

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 86

మంగళవారం 17-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



హక్కులకు లెక్కొద్దు

మాతృత్వానికి సిద్ధపడిందంటే స్త్రీ.. 24 బై 7 డ్యూటీకి సైన్ చేసినట్టే! ఆ కొలువుకు ఆ షిఫ్ట్ మాత్రమే ఉంటుంది! శారీరకంగా, మానసికంగా ఎన్ని మార్పులు.. ఎన్ని సర్దుబాట్లను అంగీకరించాలి అమ్మ!? వర్కింగ్ ఉమన్ అయితే.. చెప్పక్కర్లేదు! ఆ శ్రమ నుంచి పాలిచ్చే మొదటి ఆరునెలలైనా ఆ తల్లికి కాస్తంత వెసులుబాటు, విశ్రాంతి కావాలి కదా! తొలి చూలు, మలి చూలుకే అనే నిబంధనతో కాదు! అవసరమైతే మూడో ప్రసవానికి కూడా! సుప్రీం కోర్ట్ కూడా సరే అంది! అదేంటి ఆ అంశం కోర్ట్ దాకా వెళ్లిందా? అవును.. ఇటీవలే తీర్పు వచ్చింది. ఆ వివరాలు... – IIలో

అమ్మకు న్యాయం


ప్రతీకాత్మక చిత్రం

హక్కులకు లెక్కొద్దు

మాతృత్వానికి సిద్ధపడిందంటే స్త్రీ.. 24 బై 7 డ్యూటీకి సైన్ చేసినట్టే! ఆ కొలువుకు ఆ షిఫ్ట్ మాత్రమే ఉంటుంది! శారీరకంగా, మానసికంగా ఎన్ని మార్పులు.. ఎన్ని సర్దుబాట్లను అంగీకరించాలి అమ్మ!? వర్కింగ్ ఉమన్ అయితే.. చెప్పక్కర్లేదు! ఆ శ్రమ నుంచి పాలిచ్చే మొదటి ఆరునెలలైనా ఆ తల్లికి కాస్తంత వెసులుబాటు, విశ్రాంతి కావాలి కదా! తొలి చూలు, మలి చూలుకే అనే నిబంధనతో కాదు! అవసరమైతే మూడో ప్రసవానికి కూడా! సుప్రీం కోర్ట్ కూడా సరే అంది! అదేంటి ఆ అంశం కోర్ట్ దాకా వెళ్లిందా? అవును.. ఇటీవలే తీర్పు వచ్చింది. ఆ వివరాలు..

తమిళనాడులోని ధర్మపురి జిల్లాకు చెందిన ఉమా దేవికి 2006లో పెళ్లయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. 2012లో టీచర్‌గా సర్కారు కొలువు వచ్చింది. అయితే భర్తతో వచ్చిన స్పర్థల కారణంగా 2017లో అతన్నుంచి విడాకులు తీసుకుంది ఆమె. పిల్లల కస్టడీని తండ్రికే ఇచ్చింది కోర్ట్. 2018లో ఉమాదేవి మళ్లీ పెళ్లి చేసుకుంది. కొన్నాళ్లకు గర్భం దాల్చింది. నెలలు నిండుతుండటంతో తొమ్మిది నెలల ప్రసూతి సెలవుకు దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తును తోసి పుచ్చారు పై అధికారి.. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనల ప్రకారం.. ఒకరు లేక ఇద్దరు పిల్లల వరకే ప్రసూతి సెలవు వర్తిస్తుందని, ఉమాదేవికి ఇది మూడో కాన్పు అదీ రెండో వివాహంతో కాబట్టి ప్రసూతి సెలవు ఇవ్వడం కుదరదని వివరణిస్తూ! నొచ్చుకున్న ఉమాదేవి మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించింది. ఆమెకు మెటర్నిటీ లీవ్ ఇవ్వాల్సిందేనని తీర్పిచ్చింది ఏకసభ్యధర్మాసనం. దాంతో ఉమాదేవి పై అధికారులు డివిజన్ బెంచ్ (ఇద్దరు సభ్యుల ధర్మాసనం)కి అప్పీల్ చేశారు. డివిజన్ బెంచ్.. ఏకసభ్య ధర్మాసన తీర్పును కొట్టేస్తూ మెటర్నిటీ లీవ్‌కి ఉమాదేవి అర్హురాలు కాదని తీర్పు ఇచ్చింది. దాంతో ఉమాదేవి సుప్రీం కోర్ట్‌కు వెళ్లింది. 'నా ఇద్దరు పిల్లలు నేను గవర్నమెంట్ సర్వీస్‌లో జాయిన్ అవకముందు పుట్టారు. సర్వీస్‌లో చేరిన తర్వాత మెటర్నిటీ లీవ్‌కి అప్లయ్ చేసుకోవడం ఇదే మొదలు. అదీగాక మెటర్నిటీ లీవ్ అనేది మహిళ రీప్రొడక్టివ్ రైట్స్ కిందికి వస్తుంది. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కూడా దీన్ని గుర్తిస్తుంది' అని వాదించింది. మూడు కాన్పులకు మెటర్నిటీ లీవ్ ఇవ్వడం అధిక సంతానాన్ని ప్రోత్సహించినట్టవడమేకాదు రాష్ట్ర ఖజానాకూ భారమేననే వాదన వినిపించారు ప్రతివాదులు.



సుప్రీం కోర్ట్ ఏం చెప్పిందంటే..

మూడో ప్రసవానికీ మహిళ మెటర్నిటీ లీవ్‌కి అర్హురాలే! అది రెండో పెళ్లయినా సరే! మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం ఉద్యోగం చేసే గర్భిణీకి ప్రసూతి సెలవు మంజూరు చేయాల్సిందే! ప్రసవాల సంఖ్యను బట్టో.. పునర్వివాహాల స్టేటస్‌ను బట్టో కాదు. వాటితో ఈ సెలవుకు సంబంధం లేదు. అధిక సంతానాన్ని, అధిక ఆర్థిక భారాన్ని నియంత్రించాలనే రాష్ట్ర ప్రభుత్వ (తమిళనాడు) నిబంధనలు ప్రశంసించదగ్గవే! అదే సమయంలో ప్రాథమిక హక్కు కోణంలో మహిళల రీప్రొడక్టివ్ హెల్త్, వెల్ బీయింగ్‌నూ పరిగణనలోకి తీసుకోవాల్సిందే.. వాళ్ల హక్కును గౌరవించాల్సిందే!' అంటూ స్పష్టమైన తీర్పునిచ్చింది.

మహిళలకు సంబంధించి ఇదొక విజయమే! ఎక్కడైనా మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, రీప్రొడక్టివిటీ రైట్ ఉల్లంఘనకు గురైనా.. ఈ తీర్పును చూపించి ఆ హక్కును పొందవచ్చు.

● వ్యూహం

ఒత్తిడి కొండను చిత్తు చేసి...

'సమస్య నీలోనే ఉన్నప్పుడు...దానికి పరిష్కారం కూడా నీలోనే ఉంటుంది'... ఇది తత్వం కాదు. నిజం.

'నీట్'కు ప్రిపేర్ అవుతున్న క్రమంలో అవిక ఒత్తిడి తట్టుకోలేక ఏడ్చేది. కన్నీళ్లు తుడుచుకున్నాక... ఒత్తిడిని దూరం చేసే దారి కనిపించింది. ఇక ఎప్పుడూ ఆమె ఏడవ లేదు. ఇప్పుడు ఆల్ ఇండియా స్థాయిలో విజేతగా నిలిచింది.



'చిన్నప్పటి నుంచి నేను డాక్టర్ కావాలనుకునేదాన్ని' అంటున్న పదిహేడు సంవత్సరాల అవిక అగర్వాల్ జాతీయ వైద్య ప్రవేశ పరీక్ష 'నీట్'లో 5వ ర్యాంక్ సాధించింది. వైద్యుల కుటుంబంలో పుట్టిన అవిక ఆ వృత్తి విలువను ప్రత్యక్షంగా చూసింది.

ఫరిదాబాద్‌కు చెందిన అవిక పదవతరగతి వరకు ఢిల్లీలో చదివింది. వృత్తి జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ఎప్పుడూ ప్రశాంతచిత్తంతో కనిపించే తల్లిదండ్రులను చూడడం తనకు ఇష్టం.

'వారు ఎంతోమందిని బాధ నుంచి విముక్తి చేశారు. జీవితంపై ఆశ కల్పించారు' అంటుంది తల్లిదండ్రుల గురించి. తల్లిదండ్రులను చూసి డాక్టర్ కావాలనుకున్న అవిక పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న క్రమంలో ఒత్తిడిని తట్టుకోలేక ఏడ్చిన సందర్భాలు ఉన్నాయి. కొద్దిరోజుల్లోనే ఆ ఒత్తిడికి పరిష్కారాన్ని కూడా కనిపెట్టింది. తనకు ఇష్టమైన టేబుల్ టెన్నిస్ ఆడడం ద్వారా ఒత్తిడి నుంచి బయటపడేది.

యుద్ధంలోనే కాదు పరీక్షల యుద్ధంలోనూ వ్యూహం(స్ట్రాటజీ) అనేది ముఖ్యం. 'మేజర్, మైనర్ గోల్స్‌గా నా స్ట్రాటజీని విభజించుకున్నాను. నీట్ అనేది నా మేజర్ గోల్. మైనర్ గోల్...ప్రతిరోజూ ఇంటికి వెళ్లిన తరువాత విన్న పాఠాలను మననం చేసుకోవడం. డౌట్స్ లేకుండా చూసుకోవడం. క్వశ్చన్స్ ప్రాక్టీస్ చేయడం' అంటుంది అవిక.

● టిప్స్

- పంటి నొప్పితో బాధపడుతుంటే రెండు తులసి ఆకులలో ఒక కల్లు రాతి ఉప్పు, చిటికెడు మిరియాల పొడి పెట్టి ఆకులను మడిచి నొప్పి ఉన్న పన్ను మీద గట్టిగా అదిమిపెట్టాలి.



- ప్రతి రోజూ తులసి నీటిని తాగినట్లయితే దగ్గు, ఇతర గొంతు సంబంధ వ్యాధులు (ఇన్‌ఫెక్షన్స్) రావు.
- ఒంటి మీద ర్యాష్ వస్తే స్నానం చేసే నీటిలో కనీసం అరగంట ముందుగా గుప్పెడు తులసి ఆకులను వేసుకోవాలి.

సమ్‌థింగ్ స్పెషల్

ఆహా... అంతరిక్షంలో గాజర్ హల్వా



శుభాంశు శుక్లా అంతరిక్షయాత్రకు సంబంధించిన ఆసక్తి శాస్త్రీయ విషయాలకే పరిమితం కాలేదు.

'అక్కడ ఏంతింటారు?' లాంటివి కూడా చాలామంది తెలుసుకోవాలనుకుంటున్నారు.

శుక్లా తనతో పాటు భారతీయ రుచులను కూడా అంతరిక్షంలోకి తీసుకువెళ్లనున్నాడు.

'ఇస్రో' ప్రత్యేకంగా సిద్ధం చేసిన వంటకాలు, గాజర్ హల్వా తీసుకువెళతాడు. ఈ వంటకాలను మొదట భారతదేశ గగన్‌యాన్ మిషన్ కోసం తయారుచేశారు. వాటిని ఇప్పుడు 'యాక్సియం-4' మిషన్ కోసం ఉపయోగించనున్నారు.

అంతరిక్ష పరిస్థితులను తట్టుకునేలా, మైక్రోగ్రావిటీలో తినడానికి తేలికగా, సురక్షితంగా, తాజాగా ఉండేలా ఈ ఆహారపదార్థాలను తయారుచేశారు. భారతీయ వంటకాలను 'యాక్సియం-4' మిషన్ కోసం ఆమోదించడం అంత తేలికగా జరగలేదు.

'భారతీయ వంటకాలలో మసాలాలు అధికంగా ఉన్నందున వాటిని తీసుకువెళ్లడానికి అనుమతి లభించడం కష్టం అయింది. చివరకు కొన్ని రకాల ఆహారపదార్థాలను అనుమతించారు. తన వెంట తీసుకువెళుతున్న భారతీయ వంటకాలను తోటి వారికి రుచి చూపించాలని శుభాంశు ఉత్సాహంగా ఉన్నాడు' అంటుంది లక్నోలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శుక్లా సోదరి సుచి శుక్లా.

● బ్యూటిప్

కాంతులీనే కురుల కోసం...



ఒక్కోసారి జుత్తు పొడిబారిపోయి, కళావిహీనంగా అయిపోవడంతో పాటు ముక్కలుగా తెగిపోతూ ఉంటుంది. అలాంటప్పుడు నీటిలో కాస్త టీ పొడి, కొన్ని ఉల్లి తొక్కలు, కొద్దిగా ఉసిరిక పొడి వేసి మరిగించాలి. ఈ మిశ్రమాన్ని శిరోజాలకు పట్టించి, మూడు గంటల తరువాత తలస్నానం చేసేయాలి. వారానికో సారి ఇలా చేస్తే జుత్తు బలపడటంతో పాటు కాంతులీను తుంది.

బులియన్

జూన్ 16న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	99,010
బంగారం (22 క్యారెట్లు)	92,674
వెండి	1,06,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,910
బంగారం (22 క్యారెట్లు)	93,200
వెండి	1,09,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,01,510
బంగారం (22 క్యారెట్లు)	93,050
వెండి	1,09,900
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,02,850
బంగారం (22 క్యారెట్లు)	95,840
వెండి	1,09,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,500
బంగారం (22 క్యారెట్లు)	90,620
వెండి	1,06,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,01,500
బంగారం (22 క్యారెట్లు)	93,050
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

ఆరుద్ర కార్తె: జూన్ 22 నుంచి

నల్లతామర సోకినా అధిక దిగుబడినిచ్చే మిరప!

లాం ఫారంలో అమ్మకానికి 3 రకాల మిరప విత్తనాలు సిద్ధం

గుంటూరుకు దగ్గర్లోని లాం ఫారం ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానంలో నల్లతామరను తట్టుకొని అధిక దిగుబడినిచ్చే ఎల్.సి.ఎ-643తో పాటు ఎల్.సి ఎ-625, ఎల్.సి ఎ-657 మిరప రకాల ఫౌండేషన్ విత్తనాన్ని ఈ నెల 16 నుంచి తెలుగు రాష్ట్రాల రైతులకు అమ్ముతున్నట్లు ఆర్ఏఎస్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్. సి. వెంకట రమణ తెలిపారు. రైతులు నేరుగా ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం లాం ఫారంలో ఉ. 9- సా. 4 గంటల మధ్యలో విత్తనాలు కొనుగోలు చేయొచ్చు (రెండో శనివారం, ప్రతి ఆదివారం సెలవు). కిలో మిరప విత్తనం ధర రూ. 1,200. ఈ మూడు రకాల మిరప విత్తనాలు ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం- లాం ఫారంలో మాత్రమే రైతులకు లభిస్తాయని డా. వెంకట రమణ తెలిపారు. అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మజూపితే రైతులు వాటిని ఖరీదు చేసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

ఇతర వివరాలకు.. 99898 09554/9440592982.



నల్లతామర సోకినా..: ఎల్. సి ఎ-643 రకం పచ్చిమిర్చితోపాటు ఎండు మిర్చికీ అనువైన రకం. కాయలు లేత ఆకుపచ్చ రంగులో పొడవుగా (13-14 సెం.మీ) ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు ఎండిన తరువాత కొంచెం ముడత, ఆకర్షణీయమైన ఎరుపు రంగుతో బ్యాడగి మాదిరిగా ఉంటాయి. బెట్టను బాగా తట్టుకొంటుంది. జెమిని వైరస్‌ను కూడా కొంతవరకు తట్టుకొంటుంది. నల్లతామర పురుగు సోకినా కొద్దిపాటి పురుగు మందుల పిచికారీతో అధిక దిగుబడినివ్వగల రకం.

ఎద పెట్టటానికి అనువైనది!: ఎల్. సి ఎ-625 రకం ఎండు మిరపకు అనువైనది. మొక్కలు బలిష్టమైన కొమ్మలతో ఎత్తుగా పెరుగుతాయి. కణుపులు దగ్గరగా ఉండి, కాపు చిక్కగా ఉంటుంది. ప్రధాన పొలంలో నేరుగా ఎద పెట్టడానికి ఎంతో అనువైన రకం. కాయలు సన్నగా, మధ్యస్థ పొడవు(8-10 సెం. మీ.)న తేజ రకాన్ని పోలి ఉంటాయి. పచ్చికాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. నూటి రకాల్లో కెల్లా అధిక ఘాటు (45,000-50,000 ఎస్.హెచ్.యు.). ఆకర్షణీయమైన ఎరుపు రంగు (60-65 ఎ.ఎస్.టి.ఎ.)గల రకం. కాయ తోలు పలచగా ఉండి, అధిక ఘాటు వల్ల కాయకుళ్ళు తెగులును కొంతవరకు తట్టుకొంటుంది. తాలు కాయలు చాలా తక్కువ.

అధిక బెట్టను తట్టుకునే రకం: ఎల్. సి ఎ-657 రకము తొలకరి తరువాత నేరుగా ఎద పెట్టుకోవడానికి అనువైనది. జెమిని వైరస్‌ను తట్టుకునే రకం. మొక్కలు ఎత్తుగా, దృఢమైన కాండంతో నిటారైన కొమ్మలు, బలమైన వేరు వ్యవస్థను కలిగి ఉంటాయి. కాయలు పొడవుగా (11-12 సెం.మీ.) ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పండినప్పుడు ముదురు ఎరుపు రంగుతో తెల్లటి తొడిమతో ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు అధిక ఘాటు (50,000-55,000 ఎస్.హెచ్.యు.), మంచి రంగును కలిగి ఉంటాయి. అధిక బెట్టను తట్టుకునే రకం.

రసాయనిక ఎరువులతో కూడిన 'హరిత విప్లవాని'కి డా. నార్మన్ బోర్లాగ్ నాంది పలికితే.. 'సూక్ష్మ జీవులతో కూడిన హరిత విప్లవాని'కి డాక్టర్ మారియాంజెలా హంగ్రియా నాంది పలికారు. మాతృదేశం బ్రెజిల్‌ను సోయా తదితర వ్యవసాయోత్పత్తుల్ని అధికంగా ఎగుమతి చేసే దేశంగా మార్చటంలో ఆమె కృషి అపూర్వమైనది. అద్వితీయమైన సాయిల్ మైక్రోబయాలజిస్టుగా ఆమె రైతాంగానికి అందించిన 30కి పైగా బాక్టీరియా ఆవిష్కరణల ఫలితంగా బ్రెజిల్ రైతులు ఏటా రూ. 2,15,625 కోట్ల మేరకు లబ్ధి పొందుతున్నారని అంచనా. ఈ ఏడాది ప్రపంచ ఆహార పురస్కారాన్ని గెల్చుకున్న డా. హంగ్రియా జీవన సాఫల్య కృషిని పరిశీలిద్దాం..



10 కోట్ల ఎకరాలు.. ఏటా రూ.2,15,625 కోట్లు!

జీవన ఎరువులు/ద్రావణాల ద్వారా బ్రెజిల్ రైతులకు ఏటా చేకూరుతున్న మేలు రూ.2,15,625 కోట్లు!

సాయిల్ మైక్రోబయాలజిస్ట్ డా.మారియాంజెలా హంగ్రియా అవిరళ కృషి ఫలితం ఇది

డాక్టర్ మారియాంజెలా హంగ్రియా. 1958 ఫిబ్రవరి 6న బ్రెజిల్‌లో పుట్టారు. సాయిల్ మైక్రోబయాలజిస్టుగా 40 ఏళ్లుగా విశేష కృషి చేస్తున్నారు. హరిత విప్లవం సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా అమల్లోకొచ్చిన 1970వ దశకం చివర్లో ఆమె డిగ్రీ కాలేజ్‌లో చేరి మైక్రోబయాలజీ చదువుకున్నారు. మొక్కల గురించి, సూక్ష్మజీవుల గురించి బామ్మ చెప్పిన పాఠాల స్ఫూర్తితో సాయిల్ మైక్రోబయాలజీ వైపు అడుగులు వేశారు. బ్రెజిల్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి అమెరికాలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ చేశారు. తిరిగి స్వదేశానికి వెళ్లి 1991లో బ్రెజిల్ ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా సంస్థలో చేరి, దీక్షగా పరిశోధనలు కొనసాగించారు. ప్రకృతిసిద్ధమైన సూక్ష్మజీవులను ఉపయోగించి పంటలకు పోషకాలను ఎలా సమకూర్చుకోవచ్చు అనే కోణంలో అపూర్వమైన పరిశోధనలు చేసి అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. ప్రయోగశాలకే పరిమితం కాకుండా ఆ ఆవిష్కరణలను రైతుల దగ్గరకు తీసుకెళ్లటానికి విస్తృతంగా కృషి చేశారు. 500కు పైగా పరిశోధనా పత్రాలు, పుస్తకాలు రాశారు.

సూక్ష్మజీవులకు పెద్ద పీట

మట్టిలో ఉండే సూక్ష్మజీవులకు, ప్రకృతిలో చెట్లు, మొక్కల వేరు వ్యవస్థకు పరస్పరాధారిత సంబంధం ఉంది. వాతావరణంలో పుష్కలంగా ఉన్న నత్రజనిని చెట్లు, మొక్కల వేర్లు నేరుగా గ్రహించుకోలేవు. మట్టిలో ఉండే కొన్ని రకాల సూక్ష్మజీవులు ఆ నత్రజనిని గ్రహించి, వేర్లు ఉపయోగించుకోగలిగిన రూపంలోకి మార్చి అందిస్తున్నాయి. ఇందుకు ప్రతిగా వేర్లు పోషక ద్రవాలను మట్టిలోకి స్రవిస్తుంటాయి. ఆ శక్తితోనే సూక్ష్మజీవులు గాలిలో నుంచి నత్రజనిని తీసుకొని వేర్లకు సరఫరా చేస్తుంటాయి. పంటలకు యూరియా వేయటానికి బదులుగా, నత్రజనిని గ్రహించే సూక్ష్మజీవుల్ని డా. హంగ్రియా తొలిగా గుర్తించారు. వాటితో ద్రావణాలను, జీవన ఎరువులను తయారు చేసి బ్రెజిల్ రైతులకు అందించారు. ప్రతి ఏటా విత్తనానికి జీవన ద్రావణాలతో లేపనం చేసి విత్తటం ద్వారా రసాయనిక ఎరువులు వాడిన పొలాలతో పోల్చితే 8 శాతం ఎక్కువ సోయా చిక్కుళ్ల దిగుబడి సాధించటంలో విజయం సాధించారు. ఆ తర్వాత వరి, గోధుమ, మొక్కజొన్న, చిక్కుళ్లు, పశుగ్రాస పంటల వేరు వ్యవస్థల్లోని ప్రత్యేక సూక్ష్మజీవులపై పరిశోధనలు చేశారు. వేర్వేరు పంటలకు అవసరమైన జీవన ఎరువులను, సూక్ష్మజీవులతో కూడిన ద్రావణాలను రూపొందించారు.

30 రకాల 'సూక్ష్మ' సాంకేతికతలు

ఆ క్రమంలో ప్రకృతికి హానిచేయకుండా, అతి తక్కువ ఖర్చుతో దిగుబడులు పెంచేలా 30 రకాల జీవన ఎరువులను, విత్తన లేపన ద్రావణాలను తయారు చేసి రైతులకు అందించారు. ఈ టెక్నాలజీలు బ్రెజిల్ రైతులకే కాక అనేక ప్రపంచ దేశాల్లోనూ వాడుకలోకి వచ్చాయి.

రైజోబియా, అజోస్పిరిల్లం బ్రాసిలెన్స్..

బ్రెజిల్‌లో 16.25 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో సుమారు 10 కోట్ల ఎకరాల్లో రైతులు డా. హంగ్రియా, ఆమె సహచర శాస్త్రవేత్తల బృందం రూపొందించిన 30 రకాల జీవన ఎరువులు/ద్రావణాలను వాడుతున్నారు. ఆ మేరకు యూరియా వంటి రసాయనిక ఎరువులు కొనటం, వాడటం మానేశారు లేదా బాగా తగ్గించారు. రైజోబియా, అజోస్పిరిల్లం బ్రాసిలెన్స్ వంటి మేలు చేసే బాక్టీరియా వాడుతున్న బ్రెజిల్ రైతులకు ఏటా చేకూరుతున్న మేలు ఎంతంటే.. ఏకంగా రూ. 2,15,625 కోట్లు (25 బిలియన్ డాలర్లు)! అంతేకాదు, 23 కోట్ల మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలు వెలువడకుండా నివారించగలుగుతున్నారు. సోయా ఉత్పత్తి, ఎగుమతుల్లో బ్రెజిల్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండడానికి డా. హంగ్రియా అవిరళ కృషే కారణం. ప్రపంచ ఆహార భద్రతకు ఆమె ఆవిష్కరణలు దోహదం చేస్తున్నాయని ప్రపంచ ఆహార పురస్కార ప్రదాన కమిటీ ప్రశంసించింది.

ఆది నుంచి సూక్ష్మజీవులపై పరిశోధనలకే ప్రాధాన్యం

నేను పరిశోధనలు ప్రారంభించిన హరిత విప్లవం తొలినాళ్లలో ప్రపంచం ఆకలి తీర్చటం ఒక్కటే లక్ష్యం. ఇంకా ఇంకా అధికోత్పత్తి సాధించటం ఒక్కటే లక్ష్యంగా ఉండేది. అయితే, నేను అందుకు భిన్నంగా పరిశోధనలు కొనసాగించాను. పర్యావరణానికి హానికలగకుండా, తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యవసాయం చేసే మార్గాలపైనే దృష్టి కేంద్రీకరించాను. సుస్థిర వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకతను ఇప్పుడు అందరూ గుర్తిస్తున్నారు. భూమిని, నీటిని కలుషితం చేయకుండా కర్బన ఉద్గారాలను తగ్గించే తీరులో వ్యవసాయం చేయాలన్న తపన ప్రపంచవ్యాప్తంగా ఏటేటా బలం పుంజుకుంటున్నది. హెక్టారుకు రసాయనిక నత్రజని ఎరువులు వాడాలంటే రైతులకు 30-50 డాలర్ల ఖర్చవుతుంది. దానికి బదులు బాక్టీరియాల కోసం హెక్టారుకు కేవలం 2-3 డాలర్లు ఖర్చు చేస్తే సరిపోతోంది.

- డా. మారియాంజెలా హంగ్రియా, ప్రపంచ ఆహార పురస్కార విజేత, జీవన ఎరువుల పరిశోధకురాలు, బ్రెజిల్

125 రోజుల పొట్టి కంది.. ఏడాదికి 3 పంటలు!

కంది పంట సాగులో పెద్ద ముందడుగు పడింది. ఇప్పటి వరకు కంది అంటే కేవలం వర్షాకాలంలో విత్తుకునే ఖరీఫ్ పంట మాత్రమే. ఇక మీదట ఏడాదికి 3 సార్లు విత్తుకోదగిన కంది పొట్టి రకం అందుబాటులోకి వచ్చింది. 45 డిగ్రీల అధిక వేడిని కూడా తట్టుకుంటూ హెక్టారుకు 2 టన్నుల వరకు దిగుబడినిచ్చే కంది వంగడాన్ని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) శాస్త్రవేత్తలు రూపొందించారు. సీనియర్ బ్రీడర్ డా. గంగశెట్టి ప్రకాశ్ సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం ప్రపంచంలోనే తొలిసారి స్పీడ్ బ్రీడింగ్, స్పీడ్ చిప్పింగ్ పద్ధతుల్లో కంది వంగడాన్ని వెలువరించారు. అధిక వేడిని తట్టుకోగల 125 రోజుల్లో కోతకొచ్చే ఐసిపివి 25444 వంగడంతో 3 సీజన్లలోనూ కందులు పండించవచ్చని ఇక్రిశాట్ చెబుతోంది.

వచ్చే జనవరిలో..

ఐసిపివి 25444 రకం కంది పంటను ఇక్రిశాట్ పొలంలో గత ఫిబ్రవరిలో విత్తాం. ఇప్పుడు కోతకొచ్చింది. ఈ రకాన్ని ఏ సీజన్‌లోనైనా సాగు చేయవచ్చు. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన భూముల్లో రబీలో ఈ కంది రకాన్ని సాగు చేయొచ్చు. ఖరీఫ్, రబీల్లో వరుసగా వరి సాగు చేసే భూముల్లో.. వేసవిలో వేయొచ్చు. మొక్కజొన్న / కూరగాయలు సాగు చేసే భూముల్లో రబీ పంటగా సాగు చేసుకోవచ్చు. కొందరు రైతులకు 2026 జనవరిలో విత్తనాలు ఇస్తాం. వాణిజ్య పరంగా విత్తనాలు అందుబాటులోకి రావటానికి మరో 1.5 ఏళ్ల సమయం పడుతుంది. ఇది జన్యు సవరణ వంగడం కాదు.

– డా. గంగశెట్టి ప్రకాశ్, సీనియర్ శాస్త్రవేత్త, కంది బ్రీడింగ్ విభాగం, ఇక్రిశాట్


కంది చేనులో ఇక్రిశాట్ డిజి డా.హిమాంన్షు పాథక్‌తో కొత్త వంగడం రూపశిల్పి సీనియర్ బ్రీడర్ డా. ప్రకాశ్


'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 86

మంగళవారం 17-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ తొలి ప్రత్యర్థి శ్రీలంక
మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల. -12లో




ఇంటి రుణం కారు చౌకగా..
రుణాలపై ఎస్‌బీఐ 0.50% రేటు కోత. దిగిరానున్న ఈఎంఐల భారం -13లో



టెలికం రంగంలోకి ట్రంప్!
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త ఫోన్ బ్రాండ్‌తోపాటు ఒక నెట్‌వర్క్‌నే ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో ఉన్నారు.
వివరాలు 6లో ▸



యుద్ధం తక్షణమే ఆపండి
ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం వాంఛనీయం కాదని జీ7 దేశాల అధినేతలు తేల్చిచెప్పారు. ఇరుదేశాలు వెనక్కి తగ్గాలన్నారు.
వివరాలు 6లో ▸



తేలుతున్న భూ పరిహారం లెక్క
రీజనల్ రింగ్‌రోడ్డు వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితులకు చదరపు మీటర్ చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించనుంది.
వివరాలు 5లో ▸



అడ్వాన్స్‌డ్‌లో పెరిగిన ఉత్తీర్ణత
ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరం 67.4% మంది, సెకండియర్‌లో 51.7% మంది పాసయ్యారు.
వివరాలు 3లో ▸

న్యూస్‌రీల్

సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని విడుదల



సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో.. మంగళగిరి కోర్టు పలు షరతులతో సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ ఇచ్చింది. దీంతో సోమవారం రాత్రి జైలు నుంచి కొమ్మినేని విడుదలయ్యారు.
- వివరాలు 14లో▶

జాగా లేకుంటే 'డబుల్' ఇల్లు



సొంత జాగా లేని అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు గత ప్రభుత్వ హయాంలో మొదలై అసంపూర్తిగా ఉండిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొనే అవకాశం కల్పిస్తోంది.
- వివరాలు 14లో▶

పంచాయతీలు సతమతం



రాష్ట్రంలో ఏడాదిన్నరగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు లేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
- వివరాలు 14లో▶

విద్యార్థులు తగ్గుతున్నారు



ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలగడం లేదు. దీంతో సర్కారు బడులకు మూసివేత ప్రమాదం పొంచి ఉంది.
- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



అది సరే! ఇక్కడ లక్షలాది మంది రోడ్డెక్కొద్దని ఎవరు చెప్పాలి సర్..!

తొమ్మిది రోజుల్లో

9 వేల కోట్లు ఇస్తాం

రైతు నేస్తం ప్రారంభోత్సవంలో రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

తొలిరోజు 41.25 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,349 కోట్లు జమ

- ఎకరానికి రూ.6 వేల చొప్పున విడుదలకు కంప్యూటర్ బటన్ నొక్కిన ముఖ్యమంత్రి
- ఎన్ని కష్టాలున్నా పెట్టుబడి సాయం ఆగదని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 1,034 వేదికల్లో 'రైతు నేస్తం' ప్రారంభం
- అన్నదాతలకు సబ్సిడీపై పనిముట్లు ఇస్తామని వెల్లడి
- వరితోపాటు కూరగాయలు, పప్పు దినుసులు పండించాలని పిలుపు



'రైతు నేస్తం' ప్రారంభోత్సవంలో రైతులతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 70.11 లక్షల మంది రైతులకు చెందిన 1.49 లక్షల ఎకరాల సాగు యోగ్యమైన వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.6 వేల చొప్పున నిధులు విడుదల చేస్తూ కంప్యూటర్ బటన్ నొక్కారు. కేవలం 9 రోజుల్లో రైతులందరికీ మొత్తం రూ.9 వేల కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. తొలిరోజు సోమవారం 2 ఎకరాల లోపు 41,25,289 మంది రైతులకు రూ.2,349.83 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. 39.16 లక్షల ఎకరాలకు గాను ఈ డబ్బులు జమయ్యాయి. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్రంలోని 1,034 వేదికల్లో కొత్తగా 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రైతు భరోసా గురించిన ప్రకటన చేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి
మెజార్టీ స్థానాల్లో గెలిచేలా కృషి చేయండి.. మంత్రులకు సీఎం రేవంత్ సూచన -2లో

పదేళ్లలో వ్యవసాయాన్ని నీరుగార్చారు..

గడిచిన పదేళ్ల కాలంలో వ్యవసాయాన్ని నీరుగార్చారు. వరి వేస్తే ఉరే అని, వడ్లు కొనలేం అని పెద్దాయన చెప్పాడు. మేం పేద ప్రజలకు
మిగతా 2వ పేజీలో ▶

సెల్‌ఫోన్లు ఇవ్వండి

కేటీఆర్‌కు ఏసీబీ అధికారుల ఆదేశం

- 2021–2024 మధ్య వినియోగించిన ఫోన్లు 18లోగా అప్పగించాలని సూచన
- అంతకుముందు సీజ్ చేసేందుకు యత్నం.. ఫోన్ తేలేదన్న కేటీఆర్!
- ఫార్ములా– ఈ రేసు కేసులో 8 గంటలకు పైగా విచారణ
- అవసరమైతే మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని స్పష్టీకరణ



విచారణ అనంతరం తిరిగి వెళ్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కారు రేసు కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావును ఏసీబీ అధికారులు సోమవారం 8 గంటలకు పైగా విచారించారు. రేసు నిర్వాహకులతో కుదుర్చుకున్న ఒప్పందాలు మొదలు, నిధుల మళ్లింపు, నిబంధనల అతిక్రమణ, విదేశీ కంపెనీతో జరిపిన లావాదేవీలు.. తదితర అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేసేందుకు ప్రయత్నించారు. ఫోన్ ఇవ్వమని కోరగా.. తీసుకురాలేదని కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. దీంతో ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణకు సంబంధించి ఒప్పందాలు మొదలైన 2021 నుంచి 2024 మధ్య కాలంలో వినియోగించిన సెల్‌ఫోన్లు ఈ నెల 18 లోగా అప్పగించాలని కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఆదేశించారు.

వరుస ప్రశ్నలు..మధ్యమధ్యలో బ్రేక్

ఏసీబీ అధికారుల నోటీసుల మేరకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటలకు తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన
మిగతా 3వ పేజీలో ▶

ఒత్తిళ్లు ఉంటే అరెస్టు చేసుకోమన్నా

- రేవంత్ జైలుకు వెళ్లి వచ్చాడు కాబట్టి మమ్మల్ని కూడా పంపాలనుకుంటున్నాడు
- పాలన చేతకాక దద్దమ్మ రాజకీయాలు చేస్తున్నాడు
- సీఎంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

3లో

2 దశల్లో జనగణన..

- 'జనగణన–2027'కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా
- అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- దేశవ్యాప్తంగా 2027 మార్చి 1 నాటికి పూర్తికానున్న ప్రక్రియ
- లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబర్ 1 నాటికి పూర్తి
- జనగణనతో పాటు కులగణన చేపట్టనున్న ప్రభుత్వం

6లో



లెక్క తేలకముందే పునర్విభజన

- దేశవ్యాప్తంగా 2027 మార్చిలో పూర్తి కానున్న జనగణన
- 2026 చివర్లోనే డీలిమిటేషన్ కమిటీ వేసే చాన్స్
- అయినా 2027 లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్!
- విభజన చట్టం ప్రకారం 153 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలు?
- తాజా జనాభా లెక్కల ప్రకారం ఆ సంఖ్యలు మారే అవకాశం

3లో

ఇజ్రాయెల్ క్షిపణి దాడుల భయంతో సోమవారం రాత్రి టెహ్రాన్‌ను వీడుతున్న ఇరాన్‌వాసులు



ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం

- ఇరాన్ దాడుల్లో ఎనిమిది మంది మృతి
- అమెరికన్ కాన్సులేట్ స్వల్పంగా ధ్వంసం
- టెహ్రాన్ నుంచి ప్రజలు వెళ్లిపోవాలన్న ఇజ్రాయెల్

ఇరాన్ ప్రభుత్వ టీవీ కార్యాలయంపై దాడి

6లో




పీఎఫ్ సేవల కోసం ఏజెంట్ల సాయం తీసుకోవద్దు

- ఆన్‌లైన్ పోర్టల్ సేవలను వినియోగించుకోవాలి
- వ్యక్తిగత డేటా గోప్యతను రిస్క్‌లో పెట్టుకోవద్దు
- చందాదారులకు ఈపీఎఫ్‌వో సూచన

- వివరాలు 13లో

యుద్ధాల యుగం కాదు



సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని నరేంద్రమోదీ

- వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి
- మానవాళి సంక్షేమం కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలి
- భారత ప్రధాని నరేంద్ర మోదీ, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ పిలుపు
- రాజధాని నికోసియాలో సమావేశమైన ఇరువురు నేతలు
- భారత్–సైప్రస్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు
- ఉగ్రవాదంపై పోరాటంలో ఇండియాకు అండగా ఉంటామన్న సైప్రస్ అధ్యక్షుడు -6లో



అటవీ శాఖ సిబ్బందిపై గిరిజనుల దాడి

- ఉద్రిక్తతకు దారి తీసిన గుడిసెల తొలగింపు
- పోలీసులపై పెట్రోల్, కారంపొడి చల్లిన వైనం
- కర్రలతో జేసీబీ డ్రైవర్‌పై దాడి
- ములుగు జిల్లా రొయ్యూర్ ప్రాంతంలో ఘటన

5లో

దేవుడికీ అర్థం కారు!

మున్సిపల్ అధికారుల తీరుపై హైకోర్టు మండిపాటు


- భవన నిర్మాణమంతా పూర్తయ్యే వరకు ఏం చేస్తారు?
- తర్వాత అక్రమ నిర్మాణం, కూల్చివేత అంటూ హడావుడి చేస్తారు
- పన్ను వసూలుకు మాత్రం భవన వివరాలన్నీ తెలుస్తయ్!
- రాష్ట్రంలో అనధికారిక నిర్మాణాలకు అధికారులదే బాధ్యత
- తీరు మారకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్

దేవుడు దిగివచ్చినా మున్సిపల్ అధికారుల తీరును అర్థం చేసుకోవడం సాధ్యం కాదని హైకోర్టు మండిపడింది. కళ్ల ముందే అంతస్తులకు అంతస్తులు భవన నిర్మాణం జరుగుతున్నా కబోదుల్లా వ్యవహరిస్తున్నారని.. తీరా నిర్మాణం పూర్తయ్యాక విధులు గుర్తుకొచ్చి కూల్చివేత అంటూ హడావుడి చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో అడ్డగోలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులే బాధ్యులని చెప్పింది. దీనికి సంబంధించి జీహెచ్‌ఎంసీ న్యాయవాదిపై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించగా.. ఆయన ఎలాంటి సమాధానం చెప్పలేకపోయారు. 'నెలల తరబడి భవన నిర్మాణమంతా పూర్తయ్యే వరకు మున్సిపల్ అధికారులు ఏం చేస్తుంటారు? ఆ ప్రాంతంలోని ఏరియా ఇన్‌స్పెక్టర్లు కళ్లు మూసుకుని తిరుగుతుంటారా? సెక్షన్ 461 ప్రకారం నిర్మాణం ప్రారంభంలోనే సీజ్ చేసే అధికారమున్నా ఎందుకు చేయరు? ఎవరో పిటిషన్ వేస్తే.. కోర్టు ఆదేశాలు జారీ చేస్తే.. తర్వాత స్పీకింగ్ ఆర్డర్స్ ఇస్తారు. స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చేలోపు భవన నిర్మాణం పూర్తవుతుంది. అప్పుడు కూల్చివేత అంటూ హడావుడి ప్రారంభిస్తారు.. రాష్ట్రంలో ఏటా వెలుస్తున్న అనధికార నిర్మాణాలను ఎందుకు ఆపలేకపోతున్నారు? విచిత్రమేంటంటే.. అక్రమ నిర్మాణం చేసేటప్పుడు వారికి కనిపించదు.. కానీ, పన్ను వసూలుకు మాత్రం ఆ భవనం కనిపిస్తుంది.. దాని వివరాలన్నీ తెలుస్తాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత అధికార దర్పాన్ని ప్రదర్శించేందుకు
మిగతా 5వ పేజీలో ▶

సివిల్ వివాదాల్లో తలదూర్చొద్దు

ఎన్నిసార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదు: హైకోర్టు



- ఖాకీల కారణంగానే న్యాయస్థానాలకు కక్షిదారులు
- పోలీసుల జోక్యంతోనే కోర్టులకు 80% కేసులు
- చట్టాన్ని మార్చుకుని మీరే ఉత్తర్వులు కూడా ఇవ్వండి
- స్టేషనరీ సామగ్రి తెచ్చుకోవాలనే స్టేషన్లు ఉండటం ఆశ్చర్యకరం

- వివరాలు 5లో▶

పర్యావరణ అనుమతులను

తిరస్కరించాలి



- బనకచర్లపై కేంద్ర మంత్రికి మంత్రి ఉత్తమ్ లేఖ
- టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ జారీ కోసం ప్రాజెక్టును మదింపు చేయరాదు
- ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే రాష్ట్రాలతో సమావేశం నిర్వహించాలి

14లో

'టచ్'లో ఉండకండి

- 'స్మార్ట్'ఫోన్లకు కట్టుబానిసలవుతున్న యువత.. అనారోగ్యాలను 'టచ్' చేసి తెచ్చుకుంటున్నాం
- మనవాళ్లకు, మంచి అలవాట్లకు దగ్గరవుదాం

14లో

విద్యార్థులు తగ్గుతున్నారు

గతంలో మూతపడిన స్కూళ్లు ఈసారైనా తెరుచుకునేనా?

గతేడాది విద్యార్థుల్లేక, పది మందికంటే తక్కువ ఉండి మూతపడినవి 1,980
విద్యార్థులను చేర్పించి అందులో కొన్నింటిని ప్రారంభిస్తున్న యంత్రాంగం
మిగతా పాఠశాలలు ఈసారైనా తెరుచుకునేనా?



ఇదీ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గాయిగూడెం ప్రాథమిక పాఠశాల. విద్యార్థుల్లేరని గతేడాది మూసేశారు. అక్కడున్న ఇద్దరు టీచర్లను సమీపంలోని పాఠశాలలో సర్దుబాటు చేశారు. గ్రామంలోని 15 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇంగ్లిష్ మీడియం కోసం ప్రైవేట్ స్కూల్‌కు పంపిస్తున్నారు.



మానుకోటలోని కుమ్మరికుంటతండా ప్రాథమిక పాఠశాలలో ఒకప్పుడు 60 మంది విద్యార్థులు ఉండేవారు. విద్యార్థులు పది మందికంటే తక్కువ కావడంతో 2019లో ఇది మూత పడింది. దీంతో 2021లో అందులో జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ కేంద్రం కూడా పనిచేయడం లేదు. దీంతో స్థానికులు అందులో గొర్రెలు, మేకలు పెంచుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం కలగడం లేదు. దీంతో ప్రభుత్వ స్కూళ్లకు మూసివేత ప్రమాదం పొంచి ఉంది. గడిచిన నాలుగేళ్లలో ఒక్క నల్లగొండ జిల్లాలోనే 310 వరకు స్కూళ్లు జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడ్డాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణంతో గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సర్దుబాటు చేయగా దాదాపు 1,980 స్కూళ్లు మూతపడ్డాయి. ఇక విద్యా సంవత్సరంలోనూ మరిన్ని స్కూళ్లపైనా మూసివేత కత్తి వేలాడుతోంది.

\- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లలో తగ్గిపోయిన విద్యార్థుల వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో



సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం చిక్కుడువానిపల్లి ప్రాథమిక పాఠశాల.

సిద్దిపేటలో తెరుచుకున్న స్కూళ్లు

సిద్దిపేట జిల్లాలో 12 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఈసారి తెరుచుకున్నాయి. అక్కన్నపేట మండలం రేగొండ ప్రాథమిక పాఠశాల గత ఏడాది జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతపడింది. టీచర్లు గ్రామంలో అవగాహన కల్పించి 35 మంది విద్యార్థులను చేర్పించారు. ఆ పాఠశాలను ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

అత్యధికంగా వరంగల్‌లో మూసివేత

- 2024-25 విద్యా సంవత్సరంలో అత్యధికంగా వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూత పడ్డాయి. 135 స్కూళ్లు విద్యార్థుల్లేక, తక్కువ మంది (పది మందిలోపే) విద్యార్థులు ఉండటంతో టీచర్లు, విద్యార్థుల సర్దుబాటుతో అవి మూత పడ్డాయి.
- ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలో 94 స్కూళ్లు మూతపడ్డాయి. నల్లగొండ జిల్లాలో 24, మంచిర్యాల జిల్లాలో 32, ఆసిఫాబాద్‌లో 34, నిర్మల్‌లో 48, నిజామాబాద్‌లో 38, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 89, కరీంనగర్ జిల్లాలో 50, రాజన్నసిరిసిల్లలో 18, జగిత్యాలలో 61, పెద్దపల్లిలో 29, హనుమకొండలో 41, మహబూబ్‌నగర్ జిల్లాలో 48, నాగర్‌కర్నూల్‌లో 15, వనపర్తిలో 33, గద్వాలలో 4, నారాయణపేటలో 37 స్కూళ్లు మూత పడ్డాయి.

మూడేళ్లలో గణనీయంగా తగ్గిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు మూత పడుతూనే ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. గడిచిన మూడేళ్ల గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. విద్యాశాఖ లెక్కల ప్రకారమే 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 30,09,212 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం వారి సంఖ్య 23,71,772కు తగ్గిపోయింది. అదే క్రమంలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 37,26,220కి పెరిగింది.

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లలో పెరిగిన విద్యార్థులు

ఖమ్మం జిల్లాలోనూ రామలింగాలపల్లి క్రాస్ రోడ్డు, ఆలియాతండా, గంగారంతండా కొత్తతండా పాఠశాలలు మూతపడ్డాయి. అయితే ఓవరాల్‌గా చూస్తే ఈ మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రైవేటు స్కూళ్లలోనూ రెట్టింపు స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2022-23లో ప్రభుత్వ స్కూళ్లలో 1,08,715 మంది విద్యార్థులు ఉంటే వారి సంఖ్య 2024-25లో 1,10,934కు పెరిగింది. ప్రైవేట్ స్కూళ్లలో గతంలో 1,22,781 మంది ఉంటే 1,26,421కి పెరిగింది.

ప్రభుత్వ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఏటేటా పెరుగుతోంది. అక్కడక్కడ బడిబాటలో టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి ఒకటీ రెండు మూత పడిన స్కూళ్లను తెరిపిస్తున్నా, వందల సంఖ్యలో మూత పడుతూనే ఉన్నాయి.

- 2021-22 విద్యా సంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్య 1,086 ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య రెట్టింపునకు దగ్గరైంది.

ఏటేటా పెరుగుతున్న జీరో ఎన్‌రోల్‌మెంట్

- జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్య 2022-23 విద్యా సంవత్సరంలో 1,307కు పెరగగా, 2023-24 సంవత్సరంలో 1,745కు, 2024-25 సంవత్సరంలో వాటి సంఖ్య 1,980కి పెరిగింది.
- ఈ నెల 19 వరకు నిర్వహించే బడిబాట తర్వాత వాటిల్లో ఎన్ని తెరుచుకుంటాయో, ఈసారి ఎన్ని స్కూళ్లు మూత పడతాయో త్వరలోనే తేలనుంది.

తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు ఇస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం ఇవ్వాలని సంకల్పించి దొడ్డు ధాన్యంకు బదులు సన్న ధాన్యం పండించమని రైతులను కోరాం. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించాం. ఈ మేరకు రైతులు సన్న వడ్లు పండిస్తే, సన్న బియ్యం పేదల కడుపు నింపుతున్నాయి. రాష్ట్ర రైతులు ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా 2.80 కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించారు.

రూ.1,29,000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు

సర్పంచులు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అంటున్నారు. మేం అధికారంలోకి వచ్చే నాటికే సర్పంచుల పదవీ కాలం ముగిసింది. కాంట్రాక్టర్లకు మరో రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టారు. మొత్తంగా రూ.1,29,000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంటు డబ్బులు వాడుకున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ రూ.12 వేల కోట్లు బకాయి పెట్టి పోయారు. పదేళ్లలో రూ.8 లక్షల 20 వేల కోట్ల అప్పు మా నెత్తిపై మోపి నడుం వంగిపోయే పరిస్థితి తెచ్చారు. రాష్ట్రా న్ని ఆర్థిక విధ్వంసంలోకి నెట్టిపోయినా, ఒక్కొక్క మెట్టు పేర్చుకుంటూ సరిచేసుకుంటూ వస్తున్నాం. ఎన్ని కష్టాలు ఉన్నా రైతులకు పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించుకున్నాం. మంత్రులందరితో చర్చించి రైతులందరికీ 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు వారి ఖాతాల్లో వేయాలని నిర్ణయించాం.

రైతు ఆశీర్వాదంతోనే ఏదైనా సాధ్యం

వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, చివరకు ముఖ్యమంత్రి అయినా రైతు ఆశీర్వాదం ఉంటేనే



రైతునేస్తం కార్యక్రమంలో భట్టితో కరచాలనం చేస్తున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో జూపల్లి, మల్‌రెడ్డి రంగారెడ్డి, దామోదర, పొన్నం, కోమటిరెడ్డి, తుమ్మల, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీతక్క, లక్ష్మణ్, వివేక్, కోదండరెడ్డి

అది సాధ్యపడుతుంది. కుర్చీ బలంగా ఉంటుంది. అందుకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం. రైతును రాజును చేయడం, వ్యవసాయాన్ని పండుగ చేయడం లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నాం. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రెండు విడతలుగా రుణమాఫీ కింద రైతులకు ఇచ్చింది రూ.17 వేల కోట్ల లోపే. ఊళ్లల్ల పెళ్లిళ్లలో ఎక్కువ కట్నాల కోసం పిలగాని తండ్రులు కార్లు, మేడలు చూపించినట్లు..పెద్దాయన రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఆనాటి గాయాలు మానలేదు. అయినా రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, రైతుబీమా, బోనస్ కింద 18 నెలల్లోనే రూ.1,01,720 కోట్లు ఖర్చు చేశాం. ఇంత తక్కువ సమయంలో అంత పెద్ద మొత్తంలో రైతుల కోసం ఖర్చు చేసిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. దీనిపై గ్రామ సభలు పెట్టి చర్చిద్దాం. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 24 గంటల్లో డబ్బులు జమ చేశాం. ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చాం. రైతులకు మేలు చేసేందుకే ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.

చావుల పునాదుల మీద రాజకీయం చేస్తున్నారు

రాష్ట్రంలో రైతుల కోసం, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని తక్కువ చేసే ప్రయత్నం జరుగుతోంది. చిన్న చిన్న పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తుంటే..మొన్ననే వచ్చాడు పిలగాడు కుదురుకోనిద్దాం అని లేకుండా రాజకీయం చేస్తున్నారు. విద్యార్థులు, రైతులు చనిపోతే సంతోషిస్తున్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఆనందం పొందుతున్నారు. చావుల పునాదుల మీద రాజకీయం చేస్తున్నారు. నేను ఎవరినీ కలవకుండా ఫాం హౌస్‌లో లేను. అయినా రాజకీయం చేస్తూ విమర్శలు చేస్తున్నారు.

విద్యార్థులు జొన్న రొట్టెలు తినాలి

చిన్నప్పుడు మా ప్రాంతంలో కందులు, బుడమ కాయలు (దోసకాయలు) పండేవి. దోసకాయ కందిపప్పు కూరను జొన్నరొట్టెతో తింటే ఎంతో కమ్మగా ఉండేది. మటన్, చికెన్ కూడా పనికిరాదు. విద్యార్థులు జొన్నరొట్టెలు తినండి. మీ బట్టలు మీరే ఉతుక్కోండి. ఏ సిక్స్ ప్యాక్ ఎక్సర్‌సైజ్‌లు పనికిరావు. వరి ఒక్కటే కాదు. కూరగాయలు, కందులు, పెసర్లు వంటి మిల్లెట్లు పండించాలి. రైతులకు సబ్సిడీతో పనిముట్లు ఇస్తాం. అధునాతన పంటలు కాదు.. తాతలు, తండ్రులు పండించిన పంటలను మళ్లీ పండించాలి. కూరగాయలు పండిస్తే హైదరాబాద్‌లో అమ్ముకోవచ్చు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు అనుభవజ్ఞులైన రైతులతో రైతు వేదికల వద్ద పాఠాలు చెప్పించండి. భూమి రైతుకు ఆత్మగౌరవం.. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎవరు ఎన్ని ధర్నాలు చేసినా, బట్టలు చించుకున్నా పదేళ్లు మన ప్రభుత్వమే ఉంటుంది.

ఎంత భూమి ఉంది? ఎంత పంట పండింది?

రైతులతో సీఎం ముఖాముఖి

ఏజీ వర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని 1,034 వేదికల్లో కొత్తగా 'రైతు నేస్తం'కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఈ సందర్భంగా పలువురు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నల్లగొండ జిల్లా చింతపల్లి రైతు వేదిక నుంచి చిట్టి ఎల్లమ్మ, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి నుంచి మనికిని రామకృష్ణ, మల్లారం నుంచి కల్వల బాబు, మహబూబాబాద్ నుంచి గాల్వీలతో సీఎం మాట్లాడారు. 'ఎంత భూమి ఉంది? ఎంత పంట పండింది?'అని ఆరా తీశారు. యాచారం మండలం చౌదర్‌పల్లి రైతు లక్ష్మయ్యతో సీఎం నేరుగా మాట్లాడారు. 'నాకు 3 ఎకరాల భూమి ఉంది. వరి కాకుండా మూడు, నాలుగు రకాల కూరగాయలు పండిస్తున్నా. అయితే మాది కరువు ప్రాంతం, 800 అడుగుల బోరు వేస్తే తప్ప నీళ్లు రావడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వ్యవసాయ పరికరాలు మాకు అందడం లేదు..'అని లక్ష్మయ్య చెప్పాడు. దీంతో సీఎం స్పందించారు. సబ్సిడీపై పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రైతును దగ్గరకు తీసుకుని ఫొటో దిగారు. వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు ఇలాంటి రైతుల దగ్గరకు వెళ్లి వారి అనుభవాలు తెలుసుకోవాలని సూచించారు.

1,49,39,111 ఎకరాలు

రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన భూములు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగు రైతులందరికీ వానాకాలం సీజన్ పెట్టుబడి సాయం కింద రూ.8,963.46 కోట్లు ప్రభుత్వం అందజేయనుంది. రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన భూములు 1,49,39,111 ఎకరాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. ఎకరానికి ఒక్కో సీజన్‌కు రూ.6 వేల చొప్పున రూ.8,963.46 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒక రైతుకు సాగు భూములు ఎన్ని ఎకరాలు ఉన్నా, ఈ పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సోమవారం రెండు ఎకరాల లోపు భూములున్న రైతుల ఖాతాల్లో నిధులు జమ కాగా.. అందులో ఎకరా లోపు విస్తీర్ణంలో భూమి ఉన్న 24.22 లక్షల మంది రైతులకు (13.54 లక్షల ఎకరాలు) రూ.812.63 కోట్లు , రెండెకరాల లోపు భూమి (25.62 లక్షల ఎకరాలు) ఉన్న 17.02 లక్షల మంది రైతులకు రూ.1,537 కోట్లు జమ చేశారు.

పంట పండే ప్రతి ఎకరాకు రైతు భరోసా

రైతునేస్తం సభలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అందిస్తామని, అందులో పరిమితులు లేవని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పంట పండే ప్రతి ఎకరాకు సంబంధించి అన్నదాతల ఖాతాల్లోకి రైతుభరోసా డబ్బులు జమ చేస్తామని తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో సాగులో 1.49 కోట్ల పైబడి ఎకరాలు ఉండగా, ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున రైతు భరోసా నిధులు జమ అవుతాయన్నారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12,000 చొప్పున ప్రజాప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు అంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే రైతులు అని భట్టి చెప్పారు.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత పాలకులు చేసిన పాపాలను తమ నెత్తిపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగడానికి కారణం గత బీఆర్ఎస్ పాలకులేనని విమర్శించారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ప్రసంగించగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయండి
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించండి... మంత్రులకు సీఎం రేవంత్ సూచన
- జరగని నిర్ణయాలు ముందే చెబితే ప్రజల్లో పలుచన అవుతామంటూ మందలింపు

సాక్షి, హైదరాబాద్: జూలైలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని చెప్పారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని వారు గమనిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో సీఎం 45 నిమిషాలకు పైగా సమావేశమయ్యారు. జరగని నిర్ణయాలను ముందుగానే ప్రకటించడం వల్ల ప్రజల్లో పలుచన అవుతామని స్థానిక సంస్థల ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కలు చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి సుతిమెత్తగా మందలించారు. కాగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. మంత్రులు టార్గెట్‌లు పెట్టుకుని మరీ పని చేయాలని, స్థానిక ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పర్యటనలో ఉన్న కొండా సురేఖ మినహా మంత్రులందరూ ఈ భేటీకి హాజరయ్యారు.

ఎన్ని ఎకరాలున్నా రైతుభరోసా!: ప్రస్తుత రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, రైతు భరోసా తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులతో రేవంత్ చర్చించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ..ఈనెలాఖరు వరకు ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా విషయంలో రాజీ పడేది లేదని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగుతున్నందున ఎన్ని ఎకరాలున్నా రైతు భరోసా వేద్దామని ఆయన అన్నట్టు సమాచారం. స్థానిక ఎన్నికల గురించి బయట మాట్లాడేదాని కంటే, ప్రజలకు తామిచ్చిన హామీలను అమలు చేస్తున్నామని వివరించడంపైనే దృష్టి పెట్టాలని అన్నట్టు తెలిసింది. జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు సమన్వయంతో వ్యవహరించాలని, బీఆర్ఎస్ బలం కొద్దో గొప్పో ఉన్న జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టి పనిచేయాలని సూచించారని సమాచారం.

బనకచర్లపై కేంద్రంతో తేల్చుకుందాం..

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రంతోనే తేల్చుకుందామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఏపీ ప్రభుత్వం ప్రీ ఫీజిబులిటీ నివేదికను సమర్పించడం, దానికి డీపీఆర్‌ను సమర్పించాలని కేంద్రం కోరడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వద్దామని అన్నట్లు తెలిసింది.



ఉద్యోగ మేళాను ప్రారంభిస్తున్న జయంత్ చౌదరి, శ్రీధర్‌బాబు

యువతలో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణలో నైపుణ్యానికి సంబంధించిన అన్ని విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని పీజీ న్యాయ కళాశాలలో లక్ష్యం సొసైటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శాఖ, తెలంగాణ నైపుణ్యాభివృద్ధి శాఖల సౌజన్యంతో మెగా జాబ్‌మేళా, స్కిల్, లోన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్ చౌదరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు సైతం నైపుణ్యాభివృద్ధి, లక్ష్యం చేరుకోవాలని, అన్ని వర్గాలకు సమగ్రాభివృద్ధిని అందించాలనే లక్ష్యంతో వీటిని అనుసంధానం చేసినట్టు తెలిపారు. నైపుణ్యాభివృద్ధిలో సమానత్వం, సమగ్రత, అవకాశాలను ప్రోత్సహించడం ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కలుగుతుందన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణను స్కిల్ కాపిటల్ ఆఫ్ ది గ్లోబల్‌గా మార్చాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్టు తెలిపారు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. యువత పెద్దఎత్తున ఉన్నా, చాలామందికి పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు ఉండటం లేదని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య నెలకొన్న అంతరాలను గుర్తించి తమ ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ వర్సిటీలో కోర్సులకు రూపకల్పన చేసిందన్నారు. ఈ ఉద్యోగమేళాలో 80కి పైగా కంపెనీలు పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, లక్ష్యం సొసైటీ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు అస్వస్థత

బేగంపేట కిమ్స్ ఆసుపత్రిలో చేరిక

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సోమవారం సాయంత్రం ఏసీబీ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్‌ను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తర్వాత కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో అస్వస్థతకు లోనైన హరీశ్‌రావు వెంటనే బేగంపేటలోని కిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. హరీశ్‌రావును పరీక్షించిన వైద్యులు చికిత్స కోసం ఆసుపత్రిలో చేరాల్సిందిగా సూచించారు. దీంతో ఆయన అడ్మిట్ అయ్యారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం హరీశ్‌రావు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హరీశ్‌రావును కేటీఆర్ పరామర్శించారు.

రేవంత్ వైఫల్యం.. వైద్య విద్యార్థులకు శాపం

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవితవ్యం రేవంత్ పాలనా వైఫల్యంతో ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నిబంధనలకు అనుగుణంగా వసతులు లేవని.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 18న రాష్ట్ర వైద్య శాఖ కార్యదర్శి ఎన్ఎంసీ ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని తాఖీదులు రావడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎన్ఎంసీ నోటీసులు ఇచ్చిన తర్వాత ఆలస్యంగా మేల్కొన్న ముఖ్యమంత్రి.. దీనిపై కమిటీ వేయడం హాస్యాస్పదం. పరిపాలన గాలికి వదిలి రేవంత్ ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారు'అని హరీశ్ మండిపడ్డారు. 'ఎన్ఎంసీ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖను మీకు పంపిస్తున్నాను. ఇప్పటికైనా కళ్లు తెరిచి 26 మెడికల్ కాలేజీల భవితవ్యాన్ని కాపాడండి. వెంటనే మెడికల్ కళాశాలలకు కావాల్సిన నిధులను విడుదల చేసి, విద్యార్థుల జీవితాలను నిలబెట్టండి'అని హరీశ్ హితవు పలికారు.

కాగితాలపై కాలేజీలను చూపారు!

- వైద్య విద్యను నాసిరకం చేసిందే మీరు
- రాష్ట్రంలోని ప్రతీ కాలేజీని కాపాడుకుంటాం
- హరీశ్‌రావుకు మంత్రి రాజనర్సింహ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసం కాగితాలపై కాలేజీలను చూపించి వైద్య విద్యను నాసిరకంగా మార్చిందే బీఆర్ఎస్ పాలకులని వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు జాతీయ వైద్య కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో హరీశ్‌రావు 'ఎక్స్'లో పెట్టిన పోస్టుకు మంత్రి 'ఎక్స్'వేదికగానే స్పందించారు. 'మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడమంటే పేపర్ల మీద జీవోలు ఇచ్చుడు కాదు. కాలేజీకి బిల్డింగుండాలె, ఎంబీబీఎస్ సీట్లకు అనుగుణంగా హాస్పిటల్ ఉండాలె. ఫ్యాకల్టీ ఉండాలె, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండాలె, విద్యార్థులకు హాస్టల్స్ ఉండాలె.. ఇలా అన్ని సౌకర్యాలు కల్పిస్తేనే కాలేజీ ఏర్పాటు చేసినట్టు.. రాజకీయ ప్రయోజనాల కోసం గాల్లో మేడలు, కాగితాలపై కాలేజీలను చూపించి, వైద్య విద్యను నాసిరకంగా చేసింది మీరు కాదా?'అని ప్రశ్నించారు. 'ఇప్పుడేమో నోటీసులు రాగానే దొంగ ఏడుపులు ఏడుస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను భయాందోళనకు గురిచేసేలా పోస్టులు పెడుతున్నారు. మీరు నాశనం చేసిన ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను మేము గాడిలో పెడుతున్నాం. ప్రతీ కాలేజీని కాపాడుకుంటాం. ఒక్క సీటు కూడా పోకుండా చర్యలు తీసుకునే బాధ్యత మా ప్రభుత్వానిది'అని అన్నారు.

వైద్య కళాశాలల్లో ఏ వసతులు కల్పించాలి?

- అవసరమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి
- క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- వైద్యారోగ్యశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పనిచేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కనీస వసతులు లేవని జాతీయ వైద్యమండలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, 2025-26 సంవత్సరానికి ఈ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు రెన్యూవల్ చేయాలంటే.. ఈనెల 18న వైద్యశాఖ కార్యదర్శి స్వయంగా హాజరుకావాలని ఆదేశించిన నేపథ్యంలోనే కళాశాలల్లోని వసతులు, జాతీయ వైద్య మండలి పేర్కొంటున్న నియమ, నిబంధనలు వెంటనే పూర్తి చేయాలన్న ఉద్దేశంతోనే వైద్యారోగ్యశాఖపై ఐసీసీసీలో సోమవారం సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాలల్లో తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు, ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి. ఎంతమేర నిధులు కావాలనే దానిపై నివేదిక ఇవ్వాలన్నారు. జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి పదోన్నతులు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు.

నర్సింగ్ కళాశాలల్లో ఆప్షనల్‌గా జపనీస్ సబ్జెక్ట్ ఉండాలి

నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష)ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆస్పత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. విద్య, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతినెలా మూడోవారంలో ఈ రెండు శాఖలపై సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎస్ రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, వైద్యారోగ్య శాఖ డైరెక్టరేట్ డాక్టర్ నరేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

లొట్టపీసు కేసు అంటూనే లోలోపల వణికిపోతున్నారు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: అవినీతి కేసులో ఏ–1గా ఉన్న ముద్దాయి కేటీఆర్ అరెస్టు కాకుండా వచ్చాడని బీఆర్ఎస్ కార్యకర్తలు సంబురాలు చేసుకుంటున్నారని, ఆయన ఏం సాధించాడని తెలంగాణ భవన్‌లో ఆయనకు స్వాగతం పలికారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఏసీబీ అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక ఆపసోపాలు పడిన కేటీఆర్, బయట మాత్రం పులకేశి బిల్డప్ ఇస్తున్నాడని సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. లొట్టపీసు కేసంటూనే లోలోపల వణికిపోతున్నాడని, అది లొట్టపీసు కేసో, నీ తాట తీసే కేసో భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు. కేటీఆర్ బతుకు తెలంగాణ ప్రజలకు తెలుసునని, లుచ్చా పనులు చేసి భూమ్మీద తనంత నిజాయితీపరుడు లేడని బుకాయిస్తున్నాడని విమర్శించారు. జైలుకు వెళ్లాలనే కోరిక కేటీఆర్‌కు బలంగా ఉన్నట్టుందని ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.

కేటీఆర్ జైలుకు వెళ్లింది ఎప్పుడు?

● భువనగిరి ఎంపీ చామల కిరణ్



సాక్షి, హైదరాబాద్: జైలుకు వెళ్లడం తనకు కొత్త కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే చెపుతున్నారని, ఆయన ఎప్పుడు జైలుకు వెళ్లారో చెప్పాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఒకవేళ గత జన్మలో మహాత్మాగాంధీతో కలసి సౌతాఫ్రికాలో జైలుకు వెళ్లి ఉంటారేమోనని ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీభవన్‌లో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి, టీపీసీసీ నేతలు గజ్జి భాస్కర్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. జైలుకు వెళితే సీఎం అవుతానని కేటీఆర్ అనుకుంటున్నారని చెప్పారు. కవిత ఢిల్లీలో జైలుకు వెళితే తాను హైదరాబాద్‌లో జైలుకు వెళతానని తన సన్నిహితుల వద్ద కేటీఆర్ చెప్పుకుంటున్నారని అన్నారు. భరత్ అనే నేను.. సినిమాలో మహేశ్‌బాబునని కేటీఆర్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ప్లాన్‌తోనే ప్రభాకర్‌రావు అమెరికాలో దాక్కున్నారని, ఇప్పుడు ఫార్ములా రేస్ కేసులో అర్వింద్‌కుమార్ ఎక్కడున్నారో కనపడటం లేదని అన్నారు.

కాంగ్రెస్ హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం

● ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల: హామీలను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై సామూహికంగా ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాలలోని నవదుర్గ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జగిత్యాలకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చి వేధింపులకు గురిచేస్తోందన్నారు. వేధింపులకు భయపడబోమని చెప్పారు. కేటీఆర్ విచారణ సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గమన్నారు. తమ పార్టీ లోపాలను సవరించుకుంటామని, తమపై ఎవరైనా దాడి చేస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. నవదుర్గ ఆలయ అభివృద్ధికి ఎంపీ దామోదర్ రావు రూ.90 లక్షలు ఇచ్చారని, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత రూ.10లక్షలిచ్చారని వివరించారు.

కేటీఆర్ పరువునష్టం కేసు విచారణ వాయిదా

సిటీ కోర్టులు: మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం దావా విచారణ సోమవారం సిటీ సివిల్ కోర్టులో జరిగింది. సినీ పరిశ్రమలో పలువురు విడాకులు తీసుకోవడానికి ఆయనే కారణమంటూ కొండా సురేఖ నిరాధార ఆరోపణలు చేయడంతో సమాజంలో తన పరువుకు భంగం కలిగిందంటూ కేటీఆర్ దావా వేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కొండా సురేఖతోపాటు మొత్తం 16 మందిపై కేటీఆర్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే పలువురు ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయగా మరికొంతమంది ప్రతివాదులు (కొన్ని మీడియా సంస్థలు) కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. తదుపరి విచారణలోపు మిగిలిన ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలంటూ కోర్టు విచారణను వాయిదా వేసింది.

కావాలనే కేసులు పెట్టి వేధిస్తున్నారు

● బీఆర్ఎస్ మహిళా నేతల ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం, ఫార్ములా–ఈ రేసింగ్ పేరుతో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను విచారణ పేరుతో వేధిస్తున్నారని బీఆర్ఎస్ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతాంగానికి ఎంతో మేలు చేసిందని, ఫార్ములా–ఈ రేసింగ్‌తో రాష్ట్రానికి మంచిపేరు వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ నాయకుల మీదే కేసులు పెట్టాలని వారు డిమాండ్ చేశారు.

..మా ఊరొచ్చింది ఏనుగు!



'ఏనుగమ్మ ఏనుగు.. మా ఊరొచ్చింది ఏనుగు' అని భలే సంబరపడిపోతున్నారు అమెరికన్లు. చూడటానికి పరిమాణంలోనూ, రాజసంలోనూ అచ్చం గజరాజుల్లా జీవం ఉట్టిపడేలా కనిపిస్తున్న ఇవన్నీ చెక్కతో చేసినవి. ఒకటికాదు, రెండు కాదు.. ఏకంగా 100 బొమ్మలు! ఆసియాలో వన్యప్రాణుల పరిరక్షణకు పనిచేస్తున్న యూకేకు చెందిన 'ఎలిఫెంట్ ఫ్యామిలీ' అనే స్వచ్ఛంద సంస్థ 'ద గ్రేట్ ఎలిఫెంట్ మైగ్రేషన్' పేరుతో వినూత్నంగా నిధుల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కుంజర సమూహం యూఎస్‌లోని ప్రముఖ నగర వీధుల్లో జనానికి వింత అనుభూతిని కలిగిస్తోంది. ప్రదర్శన మాత్రమే కదా, గొప్ప ఏముంది అని కొట్టిపారేయకండి.. ఎందుకంటే ఇవి మనదేశంలోనే రూపుదిద్దుకున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మనదేశంలోని ఆసియా ఏనుగులు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచినవి. అలాంటి ఏనుగులు రైలు ఢీకొట్టడం, విద్యాదాఘాతాల వంటివాటి వల్ల మరణించడం చూసి తట్టుకోలేక వాటికోసం 2002లో అప్పటి జైపూర్ రాజకుటుంబం, బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ఫైనాన్షియర్ సర్ ఎవలిన్ డి రాస్‌చైల్డ్ సంయుక్తంగా 'ఎలిఫెంట్ ఫ్యామిలీ'ని ఏర్పాటుచేశాయి. ఈ సంస్థ ఏనుగుల సంరక్షణలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతోంది. అందులో ఒకటి 'ద గ్రేట్ ఎలిఫెంట్ మైగ్రేషన్'. ఈ ప్రాజెక్టు కోసం.. భారత్‌లో తయారైన ఈ భారీ ఏనుగుల బొమ్మలు ఇప్పుడు అమెరికన్లు కట్టిపడేస్తున్నాయి.

యూఎస్‌లో 100 భారీ బొమ్మల ప్రదర్శన

- 'ద గ్రేట్ ఎలిఫెంట్ మైగ్రేషన్' ప్రాజెక్టు
- చేపట్టిన ఎన్జీఓ 'ఎలిఫెంట్ ఫ్యామిలీ'
- గజరాజుల బొమ్మల తయారీ భారత్‌లోనే
- మన శిల్పులు, ఇక్కడి మొక్కలతోనే

ఖరీదు కాస్త ఎక్కువే!

ప్రదర్శన అంటే కేవలం చూడటమే కాదు.. ఔత్సాహికులు తమకు నచ్చిన బొమ్మను బుక్ చేసుకోవచ్చు కూడా. ఏనుగు పిల్ల నుంచి భారీ కరిరాజు వరకు శిల్పులు నాలుగు రకాల బొమ్మలు తయారుచేశారు. వీటి ధరలు రూ.6,88,000లతో మొదలై రూ.18,92,000 వరకు ఉన్నాయి. బొమ్మ తయారుచేసి, ఇవ్వడానికి 4–6 నెలల సమయం పడుతుందని 'ఎలిఫెంట్ ఫ్యామిలీ' సంస్థ చెబుతోంది. తమిళనాడు నీలగిరిలోని గూడలూర్‌కు చెందిన 200 మంది స్థానిక గిరిజన కళాకారుల సంఘం 'కో ఎగ్జిస్టెన్స్ కలెక్టివ్' చేతిలో ఇవి రూపుదిద్దుకున్నాయి. నీలగిరి ప్రాంతంలో తిరిగే ఏనుగులను పోలిన ఈ బొమ్మలను.. శిల్పులు అయిదేళ్ల శ్రమించి తీర్చిదిద్దారు.

నగరాల వారీగా..

గజరాజుల శిల్పాలను అమెరికా అంతటా తిప్పి, ప్రదర్శనలు ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగా 2024 జూలైలో న్యూపోర్ట్‌తో మొదలై న్యూయార్క్ సిటీ, మియామీ బీచ్, హ్యూస్టన్‌లలో ఎగ్జిబిషన్ జరిగింది. మోంటానాలోని బ్రౌనింగ్‌లో జూన్ 4న ప్రారంభమైన ప్రదర్శన జూన్ 16తో ముగిసింది. పశ్చిమ యూఎస్ వయోమింగ్‌లోని జాక్సన్ హోల్‌లో మే 17 నుంచి జూన్ 20 వరకు జరుగుతుంది. జూలై 1 నుంచి ఈ గజరాజులు కాలిఫోర్నియా వాసులకు కనువిందు చేయనున్నాయి.

సంచరించడానికి స్థలం..

లాంటానా కామరా పుష్పించే ఈ కలుపు మొక్క వేగంగా వ్యాపిస్తుంది. జలావరణాల్లో ఇవి వేగంగా విస్తరించడం వల్ల జంతువులు జనావాసాల్లోకి రావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే, ఈ మొక్కలను ఏనుగు బొమ్మల తయారీకి వాడటం ద్వారా.. వన్యప్రాణుల సంచారానికి ఎక్కువ స్థలం ఉంటుందని, అటవీ పునరుద్ధరణకు దోహదపడుతుందనేది 'ఎలిఫెంట్ ఫ్యామిలీ' ఆలోచన. 'ద గ్రేట్ ఎలిఫెంట్ మైగ్రేషన్' ద్వారా సేకరించే నిధులను.. మానవులు, వన్యప్రాణుల సామరస్య సహజీవనాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచవ్యాప్తంగా చేపట్టే కార్యక్రమాల కోసం వెచ్చిస్తారు.



ఒత్తిళ్లు ఉంటే అరెస్ట్ చేసుకోమన్నా..

- రేవంత్ జైలుకు వెళ్లి వచ్చాడు కాబట్టి మమ్మల్ని కూడా పంపాలనుకుంటున్నాడు
- పరిపాలన చేతకాక దద్దమ్మ రాజకీయాలు చేస్తున్నాడు
- ఇదో లొట్టపీసు కేసు.. ఆయనో లొట్టపీసు నాయకుడు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: 'రూ.50 లక్షల డబ్బు సంచితో లుచ్చా పనులు చేసి జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి మమ్మల్ని కూడా జైలుకు పంపాలనే శాడిస్టు ఆలోచనతో ఉన్నాడు. తనకు జరిగింది ఇతరులకూ జరగాలనే ఉద్దేశంతో నెల రోజులు జైల్లో పెట్టాలనే షౌకు (కోరిక)తో ఉన్నాడు. అందులో భాగంగానే తెలంగాణ సాధించిన కేసీఆర్‌తో పాటు మాజీమంత్రి హరీశ్‌రావును కాళేశ్వరం కమిషన్ ముందుకు, నన్ను ఏసీబీ విచారణకు పిలుస్తున్నాడు. జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందడం తప్ప మరేమీ చేయలేడు. నేను తప్పు చేయలేదు, తెలంగాణకు తలవంపులు తెచ్చే పని చేయలేదు. ఇదొక లొట్టపీసు కేసు. ఆయన ఒక లొట్టపీసు నాయకుడు..' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఫార్ములా ఈ'కారు రేసు అంశంలో సోమవారం ఏసీబీ విచారణకు హాజరైన అనంతరం.. తెలంగాణ భవన్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

చిట్టి నాయుడి ప్రశ్నలు తిప్పి తిప్పి అడిగారు

'ఫార్ములా ఈ రేసు విధానపరమైన నిర్ణయమని, ఒక్క పైసా అవినీతి జరగలేదని చెప్పినా ఏసీబీ అధికారులు చిట్టి నాయుడు రాసిచ్చిన ప్రశ్నలను తిప్పి తిప్పి అడిగారు. అవినీతి ఎక్కడ జరిగిందని ఏసీబీ అధికారులను అడిగితే నీళ్లు నములుతున్నారు. అవినీతికి అవకాశం లేని తుపేల్ కేసులో ఏసీబీని



మాట్లాడుతున్న కేటీఆర్. పక్కన హరీశ్‌రావు తదితరులు

ఇన్వాల్వ్ చేయడం ఇప్పటివరకు చూడలేదని మా పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటున్నారు. ప్రభుత్వం నుంచి ఒత్తిళ్లు ఉంటే అరెస్టు చేసుకోవచ్చని ఏసీబీకి చెప్పా. తెలంగాణ కోసం మరోమారు జైలుకు వెళ్లేందుకు సిద్ధం..' అని కేటీఆర్ అన్నారు.

21న కాళేశ్వరం గొప్పదనాన్ని వివరించాలి

'రేవంత్‌రెడ్డి పాలన చేతకాక దద్దమ్మ రాజకీయాలతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటివరకు నాపై 14 కేసులు పెట్టాడు, మరో 1,400 కేసులు పెట్టినా రేవంత్ ఉడుత ఊపులకు భయపడేది లేదు. ఏసీబీ విచారణ డైలీ సీరియల్ మాదిరిగా తయారైంది. కేసులు, విచారణలను పక్కన పెట్టి కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించి కాంగ్రెస్‌ను ఫుట్‌బాల్ ఆడుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ఈ నెల 21కి ఆరు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కాళేశ్వరం గొప్పదనాన్ని ప్రజలకు తెలియచేయడానికి రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలి..' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కేటీఆర్ వ్యక్తి కాదు.. శక్తి: హరీశ్‌రావు

'స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి రేవంత్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాడు. తుమ్మినా, దగ్గినా కేసులు పెడుతున్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో కేటీఆర్‌పై 14 కేసులు పెట్టడమే దీనికి నిదర్శనం. ఎన్ని కేసులు పెట్టినా బిడ్డా.. కేటీఆర్ ఒక వ్యక్తి కాదు శక్తి. లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అండ ఉన్న కేటీఆర్‌ను ముట్టుకుంటే భస్మం అయిపోతారు జాగ్రత్త..' అని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. రాష్ట్ర గౌరవాన్ని పెంచేందుకు కేటీఆర్ ఫార్ములా ఈ రేస్‌ను నిర్వహిస్తే, రేవంత్ అందాల పోటీలతో తెలంగాణ పరువును తీశాడని మండిపడ్డారు.

తెలంగాణ భవన్‌కు భారీగా నేతలు

ఏసీబీ విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో కేటీఆర్ మంగళవారం ఉదయం హరీశ్‌రావుతో కలిసి నందినగర్ నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిశారు. అనంతరం హరీశ్‌తో కలిసి ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్‌కు పార్టీ ముఖ్య నేతలు స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్..ఫార్ములా ఈ కేసులో తనను అరెస్టు చేయించే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నాడని అన్నారు. వేయి కేసులు పెట్టినా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఒకరిద్దరిని మాత్రమే జైల్లో పెట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి లక్షలాది కేసీఆర్ సైనికులను టచ్ చేసే ధైర్యం లేదని వ్యాఖ్యానించారు. కాగా హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది ముఖ్య నేతలు విచారణ పూర్తయిన తర్వాత కేటీఆర్ తెలంగాణ భవన్‌కు తిరిగి వచ్చేంత వరకు తెలంగాణ భవన్‌లో ఎదురుచూశారు. సుమారు 9 గంటల పాటు విచారణ అనంతరం అక్కడికి వచ్చిన కేటీఆర్‌కు బాణాసంచా పేల్చి, నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. మీడియాతో మాట్లాడిన తర్వాత కేటీఆర్ తిరిగి నందినగర్ నివాసానికి వెళ్లి కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

సెల్‌ఫోన్లు ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయానికి చేరుకున్నారు. కేవలం కేటీఆర్ వాహనాన్ని మాత్రమే పోలీసులు లోనికి అనుమతించారు. కాగా సాయంత్రం 6 గంటల వరకు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్‌లతో కూడిన బృందం ప్రశ్నించినట్టు తెలిసింది. మధ్యలో టీ బ్రేక్‌లు ఇచ్చారని, మధ్యాహ్నం 45 నిమిషాలకు పైగా భోజన విరామం ఇచ్చినట్టు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈ ఏడాది జనవరి 9న కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా సోమవారం నాటి విచారణలో పలు కీలక అంశాలపై ప్రశ్నించారు.

డాక్యుమెంట్లు ముందుంచి..

ఈ కేసులో ఏ–2 అయిన సీనియర్ ఐఏఎస్ అధికారిఅర్వింద్ కుమార్, ఏ–3 హెచ్ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డితో పాటు గ్రీన్‌కో ఏస్ నెక్స్ట్ జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్ స్టేట్మెంట్లలో గుర్తించిన అంశాలు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులను, సీఈవోను జూమ్ మీటింగ్ ద్వారా గతంలో వర్చువల్‌గా విచారించిన సమయంలో వారిచ్చిన స్టేట్మెంట్ల ఆధారంగా తయారు చేసుకున్న ప్రశ్నావళి ఆధారంగా కేటీఆర్‌ను అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ఇప్పటికే సేకరించిన పలు డాక్యుమెంట్లను ముందుంచి ప్రశ్నించారు. వరుస ప్రశ్నలు వేస్తూ, డాక్యుమెంట్లను చూపుతూ వివరాలు రాబట్టారు. కేటీఆర్ చెప్పేదంతా వీడియో రికార్డింగ్ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండగా ఏ హోదాలో ఆదేశాలు ఇచ్చారనే కోణంలో విచారణ సాగింది. మొదటి దఫా విచారణలో కేటీఆర్ ఇచ్చిన సమాచారం, కేసు దర్యాప్తులో సేకరించిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఆధారంగా క్రాస్ క్వశ్చనింగ్ చేశారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ఖాతాలకు రూ.45.71 కోట్లు బదిలీ చేయడంపై, అనధికారింగా ఈ నగదు బదిలీ ఎందుకు చేయాల్సి వచ్చిందన్న విషయాలపై మరోసారి ప్రశ్నించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీ ఎలక్టోరల్ బాండ్స్ గ్రీన్‌కో కంపెనీ కొనుగోలుపైనా ఆరా తీసినట్టు తెలిసింది. కాగా అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు సూచించినట్టు తెలిసింది.

బీఆర్ఎస్ శ్రేణుల హడావుడి..ఉద్రిక్తత

కేటీఆర్ విచారణకు బంజారాహిల్స్ వస్తుండడంతో పాటు అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమావేశం జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీబీ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ముందుగానే బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్‌ను అనుసరిస్తూ పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు ఏసీబీ కార్యాలయం వద్దకు వచ్చారు. అయితే పోలీసులు వారిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ముందే అడ్డుకున్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు పక్కనే ఉన్న నీలోఫర్ కేఫ్‌లోకి వెళ్లడంతో వారిని అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నీలోఫర్ కేఫ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలను పోలీసులు కాసేపు మూసివేయించారు.

జనాభా తేలకముందే పునర్విభజన షురూ!

- దేశవ్యాప్తంగా 2027 మార్చిలో పూర్తి కానున్న జనగణన
- 2026 చివర్లోనే డీలిమిటేషన్ కమిటీ వేసే చాన్స్
- పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 153 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలు?
- తాజా జనాభా లెక్కల ప్రకారం ఆ సంఖ్యలు మారే అవకాశం

సాక్షి, హైదరాబాద్: జనాభా లెక్కలు తేలకముందే అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమం మొదలు కానుందని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గెజిట్ ప్రకారం 2027 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా జనగణన పూర్తి కానుంది. అయితే అంతకంటే ముందే 2026 చివర్లోనే డీలిమిటేషన్ కమిటీ ఏర్పాటు కానుందని, ఈ మేరకు సూత్రప్రాయ నిర్ణయం జరిగిందని సమాచారం. ప్రతి 25 ఏళ్లకోసారి పునర్విభజన చేయడం ఆనవాయితీగా వస్తోంది. చివరిసారిగా 2001లో దేశ వ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరిగింది. ఈ నేపథ్యంలో 2026లో మళ్లీ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కావాలి. 2001లో డీలిమిటేషన్ జరిగినప్పుడు అప్పటి జనాభానే పరిగణనలోకి తీసుకున్నారు. కానీ 2011లో, తర్వాత 2021లో కూడా జనగణన జరగలేదు. కాగా తాజా జనగణన 2027 మార్చి నాటికి పూర్తయి మే నెలాఖరుకు పూర్తి వివరాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో 2026 చివర్లోనే కమిటీ ఏర్పడినా 2027 జనగణన లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ జరుగుతుందని, ఈ లెక్క ప్రకారమే నియోజకవర్గాల సంఖ్య కూడా ఖరారవుతుందని ప్రభుత్వ వర్గాలు చెపుతున్నాయి.

పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే పెంపు

వాస్తవానికి రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఆమోదించిన పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ స్థానాలను 153కు, 17 లోక్‌సభ స్థానాలను 25కు పెంచాలని ఆ చట్టంలో పేర్కొన్నారు. అలా చేస్తే ఇప్పుడు ఉన్న దానికంటే 34 అసెంబ్లీ, 8 లోక్‌సభ స్థానాలు పెరిగేవి. కానీ కేంద్రం చేయలేదు. తాజాగా జనగణన జరగనుండటంతో..అప్పటి జనాభా లెక్కల ప్రకారం ఆ స్థానాల సంఖ్య మారే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో పెరిగిన ఉత్తీర్ణత

- ఫస్టియర్‌లో 67.4%, సెకండియర్‌లో 51.7 శాతం మంది పాస్
- నేటి నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరం 67.4 శాతం, ద్వితీయ సంవత్సరంలో 51.7 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మే 22 నుంచి 29 వరకూ జరిగిన ఈ పరీక్షల ఫలితలను ఇంటర్ బోర్డ్ సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. మొత్తం 4,13,880 మంది ఈ పరీక్షలు రాశారు. ఫిబ్రవరిలో జరిగిన వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు ఇంటర్ ఫస్టియర్‌లో మార్కులు పెంచుకోవడం కోసం (ఇంప్రూవ్‌మెంట్) 1,23,796 మంది ఈ పరీక్ష రాశారు. గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఫస్టియర్‌లో జనరల్ 1,68,079 మంది, ఒకేషనల్‌లో 11,452 మంది కలిపి మొత్తం 1,79,531 మంది పాసయ్యారు. వారిలో బాలికలు 90,191 మంది, బాలురు 89,340 మంది ఉన్నారు. ఇంటర్ సెకండియర్‌లో జనరల్, ఒకేషనల్ కలిపి 76,260 మంది పాసయ్యారు. వారిలో బాలికలు 30,085 మంది, బాలురు 46,175 మంది ఉన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం మంగళవారం నుంచి 23వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్ బోర్డ్ తెలిపింది.

గ్రూపుల వారీగా ఉత్తీర్ణుల వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

ఇసుక క్వారీలపై విజిలెన్స్ దాడులు

సాక్షి ఎఫెక్ట్

ఏటూరునాగారం: ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం(కె), ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని ఇసుక క్వారీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. ఈనెల 5వ తేదీన సాక్షి మెయిన్‌లో 'నదుల్లో ఇసుక తోడేళ్లు' శీర్షికన ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇసుక క్వారీలో పొక్లెయినర్ ద్వారా ఎలా లోడింగ్ చేస్తున్నారు. వే బ్రిడ్జి మీద తూకం వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. లారీల డ్రైవర్ల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారా అని కూపీ లాగుతున్నారు. ఎక్స్‌ట్రా బకెట్, అధిక లోడింగ్ చేస్తున్నారనే అంశంపై వివరాలు సేకరించారు.

థర్డ్‌పార్టీల కాంట్రాక్ట్ రద్దు?

గోదావరి నదిలోని ఇసుకను పొక్లెయినర్‌తో తోడేందుకు, టిప్పర్లలో లోడింగ్ చేసే థర్డ్ పార్టీ కాంట్రాక్ట్‌ను రద్దు చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇసుక క్వారీల్లో కాంట్రాక్టు పద్ధతిలో మిషనరీలను ఏర్పాటు చేసుకున్న వారి ద్వారానే అక్రమాలకు పాల్పడుతున్నారని, టీజీఎండీసీ అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నట్టు అధికారులు గుర్తించారు. గిరిజనులకు ఇసుక విక్రయ వ్యాపారం అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

కేబినెట్‌లో మాట్లాడాల్సింది.. మీడియాతో మాట్లాడితే ఎలా?

● స్థానిక ఎన్నికలపై పొంగులేటి ప్రకటన పట్ల టీపీసీసీ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న ఈ అంశంపై బహిరంగ ప్రకటన చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. కేబినెట్‌లో చర్చించాల్సిన అంశాలపై మీడియాతో మాట్లాడితే ఎలా? అని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు పరిధిలో ఉన్న విషయాలపై మాట్లాడే సమయంలో మంత్రులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు సూచించారని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే మంత్రులు ఎవరి శాఖల పరిధిలోని విషయాలపై వారు మాత్రమే మాట్లాడాలని, సున్నితాంశాలపై మాట్లాడే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మహేశ్‌గౌడ్ సూచించినట్టు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో పీసీసీ చీఫ్ సాక్ష్యం

● నేటి ఉదయం జూబ్లీహిల్స్ ఏసీపీ వద్దకు మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కీలకమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ సాక్షి కాబోతున్నారు. ఈ కేసుకు సంబంధించి సాక్ష్యం ఇచ్చేందుకు రావాలని పోలీసుల నుంచి ఆయనకు సమాచారం వచ్చింది. దీంతో మంగళవారం ఉదయం 11 గంటలకు ఆయన జూబ్లీహిల్స్ ఏసీపీ వద్ద సాక్షిగా తన వాంగ్మూలం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 2023లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌గౌడ్ ఫోన్‌ను అప్పటి ప్రభుత్వం ట్యాప్ చేసిందని ఆయన పలుమార్లు ఇప్పటికే ఆరోపించారు. తాను కూడా ఫోన్‌ట్యాపింగ్ బాధితుడినేనని చెప్పారు. ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యాపింగ్ కేసులో సాక్షిగా పీసీసీ చీఫ్ ఏం చెప్తారనేది ఆసక్తిగా మారింది.

ఎన్నికలు త్వరలో ఉంటాయని మాత్రమే అన్నా

● తేదీ చెప్పినట్లుగా వస్తున్న వార్తలు అవాస్తవం: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో ఉంటాయని మాత్రమే అన్నానని, తాను ఎన్నికల తేదీ చెప్పినట్లుగా మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని మంత్రి సీతక్కస్పష్టం చేశారు. సోమవారం ఆమె పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, తాను అనని మాటలు అన్నట్లుగా వార్తలు రావడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. కార్యకర్తల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై వారం పది రోజుల్లో స్పష్టత వస్తుందని మాత్రమే చెప్పానన్నారు. అయితే వారం రోజుల్లో షెడ్యూల్ వస్తుందని.. నోటిఫికేషన్ వెలువడుతుందని.. తాను అన్నట్టుగా కొందరు వార్తలు రాశారని పేర్కొన్నారు. వారం రోజుల్లో షెడ్యూల్ వస్తుందని తాను చెప్పినట్లుగా ఒక్క ఆధారం అయినా చూపిస్తారా? అని ప్రశ్నించారు. 20 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్నానని, స్థానిక ఎన్నికలు ఎలా జరుగుతాయో నాకు తెలియదా? అని అన్నారు. కేటీఆర్ జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నారని, జైలుకు పంపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. ఏదో ఆశించి కేటీఆర్ జైలుకు వెళ్లాలని అనుకుంటున్నారని, కేటీఆర్ వ్యవహారాన్ని దర్యాప్తు సంస్థలే చూసుకుంటాయని ఆమె స్పష్టం చేశారు.



ప్రపంచంలో ఇన్ని అద్దాలు ఉన్నప్పటికీ, తాము ఎలా ఉన్నామో ఎవరికీ ఎందుకు తెలీదు?

- ఆర్థర్ షోపెన్‌హవర్

సాక్షి

మంగళవారం, 17 జూన్ 2025

యుద్ధం కాదు... చర్చలే దిక్కు!

ఏ యుద్ధంలోనైనా కనబడే దూకుడే అయిదోరోజుకల్లా ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణలో కనబడుతోంది. ఎవరికెవరూ తీసిపోకుండా క్షిపణులు, బాంబులు యథేచ్ఛగా ప్రయోగిస్తున్నారు. జనావాసాలను గురిచూస్తున్నారు. ప్రత్యర్థుల్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నట్టు ప్రకటించుకుంటున్నారు. ఇజ్రాయెల్ విమానాల బాంబుదాడుల్లో 406 మంది ఇరాన్ పౌరులు మరణించగా, 654 మంది గాయపడ్డారని వాషింగ్టన్‌లోని మానవహక్కుల కార్యకర్తలు ప్రకటించారు. అటు రాజధాని టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాలపై ఇరాన్ సాగించిన క్షిపణి దాడులకు ఇజ్రాయెల్‌లో 14 మంది మరణించగా, 390 మంది గాయపడ్డారని అక్కడి సైన్యం తెలియజేసింది. తొలుత అణుకేంద్రాలపై దాడులు చేశామన్న ఇజ్రాయెల్ రెండోరోజు నుంచి నగరాలూ, పట్టణాలూ లక్ష్యంగా చేసుకుని బాంబులు ప్రయోగిస్తోంది. తయారీరంగ పరిశ్రమలనూ, ఎలక్ట్రానిక్ పరిశ్రమలనూ, పోలీస్ స్టేషన్లనూ, మౌలిక సదుపాయాలనూ ధ్వంసం చేస్తోంది. ఒక్క టెహ్రాన్‌లోనే శని ఆదివారాల్లో 250 లక్ష్యాలను దెబ్బతీశామని చెబుతోంది. దక్షిణ ఇరాన్‌లోని ప్రపంచంలోనే అతి పెద్ద సహజవాయు క్షేత్రాన్ని, టెహ్రాన్ వెలుపల ఒక చమురు డిపోను ఇజ్రాయెల్ సైన్యాలు పేల్చివేశాయి.

అణ్వస్త్రాల తయారీకి ఇరాన్ చేరువలో ఉన్నదని, అందుకే దాడులకు దిగామని ఇజ్రాయెల్ ఇస్తున్న సంజాయిషీ బూటకం. వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అది శుద్ధిచేసిన యురేనియం నిల్వలు ఉంచుకున్నా, బాంబు తయారీకి దరిదాపుల్లో లేదని సాక్షాత్తూ అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ కొన్ని వారాల క్రితం తెలిపారు. అణు ఒప్పందం గురించి అమెరికా–ఇరాన్‌ల మధ్య చర్చలు సాగుతుండగానే హఠాత్తుగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ అణు ఆరోపణ ఎందుకు చేసినట్టు? ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను అడ్డు తప్పించటానికి ఆ దేశంలో రసాయన ఆయుధాలున్నాయని కపట నాటకమాడిన అమెరికా అడుగుజాడల్లో ఇజ్రాయెల్ నడుస్తోంది. ఆ సాకుతో సద్దాంను తప్పించి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠిద్దామని అప్పట్లో అమెరికా, నాటో దేశాలు భావించాయి. కానీ జరిగిందంతా వేరు. రసాయన ఆయుధాల జాడలేదు సరిగదా... ఉగ్రవాదం మరింతగా విజృంభించింది. ఇప్పటికీ ఇరాక్ కుదుట పడలేదు. అఫ్గాన్, లిబియా, యెమెన్, సిరియాలు సైతం అదే దుఃస్థితిలో ఉన్నాయి. ప్రధాని నెతన్యాహూ రెండు లక్ష్యాలతో ఇరాన్‌పై విరుచుకుపడ్డారు. మతాచార్యుడు ఖమేనీ కనుసన్నల్లోని పాలకవ్యవస్థను పడగొట్టి అక్కడ తమకు అనుకూలమైన ప్రభుత్వం ప్రతిష్ఠించటం అందులో ఒకటైతే, రెండోది స్వదేశంలో తాను కోల్పోయిన పరువు తిరిగి పొందటం. అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసినా ఇరాన్‌లో తమకు అనుకూలమైన వారిని ప్రతిష్ఠించటం అసాధ్యం. ఆ రోజులు పోయాయి. 1970వ దశకం వరకూ ఇరాన్‌ను పాలించిన షా రెజాపెహ్లావీ వంటి అమెరికా కీలుబొమ్మ ఆ దేశంలో కొత్తగా పుట్టుకొచ్చే అవకాశం లేదు. ఇరాన్ ప్రతిఘటిస్తున్న తీరు చూస్తే నెతన్యాహూ రెండో లక్ష్యం కూడా నెరవేరే అవకాశం కనబడటం లేదు. పాలస్తీనాలో దిక్కూ మొక్కూలేని నిస్సహాయ పౌరులపై అమెరికా సరఫరా చేసిన మారణాయుధాలతో విరుచుకుపడటం వేరు. ఇప్పుడు ఇరాన్ జోలికి పోవటం వేరు.

ఇరాన్ పౌరులకు తమ ప్రభుత్వంపై ఎంతైనా వ్యతిరేకత ఉండొచ్చుగానీ, కొన్ని దశాబ్దాలుగా వారంతా నిత్యం యుద్ధ రంగంలోనే ఉన్నారు. ఇప్పుడంటే సౌదీతో ఒక మేరకు స్నేహసంబంధాలు ఏర్పడ్డాయిగానీ ఆ దేశం కూడా ఇరాన్‌పై కత్తికట్టినదే. గతంలో ఇరాక్‌తో వైరం ఏర్పడినప్పుడు వరసగా పదేళ్లపాటు యుద్ధం సాగించిన దేశం ఇరాన్. ఎంతగా అమెరికా మద్దతున్నా ఈ మాదిరి సుదీర్ఘ యుద్ధాన్ని ఇజ్రాయెల్ ఆర్థికవ్యవస్థ తట్టుకోవటం అసాధ్యం. ఆ మాటకొస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థ అంతటి మహాయుద్ధాన్ని భరించే స్థితిలో లేదు. 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరిట పలు దేశాల్లో నాటో కూటమితో కలిసి సాగించిన యుద్ధాల పర్యవసానంగా ఇప్పటికే అమెరికా నిండా మునిగింది. దాని ప్రస్తుత రుణం 36 లక్షల కోట్ల డాలర్లు. ఆర్థికవ్యవస్థకొచ్చే ఆదాయంలో సింహభాగం దానిపై వడ్డీలకే ఖర్చవుతోంది. ఇజ్రాయెల్‌కు వత్తాసుగా ఇరాన్‌తో వైరం పెట్టుకుంటే ఆ సుదీర్ఘ పోరు మరో పదిలక్షల కోట్ల డాలర్లను ఆవిరిచేస్తుంది. తాను అధికారంలోకొస్తే 'అనవసర యుద్ధాల' నుంచి అమెరికాను తప్పిస్తానని, ఒక్క సైనికుడు కూడా విదేశీగడ్డపై ఉండే అవసరం రాదని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఊదరగొట్టారు. అందుకే 'ఇజ్రాయెల్ జోలికెళ్తే ఖబడ్దార్' అంటూ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించటాన్ని స్వపక్షంలో అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు.

ఇప్పటికీ మించిపోయింది లేదు. అణు చర్చలకు సిద్ధమంటోంది ఇరాన్. కాకపోతే ఇజ్రాయెల్ వద్ద పుష్కలంగా అణ్వాయుధాలుండగా... పౌర అవసరాలకు సైతం యురేనియం వాడకాన్ని అనుమతించబోమనటం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమే అంటున్నది. నిజానికి ఒబామా హయాంలో అమెరికా ఆ వెసులుబాటు ఇవ్వటం వల్లనే 2015లో అణు ఒప్పందం సాకారమైంది. క్రితంసారి ఏలుబడిలో ట్రంప్ ఆ ఒప్పందాన్ని కాలరాశారు. ఇజ్రాయెల్ సృష్టించిన ఈ ఊబి నుంచి బయటపడాలంటే ఇప్పటికీ ట్రంప్‌కు ఆ ఒప్పందమే దిక్కు. ఈ నాలుగు రోజుల్లో డాలర్ విలువ పదిశాతం తరిగిపోయింది. ఇరాన్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి సాయపడతామని జర్మనీ విదేశాంగమంత్రి యోహాన్ వాడెపుల్ ముందుకొచ్చారు. అందుకు సిద్ధపడటమే అమెరికా ముందున్న ఏకైక మార్గం. కాదంటే ఇవాళ పశ్చిమాసియా కావొచ్చుగానీ... రేపు ప్రపంచమే పెను సంక్షోభంలో పడుతుంది. అప్పుడు ఆర్థిక పతనం నుంచి అమెరికాను ఎవరూ కాపాడలేరు.

తలొగ్గుతారా? తయారు చేస్తారా?

సందర్భం



టంకశాల అశోక్

పరిస్థితి ఇంతవరకు వచ్చిన తర్వాత ఇరాన్ ఎదుట మిగిలిన మార్గాలు రెండే! అమెరికా, ఇజ్రాయెల్‌ల ఒత్తిడికి లొంగిపోయి జీవించటమా? లేక స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో జీవించటం కోసం అణ్వాయుధాలను తయారు చేసుకోవటమా? అణ్వస్త్ర తయారీని ఇరాన్ కోరుకోవటం లేదు. అటువంటి సామూహిక హనన శక్తి గల ఆయుధ ఉత్పత్తి ఇస్లాం బోధనలకు విరుద్ధమనే సైద్ధాంతిక వైఖరి తీసుకున్న ఇరాన్ అధినేత అయతొల్లా ఖామేనీ ఆ మేరకు ఆదేశాలు ఎన్నడో జారీ చేశారు. అణుశక్తిని శాంతియుత అవసరాల కోసమే ఉపయోగించగలమని పలుసార్లు ప్రకటించారు. కానీ అమెరికా శిబిరానికి మౌలికంగా ఇరాన్ పట్లనే శత్రుత్వం ఉంది. అక్కడ అణు పరిశోధనలన్నవి సాకు మాత్రమే!

అమెరికా అండతోనే...

ఒకసారి ఇటీవలి పరిణామ క్రమాన్ని చూద్దాం. అణు పరిశోధనలు, వాటి పరిమితుల విషయమై ఇరాన్, అమెరికాల మధ్య ఖతార్‌లో అయిదు విడతల చర్చలు జరిగాయి. ఆరవ విడత ఈ నెల 15న జరగాల్సి ఉండగా, రెండు రోజుల ముందు 13న ఇజ్రాయెల్ దాడులు మొదలయ్యాయి. దాడుల గురించి తమకు ముందే తెలుసునని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జూన్ 14న స్వయంగా ప్రకటించారు. తాము అమెరికాతో సమన్వయం చేసుకునే దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అంతకుముందు 13 నాడే అన్నారు. తమ ఇంటెలిజెన్స్ సమాచారంతో, తాము సరఫరా చేస్తున్న ఆయుధాలతోనే దాడులు సాగుతున్నాయని ట్రంప్ 14న వెల్లడించారు. దాడులకు రెండు రోజుల ముందే అమెరికా ప్రభుత్వం పశ్చిమాసియా ప్రాంతంలోని తమ పౌరులకు, దౌత్య కార్యాలయాలకు జాగ్రత్తలు చెప్పి, తమ సైనిక స్థావరాలకు తగు హెచ్చరికలు చేసింది. అయినా తమకు దాడులతో నిమిత్తం లేదని వాదిస్తున్నది.

దీన్ని బట్టి కొన్ని ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. పాలస్తీనాతో ముడిబడిన చర్యలకు ఇరాన్ మిత్ర సంస్థలు ఇతర భూభాగాల నుంచి దాడులకు పాల్పడుతుండటం, వాటిపై ఇజ్రాయెల్ ప్రతిచర్యలు కొత్తవి కాదు. అవి ఎట్లున్నా, అణు పరిశోధనల విషయమై ఇరాన్ - అమెరికాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి ఈ 15 నాటి ఆరవ విడతలో ఫలించే అవకాశం ఉందని ట్రంప్ సైతం కొద్ది రోజులుగా అంటూ వస్తున్నారు. ఇదంతా నెతన్యాహూకు తెలిసినదే. అటువంటపుడు చర్చలకు సరిగ్గా రెండు రోజుల ముందు దాడులేమిటి? ఈ ప్రశ్నలపై నిపుణుల నుంచి రెండు అభిప్రాయాలు వినవస్తున్నాయి. ఒకటి, అమెరికా–ఇరాన్ చర్చలను, ఒకవేళ పరిష్కారం కుదిరే అవకాశం ఉంటే దానిని భంగపరచటం కోసమే ఇజ్రాయెల్ ఆ పని చేసిందన్నది. రెండు, ముందస్తు దాడులతో ఇరాన్‌ను భయపెట్టి చర్చలతో దారికి తెచ్చుకోవటం ట్రంప్ ఎత్తుగడ అన్నది. ఈ రెండింటిలో దేనికి అదిగా నిజం కాగల అవకాశాలు ఉన్నాయి కూడా. ఇరాన్‌తో రాజీ ఇజ్రాయెల్‌కు ఎంత మాత్రం ఇష్టం లేనిది. అందు కోసం వారు అమెరికానైనా ధిక్కరించగలరు. ఎందుకంటే, పాలస్తీనాకు నిజమైన మిత్ర దేశంగా మిగిలింది ఆ ప్రాంతంలో ఇరాన్ ఒక్కటే. వేర్వేరు అరబ్ దేశాలను అమెరికా ద్వారా మిత్రులుగా మార్చుకుంటున్నా, ఎంత మాత్రం రాజీ పడనిది ఇరాన్ మాత్రమే. కనుక దానిని ధ్వంసం చేయాలి. అమెరికాకు సంబంధించి, ఇజ్రాయెల్‌తో వైరాన్ని వదిలి, పాలస్తీనా కోసం పట్టుబట్టనట్లయితే సరిపోతుంది. ఆ విధంగా ఇజ్రాయెల్, అమెరికాల మధ్య కొద్దిపాటి వ్యత్యాసం ఉంది.



◆ ఇరాన్‌తో అమెరికా ఆరవ విడత చర్చలకు సరిగ్గా రెండు రోజుల ముందు దాడులేమిటి? ఈ ప్రశ్నలపై నిపుణుల నుంచి రెండు అభిప్రాయాలు వినవస్తున్నాయి. ఒకటి, అమెరికా–ఇరాన్ చర్చలను, ఒకవేళ పరిష్కారం కుదిరే అవకాశం ఉంటే దానిని భంగపరచటం కోసమే ఇజ్రాయెల్ ఆ పని చేసిందన్నది. రెండు, ముందస్తు దాడులతో ఇరాన్‌ను భయపెట్టి చర్చలతో దారికి తెచ్చుకోవటం ట్రంప్ ఎత్తుగడ అన్నది.

వైఖరుల్లో తేడా!

అణుశక్తి విషయంలోనూ ఇదే పరిస్థితి. ఇరాన్ అణుశక్తి పరిశోధనలు ఒక పరిమితికి లోబడి జరగాలని, అణ్వాయుధాల ఉత్పత్తికి అవసరమయ్యే యురేనియం 90 శాతం శుద్ధి జరగరాదని 2016లో ఇరాన్‌కు, అమెరికా తదితర దేశాలకు మధ్య అంగీకారం కుదిరింది. అందుకు బదులు ఇరాన్‌పై ఆంక్షలు సడలించాలన్నారు. కానీ రెండేళ్ల తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ కూడబలుక్కోవటంతో ఆ ఒప్పందం నుంచి అమెరికా ఉపసంహరించుకుంది. అప్పుడు కూడా అధ్యక్షుడు ట్రంప్. అప్పటినుంచి ఈ ఏడేళ్లుగా అణు రాజకీయం నడుస్తూనే ఉంది. అణ్వస్త్రాల కోసం యురేనియంను 90 శాతానికి, అంతకన్నా మించి శుద్ధి చేయవలసి ఉంటుంది. శాంతియుత అవసరాలకు అంతకులోపు అయితే సరిపోతుంది. ఇరాన్ కేంద్రాల్లో ప్రస్తుతం శుద్ధి 60 శాతంగా ఉంది. ఆ మాట ఇరాన్ ప్రభుత్వం చెప్పటమే కాదు అణుశక్తి సంస్థ కూడా ధ్రువీకరించింది. అయినప్పటికీ ఇజ్రాయెలీ నిఘా సంస్థలు మాత్రం తొమ్మిది అణ్వస్త్రాలకు కావలసినంత శుద్ధి ఇప్పటికే జరిగిపోయిందనీ, త్వరలో పదిహేనింటికి జరుగుతుందనీ ప్రచారం మొదలు పెట్టాయి. గమనించదగినదేమంటే అమెరికా మాత్రం ఈ మాట నేటికీ అనటం లేదు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకూడదనేది ఒక్కటే తమ షరతని ప్రకటిస్తోంది.

ఈ విషయమై ఇజ్రాయెల్, అమెరికా వైఖరుల మధ్య తేడా కనిపిస్తుంది. కనీసం శాంతియుత ప్రయోజనాల కోసమైనా సరే ఇరాన్ పరిశోధనలు ససేమిరా చేయరాదని, స్వయంగా శుద్ధి చేయకపోవటమేగాక, పరిమిత శుద్ధి గల ఇంధనాన్ని అయినా ఇతరుల నుంచి దిగుమతి చేసుకునేందుకు వీలు లేదన్నది ఇజ్రాయెల్ వాదన. ట్రంప్ వైఖరిలో ఇతర అంశాలకు సంబంధించి వలెనే ఇందులోనూ చంచలత్వం కనిపిస్తుంది. ఒకవేళ ఖతార్ చర్చలు సాగి ఉంటే అంగీకారం ఏదైనా కుదిరేదేమో తెలియదు. అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయబోమని మాత్రం ఇరాన్ స్పష్టం చేస్తోంది. తాము జోక్యం చేసుకుని ఏదైనా మధ్యే మార్గానికి ప్రయత్నించగలమని రష్యా కూడా అంటున్నది. ఇపుడు అకస్మాత్తుగా ఇజ్రాయెల్ దాడులు చేయటంతో, అందుకు అమెరికా తోడ్పడినట్లు ట్రంప్ మాటలలోనే కనిపిస్తుండటం వల్ల, తాము చర్చలకు 15న వెళ్లబోవటం లేదని ఇరాన్ ప్రకటించింది. అదే సమయంలో, ఇది శాశ్వత బహిష్కరణ అనక పోవటం గమనించదగ్గది. ఇరాన్ నిజాయతీని, దౌత్య మార్గంలో పరిష్కారానికి కట్టుబడటాన్ని అది చెప్తున్నది.

రహస్య అణు కేంద్రాలు?

అయితే, ఇరాన్ అణుశుద్ధి అణ్వస్త్ర తయారీ గురించి చెప్పుకోవలసినవి మరికొన్ని ఉన్నాయి. యురేనియం శుద్ధి 90 శాతం మేర ఇప్పటికే జరిగిందనేందుకు ఎటువంటి ఆధారాలూ అమెరికన్ల వద్ద సైతం లేవు. అణు ఇంధన సంస్థ కూడా ఆ మాట అనటం లేదు. కానీ, ఇరాన్ తమకు చూపకుండా దాచి పెడుతున్న విభాగాలు కొన్ని ఉన్నాయని ఆ సంస్థ అంటున్నది. ఆ మాట నిజం కాదని ఇరాన్ కూడా ఖండించటం లేదు. ఇజ్రాయెల్ దాడుల దరిమిలా ఒక కొత్త విషయం వెల్లడించారు. అది, ఎవరికీ తెలియని మరొకచోట కూడా శుద్ధి కేంద్రం నిర్మిస్తున్నామని! ఇవన్నీ నిజమైనా, చివరకు వారు అణ్వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారనుకున్నా, ఇజ్రాయెల్, అమెరికా సహా ఎన్నో దేశాలకు భారీ సంఖ్యలో అణ్వస్త్రాలు ఉన్నపుడు, తన రక్షణ కోసం ఇరాన్ మాత్రం ఎందుకు తయారు చేసుకోరాదన్నది మౌలికమైన ప్రశ్న. ఉత్తర కొరియా ఉదాహరణ ఇపుడు మరోసారి చర్చకు వస్తున్నది. అదే విధంగా ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నట్లయితే దాడికి ఇజ్రాయెల్, అమెరికాలు సాహసించగలవా? అణువ్యాప్తి నిరోధక ఒప్పందాలను ఉల్లంఘించి, ఇజ్రాయెల్ అణ్వస్త్ర తయారీకి రహస్యంగా సహకరించింది అమెరికా, యూరప్‌లు కాదా?

ప్రస్తుత యుద్ధానికి వస్తే, అమెరికా తోడ్పాటుతో ఇజ్రాయెల్ ఏకపక్ష విధ్వంసాలు సృష్టించగలగటం వట్టి మాట అని ఇరాన్ తన ఎదురు దాడులతో రుజువు చేస్తున్నది. ఇజ్రాయెల్ ఎంతో ఘనంగా చెప్పుకునే ఐరన్ డోమ్ బలహీనతలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక బలం మహాశక్తిమంతమైనదే గానీ, రెండవరోజు నుంచి కూడదీసుకున్న ఇరానియన్ రక్షణ వ్యవస్థలు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలను కూల్చివేయటం మొదలైంది. బహుశా వీటన్నింటి కన్నా ముఖ్యమైన వార్తలు, ఇరాన్ అణు కేంద్రాలకు ఇజ్రాయెల్ దాడులతో వాటిల్లిన నష్టం స్వల్పమైనదేనని, భూగర్భంలో, కొండలలో చాలా లోతున గల కేంద్రాలు యథాతథంగా ఉన్నాయన్నది. ఇరాన్ చివరకు అణ్వస్త్రాలు ఉత్పత్తి చేయక తప్పదా?

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

అంత ఈజీనా?



అదేదో దుకాణం లోంచి బ్రెడ్డు కొన్నంత మామూలు విషయం అయినట్టుగా జనం (ఇరాన్) ప్రభుత్వ మార్పులోని సంభావ్యత గురించి ఉల్లాసంగా మాట్లాడుతున్నారు. ఇరాక్, అఫ్గానిస్తాన్, 'ఉగ్రవాదం మీద యుద్ధ' కాలం నుంచి ఏమీ నేర్చుకోలేదన్నమాట!

- కబీర్ తనేజా, ఫెలో

ద్వంద్వం



పాకిస్తాన్: ఇరాన్‌ను దెబ్బకొడితే ఇజ్రాయెల్ మీద అణుదాడి చేస్తాం.
అదే పాకిస్తాన్: ఇరాన్ శరణార్థులకు ప్రవేశం లేదు. ఈజిప్ట్: నెతన్యాహూ గాజాలో నరమేధం సాగిస్తున్నారు.
అదే ఈజిప్ట్: గాజా శరణార్థులకు ప్రవేశం లేదు.

- అమిత్ శాండిల్య, కాలమిస్ట్

అగ్లీదే కూల్!



ఏఐ వచ్చిన తర్వాత 'వికారమైన ప్రెజెంటేషన్లు' గత కాలపు అంశాలుగా మారిపోయాయి. కానీ ఇప్పుడు ఆ వికారంగా రూపొందించిన ప్రెజెంటేషనే ప్రామాణికమైనదిగా కనబడుతూ దాన్ని మరింత విలువైనదిగా చేస్తోంది.

- కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

స్వీయౌషధం



మనం ప్రేమించేవాళ్లతో మాట్లాడినట్టే, మనతో మనం మాట్లాడుకోవడం అనేది ఒత్తిడి, భయం, బాధల నుంచి మనల్ని మనం దూరంగా ఉంచుకోవడానికి ప్రభావశీలమైన మార్గం.

- లూయిస్ హోవెజ్, రచయిత

సరిగ్గానే చేస్తున్నారా?



మీ పనికి రావాల్సినంత గుర్తింపు రావడం లేదని మీరు ఆందోళన చెందుతూవుంటే, మీరు ఏ పని చేస్తున్నారో దాన్ని మరోసారి తరచి చూసుకోండి.

- మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

ప్రధానికి బహిరంగ లేఖ

అభిప్రాయం



జస్టిస్ చంద్రకుమార్

నేను ఒక సాధారణ పౌరుడిగా ఈ ఉత్తరం రాస్తున్నాను. మీరు మన దేశంలో కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను, ముఖ్యంగా జీవించే హక్కును పరిరక్షించే బాధ్యత మీపై ఉంది. ప్రాణం ఎంతో విలువైనది. ఒకసారి మనిషి ప్రాణం పోతే మళ్లీ రాదు. కొంతకాలం క్రితం గౌరవనీయులైన హోంశాఖ మంత్రి అమిత్ షా గారు 2026 మార్చి నాటికి మన దేశంలో నక్సలిజం (నక్సలైట్లు) లేకుండా చేస్తామని ప్రకటించారు. ఆ ప్రకటనను మీరు సమర్థిస్తున్నట్లు మీ తదుపరి మాటల ద్వారా స్పష్టమైనది.

యువత జీవితాలను నష్టపరుస్తున్న డ్రగ్స్‌ను లేదా మత్తు పదార్థాలను ఒక కాలపరిమితిలో నిర్మూలిస్తామని, లేదా విదేశాలలో ఉన్న 80 లక్షల కోట్ల నల్లధనాన్ని తిరిగి తీసుకొనివస్తామని ప్రకటించినా, లేదా వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తామని చెప్పినా, మహిళల మీద అత్యాచారాలు జరగకుండా చూస్తామని చెప్పినా, బాల కార్మికులు లేకుండా చూస్తామని చెప్పినా, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని చెప్పినా, రైతుల ఆత్మహత్యలు జరగకుండా ఉండే పరిస్థితి కల్పిస్తామని చెప్పినా, రైతులకు గిట్టుబాటు ధరలు ఇస్తామని చెప్పినా, అందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని చెప్పినా, లేదా భూమిలేని రైతు కుటుంబాలకు భూమి ఇస్తామని చెప్పినా... ఇలా ప్రజల జీవితాలు మెరుగు పరిచే ఏ కార్యక్రమాన్నయినా ఒక కాల పరిమితిలో పరిష్కరిస్తామని చెప్పినా ప్రజలు ఎంతో సంతోషించేవారు. కానీ నక్సలిజం నిర్మూలన ప్రకటన చేశారు. దీని వెనుక కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు ఉన్నాయని అనేకమంది ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు తప్పని కూడా మీ నుంచి ప్రకటన వచ్చినట్లు నేను చూడలేదు.

'ఆపరేషన్ కగార్' పేరుతో నక్సలైట్ల నిర్మూలన చేపట్టారు. ఏడాది కాలంగా వందలాది మంది నక్సలైట్లు, ఆదివాసీలతోపాటు కొందరు పోలీసులూ మరణించారు. దీంతో మేము కొంతమందిమి కలిసి 'శాంతి చర్చల కమిటీ'ని ఏర్పాటు చేసి మార్చి 24న ఒక ప్రకటన విడుదల చేశాం. ఇటు కేంద్రం అటు మావోలు చర్చలు జరపాలనీ, ఈలోగా ఇరుపక్షాల వారూ కాల్పుల విరమణ పాటించాలనీ కోరాం. దీనికి మావోయిస్టులు స్పందించి 2025 మార్చి 28న ఒక బహిరంగ ప్రకటన చేశారు. తాము చర్చలకు సిద్ధమనీ, కాల్పుల విరమణ పాటిస్తామనీ, చర్చలకు అనుకూలమైన వాతావరణ కల్పించి కూంబింగ్ ఆపరేషన్స్ నిలిపివేయాలనీ కోరారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.

కేంద్రం గతంలో సాయుధులైన అనేక సంస్థలతో చర్చలు జరిపి శాంతి ఒప్పందాలు చేసుకుంది. ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్‌తో, నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపురతో 2024లో; నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్‌తో 2024లో, ఆదివాసీ ఇన్సర్జెంట్ గ్రూప్స్‌తో 2023లో, దిమ్సా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్‌తో 2023లో, మిజో నేషనల్ ఫ్రంట్‌తో 1996లో శాంతి ఒప్పందాలు చేసుకుని మంచి ఫలితాలను సాధించడం జరిగింది. అలాగే మావోయిస్టులతో కూడా శాంతి ఒప్పందం చేసుకుని ఉండవలసింది.

మావోయిస్టులు కూడా ప్రజా జీవితంలోకి వచ్చి సామాన్య ప్రజలను చైతన్యవంతులను చేసి, వారి సమస్యల పరిష్కారానికి శాంతియుత పోరాటాలు జరపవచ్చు. ఇటు కార్మికులకు, అటు పేద రైతులకు, ఆదివాసీలకు, దళితులకు మరిన్ని హక్కులు సాధించడానికీ, ప్రజల్ని రాజకీయంగా చైతన్యవంతులను చేయడానికీ మావోయిస్టులు పూనుకోవచ్చు. తద్వారా సమాజంలో మంచి మార్పులు రావడానికి అవకాశం కలగవచ్చు. ఇటువంటి సువర్ణ అవకాశాన్ని అటు ప్రభుత్వం, ఇటు నక్సలైట్లు వదులుకోవడం సరైనది కాదని భావిస్తున్నాం.

విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు

రైతాంగం కష్టాలు కొనసాగాల్సిందేనా!

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో వరితో సహా 14 పంటలకు అర కొరగా పెంచిన కనీస మద్దతు ధరల ప్రకటన రైతులను ఉసూరుమనిపిస్తోంది. కేంద్రం ప్రకటించిన ధరలను పరిశీలిస్తే, క్వింటాలు వరికి రూ. 69, జొన్నలకు రూ. 328, సజ్జలకు రూ. 150, మొక్కజొన్నకు రూ. 150, కంది పప్పుకు రూ. 450, పెసర్లకు రూ. 86, మినుములకు రూ. 400, వేరుశనగకు రూ. 480, పొద్దుతిరుగుడుకు రూ.441, సోయాబీన్‌కు రూ. 436, పత్తికి రూ. 589, కుసుమలకు రూ. 579, రాగులకు రూ. 596లు మేర మాత్రమే పెంచారు. ఆశ్చర్యం ఏమంటే ఈసారి పెంపుదల 2024-25లో పెంచిన దానికంటే తక్కువ ఉండటం.

అన్నదాతకు అన్యాయం జరగడం కొత్త కానప్పటికీ... దాదాపు 3 ఏళ్ల క్రితం మన కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఉరితాళ్ల వంటి 3 వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలపాటు ఢిల్లీ కేంద్రంగా రైతులు సాగించిన పోరాటం నేపథ్యంలో పంటల కనీస మద్దతు ధరల చట్టబద్ధతపై అవకాశాల పరిశీలన కోసం కమిటీ వేస్తామనీ, కమిటీ సూచనల ప్రకారమే నిర్ణ యాలు తీసుకొంటామనీ ఇచ్చిన రాతపూర్వక హామీకి ఇప్పటివరకు అతీగతీ లేదు.

సంస్కరణలు అనివార్యం

కనీస మద్దతు ధరలను నిర్ణయించే ప్రక్రియను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న పంటల ఉత్పత్తి వ్యయాన్ని రాష్ట్రాల వారీగా లెక్కించి, దానిని జాతీయ సగటుగా లెక్కించడం సరియైనది కాదు. సాగు ఖర్చులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఎంతో ఉంది. సగటు లెక్కన ధరలు నిర్ణయించడం వల్ల ఎక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది. దేశంలో ప్రధాన పంటల సాగు వ్యయాన్ని లెక్కించేందుకు ఎప్పుడో ఏర్పాటైన వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైసెస్ – సీఏసీపీ) వరుసగా మూడేళ్ల పంట సాగు వ్యయాన్ని లెక్కించి, దాని ఆధారంగా కనీస మద్దతు ధరల్ని లెక్కించి... ఆ వివరాలను కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీకి నివేదిస్తుంది. 'సీఏసీపీ'కి స్వయం ప్రతిపత్తి ఉన్నప్పటికీ... ఆ సంస్థ నివేదించే ధరల్ని కేంద్రం యథాతథంగా ఆమోదించడం లేదు. వాటికి సవరణలు చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం తమ వద్దనే ఉంచుకుంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వాలు, మరోవైపు సీఏసీపీ పంటల ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించడానికి భారీ కసరత్తు జరిపి అందిస్తున్న నివేదికల్ని బుట్టదాఖలు చేస్తున్నప్పుడు... అసలు ఆ సుదీర్ఘ కసరత్తు వల్ల ఒనగూడుతున్న ప్రయోజనం ఏమిటి? వాటికయ్యే ఖర్చు, సమయం వృథా అవడం తప్ప?!

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం హామీ ఇచ్చి ఆరేళ్లు దాటింది. అందుకు అనుగుణంగానే వ్యవసాయ రంగంపై 'నీతి ఆయోగ్' ఓ కార్యాచరణ ప్రణాళికా పత్రాన్ని రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించింది. కానీ, అది కూడా రైతాంగానికి చేసిన మేలేమీ లేదు. 2006లో డా॥ ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ అందించిన సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయానికి 50 శాతం జోడించి కనీస మద్దతు ధరల్ని ప్రకటిస్తామని కేంద్ర ప్రభుత్వం ఒకవైపు నమ్మబలికి, మరోవైపు స్వామినాథన్ చెప్పిన సీ2+ 50 శాతం ఫార్ములాను అనుసరించి ఎంఎస్‌పీ ఇస్తే నిత్యావసరాల ధరలు పెరిగి వినియోగదారుడి నడ్డి విరుగుతుందంటూ సుప్రీం కోర్టులో ఓ అఫిడవిట్ దాఖలు చేసి చేతులు దులుపుకొంది. అంతేకాదు... స్వామినాథన్ చెప్పిన సీ2+ 50 శాతం ఫార్ములాకు కొత్త భాష్యం చెప్పే దుస్సాహసం చేసింది కూడా! ఉదాహరణకు ఈ ఏడాది క్వింటాలు వరి ఉత్పత్తికి జాతీయ సగటు ఉత్పత్తి వ్యయం రూ. 3,135 అని రైతు సంఘాలు శాస్త్రీయంగా అంచనా వేశాయి. అయితే, తాజాగా కేంద్రం వరికి ప్రకటించిన ఎంఎస్‌పీ రూ. 2,369. అదేవిధంగా పత్తికి రూ. 16 వేల ధర ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వం సీఏసీపీకి నివేదిస్తే... కేంద్రం పత్తికి ప్రకటించిన ధర రూ. 7,710కు పరిమితం అయింది. ఈ లెక్కలు అన్ని ప్రధాన పంటలకూ వర్తిస్తాయి.



◆ కనీస మద్దతు ధరలను నిర్ణయించే ప్రక్రియను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. పంటల ఉత్పత్తి వ్యయాన్ని రాష్ట్రాల వారీగా లెక్కించి, దానిని జాతీయ సగటుగా లెక్కించడం సరికాదు. సగటు లెక్కన ధరలు నిర్ణయించడంతో ఎక్కువ ఖర్చున్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది.

వ్యవసాయ రంగాన్ని మెరుగుపర్చే అవకాశాలు గతంలో కంటే ఇపుడు ఎక్కువగానే ఉన్నాయి. రైతాంగానికి సాగు ఖర్చును గణనీయంగా తగ్గించి ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచే అవకాశాలు అనేకం అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాగుకయ్యే వ్యయాన్ని; చీడపీడలు, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాల్ని గణనీయంగా తగ్గించవచ్చు. చాలా దేశాలు వ్యవసాయరంగంలో బయో టెక్నాలజీని సమర్థంగా వినియోగించి మంచి ఫలితాలు రాబడుతున్నాయి. వాతావరణ మార్పుల్ని ముందుగానే అంచనా వేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందిస్తున్నారు. నీటికొరత, వర్షపు నీటి ముంపు, తెగుళ్ల వంటి వాటిని సమర్థంగా తట్టుకోగల వంగడాలను సృష్టిస్తున్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణ గణనీయంగా పెరిగింది. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్‌ను ఉపయోగించి ఏ నేల ఏ పంటలకు అనుకూలమో తెలుసుకొని అందుకు అనుగుణమైన పంటలు పండిస్తున్నారు.

ఇక, ప్రధానంగా గిట్టుబాటు ధరలకు సంబంధించి... దళారీల ప్రమేయం లేకుండా మార్కెట్ యార్డులను సమర్థంగా నిర్వహిస్తున్నారు. పంటల ఉత్పత్తి ధర కంటే మార్కెట్ యార్డులో ధర ఎక్కువగా ఉన్నప్పుడే... దానిని అమ్మాలనే నిబంధన కచ్చితంగా అమలు చేస్తున్నారు. అలా జరగడం కోసం పంటకు గిట్టుబాటు ధరను కనీస రిజర్వు ధరగా చట్టపరంగా పరిగణిస్తున్నారు. అయితే, ఈ రిజర్వు ధర అన్నది ఒకేలా ఉండదు. దిగుబడిని బట్టి రిజర్వు ధర ఆధారపడి ఉంటుంది. చైనా, థాయ్‌లాండ్, జపాన్ వంటి దేశాలలో సహకార పద్ధతిలో రైతులు తమ ఉత్పత్తులను అమ్ముతున్నారు. దాని వల్ల మంచి ధరల కోసం వారు గట్టిగా బేరమాడగలుగుతున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో రైతుల తరఫున బేరసారాలు సాగించడానికి ప్రత్యేక డైరక్టర్‌ను అన్ని మార్కెట్ యార్డుల్లో నియమిస్తున్నాయి. ఇటువంటి సదుపాయాలు, వెసులుబాట్ల కారణంగా రైతాంగానికి ఇంతకు ముందు లేని రక్షణ కలుగుతోంది. ఈ విధానాలన్నీ మన దేశంలో కూడా అమలు చేసినట్లయితే... రైతులకు మేలు జరుగుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు, మాజీ కేంద్రమంత్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.షష్ఠి ప.12.13 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: శతభిషం రా.11.03 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.6.42 నుండి 8.15 వరకు, తదుపరి తె.5.10 నుండి 6.43 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం: ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.38 వరకు, అమృతఘడియలు: ప.3.54 నుండి 5.27 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.29, సూర్యాస్తమయం: 6.32.

ఏపీ నుంచి తెలంగాణకు ఆరుగురు ఉద్యోగులు

- రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ఏపీ సచివాలంలో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన ఆరుగురు నాలుగో తరగతి ఉద్యోగులను తిరిగి తెలంగాణ రాష్ట్రానికి పంపేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో ఖాళీలు లేకపోవడంతో కమలనాథన్ కమిటీ ఆంధ్రప్రదేశ్‌కు ఆ ఉద్యోగులను కేటాయించింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఆరుగురు ఉద్యోగులను వెనక్కి తీసుకోవడానికి సమ్మతించిన నేపథ్యంలో నాలుగో తరగతి ఉద్యోగులు మహబూబ్ ఖాన్, శ్రీనివాస్, సయ్యద్ ఫరీద్, సంజీవ, పుండరీ కాక్షయ్య, గిరిధర్ బాబును రిలీవ్ చేశారు.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు..

- 14 ఏళ్ల బాలుడి ఆత్మహత్య



అయాన్ అహ్మద్

పహాడీషరీఫ్: సెల్‌ఫోన్ చూడొద్దని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన 14 ఏళ్ల బాలుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకుంటకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ నిస్సార్ అహ్మద్ కుమారుడు అయాన్ అహ్మద్(14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ నుంచి మెసేజ్‌లు వస్తున్న నేపథ్యంలో ఫోన్ ఇవ్వాలని తరచూ తండ్రిని కోరేవాడు. లేకపోతే తనకు ఫోన్ కొనివ్వాలని అడిగాడు. ఈ విషయమై ఆదివారం రాత్రి తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. కొద్దిసేపటి తర్వాత గదిలోకి వెళ్లిన అహ్మద్ ఇంటి పైకప్పు రాడ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి ఇది గమనించిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సింహ

నందిగామ: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నర్సప్పగూడ గ్రామానికి చెందిన కాట్న నర్సింహ (60) సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

తేలుతున్న ట్రిపుల్‌ఆర్ భూ పరిహారం లెక్క

- చదరపు మీటరుకు రూ.185 చొప్పున మూడు రెట్లు చెల్లిస్తాం
- నిర్వాసిత రైతులకు నోటీసులు జారీ
- కలెక్టర్ నేతృత్వంలోని ఆర్బిట్రేషన్ కోసం నిర్వాసితుల అభ్యర్థనల స్వీకరణ
- తక్కువ పరిహారానికి భూములు ఇచ్చేది లేదంటున్న రైతులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) పరిహారం లెక్క తేలుతోంది. రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు చదరపు మీటరు చొప్పున పరిహారం చెల్లించనున్నారు. సంగారెడ్డి మండలం కలాబ్‌గూర్ గ్రామ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు చ.మీ.కి 185.38 చొప్పున.. దీనిపై మూడింతలు.. అంటే చ.మీ.కి సుమారు రూ.556.14 చొప్పున చెల్లిస్తామని సంగారెడ్డి ఆర్డీఓ భూములు కోల్పోతున్న రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ మొత్తంపై 3ఏ నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి పరిహారం చెల్లించే రోజు వరకు 12 శాతం వడ్డీని అదనంగా ఇవ్వనున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం, పునరావాసం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆయా గ్రామాల్లో జరిగిన క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ విలువలు, మార్కెట్ విలువల ఆధారంగా



ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ కోసం సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఈ పరిహారం లెక్కింపు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో ప్రాంతానికి ఈ మొత్తం మారుతుందని, ఆయా గ్రామాల్లోని మార్కెట్ రేటు, రిజిస్ట్రేషన్ క్రయవిక్రయాల రేటు ఆధారంగా పరిహారం లెక్కింపు ఉంటుందని చెబుతున్నారు. అయితే అధికారులు చెప్పే లెక్క ప్రకారం ఎకరానికి రూ.22.49 లక్షలు మాత్రమే అవుతుంది. ఈ నామమాత్ర పరిహారానికి భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా లేరు. ఎంతో విలువైన తమ భూములకు ఇంత తక్కువ పరిహారం ఇస్తామంటే ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు.

కలెక్టర్ నేతృత్వంలో ఆర్బిట్రేషన్

నోటీసులు జారీ చేసిన అధికారులు..కలెక్టర్ నేతృత్వంలోని ఆర్బిట్రేషన్‌కు వెళితే ఈ పరిహారం ఒకటి నుంచి మూడు రెట్లు పెరుగుతుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ లెక్కన కలాబ్‌గూర్ గ్రామ పరిధిలో ఉన్న నిర్వాసితులకు ఎకరానికి సుమారు రూ.55 లక్షల వరకు పరిహారం వచ్చే అవకాశాలున్నాయని అనధికారిక అంచనా. కాగా నోటీసులు ఇచ్చిన అధికారులు నిర్వాసిత రైతుల నుంచి వారి ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు, భూమి పట్టాదారు పాసు పుస్తకాలు, బ్యాంకు పాస్‌బుక్‌లు తీసుకుంటున్నారు.

ఎనిమిది కాలాలు.. 111 గ్రామాల పరిధిలో భూసేకరణ

రాష్ట్ర అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా భావిస్తున్న ఈ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం 161 కి.మీలు నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ భాగానికి సంబంధించి మొత్తం ఎనిమిది కాలాలు (కాంపిటీటివ్ అథారిటీ ల్యాండ్ అక్విజేషన్) భూసేకరణ ప్రక్రియను చేపట్టారు. సంగారెడ్డి, ఆందోల్, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు భూసేకరణ ప్రక్రియను చేపట్టారు. మొత్తం 111 గ్రామాల పరిధిలోని రైతులు భూములు కోల్పోతున్నారు. సుమారు 6,250 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఈ రహదారి ఉత్తర, దక్షిణ భాగాలను కలిపి భూసేకరణ కోసం ప్రభుత్వం రూ. 5,234 కోట్లు కేటాయించింది.

9 మంది రైల్వే ఉద్యోగులకు పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించిన రైల్వేలోని వివిధ విభాగాలకు చెందిన 9 మందికి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ 'ఎంప్లాయి ఆఫ్ ది మంత్'పురస్కారాలు అందజేశారు. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన ముగ్గురు, హైదరాబాద్ డివిజన్‌కు చెందిన ఒకరు, విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు, గుంటూరు డివిజన్‌కు చెందిన ఇద్దరు చొప్పున లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాక్ మెయింటెయినర్లు ఇందులో ఉన్నారు. రైల్ నిలయంలో సోమవారం ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

రైలుకింద పడి ప్రేమజంట ఆత్మహత్య

- పెళ్లికి పెద్దలు అంగీకరించరని...



వినయ్‌కుమార్



శ్రుతి

భువనగిరి/స్టేషన్‌ఘన్‌పూర్: తమ పెళ్లికి పెద్దలు అంగీకరించరని రైలుకింద పడి ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన భువనగిరిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండ గ్రామానికి చెందిన కోటే వినయ్‌కుమార్(25), రచ్చ శ్రుతి(23) ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు కలిసి చదువుకున్నారు. చిన్ననాటి స్నేహితులైన వారి మధ్య ప్రేమ చిగురించింది. వినయ్‌కుమార్ స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. శ్రుతి బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఇద్దరూ వేర్వేరు సామాజికవర్గాలకు చెందినవారు. ఇటీవల శ్రుతికి పెళ్లి సంబంధాలు చూశారు. దీంతో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించరని భావించి ఇద్దరూ భువనగిరికి వచ్చారు. పట్టణ సమీపంలో పగిడిపల్లి-భువనగిరి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి సికింద్రాబాద్-విశాఖపట్నం లింక్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. ఛిద్రమైన మృతదేహాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు చేసిన రోదనలు మిన్నంటాయి. స్వగ్రామంలో శ్రుతి, వినయ్‌కుమార్‌ల అంత్యక్రియలు వేర్వేరుగా వారి కుటుంబసభ్యులు చేపట్టారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ జి.వేణు ఆదేశాల మేరకు ఎస్‌ఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఇంటర్‌లో ఫెయిలై.. ముగ్గురి ఆత్మహత్య



అక్షయ



వెంకటరమణ



హారిక

నస్పూర్/అక్కన్నపేట(హుస్నాబాద్)/జహీరాబాద్ టౌన్: ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో సోమవారం ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంచిర్యాల, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లోని జయశంకర్ కాలనీలో నివాసం ఉండే కోటేజీ కృష్ణార్జునరావు, ప్రవీణ దంపతుల చిన్న కూతురు అక్షయ సెకండియర్ గణితం ఫెయిల్ కాగా సప్లిమెంటరీ పరీక్ష రాసింది. సోమవారం వెలువడిన ఫలితాల్లోనూ పాస్ కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్షయ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తండ్రి గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందింది. మరో ఘటనలో.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం దాస్‌తండా గ్రామానికి చెందిన గుగులోతు కవిత-సూర్యానాయక్ దంపతుల రెండవ కుమార్తె హారిక (17) హనుమకొండ జిల్లా వంగర గురుకులంలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. బాటనీ సబ్జెక్ట్‌లో ఫెయిలైంది. తిరిగి సప్లిమెంటరీ రాసినా పాస్ కాకపోవడంతో సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మరో ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. రాయికోడ్ మండలం మహబత్‌పూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కృష్ణ కుమారుడు వెంకటరమణ(18)ఆర్‌ఎల్‌ఆర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. సెకండ్ ఇయర్‌లో ఫెయిల్ కావడంతో సప్లిమెంటరీ పరీక్షలు రాసాడు. సోమవారం విడుదలైన ఫలితాల్లోనూ ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

లంచం తీసుకుంటూ చిక్కిన డీఈవో, జేఏ



ఏసీబీకి చిక్కిన ములుగు డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్

ములుగు రూరల్: ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు 2024 జూన్‌లో రోడ్డు ప్రమాదానికి గురై సెలవు పెట్టాడు. అనంతరం అదే ఏడాది అక్టోబర్‌లో విధుల్లో చేరేందుకు స్థానిక ఎంఈవో కార్యాలయానికి వెళ్లగా, మూడు నెలల కంటే ఎక్కువగా సిక్ లీవ్ తీసుకున్నందుకు డీఈవోకు సరెండర్ చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఆ ఉపాధ్యాయుడు డీఈవో వద్దకు వెళ్లి సమస్యను వివరించాడు. అయితే ఎన్ని రోజులు గడిచినా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ క్రమంలో జూనియర్ అసిస్టెంట్ దిలీప్ ఫోన్ చేసి పోస్టింగ్ ఇవ్వాలంటే రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, ఆ ఉపాధ్యాయుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు సోమవారం రూ.20 వేలు తీసుకువెళ్లి .. డీఈవో పాణినికి రూ.15వేలు, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కు రూ.5 వేలు ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

దేవుడికీ అర్థం కారు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నిస్తుంటారు. మునిసిపల్‌అధికారులను దేవుడు కూడా బాగుచేయలేడు. ప్రజలకు మునిసిపల్ అధికారులు, న్యాయవాదులు, కోర్టుల గురించి తెలుసు. అధికారుల తీరు మారకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు'అని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు.

క్రమబద్ధీకరణపై నిర్ణయం వరకు యథాతథస్థితి

జీహెచ్‌ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 462 కింద చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నోటీసు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌కు చెందిన కె.రఘువీర ఆచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భవనం కూల్చివేస్తామంటూ అధికారులు నోటీసులు జారీ చేయడం చట్టవిరుద్ధమన్నారు. భవన క్రమబద్ధీకరణ పథకం (బీఆర్‌ఎస్) కింద దరఖాస్తు చేసుకున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన నోటీసులను నిలుపుదల చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ దరఖాస్తుపై నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. చాలాప్రాంతాల్లో అక్రమ నిర్మాణదారులకు అధికారులు సహకరిస్తున్నారని, అందుకే నిర్మాణాలు పూర్తయ్యే వరకు చర్యలు తీసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. పిటిషనర్ సమర్పించిన క్రమబద్ధీకరణ దరఖాస్తును పరిశీలించి నిర్ణయం తీసుకునే వరకు యథాతథస్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతివాదులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను జూలై 15కు వాయిదా వేశారు.

అటవీ శాఖ సిబ్బందిపై గిరిజనుల దాడి

- ఉద్రిక్తతకు దారి తీసిన గుడిసెల తొలగింపు
- పోలీసులపై పెట్రోల్, కారంపొడి చల్లిన వైనం
- కర్రలతో జేసీబీ డ్రైవర్‌పై దాడి
- ములుగు జిల్లా రొయ్యూర్ ప్రాంతంలో ఘటన



గుడిసెలు తొలగించేందుకు వచ్చిన జేసీబీపై కర్రలతో దాడి చేస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం: ములుగు జిల్లాలో గిరిజనుల గుడిసెల తొలగింపు ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఏటూరునాగారం మండలంలోని అటవీ శాఖ రొయ్యూర్ బీట్ రిజర్వు ఫారెస్టులో కొంతమంది గిరిజనులు గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నార్త్ డిప్యూటీ రేంజ్ అధికారి అప్సరున్నీసా సోమవారం అటవీ శాఖ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో సుమారు 23 ఎకరాల వరకు అటవీ భూమి ఉండగా, అక్కడ అక్రమంగా గుడిసెలు ఎందుకు వేశారని ప్రశ్నించారు. అనంతరం జేసీబీతో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేయగా గిరిజనులు కర్రలు, రాళ్లు, కత్తులు, కారం పొడి, పెట్రోల్‌తో దాడికి దిగారు. దీంతో అటవీ సిబ్బంది రక్షణ కోసం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో చేరుకొని గిరిజనులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా గిరిజనులు వారితో కూడా వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా జేసీబీ అద్దాలు పగులగొట్టి, డ్రైవర్‌పై కర్రలతో దాడి చేశారు. అదే సమయంలో పోలీసులపై పెట్రోల్, కారంపొడి చల్లడంతో వారిని అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనంతరం గిరిజనులు మాట్లాడుతూ శంకరాజుపల్లి, రొయ్యూర్‌ను ఏజెన్సీగా ప్రకటించి తమకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై డిప్యూటీ రేంజ్ అధికారి అప్సరున్నీసాను వివరణ కోరగా, ఆ ప్రాంతం అటవీ శాఖ పరిధిలోని రిజర్వు ఫారెస్టు అని, అందులో ఎలాంటి నిర్మాణాలు చేయడానికి అనుమతి లేదని అన్నారు. పర్యావరణం, అడవుల రక్షణ కోసమే అక్కడ ఉన్న గుడిసెలను తొలగిస్తున్నామని వివరించారు. అయితే.. తమపై నీలాద్రి అనే వ్యక్తి కత్తితో దాడిచేసేందుకు ప్రయత్నించాడని, మరికొందరు కర్రలతో జేసీబీపై దాడి చేయగా డ్రైవర్ అల్లంల రమేశ్‌కు గాయాలయ్యాయని చెప్పారు. పోలీసులపై పెట్రోల్, కారంపొడి చల్లి దాడికి యత్నించారని తెలిపారు. తమపై దాడికి దిగినవారి మీద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. కాగా, అటవీశాఖ అధికారులపై దాడికి యత్నించిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం సాయంత్రం తెలిపారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారిణి అప్సరున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సివిల్ వివాదాల్లో తలదూర్చొద్దు

- ఎన్నిసార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సివిల్ వివాదాల్లో ఇష్టారాజ్యంగా జోక్యం చేసుకోవద్దని ఎన్నిసార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదని హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో సివిల్ వివాదాలు పెండింగ్‌లో ఉండగా, ఎందుకు తలదూరుస్తారని ప్రశ్నించింది. పోలీసుల కారణంగానే కక్షిదారులు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనిపై పదేపదే చెబుతున్నా తీరు మార్చుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానాలు చేసే పనులు కూడా పోలీసులే నిర్వహించాలని భావిస్తున్నారని.. ఆ మేరకు చట్టంలో మార్పులు చేసుకోండని ఘాటుగా వ్యాఖ్యానించింది. 'స్టేషన్లలో కూర్చొని తీర్పులు ఇవ్వండి.. ఇళ్లు, స్థలాలు ఖాళీ చేయించండి.. అద్దె నియంత్రణ చట్టం సహా పలు బాధ్యతలను అప్పగించేలా చట్టం చేయమని సర్కార్‌ను కోరండి'అని అసహనం వ్యక్తంచేసింది. రక్షణ బాధ్యత కంటే గిఫ్ట్ డీడ్, వీలునామా లాంటి సివిల్ వివాదాల్లోనూ జోక్యం చేసుకోవడమే ఎక్కువగా కనిపిస్తోందని అభిప్రాయపడింది. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను, దావాలను ఉపసంహరించుకోమని పోలీసులు ఎలా చెబుతారని ప్రశ్నించింది. ఆ అధికారం ఎక్కడ ఉందని, ఏ చట్టంలో చెప్పారని నిలదీసింది. హైదరాబాద్ బార్కాస్‌లోని ఇంటి స్థలంపై కోర్టులో పిటిషన్‌ను వెనక్కు తీసుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని మోహిన్ బఫానా హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు స్టేషన్‌కు పిలిచి దావాను ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌పై ఒత్తిడి తెస్తున్నారని నివేదించారు. దాడి జరిగిందని ఫిర్యాదు చేసిన కారణంగానే కేసు నమోదు చేసినట్లు హోంశాఖ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

చట్టం ఏం చెబుతుందో చదవండి..

వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసుల విధుల నిర్వహణపై గతంలో ఇదే హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎన్నిసార్లు చెప్పినా పోలీసుల తీరు మాత్రం మారడం లేదని, ఇప్పటికీ స్టేషన్ మెట్లు ఎక్కాలంటే సామాన్యుడు భయపడే పరిస్థితి ఉందన్నారు. ఎండల్లో వచ్చిన బాధితులకు కనీసం మంచినీళ్లైనా ఇవ్వరని.. చాలా స్టేషన్లలో ఫిర్యాదు చేయడానికి పేపర్లు సహా స్టేషనరీ సామగ్రి తెచ్చుకోవాలని చెబుతున్నారని, ఇది తీవ్రంగా తప్పుబట్టాల్సిన విషయమన్నారు. ఖరీదైన స్టేషన్ అని చెప్పే గచ్చిబౌలిలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు ఓ బాధితుడు చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. పోలీసుల చట్టం ఏం చెబుతుందో చదువుకోవాలని, తమకు నచ్చిన విధంగా తక్షణ న్యాయం అందించాలనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. చట్టప్రకారం ఎవరు ఏ విధులు నిర్వహించాలో, వాటికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. తెలియక సివిల్ వివాదాలపై పీఎస్‌లకు వస్తే కోర్టులను ఆశ్రయించాలని సూచన ఇవ్వాలేగానీ, ఆ విధులు కూడా నిర్వహించవద్దని చెప్పారు. తాజా పిటిషన్‌లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌పై విచారణ జరిపి చర్యలకు ఎందుకు ఆదేశించవద్దని ప్రశ్నించింది. సివిల్ అంశం జోలికి వెళ్లకుండా, ఫిర్యాదుపైనే విచారణ జరుపుతారని ప్రభుత్వ న్యాయవాది హామీ ఇచ్చారు. దీంతో న్యాయమూర్తి ఈ పిటిషన్‌లో విచారణ ముగించారు.

అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్: ఈసీ

న్యూఢిల్లీ: ఓటింగ్ సమయంలో పోలింగ్ ప్రక్రియపై పర్యవేక్షణను మరింతగా పెంచాలని ఎన్నికల సంఘం(ఈసీ) నిర్ణయించింది. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌ను ప్రస్తుతమున్న 50 శాతం నుంచి వంద శాతానికి పెంచనుంది. అయితే, వెబ్‌కాస్టింగ్ డేటా ఈసీ వినియోగానికి మాత్రమే పరిమితం. ఈ విధానాన్ని ఈ ఏడాదిలో బిహార్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా అమలు పర్చనుంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న అన్ని పోలింగ్ బూత్‌లలోనూ వెబ్‌కాస్టింగ్ అమలు చేయాలని ఈసీ తాజాగా రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు తెలిపింది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో వీడియో గ్రఫీ, ఫొటో గ్రఫీ వంటివాటిని వాడుకోవాల్సి ఉంటుందని తెలిపింది. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్నదీ లేనిదీ పరిశీలించేందుకు 50 శాతం పోలింగ్ కేంద్రాల్లోనూ, సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నవాటిలోనూ ప్రస్తుతం వెబ్‌కాస్టింగ్‌ను ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే.

టెలికాం రంగంలోకి డొనాల్డ్ ట్రంప్!

ఫోన్, టెలికాం నెట్‌వర్క్‌ల ట్రేడ్‌మార్క్‌కు దరఖాస్తు

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన మద్దతుదారులు రెడ్ టోపీలను మాత్రమే కాదు.. ఇక నుంచి పసిడి వర్ణపు ఫోన్లను కూడా క్యారీ చేయనున్నారు. ఎందుకంటే ట్రంప్ ఇప్పుడు టెలికాం రంగంపై దృష్టి సారించారు. కొత్త ఫోన్ బ్రాండ్‌తోపాటు ఒక నెట్‌వర్క్‌నే ఏర్పాటు చేయాలనే ప్రణాళికలో ఉన్నారు. ఆయన ట్రేడ్‌మార్క్‌లను నిర్వహించే కంపెనీ డీటీటీఎమ్ ఆపరేషన్స్ ఎల్ఎల్‌సీ రెండు ట్రేడ్ మార్క్‌లకోసం యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకుంది. అందులో ట్రంప్ బ్రాండ్ మొబైల్‌ఫోన్, టెలికాం నెట్‌వర్క్ ఉన్నట్లు తెలుస్తోంది. జూన్ 12న ట్రంప్, టీ1 పేర్లపై పేటెంట్ కోరినట్లు తెలుస్తోంది. దరఖాస్తు పత్రాల ప్రకారం.. మొబైల్ ఫోన్లు, ఫోన్‌కేసులు, బ్యాటరీ ఛార్జర్లు, వైర్‌లెస్ టెలికాం సేవలు, ట్రంప్ బ్రాండ్‌తో రీటైల్ దుకాణాలు ప్రారంభించే ప్రణాళికలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ఊతమిస్తూ ట్రంప్ వ్యాపారాలను నిర్వహించే ఆయన కుమారుడు ఎరిక్ ట్రంప్ ఓ ప్రకటన చేశారు. ట్రంప్ మొబైల్ అనే కొత్త వెంచర్ అమెరికాలో తయారయ్యే ఫోన్లను విక్రయిస్తుందని, కాల్ సెంటర్‌కూడా నిర్వహిస్తుందని వెల్లడించారు. ఆగస్టులో అందుబాటులోకి వచ్చే టీ1 ఫోన్ బంగారు రంగులో ఉంటుందని, అయితే దీనిని మరో కంపెనీ తయారు చేస్తుందని ట్రంప్ కుటుంబ సంస్థ తెలిపింది. మరిన్ని వివరాలను వెల్లడించలేదు.

ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం

ఇరాన్ దాడుల్లో ఎనిమిది మంది మృతి

- అమెరికన్ కాన్సులేట్ స్వల్పంగా ధ్వంసం
- టెహ్రాన్‌లో ఖుద్స్ ఫోర్స్ కమాండ్ సెంటర్లను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడి

టెల్ అవీవ్/వాషింగ్టన్: ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం నాలుగో రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది. తమ అణు స్థావరాలను ధ్వంసం చేయడంతో అత్యున్నత సైనికాధికారులను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో సోమవారం ఉదయం క్షిపణుల వర్షం కురిపించింది. టెల్ అవీవ్, పెటా తిక్వా ప్రాంతాల్లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. ఈ దాడుల్లో కనీసం ఎనిమిది మంది ఇజ్రాయెల్ పౌరులు మృతిచెందారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. సాధారణ పౌరులను ఇరాన్ సైన్యం లక్ష్యంగా చేసుకుందని ఇజ్రాయెల్ పోలీసు శాఖ అధికార ప్రతినిధి డీన్ ఎల్స్‌డన్ ఆరోపించారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లోని అమెరికన్ కాన్సులేట్‌ను తాకింది. దీంతో కాన్సులేట్ స్వల్పంగా దెబ్బతిన్నట్లు అమెరికా రాయబారి మైక్ హకాబీ చెప్పారు. తమ సిబ్బంది ఎవరూ గాయపడలేదని 'ఎక్స్'లో పోస్టుచేశారు. ముందుజాగ్రత్తగా చర్య టెల్ అవీవ్‌లోని అమెరికన్ కాన్సులేట్‌తోపాటు జెరూసలేంలోని అమెరికా ఎంబసీని సోమవారం మూసివేశారు. ఇజ్రాయెల్‌పై దాదాపు 100 మిస్సైళ్లప్రయోగించినట్లు ఇరాన్ ప్రకటించింది. మరిన్ని ప్రతీకార దాడులు ఉంటాయని తేల్చిచెప్పింది. ఇరాన్ దాడుల్లో తమ దేశంలో ఇప్పటిదాకా 24 మంది మరణించారని, 500 మందికిపైగా గాయపడ్డారని ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్ సైన్యం 370 మిస్సైళ్లు, వందలాది డ్రోన్లు ప్రయోగించినట్లు పేర్కొంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఖుద్స్ ఫోర్స్‌కు చెందిన 10 కమాండ్ సెంటర్లను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలియజేసింది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటివరకు 224 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 1,277 మంది గాయపడ్డారు. అయితే, మృతుల సంఖ్యను ఇరాన్ ప్రభుత్వం తక్కువ చేసి చూపుతోందని మానవ హక్కుల సంఘాలు అంటున్నాయి. వాస్తవానికి ఇరాన్‌లో 400 మందికిపైగా మరణించారని చెబుతున్నాయి.



బాంబు దాడితో వార్తలను మధ్యలోనే వదిలేసి న్యూస్ రూమ్ నుంచి బయటకు వెళుతున్న ఇరాన్ టీవీ యాంకర్

ఇరాన్ ప్రభుత్వ టీవీ కార్యాలయంపై దాడి

కొద్దిసేపు ప్రసారాలకు అంతరాయం

టెహ్రాన్: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ప్రభుత్వ వార్తా చానల్ 'ఇరిన్'ప్రధాన కార్యాలయ భవనంపై ఇజ్రాయెల్ సోమవారం క్షిపణులతో దాడి చేసింది. భవనం కొంతభాగం ధ్వంసమైంది. ఆ సమయంలో యాంకర్ సహర్ ఎమామి చదువుతున్న వార్తలతోపాటు దాడితో సంభవించిన పేలుడు శబ్దం సైతం ప్రతిధ్వనించింది. భవన శిథిలాలు కింద పడుతున్న శబ్దాలు సైతం వినిపించాయి. స్టూడియో మొత్తం దుమ్ముతో నిండిపోయింది. యాంకర్ వెనుకనున్న స్క్రీన్ తెగిపోయింది. భయపడిన సహర్ ఎమామి వెంటనే కెమెరాను ఆపేసి, బయటకు పరుగుతీశారు. దీంతో కొద్దిసేపు వార్తల ప్రసారం నిలిచిపోయింది. అనంతరం సహర్ ఎమామి, మరో యాంకర్‌తో కలిసి ఇంకో స్టూడియోలో ప్రీ రికార్డెడ్ కార్యక్రమాలను కొనసాగించారు. పేలుడు కారణంగా భవనం అద్దాలు ధ్వంసమైన, ఇతర భాగాల్లో చెలరేగిన మంటలతో కూడిన వీడియోలు తర్వాత ఇరిన్‌లో టెలికాస్ట్ అయ్యాయి. కాగా, ఇరిన్ కార్యాలయాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ దాడికి గంట ముందు ఇజ్రాయెల్ హెచ్చరికలు పంపింది. ఇరిన్‌పై దాడికి తామే కారణమని ఇజ్రాయెల్ ప్రకటించుకుంది. ఇరాన్ సాగించే దుష్ప్రచారానికి ప్రధాన వేదికపై ఆర్మీ దాడి చేసిందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఇరాన్ నియంతృత్వం ఏరూపంలో ఉన్నా సహించేది లేదన్నారు. టెహ్రాన్ మూడో నంబర్ జిల్లాలో పలు టీవీ, రేడియో చానెళ్లతోపాటు ఇరిన్ కార్యాలయముంది. ఈ ప్రాంతంలో సుమారు 3.30 లక్షల మంది పనిచేస్తుంటారు.

టెహ్రాన్‌ను ఖాళీ చేయండి: ఇజ్రాయెల్

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భీకర స్థాయిలో దాడులు చేయబోతున్నట్లు ఇజ్రాయెల్ తేల్చిచెప్పింది. టెహ్రాన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని సాధారణ ప్రజలకు సూచించింది. గతంలో గాజా, లెబనాన్‌లోనూ దాడులకు ముందు ఇజ్రాయెల్ సైన్యం ఇలాంటి హెచ్చరికలే జారీ చేసింది. టెహ్రాన్ గగనతలంపై సంపూర్ణ ఆధిపత్యం సాధించామని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ స్పష్టంచేశారు. ఇరాన్‌లోని అణు స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసి తీరుతామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. తాము ఏం చేయాలని అనుకుంటున్నామో అది చేసి చూపిస్తామన్నారు.

ఇరాన్‌లో వైద్యుడికి ఉరి

2023 నుంచి జైలులో ఉంటున్న మెడికల్ డాక్టర్ ఇస్మాయిల్ ఫెక్రీకి ఇరాన్ అధికారులు సోమవారం ఉరిశిక్ష అమలు చేశారు. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్‌కు అతడు సహరించినట్లు, ఇరాన్‌కు సంబంధించిన రహస్య సమాచారాన్ని అందించినట్లు ఆరోపణలు రుజువయ్యాయని ఇరాన్ అధికారులు చెబుతున్నారు.

యుద్ధాల యుగం కాదు

- వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి
- భారత ప్రధాని మోదీ, సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్ పిలుపు

నికోసియా: పశ్చిమాసియా, యూరప్‌లో జరుగుతున్న యుద్ధాలు, సంఘర్షణలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇది యుద్ధాల యుగం కాదని తేల్చిచెప్పారు. వివాదాలు తలెత్తితే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, యుద్ధాలకు ముగింపు పలకాలని కోరారు. సోమవారం సైప్రస్ రాజధాని నికోసియాలో మోదీ, నికోస్ సమావేశమయ్యారు. భారత్–సైప్రస్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. రక్షణ, వ్యాపారం, వాణిజ్యం, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరులు, వాతావరణ మార్పులు తదితర కీలక అంశాలపై సంప్రదింపులు జరిగాయి. ఇరుదేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయానికొచ్చారు. భేటీ అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. పశ్చిమాసియా, యూరప్‌లో కొనసాగుతున్న యుద్ధాల ప్రభావం ప్రపంచమంతటా ఉంటుందని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. ప్రపంచ మానవాళి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని శాంతి, స్థిరత్వం కోసం అన్ని దేశాలూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సంఘర్షణలకు తెరదించడానికి చర్చలు, సంప్రదింపులే మార్గమని పునరుద్ఘాటించారు. సీమాంతర ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించిన సైప్రస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్–సైప్రస్ ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన అధ్యాయాన్ని లిఖించడానికి ఈ పర్యటన తనకు ఒక సువర్ణ అవకాశమని మోదీ వ్యాఖ్యానించారు. రెండు దేశాల సంబంధాలకు ప్రజాస్వామ్యం పట్ల పరస్పర విశ్వాసం, చట్టబద్ధమైన పాలనే పునాది అని స్పష్టంచేశారు. భారత్‌లో పర్యటించాలని సైప్రస్ అధ్యక్షుడిని మోదీ ఆహ్వానించారు.

దురాక్రమణకు చరమగీతం పాడాలి: నికోస్

భారత్–సైప్రస్ మధ్య చరిత్రాత్మక స్నేహ సంబంధాలు ఉన్నాయని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ గుర్తుచేశారు. విశ్వాసమే ప్రాతిపదికగా రెండు దేశాల నడుమ ఆత్మీయ సంబంధాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించినట్లు గుర్తుచేశారు. అంతకుముందు ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌కు చేరుకున్న మోదీ ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగాకౌన్సిల్ ఆఫ్ నికోసియా సభ్యుడు మైఖేలా ఖ్రైత్రియోటి మలాపా.. మోదీ పాదాలకు నమస్కరించారు.

వ్యాపారాభివృద్ధికి అద్భుత అవకాశాలు

భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని నరేంద్ర మోదీ వెల్లడించారు. వ్యాపారాభివృద్ధికి తమ దేశంలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలని, పెట్టుబడులతో ముందుకు రావాలని సైప్రస్ ఇన్వెస్టర్లకు, పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సైప్రస్ దక్షిణ కోస్తాతీరంలోని లిమాసోల్ సిటీలో బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మోదీ మాట్లాడారు. గత 11 ఏళ్లలో ఇండియా సాధించిన ఆర్థిక ప్రగతిని వివరించారు.



మోదీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ కరచాలనం

మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం

ప్రధాని మోదీని సైప్రస్ ప్రభుత్వం తమ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించింది. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ మకారియోస్–3'ని మోదీకి ప్రదానం చేశారు. భారత్–సైప్రస్ మధ్య స్నేహబంధానికి ఈ అవార్డును అంకితం ఇస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమని అభివర్ణించారు. వసుధైక కుటుంబం అనే భావనకు ఈ పురస్కారం ఒక ప్రతీక అన్నారు. రాబోయే రోజుల్లో మన రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం అత్యున్నత స్థాయికి చేరుకుంటుందన్న విశ్వాసం తనకు ఉందని చెప్పారు.

రెండు దశల్లో జనగణన

'జనగణన-2027'కు కేంద్రం పచ్చజెండా

- అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- దేశవ్యాప్తంగా 2027 మార్చి 1 నాటికి ప్రక్రియ పూర్తి
- లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో మాత్రం 2026 అక్టోబర్ 1 నాటికే
- జనగణనతో పాటు ఈసారి దేశవ్యాప్తంగా కులగణన కూడా
- రూ.13 వేల కోట్ల అంచనా వ్యయం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖలోని భారత రిజి‌స్ట్రార్ జనరల్ కార్యాలయం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభమైనట్లైంది. రెండు దశల్లో జరుగనున్న ఈ 16వ జనగణనలో భాగంగా కులగణన కూడా చేపట్టనున్నారు. చివరి జనగణన 2011లో జరిగింది. మళ్లీ 16 ఏళ్లకు, అంటే 2027 మార్చి 1 తేదీకి ఆ కసరత్తు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. శీతాకాలంలో పూర్తిగా మంచుమయంగా మారే జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లడఖ్‌కు 2026 అక్టోబర్ 1ని రిఫరెన్స్ తేదీగా కేంద్రం పేర్కొంది. ఆ నాటికల్లా అక్కడ జన, కులగణన ప్రక్రియ పూర్తవుతుంది. మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2027 మార్చి 1కి పూర్తవుతుంది. ఈ మొత్తం జనాభా లెక్కల ప్రక్రియ దాదాపు 21 నెలల్లో పూర్తికానుంది. జనగణన రెండు దశల్లో జరగనుంది. మొదటి దశలో ఆవాస నమోదు కార్యక్రమం (హౌస్ లిస్టింగ్ ఆపరేషన్–హెచ్ఎల్ఓ) జరుగుతుంది. ప్రతి ఇంటి నివాస స్థితి, ఆస్తులు, సౌకర్యాలు తదితర వివరాలు సేకరిస్తారు. తరవాత, రెండో దశలో జనాభా నమోదు (పీఈ- పాపులేషన్ ఎన్యుమరేషన్) కార్యక్రమం చేపడతారు. ఇందులో ప్రతి ఇంటిలోని ప్రతి వ్యక్తి లెక్కలు, సామాజిక–ఆర్థిక, సాంస్కృతిక తదితర వివరాలు సేకరిస్తారు. జనగణన చట్టం, 1948 (అధ్యాయం 3) కింద లభించిన అధికారాల ద్వారా 2019 నాటి జనగణన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, అప్పటి వరకు అమలైన చర్యలు ఇకపై కూడా అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. దాదాపు 34 లక్షల మంది గణనదారులు, పర్యవేక్షకులు... దాదాపు 1.3 లక్షల జనాభా లెక్కల సిబ్బంది జనగణనలో భాగం కానున్నారు. వీరు మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డిజిటల్ మార్గాల ద్వారా జగగణన నిర్వహిస్తారు. ప్రభుత్వం ప్రకటించే పోర్టల్లు, యాప్‌ల ద్వారా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకొనే అవకాశాన్ని ఇవ్వనున్నారు. ఈ భారీ కసరత్తుకు దాదాపు రూ. 13 వేల కోట్లు వ్యయం కానుంది.

మహిళా బిల్లు, డీ లిమిటేషన్‌కు మార్గం సుగమం!

జనగణనపై స్పష్టత వచ్చిన నేపథ్యంలో కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, రాష్ట్రాల మధ్య ఉత్తర–దక్షిణ రగడకు దారితీసేలా ఉన్న నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమం కానుంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు ప్రత్యేకించే బిల్లుకు ఇప్పటికే ఆమోదం లభించడం తెలిసిందే.



ఎన్‌సీఆర్ కూడా..

2021లో కులగణనతో పాటే జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్సీఆర్)ను కూడా అప్‌డేట్ చేయాలని నిర్ణయించారు. తాజా కసరత్తులో దాన్ని చేపట్టేదీ లేనిదీ స్పష్టత ఇవ్వలేదు. అయితే ఎన్సీఆర్‌ను అప్‌డేట్ చేస్తారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

2011లోనూ కులగణన జరిగినా...

2011 జనగణన సందర్భంగా కూడా కులగణన కసరత్తు జరిగింది. ఈ అంశాన్ని కేబినెట్ పరిశీలిస్తుందని 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభలో ప్రకటించారు. చాలా పార్టీలు కులగణనకు డిమాండ్ చేశాయి. కానీ నాటి యూపీఏ ప్రభుత్వం కులగణ నకు బదులు 'సామాజిక, ఆర్థిక, కులగణన (ఎస్ఈసీసీ)' పేరిట 2011లో సర్వే జరిపింది. అలా అప్పుడు కుల సంబంధిత గణాంకాలు సేకరించిన వాటిని ఎప్పుడూ వెల్లడించలేదు, ఉపయోగించలేదు. గత మూడేళ్లలో బిహార్, తెలంగాణ కులగణన జరిపాయి. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఈ కసరత్తు చేసినా, 'వాటిలో పారదర్శకత లోపించింది. కొన్ని సర్వేలు పక్కా రాజకీయ కోణం నుంచి, ప్రజల్లో అనుమానాలు రేకెత్తించే ఉద్దేశంతో జరిపారు' అని కేంద్రం పేర్కొంది.

అక్టోబర్ నుంచే శిక్షణ

- జనగణన కసరత్తుకు ముందు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లూ, ఇతర సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వనున్నారు. ఇది వచ్చే అక్టోబర్ నుంచే మొదలవుతుంది.
- కేంద్రంలో అత్యున్నత స్థాయిలో కనీసం 100 మంది జాతీయ శిక్షకులు ఉంటారు. వారికి జనగణనతో పాటు ట్రైనర్ డెవలప్మెంట్ నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇస్తారు.
- తర్వాత వారు దాదాపు 1,800 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తారు.
- వీరు 45,000 పై చిలుకు క్షేత్రస్థాయి ట్రైనర్లకు శిక్షణ ఇస్తారు. వీరు అంతిమంగా కింది స్థాయి సిబ్బంది అయిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లూ, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తారు.

3 డజన్ల ప్రశ్నలు

జన, కులగణనలో భాగంగా ప్రతి పౌరుడు 36 ప్రశ్నలకు బదులివ్వాల్సి ఉంటుంది. వాటిలో కొన్ని...

- టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్నాయా?
- వాడుతున్న వాహనం
- ప్రధాన ఆహారం
- నీటి వనరులు
- ఎలాంటి ఇల్లు
- ఇంటి యజమాని మహిళనా?

ఇవీ విశేషాలు

- జనగణన ప్రక్రియకు స్వీయ–గణన ఎంపిక ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.
- ఈసారి ప్రక్రియను డిజిటల్‌గా నిర్వహించనున్నారు.
- రాతకోతల అవసరం లేకుండా సిబ్బంది టాబ్‌ల ద్వారా సమాచారం నమోదు చేసుకుంటారు.
- సేకరణ, ప్రసారం నిల్వ సమయంలో డేటా భద్రతను నిర్ధారించడానికి చాలా కఠినమైన డేటా భద్రతా చర్యలు అమలు చేయనున్నారు.
- భారత రిజి‌స్ట్రార్ జనరల్ (ఓఆర్‌జీఐ) కార్యాలయం ఇప్పటికే సెల్ఫ్ ఎన్యూమరేషన్ (ఎస్ఈ) పోర్టల్‌ను అభివృద్ధి చేసింది.
- దీనిద్వారా వ్యక్తులు తమ ఇంటి సభ్యుల సమాచారాన్ని వీక్షించడానికి, అప్‌డేట్ చేయడానికి వీలవుతుంది.
- చివరగా 2011లో జరిగిన జనగణన ప్రకారం దేశ మొత్తం జనాభా 121.19 కోట్లు.
- వారిలో పురుషులు 62.372 కోట్లు (51.54 శాతం)
- స్త్రీలు 58.646 కోట్ల మంది (48.46 శాతం).

\+ 2021 జనగణనకు 2020లోనే సర్వం సిద్ధమైంది. కానీ కరోనా కారణంగా వాయిదా పడింది.

1931లో చివరి కులగణన

స్వాతంత్ర్యం అనంతరం దేశంలో కుల గణన చేపడుతుండటం ఇదే తొలిసారి. భారత్‌లో తొలి కులగణన 1881లో బ్రిటిష్ హయాంలో జరిగింది. అప్పుడు కుల గణన కూడా జరిపి డేటా విడుదల చేశారు. తర్వాత ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరిగింది. 1931 వరకు ప్రతి జనగణనలోనూ కులాలవారీ డేటా కూడా విడుదలయ్యింది. 1941 జనగణనలో కులాల వారీగా డేటా సేకరించినప్పటికీ ఆ గణాంకాలను విడుదల చేయలేదు. దేశంలో 2011 వరకు ఎటువంటి అంతరాయం లేకుండా జనగణన ప్రక్రియ కొనసాగింది. అయితే, కరోనా కారణంగా 2021లో విడుదల చేయాల్సిన జనాభా లెక్కలు వాయిదా పడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ప్రతి జనాభా గణనలోనూ, ప్రభుత్వం కేవలం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కుల ఆధారిత డేటాను మాత్రమే విడుదల చేసింది. 1931 తర్వాత ఇతర కులాలకు సంబంధించిన గణాంకాలను ఎప్పుడూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదు.

- ఇది మొత్తమ్మీద 16వ కులగణన. స్వాతంత్ర్యం వచ్చాక 8వది.
- ఈసారి కులగణన కూడా జరపాలని గత ఏప్రిల్ 30న ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు.

కులగణన ఉంటుంది: కేంద్రం

న్యూఢిల్లీ: జనగణనలో భాగంగా ఈసారి కులగణన కచ్చితంగా ఉంటుందని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. 'సోమవారం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన లేదని, ఆ కసరత్తు ఉండబోదని తప్పుదోవ పట్టించే ప్రచారం జరుగుతోంది. దాన్ని నమ్మొద్దు' అని ఒక ప్రకటనలో పేర్కొంది. గెజిట్ లో కులగణన ప్రస్తావనే లేదని కాంగ్రెస్ దుయ్యబట్టింది. ఇది మోదీ సర్కారు యూ టర్న్ అని విమర్శలు గుప్పించింది. అనంతరం కేంద్ర హోం శాఖ ప్రకటన చేసింది. కేవలం కులగణనకే పరిమితం కారాదని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 'ఈ విషయంలో తెలంగాణ మోడల్ ను అనుసరించాలి. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన సమగ్ర వివరాలను కూడా కులాలవారీగా పొందుపరచాలి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు.

యుద్ధం తక్షణమే ఆపండి

ఇజ్రాయెల్, ఇరాన్‌లకు జీ7 దేశాల అధినేతల వినతి ● వెంటనే చర్చలు ప్రారంభించాలన్న డొనాల్డ్ ట్రంప్

కాల్గరీ: ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ఎంతమాత్రం వాంఛనీయం కాదని జీ7 దేశాల అధినేతలు తేల్చిచెప్పారు. రెండు దేశాలు వెంటనే వెనక్కి తగ్గాలని, యుద్ధానికి స్వస్తి చెప్పాలని కోరారు. ఇజ్రాయెల్–ఇరాన్ వెంటనే చర్చలు ప్రారంభించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. పరస్పరం కలిసి చర్చించుకొని, ఘర్షణకు తెరదించాలని అన్నారు. జీ7 కూటమి వార్షిక సదస్సు సోమవారం కెనడాలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు నేతలు మీడియాతో మాట్లాడారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నివారించడమే లక్ష్యంగా ఒక పరిష్కార మార్గం కనిపెట్టాలని తామంతా అంగీకారానికి వచ్చినట్లు బ్రిటిష్ ప్రధానమంత్రి కియర్ స్టార్మర్ చెప్పారు. ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలోనూ పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందన్నారు. అణ్వాయుధాలు సొంతం చేసుకొనేందుకు ఇరాన్‌ను అనుమతించకూడదని జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చెప్పారు. మరోవైపు జీ7 కూటమిపై డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 2014లో రష్యాను ఈ కూటమి నుంచి తొలగించడం పొరపాటేనని చెప్పారు. రష్యాను పక్కనపెట్టడం ప్రపంచాన్ని ఇప్పుడు అస్థిరపరుస్తోందని అభిప్రాయపడ్డారు. జీ7 ఇక జీ8 కావాలని.. జీ9 అయితే ఇంకా బాగుంటుందని పేర్కొన్నారు. కూటమిలో రష్యా, చైనా సైతం సభ్యదేశాలుగా చేరాలన్న తన ఆకాంక్షను ట్రంప్ వ్యక్తంశారు. జీ7 ప్రస్తుతం ఫ్రాన్స్, అమెరికా, యూకే, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా,చే యూరోపియన్ యూనియన్(ఈయూ) సభ్యదేశాలుగా ఉన్నాయి. ఇందులో భారత్‌కు సభ్యత్వం లేదు. అయినప్పటికీ ఈ ఏడాది జీ7 సదస్సుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. మంగళవారం జీ7 సదస్సులో మోదీ పాల్గొంటారు.



జీ7 సదస్సుకు ప్రధాని మోదీ రాక సందర్భంగా కాల్గరీలో ఖలిస్థానీవాదుల నిరసన

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 17 । జూన్ । 2025



ఇక్కడ నో అడ్మిషన్..

ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ఫుల్ అయ్యాయి. ఇక్కడ నో అడ్మిషన్ బోర్డు పెట్టగా..గచ్చుబాయి తండాలో మాత్రం విద్యార్థులు లేక పాఠశాల ఖాళీ అయింది. - 10లో



నగర వనిత.. విజయ వీచిక..

నగరంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగంలో మహిళలు గొప్పగా రాణిస్తున్నారు. మొదట ఈ రంగంలో పురుషాధిపత్యం కనిపించినా, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



పరీక్ష ఫలితాల కోసం..

ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ఉద్యోగాల కోసం నిర్వహించిన పోటీ పరీక్ష ఫలితాలను వెంటనే విడుదల చేయాలని రెండవ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వారు కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఎస్‌ఆర్‌బీ) కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.

పాతబస్తీ మెట్రోకు రూ.125 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రోరైల్ విస్తరణకు ప్రభుత్వం సోమవారం రూ.125 కోట్లు విడుదల చేసింది. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో మెట్రోరైల్ నిర్మాణానికి చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. ఇందులో భాగంగా సుమారు 950 వరకు ఆస్తుల సేకరణకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు దాదాపు 311 ఆస్తులను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సహాయ పునరావాస నష్టపరిహారం కింద వాటి యజమానులకు రు. 283 కోట్లు పంపిణీ చేశారు. మరిన్ని ఆస్తులను సేకరించి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది. మరోవైపు త్వరలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి కేంద్రం నుంచి అనుమతి లభించిన వెంటనే మొదట పాతబస్తీ మెట్రో కారిడార్ నిర్మాణం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మెట్రోరైల్‌కు రైల్వే సేఫ్టీ ఎక్సలెన్సీ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్‌కు ప్రతిష్టాత్మక రైల్వే సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ నెల 13వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ఎకనమిక్ టైమ్స్ ఇన్‌ఫ్రా రైల్ షో–2025లో ఈ అవార్డు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలతో మెట్రో రైళ్లకు ప్రతిసంవత్సరం ఈ అవార్డును అందజేస్తారు. హైదరాబాద్ మెట్రోరైల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం సంతోషదాయకమని, ఈ గుర్తింపు గొప్పమైలురాయి వంటిదని అధికారులు పేర్కొన్నారు.సురక్షితమైన, విశ్వసనీయమైన, ప్రపంచ స్థాయి అర్బన్ ట్రాన్సిట్ సొల్యూషన్స్‌ను అందించడంపై సంస్థకు గల నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుందన్నారు.' ఈ అవార్డు తాము సాధించిన విజయాలకు గుర్తింపు మాత్రమే కాదని, అర్బన్ మొబిలిటీ భవిష్యత్తును మరింతగా తీర్చిదిద్దాల్సిన బాధ్యతను సైతం గుర్తుచేస్తుందని ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీరెడ్డి తెలిపారు. ''ఫ్యూచర్ ఆఫ్ అర్బన్ రైల్ అండ్ స్మార్ట్ స్టేషన్స్ – ట్రాన్స్‌ఫార్మింగ్ అర్బన్ మొబిలిటీ'' అనే అంశంపై జరిగిన ప్యానెల్ డిస్కషన్‌లో ఆయన తన అనుభవాలను,రాబోయే తరం ట్రాన్సిట్‌కి సంబంధించి ఎల్‌అండ్‌టీ విజన్‌ను వివరించారు.

ఆటో పర్మిట్ ఇక ఆన్‌లైన్‌లో..

రవాణాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు అవకాశం

- హైదరాబాద్‌తో పాటు ఎక్కడైనా కొనుగోలు చేయవచ్చు
- బ్లాక్‌మార్కెటింగ్ అడ్డుకునేందుకు ఆర్టీఏ పటిష్ట చర్యలు
- విధివిధానాలపై కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో:


కొత్త ఆటో పర్మిట్‌లకు ఇక ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం రవాణాశాఖ వెబ్‌సైట్‌లో అవకాశం కల్పిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి అన్ని విధాలుగా అర్హతలు కలిగిన ఆటోడ్రైవర్‌లకు ప్రొసీడింగ్స్ (అనుమతులు) ఇస్తారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో ఎక్కడైనా ఆటోరిక్షా కొనుగోలు చేసుకోవచ్చు. పర్మిట్‌లపైన ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా, బ్లాక్ దందాకు అవకాశం లేకుండా పారదర్శకమైన విధివిధానాలను రూపొందించేందుకు రవాణాశాఖ దృష్టి సారించింది. గతంలో కొంతమంది డీలర్లు, ఫైనాన్షియర్‌లు కలిసి పెద్దఎత్తున దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బినామీ పేర్లపైన ఆర్టీఏ నుంచి అనుమతులు తీసుకొని పర్మిట్‌లను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. ఆటోరిక్షాలపైన కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచారు. అప్పట్లో కొందరు రవాణా అధికారులు సైతం ఇందుకు సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఫైనాన్షియర్‌లు నిరుపేద ఆటోడ్రైవర్‌లపైన నిలువుదోపిడీకి పాల్పడ్డారు. అప్పటి పరిణామాలు మరోసారి పునరావృతం కాకుండా అరికట్టేందుకు ఈసారి అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో కేవలం హైదరాబాద్‌లోనే కొనుగోలు చేయాలనే నిబంధన ఉండేది. దీంతో కొనుగోలుదార్లు డీలర్ల డిమాండ్ మేరకు ఆటోధర కంటే రెట్టింపు ధర చెల్లించవలసి వచ్చింది. ఈసారి తెలంగాణలో ఎక్కడైనా సరే కొనుక్కొనేందుకు అవకాశం కల్పించడం వల్ల షోరూమ్ ధరలకే ఆటోలు లభించే అవకాశం ఉంటుంది. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు 65 వేల కొత్త ఆటో పర్మిట్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కొత్త పర్మిట్‌లపైన ఆంక్షలను సడలించారు. ఈ ఆటోల్లో 25 వేల వరకు పెట్రోల్, డీజిల్ నుంచి ఎల్పీజీ, సీఎన్జీలోకి మార్చుకొనేందుకు రిట్రోఫిట్‌మెంట్‌కు అవకాశం కల్పిస్తారు. మరో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు, 10 వేల ఎల్పీజీ, మరో 10 వేల సీఎన్జీ ఆటోలకు పర్మిట్‌లు ఇవ్వనున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌లో సుమారు 1.4 లక్షల ఆటోలు తిరుగుతున్నాయి. కొత్త పర్మిట్‌ల వల్ల ఆటోల సంఖ్య 2 లక్షలు దాటనుంది.

గ్రేటర్ నివాసి అయితే చాలు...

కొత్తగా ఆటోలు కొనుగోలు చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు ఆధార్ వంటి ధృవపత్రాలను కలిగి ఉండాలి. ఇంటి చిరునామా, వివరాలను అధికారులకు అందజేయాలి. అలాగే త్రీవీలర్ ఆటోడ్రైవింగ్ లైసెన్స్, లైట్‌మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వాళ్లకు మాత్రమే ఆటో కొనుగోలు చేసేందుకు అనుమతినిస్తారు. ఒక డ్రైవర్‌కు ఒక్క ఆటోకు మాత్రమే పర్మిషన్ ఇచ్చేవిధంగా నిబంధనలను కఠినతరం చేయాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఒకే డ్రైవింగ్ లైసెన్స్, ఒకే చిరునామాపైన పదుల సంఖ్యలో పర్మిట్‌లను పొందిన కొందరు వాటిని అధికధరలకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. ఈసారి అలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా పటిష్టమైన నియంత్రణ చర్యలు తీసుకోనున్నట్లు ఆర్టీఏ అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు కొత్త ఆటోపర్మిట్‌లపై విధివిధానాలను రూపొందించేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్ జేటీసీ రమేష్ నేతృత్వంలో అధికారుల సమావేశం జరిగింది. పర్మిట్‌లను పారదర్శకంగా ఇచ్చేందుకు తీసుకోవలసిన చర్యలపైన విస్తృతంగా చర్చించారు. ఆటో పర్మిట్‌లపై విధివిధానాలపైన త్వరలో రవాణాకమిషనర్ నిర్ణయం తీసుకోనున్నారు.

ఫైనాన్షియర్‌ల పర్మిట్ దందా....

నగరంలో పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని భూరేలాల్ కమిటీ సిఫార్సుల మేరకు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఆటోలపైన ఆంక్షలు విధించింది. అదే సమయంలో కాలం చెల్లిన ఆటోల పర్మిట్‌లపైన కొత్తవి కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో కొందరు ఆటోమొబైల్ డీలర్లు, ఫైనాన్షియర్లు పాతపర్మిట్‌లను తమ గుప్పిట్లో పెట్టుకొని అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఆటో రిక్షా ధరతో సంబంధం లేకుండా కేవలం పాతపర్మిట్‌ను రూ.50 వేల చొప్పున విక్రయిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే గతంలో రెండుసార్లు ఆంక్షలను సడలించి సుమారు 25 వేల వరకు కొత్త పర్మిట్‌లను ఇచ్చారు. ఈ కొత్తవాటిని సైతం ఫైనాన్షియర్‌లే బినామీ పేర్లపైన కొట్టేసి రూ.కోట్లు ఆర్జించారు. ఈ సారి ప్రభుత్వం 65 వేల ఆటోలకు అనుమతినిచ్చింది.




ఆర్టీఏ నిఘా అవసరం..

ఈసారి పర్మిట్‌ల కోసం పటిష్టమైన విధివిధానాలను రూపొందించడమే కాకుండా వాటి అమలుపైన నిఘాను ఏర్పాటు చేయడం అవసం. రవాణాశాఖ కేవలం గైడ్‌లైన్స్ రూపొందించడం వరకే పరిమితమైతే ఏకంగా 65 వేల ఆటోపర్మిట్‌లు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తాయి. దాంతో యథావిధిగా మరోసారి ఫైనాన్షియర్లు, డీలర్లు కలిసి బ్లాక్ దందా కొనసాగించే అవకాశం ఉంది.

ఏఎంసీలకు 'ట్రేడ్ లైసెన్స్' పవర్!

ఏఎంఓహెచ్‌ల నుంచి అధికారాలు బదలాయింపు



- లైసెన్సు ఫీజుల ఆదాయం పెంచుకునేందుకు చర్యలు
- సర్క్యులర్ జారీ చేసిన కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో పారిశుధ్యం, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ తదితర పనుల్ని పర్యవేక్షిస్తున్న ఏఎంఓహెచ్‌ల (అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్) అధికారానికి కత్తెర పడింది. వారి నుంచి ఆ బాధ్యతలు తప్పించి ఏఎంసీ (అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్)లకు అప్పగించారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ సర్క్యులర్ జారీ చేశారు. అన్ అసెస్డ్, అండర్ అసెస్డ్ ట్రేడ్ లైసెన్సుల ఫీజుల క్రమబద్ధీకరణ, ట్రేడ్ లైసెన్సుల ద్వారా రావాల్సిన ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా ట్రేడ్ లైసెన్సులకు సంబంధించిన ఓవరాల్ ఇన్‌ఛార్జి ఆఫీసర్లుగా సంబంధిత ఏఎంసీలు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. తమకప్పగించిన ఈ అధికారాలతో ఇకనుంచి ట్రేడ్‌లైసెన్సుల ఫీజుల వసూళ్లు, అండర్ అసెస్డ్ ఆస్తుల రివిజన్, అన్ అసెస్డ్ ఆస్తుల అసెస్‌మెంట్ పనుల్ని ఏఎంసీలే పర్యవేక్షిస్తారు. జీహెచ్‌ఎంసీ చట్టం, నిబంధనల మేరకు ప్రతి వ్యాపారీ ట్రేడ్‌లైసెన్సు చెల్లించేలా వారికి అవగాహన కల్పించడంతో పాటు..ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్సులు చెల్లిస్తున్నదీ లేనిదీ గుర్తించేందుకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో ఏఎంసీలు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ట్రేడ్‌లైసెన్సులు లేనట్లు గుర్తించిన వారినుంచి వెంటనే వాటి కోసం దరఖాస్తు చేయించాలని పేర్కొన్నారు.

ఇంకా కొన్ని సూచనలు చేశారు. ఆమేరకు..

- హోటళ్లు, మాల్స్, రెస్టారెంట్స్ వంటి పెద్ద వ్యాపార సంస్థల్ని తనిఖీ చేసి అండర్, అన్‌అసెస్డ్ వాటిని ట్రేడ్‌లైసెన్సు ఫీజుల జాబితాలో చేర్చాలి.
- ఇంకా అసెస్ కాని వాణిజ్య భవనాల గుర్తింపు నెల రోజుల్లోగా పూర్తి కావాలి.
- అన్ని నివాసేతర భవనాలు ట్రేడ్ లైసెన్సులు చెల్లిస్తున్నాయని నిర్ధారించుకునే బాధ్యత ఏఎంసీలదే కాబట్టి వారు తమ పరిధిలో ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలి. ఏరోజు ఎన్ని వాణిజ్య భవనాలు తనిఖీలు చేసింది పేర్కొంటూ రోజువారీ లాగ్‌బుక్ నిర్వహించాలి.
- కమిషనర్ లేదా అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ)ల నుంచి ఏవైనా సూచనలందినట్లయితే వాటిని ఎప్పటి కప్పుడు పూర్తిచేయాలి.
- ఏఎంసీలందరూ తమ కప్పగించిన ఈ బాధ్యతల్ని తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో నిబంధనల మేరకు తగిన డిసిప్లినరీ చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

ట్రేడ్ లైసెన్సుల ఆదాయం పెంచుకునేందుకు..

- జీహెచ్‌ఎంసీకి ట్రేడ్‌లైసెన్సు ఫీజుల ద్వారా రావాల్సిన ఆదాయం కంటే ఎన్నో రెట్ల ఆదాయం తక్కువగా వస్తోంది. నగరంలో లక్షల దుకాణాలున్నా, వాటన్నింటి నుంచీ రావాల్సినంత ఆదాయం ట్రేడ్ లైసెన్సుల ఫీజుల ద్వారా రావడం లేదు. వీటిపై ఇప్పటి వరకు అధికారాలున్న ఏఎంఓహెచ్‌లు తగిన శ్రద్ధ చూపకపోవడంతో పాటు కొందరు సొంత జేబులు నింపుకుంటూ, సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే కమిషనర్ వారి నుంచి ట్రేడ్ లైసెన్సుల అధికారాలను కత్తిరించి ఏఎంసీలకు పూర్తి బాధ్యతలప్పగించినట్లు తెలుస్తోంది.
- జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను జాబితా మేరకు దాదాపు 3.17 లక్షల వాణిజ్య భవనాలుండగా, వాటిల్లో కేవలం1.09 లక్షల భవనాల వారు మాత్రమే గత సంవత్సరం ట్రేడ్‌లైసెన్సు ఫీజు చెల్లించారు. ఫీజు చెల్లించని వారితోపాటు ట్రేడ్ లైసెన్స్ నెంబర్లు ఆస్తిపన్నునెంబరు(పీటీఐఎన్)తో సరిపోలని భవనాలు భారీ సంఖ్యలో ఉన్నట్లు గత కమిషనర్ ఇలంబర్తి గుర్తించారు. అప్పట్లోనే ట్రేడ్ లైసెన్సుల ఫీజుల కోసం తగిన చర్యలు చేపట్టాలని భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

అక్రమ కట్టడాలకు ఆదిలోనే చెక్!

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కఠిన చర్యలు

- కొత్త ప్రొసీజర్‌కు రూపకల్పన
- అక్రమ భవనం..వినియోగం కుదరదిక..
- గీత దాటితే సీల్ తప్పదు..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో అనధికార నిర్మాణాలు, అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయిస్తూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ)రూపొందించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై వెల్లువెత్తుతున్న విమర్శలు, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వీటిని రూపొందించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ జారీ చేసిన ఈ ఎస్‌ఓపీ ప్రకారం, అనధికార నిర్మాణాలను సీల్ చేయడానికి కొన్ని విధానాలు పాటిస్తారు. అవి ఇలా...

- కొత్త ప్రొసీజర్ ప్రకారం..నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టని ప్రాంతాలను అధికారులు సందర్శించి నిర్మాణం దశ, స్వభావం, అక్కడ జరుగుతున్న ఉల్లంఘనలు, భవన యజమాని లేదా అద్దెదారు వివరాలు సేకరిస్తారు.
- అక్కడ అనుమతి తీసుకున్న మేరకు కాకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తేలితే యజమాని లేదా అద్దెదారుకు షోకాజ్ నోటీస్ జారీ చేస్తారు. నిర్మాణ పనులను వెంటనే నిలిపి వేయాలని, అప్పటికే నిర్మించిన వాటిని 15 రోజుల లోపు తొలగించాలని లేదా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరుతారు.
- సదరు భవన యజమానికి నోటీసును వ్యక్తిగతంగా అందజేస్తారు. లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపుతారు. నిర్మాణ స్థలంపై నోటీసును స్పష్టంగా అతికిస్తారు. నోటీసు కాపీని జిల్లా కలెక్టర్‌కు డిజిటల్‌గా పంపుతారు.
- షోకాజ్ నోటీసు ఇచ్చినప్పటికీ నిర్మాణ పనులు ఆగకపోతే, తక్షణమే నిర్మాణాన్ని సీల్ చేస్తారు. భవనంలో నివాసితులుంటే సీలింగ్ చేయడానికి మూడు రోజులలోపు ఖాళీ చేయాలని యజమాని/అద్దెదారుకు ఆదేశిస్తారు.



సీలింగ్ విధానం ఇలా..

నిర్మాణ నిబంధనలు పాటించని భవనం చుట్టూ ఎరుపు రంగు రిబ్బన్ కడతారు. సీలింగ్ చేసిన అధికారి, సాక్షుల సంతకాలతో కూడిన పేపర్ ట్యాగ్‌ను ఉంచుతారు. రిబ్బన్ ముడిపడే ప్రతి చోట వ్యాక్స్‌తో ఆఫీస్ సీల్‌ను అతికిస్తారు. ప్రతి అంతస్తులో ప్రవేశం/నిష్క్రమణ ప్రాంతాలు (మెట్లు, లిఫ్ట్‌లు, ర్యాంపులు మొదలైనవి) మూసివేసి, రిబ్బన్లతో సీల్ చేస్తారు. ఓపెనింగ్స్‌ను మూసివేయడానికి ప్లైవుడ్ బోర్డులు లేదా ఇతర వాతావరణ నిరోధక బోర్డులను ఉపయోగిస్తారు. తాళం వేయడానికి అవకాశం ఉన్న చోట, తాళం వేసి, గుడ్డ దారంతో కప్పి, అధికారి–సాక్షుల సంతకాలతో కూడిన పేపర్ ట్యాగ్‌ను ఉంచి, ఆఫీస్ సీల్‌ను అతికిస్తారు. జీహెచ్‌ఎంసీ, టీజీ బీపాస్ చట్టం, నిబంధనల మేరకు సీల్ చేస్తున్నట్లు స్పష్టంగా సూచించే నోటీసును భవనంపై ప్రదర్శిస్తారు. సీలింగ్ ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేస్తారు. పాల్గొన్న పోలీసు, పౌర సిబ్బంది వివరాలతో కూడిన సీలింగ్ నివేదికను సిద్ధం చేసి, ఇద్దరు సాక్షులతో సంతకాలు చేయిస్తారు. ఈ నివేదికను కమిషనర్‌కు పంపించి..డిజిటల్ పోర్టల్‌లో ప్రదర్శిస్తారు.

సదుపాయాలు కట్

విద్యుత్, జలమండలి తదితర యుటిలిటీ విభాగాలకు సేవలను నిలిపివేయాల్సిందిగా సమాచారం ఇస్తారు. సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్, సబ్–రిజిస్ట్రార్, కోర్టు కేసు అయితే మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు సీలింగ్ గురించి తెలియజేస్తారు. డిజిగ్నేటెడ్ అధికారి లేదా అప్పీలేట్ అథారిటీ లేదా కోర్టు ఆదేశం లేకుండా ఎవరూ సీల్‌ను తొలగించరాదు. సీల్‌ను తొలగించే అధికారం జోనల్ కమిషనర్‌కు (డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు సీల్ చేసినట్లయితే) లేదా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు (జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు సీల్ చేసినట్లయితే) ఉంటుంది. ఈ స్టాండర్డ్ విధానాన్ని అధికారులు, సిబ్బంది అందరూ కచ్చితంగా పాటించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ విధానాన్ని పాటించడంలో ఏవైనా ఉల్లంఘనలు లేదా నిర్లక్ష్యం జరిగితే సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ప్రజలు అక్రమ నిర్మాణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

'గాంధీ'లో సౌకర్యాలు మెరుగుపడాలి

కరోనా విషయంలో అప్రమత్తత అవసరం

- వైద్యులు, సిబ్బంది కొరతపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తా..
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గాంధీ ఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయినిగా పేరొందిన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, వసతులు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన గాంధీఆస్పత్రిని సందర్శించి పలు అంశాలపై ఆరా తీశారు. దేశంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు రాష్ట్ర కోవిడ్ నోడల్ సెంటర్ గాంధీ ఆస్పత్రిలో వైద్యసేవలు, కరోన వైరస్‌ను ఎదుర్కొనే సన్నద్ధతను పరిశీలించినట్లు కిషన్‌రెడ్డి వివరించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారీ, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, వైద్యాధికారులు, పాలన యంత్రాంగంతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పలు వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఓపీ విభాగంలో ఆయుష్మాన్‌భారత్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రిలో మౌలికవసతులు, సౌకర్యాలు మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు, ఆర్‌ఎంఓ, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది కొరతపై రాష్ట్ర వైద్యశాఖ మంత్రి, చీఫ్ సెక్రటరీతో మాట్లాడి ఆయా పోస్టులు భర్తీ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. గాంధీ ఓపీ విభాగంలో వైద్యసేవలు పొందే రోగులు తమ ఆధార్ కార్డు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ఉచిత వైద్యం పొందే అవకాశం కలుగుతుందన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా వేతన బకాయిలపై మంత్రి సీరియస్ అయ్యారు. తక్షణమే ఆయా ఏజెన్సీ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి వేతనాలు చెల్లించేలా కృషి చేయాలని ఆస్పత్రి పాలన యంత్రాంగానికి సూచించారు. మూగబోయిన గాంధీ ఫోన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరా తీశారు. ఏడాది బిల్లులు బకాయితో బీఎస్‌ఎన్‌ఎల్ ఫోన్ (040–27505566) డిస్‌కనెక్ట్ చేసిన వైనంపై 'సాక్షి' కథనంపై మంత్రి ఆరా తీయగా, ఏడాదికి బడ్జెట్ శాంక్షన్ రూ.48 వేలు ఉండగా, రూ.5 లక్షల బిల్లు వస్తుందని, బడ్జెట్ పెంపుకై ప్రభుత్వానికి లేఖ రాశామని అధికారులు వివరించారు. రేడియాలజీ విభాగంలో సీటీ, ఎమ్మారై స్కానింగ్ యంత్రాలు పనిచేయడం లేదని పలువురు రోగులు మంత్రికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



గాంధీలో రోగిని పరామర్శించి వైద్యసేవలపై ఆరా తీస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సమస్యలపై బీజేపీ పోరు

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన

- అడ్డుకున్న పోలీసులు..ఉద్రిక్తత



జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, కార్పొరేటర్లు

సాక్షి, సిటీబ్యూరో/లక్డీకాపూల్: నగర సమస్యలపై భారతీయ జనతాపార్టీ కార్పొరేటర్లు గళమెత్తారు. ఈ మేరకు అధికారులను నిలదీసేందుకు సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్దకు కమలం నేతలు, కార్పొరేటర్లు భారీగా తరలివచ్చారు. వీరి ఆందోళనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ ఆఫీస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. వీధిదీపాలు, రోడ్ల సమస్యతో పాటు డివిజన్‌లలో ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నిరసనకు దిగింది. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్పొరేటర్లు, బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో వాగ్వాదం జరిగింది. రామ్‌నగర్ కార్పొరేటర్ గోడ దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ ఆఫీస్ గేట్ ముందు కూర్చుని బీజేపీ నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ..ప్రజా సమస్యలను చెప్పేందుకు వస్తే గేట్లు మూసేసి రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. విశ్వనగరంగా చెబుతున్న హైదరాబాద్ ఇప్పుడు వీధి దీపాలు లేక అంధకారంలో ఉందన్నారు. వీధి దీపాలు లేని కారణంగా గల్లీలు, కాలనీలు గంజాయికి అడ్డాలుగా మారాయని తెలిపారు. యువత పక్కదారి పడుతోందని, మద్యం తాగి మహిళలను ఇబ్బందిపెట్టే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లోనే ఇలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉందో అంటూ ఆ పార్టీ నేతలు నిలదీశారు. తప్పకుండా బల్దియా కమిషనర్‌ను కలుస్తామని..తమను లోపలికి పంపించకపోతే కమిషనర్ బయటకు వచ్చే వరకు ఇక్కడే ఉండి ఆందోళన చేస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నగర బీజేపీ అధ్యక్షుడు లంకెల దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బర్త్ సర్టిఫికెట్లపై విచారణ జరపాలి

గత పదేళ్లలో జీహెచ్‌ఎంసీ జారీ చేసిన బర్త్, డెత్ సర్టిఫికెట్లపై విజిలెన్స్ విచారణ జరిపించాలని బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, శ్రీవాణి జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కోరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము కమిషనర్‌కు ఈ అంశాన్ని వివరించామని అనంతరం విలేకరులకు తెలిపారు. నకిలీ బర్త్ సర్టిఫికెట్ల వల్ల రోహింగ్యాలు, ఇతర దేశాల వారి ఫేక్ ఓటర్ ఐడీలు పొందారని, వాటి ద్వారా ఆధార్ కూడా పొంది ఇక్కడి సిటిజెన్‌గా చలామణి అవుతున్న విషయాన్ని కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు.

పీజీ కోర్సులకు రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల ప్రవేశాలు అధికారుల కసరత్తు ప్రారంభించారు.ఈ నెల 13న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో పాటు ఇతర అధికారులు, వివిధ వర్సిటీల వీసీలు, సీపీగెట్ కన్వీనర్, ఇతర అధికారులు చర్చించి 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

గతంలో కేవలం పత్రికల్లో ప్రకటన జారీ చేసి పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే వారు. కానీ ఈసారి నోటిఫికేషన్ గతేడాది కంటే నెల రోజులు ఆలస్యమైంది. ఇతర కోర్సుల (లాసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్, పీఈసెట్) నోటిఫికేషన్ ఏప్రిల్‌లో విడుదలై పరీక్షల ఫలితాలను కూడా ప్రకటించగా సీపీగెట్ పక్రియ వెనుకబడింది. దీంతో దరఖాస్తుల సీక్వరణ, ప్రవేశ పరీక్షలు, ఫలితాలు, కౌన్సెలింగ్ తరగతుల ప్రారంభం, సెమిస్టర్ పరీక్షలు వాటి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ కారణంగా పీజీ కోర్సుల విద్యా సంవత్సరం గాడితప్పింది. ఇదిలా ఉండగా కొన్ని వర్సిటీలు, అటానమస్ కాలేజీల్లో డిగ్రీ పరీక్షలు, ఫలితాల విడుదలలో జాప్యం వలన టీజీ సీపీజీఈటీ–2025 నోటిఫికేషన్ ఆలస్యంగా విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కానీ డిగ్రీ అర్హతతో ఇతర సెట్లను నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించడం లేదు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలోని 8 వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు జరిగే ఎంట్రన్స్ టెస్ట్‌కు రేపటి నుంచి(18న) ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. పీజీ కోర్సుల్లో ఒక్క సబ్జెక్టుకు ఓసీ, బీసీలకు రూ.800, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌కు రూ.600, అదనంగా మరో సబ్జెక్టుకు దరఖాస్తు చేస్తే రూ.450 చెల్లించాలని అధికారులు తెలిపారు. 45 సబ్జెక్టులకు వచ్చే నెల 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు.

కథక్ నృత్య కళాకారిణి మంగళాభట్ కన్నుమూత



మంగళాభట్(ఫైల్)



రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకుంటూ.. (ఫైల్)

బంజారాహిల్స్: ప్రఖ్యాత కథక్ నృత్య కళాకారిణి నాట్య గురు మంగళాభట్ (62) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైటెక్ సిటీలోని సింధు ఆస్పత్రిలో 'ఇక సెలవు' అంటూ వెళ్లిపోయారు. ప్రముఖ కథక్ నాట్యగురు రాఘవరాజ్‌భట్ సతీమణి మంగళాభట్ విఖ్యాత జానపద కళా బ్రహ్మ గోపాల్‌రాజ్ పేరుతో గత 35 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఎందరినో కథక్ నాట్యంలో తీర్చిదిద్దారు. ఆమె భర్త రాఘవరాజ్‌భట్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో లెక్చరర్‌గా సేవలు అందిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం స్వీకరించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని మిథిలానగర్‌లోని ఆమె స్వగృహంలో కళా ప్రేమికులు, బంధుమిత్రులు సందర్శనార్థం ఉంచి, జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో మధ్యాహ్నం ఒంటి గంటకు అంత్యక్రియలు నిర్వహిస్తారు. మంగళాభట్ (మంగళా కులకర్ణి) మృతి పట్ల పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సంతాపం తెలిపారు.

యూనిఫైడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు, అత్యవసర పరిస్థితుల్లో తగిన కార్యాచరణ చేపట్టేందుకు రైల్‌నిలయంలో ఏర్పాటు చేసిన యూనిఫైడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ సోమవారం ప్రారంభించారు. రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా విపత్తు నిర్వహణ నియంత్రణ గది వద్ద ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే జోనల్ ఇంటర్‌ఛేంజ్ మానిటరింగ్ సిస్టమ్, స్టేషన్ ఇన్ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టమ్‌లను, మెట్టుగూడలోని ఎస్అండ్‌టీ వర్క్‌షాప్‌లో సోలార్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

హిమాయత్‌నగర్: నగరంలో 60 వేల కొత్త ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీతో పాటు రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతిపాదన ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం(ఏఐటీయుసి) సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెండు దశాబ్దాలుగా అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ కోదండరాంలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరిపి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. 2013 నుండి ఆటో మీటర్ చార్జీలు నాటి ప్రభుత్వాలు పెంచకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆటో డ్రైవర్లు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కుంటున్నారని అన్నారు.

కబ్జా కోరల్లో నాలాలు, పాత లేఔట్లు!

శ్లాబులు వేసి నాలాలపై నిర్మాణాలు

- పాత లేఔట్లలో పాస్‌పుస్తకాలతో పాగా
- వీలున్న చోట పార్కులూ స్వాహా
- హైడ్రా ప్రజావాణిలో 47 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: ఓపక్క వర్షాకాలం... మరోపక్క హైడ్రా స్పందన... వెరసి నాలాల కబ్జాలపై వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. రాజధానిలోని కొన్ని నాలాలను పూడ్చి కబ్జా చేస్తుంటే... మరికొన్నింటి మీద శ్లాబులు వేసి ఇళ్లు, దుకాణాలు నిర్మిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు. ఫలితంగా నాలాల్లో పేరుకుపోతున్న చెత్తను తొలగించడం సాధ్యం కాక అవి పూడుకుపోతున్నాయని వాపోతున్నారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ద్వారా అనేక ఫిర్యాదులు అందాయి. మల్కాజిగిరి, బాచుపల్లి, సికింద్రాబాద్, పద్మారావునగర్, మాదాపూర్ ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి ఫిర్యాదు చేశారు. ఒకప్పటి గ్రామపంచాయతీ లేఔట్లను తిరిగి వ్యవసాయ భూములుగా చిత్రీకరిస్తున్న కొందరు తప్పుడు పాస్ పుస్తకాలతో కాజేస్తున్నారని మరికొన్ని ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం 47 ఫిర్యాదుల్లో అత్యధికంగా నాలాలు, పాత లేఔట్లకు సంబంధించినవే కావడం గమనార్హం. వీటిని సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ ఏవీ రంగనాథ్ సమగ్ర విచారణ జరపడంతో పాటు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కీలక ఫిర్యాదులు ఇలా...

- మేడ్చల్ జిల్లా కొరెముల గ్రామం సర్వే నెం.739 నుంచి 749 వరకూ 147 ఎకరాల్లో ఏకశిలానగర్ పేరుతో లే ఔట్‌ను 1985లో వేశారు. అందులోని 47 ఎకరాలను 2006లో వ్యవసాయ భూమిగా మార్చేసిన ఓ వ్యక్తి లే ఔట్ స్వరూపాన్నే మార్చేశారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదే లే ఔట్‌లో రెండు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రహరీలు నిర్మించి కొంతమేర కాజేశాయని పేర్కొన్నారు.
- ఇదే గ్రామంలోని సర్వే నెం.796లో 11.20 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 7.20 ఎకరాల పరిధిలో ఓ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. మిగతా నాలుగు ఎకరాలు కబ్జా చేసి దీంతో పాటు నదెం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదు అందింది.
- పంజగుట్ట ఆఫీసర్స్ కాలనీలో వెయ్యి గజాల పార్కు స్థలం ఉండేది. దీని నుంచి 500 గజాల స్థలంలో దుర్గాభవానీ ఆలయం నిర్మించారు. మిగిలిన 500 గజాల స్థలం కబ్జా కాకుండా పార్కును అభివృద్ధి చేయాలని అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. ఆలయంతో పాటు చుట్టూ ఉన్న దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పార్కు కోసం కేటాయించాలని కోరారు. శ్రీనగర్‌కాలనీ నుంచి వచ్చే వరద కాలువ తమ కాలనీ ద్వారా వెళ్లేదని ఇప్పుడా కాలువ మాయం కావడంతో వరదంతా తమ నివాసాలను ముంచెత్తుతోందని వాపోయారు.
- అల్వాల్ మండలం జొన్న బండలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో 900 గజాల పార్కు స్థలం కబ్జా అవుతోందని, దానికి ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ అక్కడి నివాసితులు హైడ్రాను కోరారు. అక్కడ రహదారులను కూడా వదలకుండా కొందరు కబ్జా చేస్తున్నారని 236 ప్లాట్లకు పార్కు లేకుండా అవుతోందని పేర్కొన్నారు.
- దేవరయాంజల్‌లోని తురకోని కుంట శిఖం భూమిలో లారీలకు సంబంధించిన వేబ్రిడ్జ్ ఏర్పాటు చేస్తున్నారని వెంటనే ఆ పనులు ఆపి చెరువును కాపాడాలని సీతారామచంద్రస్వామి దేవస్థానం భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రాను కోరారు. ఇదే ప్రాంతంలో దేవస్థానానికి చెందిన భూమి కబ్జా అవుతోందని సేవ్ దేవరయాంజల్ ప్రతినిధులు హైడ్రా దృష్టికి తెచ్చారు.
- దేవరయాంజల్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువను మళ్లించడంతో అది ఊరు నుంచి వచ్చే మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. వరద కాలువ నేరుగా చెరువుకు చేరేలా చేస్తే తమకు వరద ముప్పు తప్పుతుందని అభ్యర్థించారు.

ఫలితాలు వెల్లడించడంలో ఆలస్యం ఎందుకు ?

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్

సుల్తాన్‌బజార్: నియామక ప్రక్రియలో పోటీ పరీక్షలు రాసిన తరువాత సంవత్సరాల తరబడి ఫలితాలు వెల్లడించడానికి ఆలస్యం ఎందుకని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని కోరుతూ రెండవ ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఎస్ఆర్‌బి) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ టెక్నాలజీ పెరిగిన ప్రస్తుత రోజుల్లో సంవత్సరాల తరబడి ఫలితాలు వెల్లడించడంలో జాప్యం జరుగుతోందంటే లోపం ఎవరి వద్దనుందో గ్రహించాలన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రతి సమావేశంలో మాట్లాడుతున్నారని కానీ అత్యంత కీలకమైన వైద్య రంగానికి సంబంధించిన ఉద్యోగాలు నింపే ప్రక్రియ మాత్రం ముందుకు సాగటం లేదన్నారు. అనంతరం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఎంహెచ్ఎస్ఆర్‌బి మెంబర్ సెక్రటరీ ఎస్.గోపికాంత్ రెడ్డిలను కలిసి సమస్యల పైన వినతి పత్రం అందజేశారు.

23 వరకు పీహెచ్‌డీ దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ కేటగిరి-2 ఎంట్రన్స్ టెస్ట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 23 వరకు ఆయా డీన్ ఫ్యాకల్టీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈ నెల 28న ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. జులై 1 నుంచి 11 వరకు ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపికైన వారి జాబితాను 19న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఓయూలో అన్ని విభాగాలలో 650 సీట్లకు సుమారు 5000 మంది అభ్యర్థులు పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025లో అర్హత సాధించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా ఓయూ పీహెచ్‌డీ సీట్ల పెంపునకు అధికారులు నిరాకరించినట్లు సమాచారం.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్: గంజాయి సేవిస్తున్న ఇద్దరిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్ ఇందిరానగర్ గడ్డ ప్రతుల్ హోండా సర్వీసింగ్ సెంటర్ సమీపంలో ఇద్దరు గంజాయి సేవిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన షేక్‌పేట వినోభానగర్‌కు చెందిన స్విగ్గీ డెలివరీ బాయ్ గోగుల శ్రీశైలం (19), రహమత్‌నగర్ వీడియోకాలనీకి చెందిన ఆఫీస్ బాయ్ యశ్వంత్‌గౌడ్ (19)లను విచారించగా వారు గంజాయి సేవించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఇరువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1.33 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫీవర్‌లో రేబిస్ కేసు నమోదు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో రేబీస్ కేసు నమోదైంది. గుడివాడకు చెందిన రాము(36)ను ఆరు నెలల క్రితం ఓ వీధి కుక్క గాయపరిచింది. ఆ సమయంలో రెండు ఇంజక్షన్స్ తీసుకుని మిగిలినవి తీసుకోలేదు. ఉపాధి కోసం నగరానికి వచ్చి పార్శిగుట్టలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అస్వస్థతకు గురైన వింతగా ప్రవర్తించసాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం సోమవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి రేబీస్ లక్షణాలు ఉన్నట్లు గమనించి రేబీస్ వార్డులో చికిత్సలు అందిస్తున్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

గచ్చిబౌలి: భవనంపై నిద్రిస్తూ పడిపోవడంతో ఓ కూలీ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన మేరకు.. యూపీకి చెందిన నంద కిశోర్(30) ఖాజాగూడలోని సాయికృపా కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. 15న రాత్రి నిద్రకు ఉపక్రమించాడు. ఉదయం చూడగా కిందపడి మృతి చెంది ఉన్నాడు. నిద్రలో జారి పడి ఉంటాడని పోలీసులు పేర్కొంటున్నారు.

ప్రజావాణి సమస్యలపై అశ్రద్ధ వద్దు: కర్ణన్



లక్డీకాపూల్: ప్రజావాణి విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో నగరం నలువైపుల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ప్రజల సమస్యలను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. హెచ్ఓడీలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, యాదగిరి రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గృహకార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ: గృహకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ డొమెస్టిక్ వర్కర్స్ (ఎన్‌పీడీడబ్ల్యూ)ప్రతినిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అంతర్జాతీయ గృహకార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గృహకార్మికుల సమస్యలపై సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేసి పటిష్టమైన చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జాతీయ కోర్ కమిటీ సభ్యులు వర్గీస్ తెకనాడ్, తెలంగాణ కన్వీనర్ లిస్సీజోసెఫ్ పాల్గొన్నారు.



నాగార్జున పరువునష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు: మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో సోమవారం జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు అయ్యారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయవాదుల ధర్నా నేపథ్యంలో విచారణను జూన్ 26కి వాయిదా వేసింది. నాగార్జున కుమారుడు హీరో నాగాచైతన్య–సమంత విడాకుల విషయంపై మంత్రి కొండా సురేఖ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, ఆమే చేసిన వ్యాఖ్యలతో తన కుటుంబ పరువుపోయిందిన నాగార్జున నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును ఛాలెంజ్ చేస్తూ మంత్రి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా విచారణ కొనసాగుతున్నది. ఇదిలా ఉండగా వచ్చే విచారణకు మంత్రి కోర్టుకు హాజరుకావాలని గతంలోనే కోర్టు న్యాయవాదికి సూచించింది.

పోలీసు స్టేషన్‌లో పాతనేరస్తుడు హల్‌చల్



శంకర్

అంబర్‌పేట: పాత నేరస్తుడు పోలీస్ స్టేషన్‌లో హంగామ సృష్టించారు. చేతిని కోసుకుని రక్తం కారుతుండగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి అరెస్టు చేస్తారా... నన్నే అతన్ని చంపమంటారా అంటూ హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి అంబర్‌పేట పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసు కథనం ప్రకారం... అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివసించే ముడావత్ శంకర్(26) పాత నేరస్తుడు. ఇతనిపై నగరంలో వివిధ పోలీసు స్టేషన్లలో 25పైగా చోరీ కేసులు ఉన్నాయి. ఇతను గతంలో చోరీ కేసులో జైలుకు వెళ్లినప్పుడు ఇతని భార్యకు స్థానిక వ్యక్తి దేవేందర్‌తో పరిచయం ఏర్పడింది. శంకర్ జైలు నుంచి బయటకు వచ్చాక భార్యపై అనుమానం పెంచుకుని నిత్యం ఘర్షణ పడుతున్నాడు. ఆదివారం రాత్రి శంకర్ అతిగా మద్యం తాగి భార్యతో గొడవపడి అద్దం పగులగొట్టి గాజుతో చేయిని కోసుకున్నాడు. రక్తం మరకలతో పోలీసు స్టేషన్‌కు వచ్చి దేవేందర్‌ను తక్షణమే అరెస్టు చేయాలంటూ పోలీసు స్టేషన్‌లో కేకలు వేశాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా వారిని దుర్భాషలాడుతూ తిరగబడ్డారు. దేవేందర్‌ను ఇప్పటికిప్పుడు అరెస్టు చేయకపోతే తానే చంపేస్తానని పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. దీంతో అతన్ని అతికష్టం మీదు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

థ్యాంక్యూ.. ఎస్ఐ సార్..

- తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత
- వివరాల కోసం నాలుగు గంటలు వెతికిన ఎస్ఐ



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ శ్రీరాములు

ఖైరతాబాద్: తప్పిపోయి తిరుగుతున్న 8 సంవత్సరాల బాలుడిని ఎస్ఐ నాలుగు గంటల పాటు వెంటపెట్టుకొని వివరాలు సేకరించి ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేర్చాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సయంలో కేర్ హాస్పిటల్ సమీపంలో రోడ్డుపై ఏడుస్తూ ఉన్న బాలుడిని స్థానికులు ఖైరతాబాద్ పెట్రోలింగ్ వాహన సిబ్బందికి అప్పగించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కనకా శ్రీరాములు బాలున్ని తన ద్విచక్రవాహనంపై ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ సుమారు 5 గంటల పాటు బాలున్ని మచ్చిక చేసుకొని వివరాలు సేకరించారు. చివరకు రాత్రి 8.30 గంటలకు బాలున్ని బంజారాహిల్స్ రోడ్‌నెం 12లోని శ్రీరాంనగర్ కాలనీలో ఉంటున్న తల్లి దండ్రులకు అప్పగించాడు. బిహార్‌కు చెందిన చందన్ భార్యతో కలిసి నగరానికి వచ్చి ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు రెండవ సంతానమైన ఆశిష్ కుమార్ సోమవారం స్నేహితులతో కలిసి ఆడుకుంటూ తప్పిపోయాడు. కనిపించకుండా పోయిన బాబుకోసం వారు సాయంత్రం నుంచి వెతుకుతున్నారు. అంతలోనే ఎస్ఐ నేరుగా బాబును తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు ఎస్ఐ శ్రీరాములకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో మరో ఐదు ఎస్టీపీలు ..!

- వంద శాతం మురుగు శుద్ధి చేరువలో..
- 20న సీఎం చేతులు మీదుగా ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా మురుగు శుద్ధి



అంబర్‌పేట్ సీవరేజ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: వంద శాతం మురుగును శుద్ధిలో భాగంగా మరో మురుగు శుద్ధి కేంద్రాలు అందులో బాటులోకి రానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈనెల 20న ప్రారంభించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా మురుగు శుద్ధి జరుగుతుండగా తాజాగా అంబర్‌పేట–1, శివాలయనగర్,నల్లగండ్ల, అత్తాపూర్–1, పాలపిట్ట ఎస్టీపీల నిర్మాణాలు పూర్తి చేసి ట్రయిల్ రన్ నిర్వహిస్తోంది. మరో మూడు ఎస్టీపీ నిర్మాణ పనులు తుది దశలు ఉన్నాయి. మరోవైపు రాబోయే పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే మురుగును సైతం శుద్ధి చేసేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా అమృత్ 2.0 పథకం కింద మరో 39 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది.వాస్తవంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంతో సుమారు రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధం కాగా ..స్థలాల సేకరణ, ఇతరాత్ర కారణాలతో వాటి సంఖ్యను ఇరవై ఎస్టీపీలకు కుదించిన సామర్థ్యం తగ్గకుండా పనులు పూర్తి చేసింది.అందులోఇప్పటికే 12ఎస్టీపీలు మురుగు నీటిని శుద్ధి చేస్తుండగా, తాజాగా మిగిలిన ఎనిమిదింటిలో ఐదు ఎస్టీపీలు అందుబాటులో రానున్నాయి.

అంబర్ పేట్ ఎస్టీపీ పనుల పరిశీలన

అంబర్‌పేట్ లో నిర్మిస్తున్న 212.5 ఎమ్మెల్డీ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, ఆర్వీ కర్ణన్, ఎంఆర్డిసిఎల్ ఎండీ నర్సింహా రెడ్డి, జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్,వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తుది దశలో ఉన్న పనుల్లో వేగంపెంచి రెండు మూడు రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎండీ పేర్కొన్నారు. మిగిలిపోయిన సివిల్ వర్క్‌లు, సుందరీకరణ కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్, పెయింటింగ్ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.

సిట్‌కు వాంగ్మూలం ఇచ్చిన మెరుగు రమేష్‌రెడ్డి



బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ ఎదుట సాక్షిగా కాంగ్రెస్ నేత మెరుగు రమేష్‌రెడ్డి హాజరై తన వాంగ్మూలం ఇచ్చాడు. అచ్చంపేట నియోజకవర్గం ఒంగూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడు మెరుగు రమేష్‌రెడ్డి ఫోన్‌ను గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం ట్యాప్ చేసింది. ట్యాప్ చేసిన ఫోన్ నెంబర్లను గుర్తించిన సిట్ అధికారులు ఆయనను పిలిచి ఆ నెంబర్ సరైనదేనా..? మీదేనా..? అని అడిగి, అప్పుడు జరిగిన ఘటనలపై ఆరా తీస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాను ఎక్కడికి వెళ్లినా పోలీసుల కదలికలు ఉండేవని, కొన్నిసార్లు తనకంటే ముందుగానే అక్కడికి పోలీసులు చేరుకునేవారని, తాను ఆశ్చర్యపోయేవాణ్ణి అని రమేష్‌రెడ్డి తెలిపారు. సిట్ అధికారులు తనను పిలిపించి ఫోన్ ట్యాప్ అయిన విషయం తెలిసినప్పుడు మాత్రమే అప్పుడు తనను ఎందుకు పోలీసులు వెంబడించారో అర్థమైందన్నారు. తన ప్రతి కదలికను పోలీసులు గుర్తించేవారని, కుటుంబ సభ్యులతో మాట్లాడే విషయాలు కూడా వింటుండేవారని, తాను ఎక్కడికి వెళ్లినా అనుసరిస్తుండేవారని వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో వెల్లడించారు. రమేష్‌రెడ్డితో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు గురైన మరికొంతమంది కూడా సిట్ ఎదుట హాజరయ్యారు.

సీవరేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించండి



జలమండలి జీఎంకు సమస్యలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లోని సీవరేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించాలని డివిజన్ కాంగ్రెస్ నాయకులు జలమండలి జీఎంను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ, గౌస్ మాట్లాడుతూ... బోరబండ డివిజన్‌లోని కొన్ని బస్తీల్లో సీవరేజీ, నీటి సమస్య ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మహ్మద్ అజారుద్దీన్ ఆదేశాల మేరకు తాము జీఎంను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం



సీఎం ఇంటి ముట్టడికి యత్నించిన వారిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

బంజారాహిల్స్: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. నిరుద్యోగులను అడ్డంపెట్టుకుని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని, జాబ్ కేలండర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా ముఖ్యమంత్రి ఇంటి వైపు వెళ్తుండగా జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మెగా డీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కమలాకర్, సాత్వికారెడ్డి, జీహెచ్‌ఎంసీ ప్రెసిడెంట్ భాగవతుల సాయిమహేష్, బుక్యా నందు, ఒగ్గు వినయ్, ఎడ్ల నరేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారును ఢీకొట్టారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడిపిస్తూ చేసిన యాక్సిడెంట్ ఘటనలో నలుగురు యువకులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 10లోని స్పైసీ ఎవెన్యూ రెస్టారెంట్‌లో ఫుడ్ పార్సిల్ తీసుకునేందుకు వెళ్లిన కార్తికేయ అనే యువకుడు ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో తన కారులో యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని జోరా పబ్‌లో మద్యంతాగిన రఘు అనే యువకుడు తన ఫ్రెండ్స్ చరణ్, సాయికృష్ణతో పాటు మరో యువకుడితో కలిసి కారులో వేగంగా వచ్చి యూటర్న్ తీసుకుంటున్న కార్తికేయ కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో కార్తికేయ కారు ధ్వంసం అయింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు రఘుకు బీత్ అనలైజర్ పరీక్షలు చేయగా మోతాదుకు మించి మద్యం సేవించచినట్లు తేలింది. ఈ మేరకు రఘుతో పాటు కారులో ఉన్న ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎంఏటీకి జీహెచ్‌ఎంసీ సహకారం

- రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు
- కలిసికట్టుగా ఉండి వరద ముంపును ఎదుర్కోవాలి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: వర్షాకాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈసారి వరద ముంపును ఎదుర్కొనేందుకు హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్ (ఎంఏటీ)లను ఏర్పాటు చేస్తోంది. ఈ యాక్షన్ టీమ్‌లకు జీహెచ్‌ఎంసీ సహకారం అందివాల్సి ఉంటుంది. మొట్ట మొదటిసారిగా అగ్నిమాపక శాఖ కూడా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లలో కీలక పాత్ర పోషించనుంది. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో ఇప్పటికే గుర్తించిన వరద ముంపు ప్రాంతాల్లో హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు అందుబాటులోకి రానుండగా ఈ బృందాలకు జీహెచ్‌ఎంసీ సహకరించనుంది.

◆ హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు, జీహెచ్‌ఎంసీ సహకారం, అగ్నిమాపక శాఖాధికారుల పాత్ర తదితర అంశాలపై సోమవారం ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ఫైర్ సమన్వయ సమావేశం జరిగింది. హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, ఖైరతాబాద్ జోన్ హైడ్రా ఇన్‌చార్జి యజ్ఞ నారాయణ, సర్కిల్–17 డీసీ రజినీకాంత్‌రెడ్డి, సర్కిల్–18 డీసీ సమ్మయ్య, ఇంజినీర్లు, ఫైర్ ఆఫీసర్లు మోహన్‌రావు, శేఖర్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వరద మంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై జోనల్ కమిషనర్ తగిన సూచనలు జారీ చేశారు. గతంలో ఎదుర్కొన్న అనుభవాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా వాటిని ఎలా పరిష్కరించుకోవాలో కూడా చర్చించారు. ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో–17 వరద ముంపు ప్రాంతాలను ఈ సందర్భంగా గుర్తించారు. హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో 24గంటల పాటు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది కూడా అందుబాటులో ఉండనున్నారు.

◆ వరద వచ్చి రోడ్లపై నిలిచిపోయినప్పుడు వాటిని నాలాల్లోకి చేరే విధంగా, మోటార్ల ద్వారా ఎత్తిపోసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు డీఆర్‌ఎఫ్ సిబ్బందికి పూర్తిగా సహకారం అందించడమే కాకుండా ఎక్కడెక్కడ ముంపు ప్రాంతాలుంటాయో అక్కడ వారితో పాటు కలిసి పని చేయాలని నిర్ణయించారు. మొత్తం ఎన్ని హైడ్రా మాన్సూన్ యాక్షన్ టీమ్‌లు పని చేయాలని రెండు మూడు రోజుల్లో తెలుస్తుందని వాటిని కేటాయించిన తర్వాత పూర్తిగా జీహెచ్‌ఎంసీతో కలిసి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకునే విధంగా తీర్మానించారు. ఫైర్ సిబ్బంది కూడా ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా చర్చించారు.

బోనాలకు డీజే అనుమతి ఇవ్వాలి

తెలంగాణ సౌండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రహీం

పంజగుట్ట: బోనాల పండగకు డీజే వినియోగించరాదని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు ఇవ్వడం ప్రత్యక్షంగా, పరోక్షంగా దీనిపై ఆధారపడ్డ వేలాదిమందిని రోడ్డుమీద పడేసినట్లే అని తెలంగాణ సౌండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. తమకు కనీసం సింగిల్ పిన్ డీజేకు అయినా అనుమతి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రహీం, ఉపాధ్యక్షులు కృష్ణ, శంకర్ మాట్లాడారు. తమకు వ్యాపారం ఉండేదే బోనాలు, వినాయక చవితికి అని అన్నారు. వ్యాపారం మొదలుకాక ముందే ప్రభుత్వం, పోలీసులు ఆంక్షలు విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్కెస్ట్రా వారు కూడా మ్యూజిక్ లేనిదే పాటలు పాడలేరని అన్నారు. ఒక్క డీజే వల్ల సుమారు 10కుటుంబాలు జీవిస్తాయని అందరికీ ఉపాధి లేకుండా పోతుందని అన్నారు.

◆ రాత్రివేల డీజే వినియోగిస్తే పోలీసులు డీజే సామగ్రి తీసుకుని వెళ్లిపోతున్నారని తెలిపారు. కాని పక్కరాష్ట్రాల్లో రాత్రి 10గంటల వరకు డీజే ఉపయోగించుకోవచ్చనే నిబంధన ఉందన్నారు. అక్కడ నిర్వాహకులపై కేసులు వేస్తారు కాని డీజే వారిపై కేసులు వేయరని గుర్తుచేశారు. ప్రభుత్వాలు చేసే కార్యక్రమాల్లో, సెలబ్రిటీల కార్యక్రమాల్లో పెద్దపెద్ద సౌండ్ పెట్టి డీజేలు వాడుతారని వారికి లేని అభ్యంతరం కేవలం తమకే విధించడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య, మెలోడీ శ్రీనివాస్, వినోద్, రవి, రఘు, కెమెంట్ తదితరులు పాల్గొన్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న సౌండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న కార్పొరేటర సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: చదువుతోనే వ్యక్తి వికాసం సాధ్యమవుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా చదివించాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఎస్పీఆర్‌హిల్స్ బ్రహ్మ శంకర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. విశాల స్థలం ఉన్న బ్రహ్మశంకర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి మల్టీపర్పస్ భవనంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు నూతనంగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫాం విక్రయాలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆగ్రహం



రాజీవ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రహమత్‌నగర్: ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయించొద్దనే నిబంధనలు ఉన్నా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు యథేచ్ఛగా వాటిని విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు రాజీవ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువెరా మాట్లాడుతూ... విద్యాహక్కు చట్టాన్ని తుంగల్లో తొక్కిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్య పేరిట వ్యాపారం చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారుల అజమాయిషీ కొరవడటం వల్లే ప్రైవేట్ పాఠశాలలు నిర్భయంగా ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. అక్రమ పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు.

నగర అభివృద్ధిలో రేవంత్ సర్కార్ విఫలం



ధర్నాలో పాల్గొన్న ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: సమస్యల పరిష్కారం కోరుతూ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలోని ఆరు డివిజన్ల నుంచి బీజేపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ జీహెచ్‌ఎంసీని అంధకారంలో ముంచెత్తారని ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అదే చేస్తున్నారని చింతల ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తి విఫలం చెందిందన్నారు. వీధి దీపాలు కూడా వేయలేని ఈ ప్రభుత్వం ఇంకేమీ అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టండి

ఫిలింనగర్: నందగిరిహిల్స్‌ను ఆనుకొని ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని బస్తీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బస్తీవాసులతో కలిసి షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. పాత సర్వే నంబర్ ప్రకారం 270 మందికి ఇక్కడ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తామే పరిష్కరించుకుంటామని తెలిపారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణానికి తమ బస్తీ అన్ని రకాలుగా అర్హత సాధించిందని పేర్కొన్నారు.



షేక్‌పేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు

చెరువు బఫర్ జోన్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.11లోని తాజ్ బంజారా లేక్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.ఇక్కడ ఉన్న లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్ పక్కన తాజ్ బంజారా లేక్ బఫర్ జోన్‌లో అక్రమంగా భూమిని చదును చేస్తూ నిర్మాణాలకు కబ్జాదారులు యత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ ఈ మూడు విభాగాల ఆధీనంలో ఉన్న ఈ స్థలంలో కొంతకాలంగా కబ్జాదారుల బెడద తీవ్రరూపం దాల్చిందన్నారు. ఇప్పటికే తాజ్‌బంజారా లేక్ స్థలాన్ని పెద్ద ఎత్తున కబ్జా చేశారని దుయ్యబట్టారు. తాజాగా జరుగుతున్న కబ్జాలను అరికట్టి ఈ స్థలంలో మొక్కలు పెంచి చెరువును కాపాడాలని స్థానికులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

◆ ఇలాగే వదిలేస్తే చెరువు చుట్టూ ప్లాట్లు వస్తాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం నడిబొడ్డున పట్టపగలే బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటుండగా ఇరిగేషన్ శాఖ అధికారులు కళ్లు మూసుకున్నారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెరువులను కాపాడతామని చెప్పుకుంటున్న హైడ్రా కూడా ఈ విషయంలో ఏమి చేస్తుందని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, హైడ్రా, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సమన్వయంగా తాజ్‌బంజారా లేక్ పక్కన సర్వే చేపట్టి బఫర్ జోన్‌లో ఎంత భూమి కబ్జాకు గురైందో తేల్చి ఆక్రమణలు కూల్చివేసి చెరువును కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బీసీ రిజర్వేషన్ల సాధన మహాధర్నా 18న

హిమాయత్‌నగర్: 42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 42 శాతం బీసీ రిజర్వేషన్‌ల అంశంలో తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందన్నారు. కులగణన, ప్రభుత్వ అసెంబ్లీ తీర్మానాలు, బీసీ కమిషన్ సానుకూల నివేదికల తదనంతరం కూడా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రాన్ని ఒప్పించటానికి యుద్ధ ప్రతిపాదికన కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

లిబర్టీ: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి పుష్పాంజలి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికి తెల్లరేషన్ కార్డులు ఇచ్చి చిత్తశుద్ధిని నిలుపుకోవాలని ఆమె కోరారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇస్తామని ప్రకటించిదని ఆచరణలో మాత్రం నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు గడిచినా ఇంత వరకు ఇస్తామన్న రేషన్ కార్డు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

మహాగణపతి తయారీ పనులపై అదనపు డీసీపీ ఆరా



ఖైరతాబాద్: శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా రూపుదిద్దుకుంటున్న 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతి తయారీ పనులను సోమవారం సెంట్రల్ జోన్ అదనపు డీసీపీ ఆనంద్ పరిశీలించారు. రెండు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్న నేపథ్యంలో కమిటీల ప్రతినిధులు సింగరి రాజ్ కుమార్, మహేష్‌యాదవ్‌తో విగ్రహ తయారీ పనులను అడిగి తెలుసుకున్నారు. రెండు కమిటీలతో సమావేశం ఏర్పాటు చేయడం, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించే అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.

రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

లిబర్టీ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. రిజర్వేషన్లు కల్పించకుండా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించొద్దన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూన్, జూలై మాసంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న క్రమంలో ముందుగా రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షణీయమని కానీ దానికి చట్టబద్ధత కల్పిస్తే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

స్తంభించిన బంజారాహిల్స్ రహదారులు

నీలోఫర్ కేఫ్‌ను మూసివేయించిన పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో విచారణకు సోమవారం ఉదయం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వందలాదిగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు బంజారాహిల్స్‌కు చేరుకున్నారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసంతో పాటు బీఆర్‌ఎస్ భవన్‌కు పెద్ద సంఖ్యలో కార్యకర్తలకు తరలివచ్చారు. దీంతో బంజారాహిల్స్ రహదారులన్నీ ఉదయం 10 గంటల నుంచే ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. బంజారాహిల్స్ రోడ్ నం.12 ప్రధాన రహదారితో పాటు అటు మాసబ్ ట్యాంక్, ఇటు జూబ్లీహిల్స్, మరోవైపు పంజగుట్ట రోడ్లలో కూడా వాహనాలు నిలిచిపోవడంతో గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

◆ ట్రాఫిక్ పోలీసులు మొత్తం ఏసీబీ కార్యాలయానికి దారితీసే రోడ్ల పైనే విధులు నిర్వహించారు. ఇంకోవైపు ఇక్కడే ఉన్న నీలోఫర్ కేఫ్‌లో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తిష్టవేశారు. దీని వల్ల సమస్యలు తలెత్తుతాయని భావించిన పోలీసులు ఉదయం నీలోఫర్ కేఫ్‌ను మూసివేయించారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు నీలోఫర్ హోటల్‌లో తిష్టవేయగా, వారందరినీ బయటకు పంపించారు.

◆ ఇదిలా ఉండగా ఏసీబీ కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాలన్నీ ఉదయం 8 గంటల నుంచే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడికక్కడ పికెటింగ్‌లను ఏర్పాటుచేశారు. 180 మంది పోలీసులతో పాటు 9 ప్లాటూన్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఒక్కరిని కూడా ఏసీబీ కార్యాలయంలోకి అనుమతించలేదు. అన్ని మార్గాలు మూసివేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు కూడా రాగా వారిని కూడా పంపించివేశారు.



బంజారాహిల్స్ రోడ్ నం.12లో నీలోఫర్ కేఫ్‌ను మూసివేయడంతో బయటకు వచ్చిన నేతలు

వాహనాలన్నీ అటు వైపే..

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రోడ్లన్నీ సోమవారం ఉదయం నుంచే వందలాది వాహనాలతో కిక్కిరిసిపోయాయి. సోమవారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్ ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యే నేపథ్యంలో ఆయన తెలంగాణ భవన్ నుంచి బయల్దేరగా ఆయన వెంట కార్యకర్తలు, ముఖ్య నేతలు పెద్ద ఎత్తున కార్లలో బయల్దేరారు. దీంతో అటు బంజారాహిల్స్ రోడ్ నం.10 వైపు, ఇటు బంజారాహిల్స్ రోడ్ నం.12 వైపు మరో వైపు ఫిలింనగర్ వైపు పెద్ద ఎత్తున రోడ్లపై వాహనాలన్నీ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీపీ హరి ప్రసాద్ అక్కడికి చేరుకొని వాహనాలను వేగంగా ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. – బంజారాహిల్స్





ఇక్కడ నో అడ్మిషన్.. అక్కడ నో స్టూడెంట్స్

- ముచ్చింతల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 960 మంది విద్యార్థులు
- గచ్చుబాయితండా బడిలో ఒక్కరు కూడా లేక వెలవెల



ముచ్చింతల్‌లోని జేబీఎం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల గేటు వద్ద నో అడ్మిషన్ బోర్డు పెట్టినా అడ్మిషన్ల కోసం గేటు బయట పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

శంషాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల గురించి మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా అని అంటుంటారు కదా! కానీ, ఓ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ముందు కార్పొరేట్ విద్యాసంస్థలు కూడా దిగదుడుపే. గత ఏడాది కేవలం 88 విద్యార్థులున్న ఈ బడిలో ఈసారి ఏకంగా 960 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతలలోని జేబీఎం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వైపు ఓ లుక్కేయాల్సిందే. ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలను ఈ ఏడాది ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఖుషి ఫౌండేషన్, మైహోం సంస్థల సహాయంతో కొత్త భవనం నిర్మించారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను కల్పించారు. దీనికి తోడు పిల్లలను ఈ స్కూలుకు తరలించేందుకు సమీప గ్రామాలకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పిస్తామని ఉపాధ్యాయులు, ఆ సంస్థల ప్రతినిధులు ప్రచారం చేశారు. దీంతో సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 251 మంది, ప్రయివేటు పాఠశాలల నుంచి 700లకు పైగా విద్యార్థులు వచ్చి చేరారు. ఇక్కడ నో అడ్మిషన్ బోర్డు పెట్టినా పట్టించుకోకుండా పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి గేటు బయట అడ్మిషన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. గత ఏడాది వరకు ఇక్కడ 88 మంది విద్యార్థులు మాత్రమే ఉండటం గమనార్హం.

◆ఇక గచ్చుబాయితండా ప్రాథమిక పాఠశాలది మరో కథ. ఇక్కడ గత ఏడాది వరకు 30 మంది విద్యార్థులు చదువుకున్నారు. ఇందులో ఇద్దరు విద్యార్థులు పైతరగతికి వెళ్లారు. మిగతా విద్యార్థులు ఇక్కడే చదువుకోకుండా వీరందరూ సమీపంలోని ముచ్చింతల్ ప్రాథమికోన్నత పాఠశాలలో చేరిపోయారు. దీంతో పాఠశాల మొత్తం ఖాళీ అయింది. విద్యార్థులు లేక వెలవెలపోతున్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఒక్కరే ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



గచ్చుబాయితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయుడు

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బల్కంపేటలోని ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో దేవాదాయ శాఖ మంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో వస్త్రభూషణ పేరిట చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అమ్మవారి కల్యాణం అద్భుతంగా ఉండాలి

బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం ఉత్సవాలపై మంత్రి పొన్నం సమీక్ష



సమావేశంలో మాట్లాడుకుంటున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాలు జరుపుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.సోమవారం బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం–2025పై సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జులై ఒకటో తేదీన జరిగే ఈ వేడుకలకు రాష్ట్ర నలుమూల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా హాజరవుతారని తెలిపారు. గత ఏడాది బారికేడ్లు, క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు తలెత్తాయని, ఈసారి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గుడి లోపల అభిషేకం జరుగుతున్న సమయంలో కూడా భక్తులను దర్శనాలకు అనుమతించాలని చెప్పారు. ఇతరులకు ఇబ్బందులు లేనంత వరకు భక్తులు డీజే సౌండ్ పెట్టుకుని ఆటపాటలు, నృత్యాలు చేసుకునే విధంగా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. వేడుకలు విజయవంతం చేసేందుకు అందరు సహకరించాలని కోరారు.

సౌండ్ లేకుండా వేడుకలు జరుపుకోలేం: తలసాని

బ్యాండ్, సౌండ్ లేకుండా ఎల్లమ్మ వేడుకలు జరుపుకోలేమని ఎమ్మెల్యే తలసాని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎల్లమ్మ కల్యాణ వేడుకలకు ప్రతి ఏటా రూ.10 లక్షలు కేటాయిస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. ఆలయాన్ని పుణ్యక్షేత్రం మాదిరిగా తీర్చి దిద్దాలనే లక్ష్యంలో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. జోగినులు, శివసత్తుల దర్శన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, స్థానిక కార్పొరేటర్ కేతినేని సరళ, ఈఓ మహేందర్‌గౌడ్, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్



పారిశుధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

నల్లకుంట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తను జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని ప్రజలకు సూచించారు. జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16 ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంటలో ముందస్తు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనికి హాజరైన కమిషనర్ కర్ణన్, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి పరిసరాల పరిశుభ్రతపై పారిశుధ్య కార్మికులకు సూచనలు ఇచ్చారు. వీధుల్లో పేరుకుపోయిన గృహ నిర్మాణ వ్యర్థాలు, చెట్ల కొమ్మలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. వీధుల్లో ఎక్కడ వ్యర్థాలు కనిపించినా సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా ఇళ్లల్లోని చెత్తను స్వచ్ఛ ఆటోల్లో లేదా డంపర్ బిన్‌లలో కాకుండా వీధుల్లో వేస్తే ఈ చలానా జారీ చేస్తామన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టే యజమానులు వ్యర్థాలను వీధుల్లో కుప్పలుగా వేయవద్దని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధులు అపరిశుభ్రంగా ఉంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాప్తి చేస్తాయని అన్నారు. వ్యాధుల నివారణకుగాను నగర వ్యాప్తంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టామని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట–16 సర్కిల్ డీసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌వో డా. హేమలత మాట్లాడుతూ.. నల్లకుంటలో చేపట్టిన ముందస్తు వర్షాకాలం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో రెగ్యులర్ పారిశుధ్య కార్మికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మరో 40 మందిని కేటాయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, ఎస్‌ఎఫ్‌ఏలు, 50 మందికి పైగా పారిశుధ్య కార్మికులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరిచందన



సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం ప్రజావాణిలో 147 దరఖాస్తులు దాఖలు కాగా, అందులో హౌసింగ్ శాఖ 77, పెన్షన్స్ 7, కలెక్టరేట్ సెక్షన్లు 16, రెవిన్యూ 13, ఇతర శాఖలు 34 దరఖాస్తులు వచ్చాయని అదనపు కలెక్టర్ తెలిపారు. అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, జి.ముకుందరెడ్డి డీఆర్‌ఓ వెంకటాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఐపీ పాసులపై పునః పరిశీలించాలి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం సందర్భంగా జారీ చేసే వీఐపీ పాసులపై పునః పరిశీలన చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ప్రశాంత వాతావరణలో వేడుకలు నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, కార్యనిర్వహణ అధికారి మహేందర్‌గౌడ్, హైమావతి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 41.12 శాతం ఉత్తీర్ణత

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో హైదరాబాద్ జిల్లా 41.12 శాతం ఉత్తీర్ణత సాధించింది. వృత్తి విద్యా విభాగంలో 57.48 శాతం ఉత్తీర్ణత లభించింది. మొదటి సంవత్సరం సాధారణ విభాగంలో 62.11 శాతం, వృత్తి విద్యా విభాగంలో 68.91 శాతం ఉత్తీర్ణత లభించినట్లు హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి దాసరి ఒడ్డన్న తెలిపారు. మొదటి ద్వితీయ సంవత్సరం సాధారణ వృత్తి విద్యా విద్యార్థులు మొత్తం 75,483 మంది పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు.

వీక్ హన్సా సర్వేలో హెచ్‌సీయూకు 7వ ర్యాంకు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి మరో గుర్తింపు లభించింది. దేశంలోని వెయ్యి ఉన్నత విద్యా సంస్థలలో సర్వే చేసిన వీక్ హన్సా–2025 తాజాగా ర్యాంకులను విడుదల చేసింది. టాప్–10లో హెచ్‌సీయూకు స్థానం లభించింది. ఈ సర్వేలో ఓవరాల్ ర్యాంకింగ్‌లో 667 స్కోరుతో హెచ్‌సీయూ 7వ స్థానం, సెంట్రల్ మల్టీ డిసిప్లినరీ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 667 స్కోరుతో 4వ స్థానం, దక్షిణ భారతదేశంలోని మల్టీ డిసిప్లినరీ యూనివర్సిటీల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానాన్ని హెచ్‌సీయూ దక్కించుకుంది. విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, ఆవిష్కరణల పట్ల హెచ్‌సీయూ నిబద్ధతకు ఈ ర్యాంకులు నిదర్శంగా చెప్పవచ్చు. ది వీక్ హన్సా రీసెర్చ్ బెస్ట్ యూనివర్సిటీస్ సర్వే–2025 దేశంలోని మల్టీ డిసిప్లినరీ, టెక్నికల్, మెడికల్ యూనివర్సిటీల పనితీరుపై ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. ఈ రీసెర్చ్ సర్వేలో భాగంగా దేశంలోని వెయ్యి విశ్వవిద్యాలయాల డేటాను నిపుణులు సమగ్రంగా పరిశీలించి ర్యాంకులు ఇచ్చారు.

22న మోదీ పాలన విజయోత్సవాలు: ఈటల

ఇంపీరియల్ గార్డెన్స్‌లో భారీ సభ



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 22 నుంచి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. తాను కూడా ఎంపీగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, కార్యకర్తలకు కృతజ్ఞత సభ కూడా నిర్వహించనున్నామని చెప్పారు. సభ నిర్వహించనున్న కంటోన్మెంట్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌ను పార్టీ నేతలతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ గత పదకొండేళ్లలో దేశం అన్నిరంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. దేశ ప్రజలు ఆయన పాలనను కొనసాగించాలని భావిస్తున్నారని పేర్కొన్నారు. 11 ఏళ్ల బీజేపీ ప్రభుత్వ విజయాలతో ప్రత్యేక ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రస్థాయి నేతలు విక్రమ్‌రెడ్డి, నందారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్, స్థానిక నేతలు విజయానంద్, బీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే అగ్రగామిగా విజయ డెయిరీ

పశు సంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



మంత్రి వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

లాలాపేట/లక్డీకాపూల్: విజయ తెలంగాణ డెయిరీని దేశంలోనే అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర పశు సంవర్థక, పాడి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారంలో సచివాలయంలో పదవీబాధ్యతలు చేపట్టిన మంత్రిని ఆ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎండి చంద్రశేఖర్‌రెడ్డిలు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నమ్మకానికి ప్రతీకగా ఉన్న విజయ పాలు, పాల ఉత్పత్తులను వినియోగదారులకు మరింత చేరువగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో వంద రోజుల్లో వంద నూతన విజయ పార్లర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రికి వివరించారు. కాగా, మంత్రి వాకిటి శ్రీహరిని రాష్ట్ర కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రవి శేఖర్‌రెడ్డి సోమవారం సచివాలయంలో కలిసి తిరుమల శ్రీవారి శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రసాదాలను అందజేసి అభినందనలు తెలిపారు.

ఎలక్ట్రికల్ ఆటోలకే అనుమతి ఇవ్వాలి

పంజగుట్ట: నగరంలో కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలకు కాకుండా ఎలక్ట్రికల్ ఆటోలకే అనుమతి ఇవ్వాలని తెలంగాణ ఆటో యూనియన్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఫెడరేషన్ అధ్యక్షుడు ఇబ్రహీం అహ్మద్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఖైరతాబాద్ రవాణా శాఖ ముందు నిరసన వ్యక్తం చేసి ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇబ్రహీం అహ్మద్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ 20 వేలు, సీఎన్‌జీ 10 వేలు, ఎల్‌పీజీ 10 వేల ఆటోలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నగరంలో పొల్యూషన్ లేకుండా చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోలకు ఎందుకు అనుమతి ఇచ్చిందో చెప్పాలన్నారు. వెంటనే ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి స్పందించి జీవో నుంచి ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోలను తొలగించాలని కోరారు. మహాలక్ష్మి పథకం వల్ల నష్టపోతున్న ఆటోడ్రైవర్లకు ఏడాదికి ఇరవై వేలు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ ఆటోలు కొనుగోలు చేసే డ్రైవర్లకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ ముదిరాజ్, పెసా కిరణ్, నిస్సార్ అహ్మద్, తహర్, మహ్మద్ అఫ్జల్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి నిరసనగా ధర్నాలు



నాంపల్లి కోర్టు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

సిటీ కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది పి.నారాయణపై జరిగిన దాడి అత్యంత బాధాకరమని నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికిషోర్ అన్నారు. న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ సోమవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు, సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి కోర్టుల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి ధర్నాలు చేశారు. న్యాయవాది నారాయణను జూన్ 7వ తేదీన వనస్థలిపురం నుంచి కొందరు కక్షిదారులు అపహరించి అతి దారుణంగా హింసించి డబ్బులు కూడా డిమాండ్ చేశారని అన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయవాదులు మాట్లాడుతూ కక్షిదారుల తరపున న్యాయవాదులు అహర్నిశలు శ్రమిస్తున్నా దాడులు తప్పడంలేదని వాపోయారు. ఇన్ని దాడులు జరుగుతున్నా, ప్రాణాలు పోతున్నా న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాంపల్లి కోర్టు బార్ సోసియేషన్ కార్యదర్శి ఎన్‌వీ రమణగౌడ్, ఉపాధ్యక్షులు రవీందర్, చంద్ర మోహన్, న్యాయవాదులు కె.నరేందర్, వేణు, నాగేందర్, మామిడాల రమేశ్, రఘు, ఈశ్వర్, కుమార్, చింతల కృష్ణ, బార్ అసోసియేషన్ సిబ్బంది రవీందర్ నాయక్, స్రవంతి, సాయిచంద్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'రజాకార్'కు అవార్డులు గద్దర్‌కు అవమానకరం



మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్వేషాన్ని నింపిన రజాకార్ సినిమాకు గద్దర్ పేరిట అవార్డు ఇవ్వడం ఆయనకు అవమానకరమని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలువలకు పట్టం కట్టని అవార్డు జ్యూరీ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జానపదం నుంచే ప్రజా సాహిత్యం పాట పుట్టిందని జానపద కళాకారులను జ్యూరీ కమిటీలో పెట్టకపోవడం సరైందికాదన్నారు. జానపద కళలను పోషిస్తున్న కళాకారులకు గద్దర్ అవార్డు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అవార్డు తీసుకున్న సినిమాల్లో ఏ ఒక్కటైనా గద్దర్ విలువలతో కూడిన సినిమాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. చరిత్రను వక్రీకరించిన సినిమాలకు అవార్డులు ఇవ్వడం గద్దర్‌కు అవమానకరమని అన్నారు. సమావేశంలో తెలంగాణ సినీ, జానపద కళాకారుల జేఏసీ చైర్మన్ మురళీధర్ దేశ్‌పాండే, చిత్ర రమేష్, యక్షగాన కళాకారుడు చంద్రయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

రామ్ నాయక్‌ను అభినందించిన సీఎం

గద్దర్ అవార్డుల జ్ఞాపికను రూపొందించిన కళాకారుడు



రామ్ నాయక్‌ను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

హిమాయత్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గద్దర్ తెలుగు సినీ అవార్డుల ప్రదాన మహోత్సవ జ్ఞాపికను రూపొందించిన ప్రముఖ కళాకారుడు రామ్ నాయక్‌ను అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు చేతుల మీదుగా సన్మానం అందుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్ నాయక్ రూపొందించిన జ్ఞాపికను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ కళారంగాన్ని తన ఆర్ట్ ద్వారా యావత్ ప్రపంచానికి తెలియజేశారని, అమెరికా, లండన్, కెనడా, దుబాయిలో అనేక అంతర్జాతీయ వేదికల మీద ఆయన గీసిన బొమ్మలు కోట్లాదిమంది జీవితాలను ప్రభావితం చేశాయన్నారు.

ఓయూ లైబ్రరీకి కేశవరావు జాదవ్ పేరు పెట్టాలి



జాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలంగాణ వైతాళికుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ జ్ఞాపకంగా ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీకి ఆయన పేరు పెట్టాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బతికినంత కాలం తెలంగాణ కోసమే పాటుపడ్డ ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో లోహియా విచార్ మంచ్ తెలంగాణ, కేశవరావు జాదవ్ సార్ అభిమానుల ఆధ్వర్యంలో ఆయన 7వ వర్ధంతి నిర్వహించారు. సుభద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, గట్టు సత్యనారాయణ, పృథ్వీరాజ్ యాదవ్, విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయతీ, నిబద్ధతకు జాదవ్ మారుపేరని, ఆయన వంద శాతం ప్రజల పక్షానే మాట్లాడారని అన్నారు. ఆయన పనిచేసిన ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి పదోన్నతి అవసరం లేదని, ఉన్నన్ని రోజులు అధ్యాపకునిగానే పనిచేశారని, డబ్బులు, జీతం, పదోన్నతులు అన్న పట్టింపులు లేని వ్యక్తి అని కొనియాడారు. పాతబస్తీలో ఎన్నో సమస్యలపై పోరాటం చేశారన్నారు. 'పరిమళించిన మానవత్వం'అనే తన పుస్తకంలో 20 మంది గురించి రాయగా, అందులో జాదవ్ ఒకరని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలని, ఉస్మానియా యూనివర్సిటీతో ఎంతో అనుబంధం ఉన్నందు వల్ల లైబ్రరీకి ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జీవన్ సింగ్, గోపాల్ సింగ్, చంద్రశేఖర్, గోపాల్, శివకుమార్, సోగరా బేగం పాల్గొన్నారు.

శెట్టి బలిజలను బీసీ జాబితాలో చేర్చాలి

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడికి వినతి



చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న శెట్టి బలిజ సంఘం ప్రతినిధులు

లక్డీకాపూల్: శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని ఆ కుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, గణపతి ప్రసాద్ ప్రజా భవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలోని బీసీ జాబితాలో శెట్టిబలిజ కులం ఉందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత దానిని బీసీ జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. టైపింగ్‌లో పొరపాటు జరిగిందని తెలంగాణ బీసీ కమిషన్ అభిప్రాయపడి దీన్ని సరిదిద్దాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శికి లేఖ రాశారని చిన్నారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మొదటిసారిగా బ్రెయిలీ ఇంటర్ పుస్తకాలు



బ్రెయిలీ కార్యాలయంలో పుస్తకాలు ప్రచురించిన దివ్యాంగుడు వెంకటేశ్వరరావు

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోనే మొదటిసారిగా దివ్యాంగుల కోసం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల బ్రెయిలీ లిపి పుస్తకాలను ప్రచురించామని, అవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వికలాంగుల సహకార సంస్థ జనరల్ మేనేజర్ ప్రభంజన్‌రావు తెలిపారు. సోమవారం మలక్‌పేటలోని సహకార సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎక్కడా ఇంటర్మీడియట్ బ్రెయిలీ పుస్తకాలు ప్రచురణ కాలేదని, దివ్యాంగ అధ్యాపకుల కోరిక మేరకు వీటిని ప్రచురించినట్లు చెప్పారు. అంధుల పాఠశాలల్లో పనిచేస్తున్న దివ్యాంగులైన టీచర్ల కోసం ఎకడమిక్ కేలండర్‌ను బ్రెయిలీ లిపిలో ప్రచురించామని తెలిపారు. బ్రెయిలీ ఇంటర్ పుస్తకాలు కావల్సిన వారు యూడీఐడీ కార్డులు తీసుకొని రావాలని, మలక్‌పేటలోని బ్రెయిలీ ప్రెస్ కార్యాలయంలో 99661 74985 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 17, జూన్, 2025





చారిత్రక వైభవాన్ని సమకాలీన ఆధునికతను సమపాళ్లలో కలుపుకుని, విభిన్న రకాల వేడుకలకు నిలయంగా మారిన నగరంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగంలో మహిళలు చెప్పుకోదగిన విధంగా రాణిస్తున్నారు. మొదట ఈ రంగంలో పురుషాధిపత్యం కనిపించినా, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. తమదైన సృజనాత్మకత, అర్థవంతమైన నిర్వహణ, డీటెయిల్డ్ ప్లానింగ్‌తో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

నగర వనిత.. విజయ వీచిక..

ఇంటి వేడుకల చుట్టూ ఇంతుల విజయవిహారం

- బర్త్‌డే, వెడ్డింగ్ ప్లానర్ నుంచి షష్టిపూర్తి వరకూ
- విభిన్న రకాలుగా సేవలందిస్తున్న మహిళలు
- పాతబస్తీ యువతులకు ఉపాధి పరంగా ఊతం
- ఈవెంట్ ఆర్గనైజర్లుగా నగర వనితల రాణింపు





సీఏ నుంచి ఈవెంట్స్ వరకూ..

చార్టెడ్ అకౌంటెంట్‌గా చేస్తూ దానిని వదిలేసి, అనుకోకుండా కోవిడ్ సమయంలో ఈ రంగంలోకి ప్రవేశించాను. ఇప్పటికి 500కి పైగా ఈవెంట్స్ ఆర్గనైజ్ చేశాను. మహిళలు ప్రతి ఒక్కరితో సులభంగా కలిసిపోతారు. అందుకే రాణించగలుగుతున్నారు. ప్రస్తుతం పుట్టినరోజులు, శారీ సెర్మనీలు, షష్టిపూర్తి..వరకూ ప్రతి వేడుకకీ మహిళలే సారథ్యం వహిస్తున్నారు.
- నిహారిక, శ్రీ వర్ణం



ఉద్యోగం కన్నా ఉన్నతంగా..

యుక్తవయసు నుంచీ మెహిందీ అంటే ఇష్టం. మా ఊరు నుంచి నగరానికి వచ్చాక ఎమ్మెస్సీ చదువుతూ పార్ట్ టైమ్ జాబ్ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఈ ఆర్ట్ ద్వారా ఆదాయం గురించి తెలిసింది. అలా పార్ట్ టైమ్ ఆర్టిస్ట్‌గా.. ఆ తర్వాత ఫుల్ టైమ్ ఆర్టిస్ట్‌గా మారాను. పెళ్లి తర్వాత భర్త ప్రోత్సాహంతో కంటిన్యూ చేస్తున్నాను. మెహందీతో పాటు నెయిల్ ఆర్ట్ కూడా నేర్చుకున్నాను. నెలలో 15రోజులు పనిచేసినా చాలు. ఉద్యోగం ద్వారా వచ్చే జీతం కన్నా ఎక్కువే వస్తుంది.
- శ్వేత గన్నోజు, మెహందీ ఆర్టిస్ట్



అందం.. అందరికీ..

ఇంటర్‌తో చదువు అటకెక్కింది. భర్త ప్రోత్సాహంతో ప్రొఫెషనల్‌గా నేర్చుకుని మేకప్ సేవలు అందిస్తున్నాను. బర్త్‌డే, ప్రీ వెడ్డింగ్ షూట్స్, సంగీత్ ఇలా ప్రతి వేడుకకూ మేకప్ అవసరం. ఇంట్లో ఫంక్షన్ ఉందంటే ఆ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు అందరూ మేకప్ కావాలంటున్నారు. దాదాపు 12 ఏళ్ల నుంచి ఈ రంగంలో పలువురు యువతకు శిక్షణ అందిస్తున్నా.
- భవానీ నవీన్, మేకప్ ఆర్టిస్ట్

సమన్వయమే.. 'సంగీత్'కి న్యాయం..

చిన్నప్పటి నుంచీ డ్యాన్స్ బాగా చేసేదాన్ని. డ్యాన్స్ పోటీల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగానే ఈ రంగంలోకి వచ్చేశా. దీంతో ఎనిమిదేళ్ల నుంచి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నా. ఈ రంగంలో రాణించాలంటే సహనం ఉండాలి. మనకు వచ్చినట్టు, నచ్చినట్టు కాదు అతిథుల బాడీ లాంగ్వేజ్ బట్టి నేర్పించాలి.
- శ్రీవాణి, కొరియోగ్రాఫర్



వెడ్డింగ్ ప్లాన్ చేయడం ఒకెత్తయితే సంగీత్, మెహందీ, హల్దీ, రిసెప్షన్ వరకూ పెళ్లిలో భాగమైన కార్యక్రమాలన్నింట్లో మహిళల పాత్రే కీలకం. గత కొన్నేళ్లుగా ట్రెండీగా మారిన డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహణా బాధ్యతల్ని సైతం మహిళలు చేపట్టడం విశేషం. ఫ్లోరల్ డెకరేషన్, టేబుల్ సెట్టింగ్స్, బ్యూటీ, కాంపాక్ట్ స్టేజింగ్ వంటివి పండించడంలో మహిళలకు సహజంగా ఉండే సున్నితత్వం ఉపకరిస్తోంది.

'సంగీత్' వారధి.. నృత్యానికి సారధి

నాట్యం, సంగీతం, డ్రామా కలగలిపిన మ్యూజికల్ ఫెస్టివల్ సంగీత్ ప్రోగ్రామ్. నృత్యం వచ్చిన, రాని, అంతంత మాత్రమే చేయగలిగిన ప్రతి ఒక్కరినీ సమన్వయపరచి సంగీత్‌ని రక్తి కట్టించే కొరియోగ్రాఫర్ అనే కీలకపాత్రలో మహిళలు సునాయాసంగా ఒదిగిపోతున్నారు. సంప్రదాయంగా నాట్యం నేర్పడంలో ఉండే సమర్థత, శ్రద్ధ, సమయ పాలన వీటన్నింటికీ మించి కుటుంబంతో మమేకమైపోయే నేర్పు.. ఈ పాత్రలో మహిళలకు తిరుగులేని ఎంపిక. సాంగ్ సెలక్షన్ నుంచి స్టెప్పుల ఎంపిక వరకూ అంతా తామై వ్యవహరిస్తున్నారు.

మాటే మంత్రం..

ఫ్యామిలీ ఈవెంట్స్‌లో బంధుమిత్రుల్ని భాగస్వాములుగా చేసే పలు కార్యక్రమాలను నడిపించే కంపేరర్లుగా కూడా మహిళలు సాటిలేని రీతిలో రాణిస్తున్నారు. భాషాపరంగా నైపుణ్యం, హాస్య చతురత, కలుపుగోలు తనంతో కంపేరింగ్ క్వీన్స్‌గా మారిపోతున్నారు. ఇంగ్లిష్-తెలుగు మిక్స్‌తో సహజంగా మాట్లాడే వీరి శైలి ఆకట్టుకుంటోంది. చిన్నితెరపై యాంకర్స్‌గా ఎలాగైతే దుమ్ము రేపుతున్నారో.. అలాగే వినోద భరిత కార్యక్రమాల్లోనూ కంపేరర్స్‌గా నగరంలో సత్తా చాటుతున్నారు. తాను ఆర్జేగా ప్రారంభమైనా వివాహ వేడుకలతో పాటు బేబీ షవర్స్, కార్పొరేట్ ఈవెంట్స్‌లో కంపేరర్‌గా స్థిరపడడానికి కారణం అందులో అవకాశాలు, ఆదాయం బాగుండడమేనని నగరానికి చెందిన పూజిత అంటున్నారు.

పాతబస్తీకి కొత్త 'పూత'..

నిజాం వైభవాలకు నిలయమైన నగరం ఇప్పుడు ఖరీదైన బ్రైడల్ ఇండస్ట్రీకి చిరునామాగా మారింది. దీంతో ప్రత్యేక మెహందీ డిజైన్లు, మేకప్ సేవలతో ముస్లిం మహిళలు ఈ రంగంలో ఉపాధి అవకాశాలు అందుకుంటూ వ్యాపారస్తులుగా ఎదుగుతున్నారు. ఓ మోటార్ మెకానిక్ కూతురుగా, కుటుంబ ఆర్థిక బాధ్యతలను మోయడానికి తల్లి తయారు చేసిన రెడీమేడ్ దుప్పట్లు అమ్మిన 19 ఏళ్ల సారా మెహందీ నిపుణురాలైన ఫాతిమా దగ్గర శిక్షణ పొందింది. ఇప్పుడు ఒక్కో సెషన్‌కు రూ.3000 వరకూ వసూలు చేస్తోందని సమాచారం.

ఇసుజు మాన్సూన్ ఐ కేర్ క్యాంప్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో కార్లకు వచ్చే రకరకాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఇసుజు ఆధ్వర్యంలో నగరవాసుల కోసం ఐ కేర్ మాన్సూన్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. వర్షాకాల కష్టాలపై ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు వాహనాన్ని కూడా సంసిద్ధం చేయడం కోసం ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని, తమ అధీకృత షోరూమ్స్‌లో ఈ నెల 16 నుంచి 5 రోజుల పాటు ఈ క్యాంప్ కొనసాగుతుందని వివరించింది.



వీవర్స్‌ను ప్రోత్సహించడం అభినందనీయం

పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి

బంజారాహిల్స్: వీవర్స్‌ను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేస్తున్న వస్త్ర ప్రదర్శనలను నగరవాసులు ఆదరించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో కొలువుదీరిన డీ సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శనను ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభిన్నమైన పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు భవిన్ తెలిపారు.

రమణీయం సాహితీ నృత్యం

రవీంద్రభారతిలో జ్యోతిరెడ్డి శిష్యురాలి అరంగేట్రం

గన్‌ఫౌండ్రీ : ప్రముఖ నాట్య శిక్షణాలయం జ్యోతి కళా క్షేత్రం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నృత్య గురువు జ్యోతిరెడ్డి శిష్యురాలు సాహితీ పద్మప్రియ కూచిపూడి నాట్య రంగ ప్రవేశం రవీంద్రభారతిలో సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, జతిస్వరం, అలరింపు, వర్ణం, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆనంద్‌రాజేశ్వర్ బైవార్ మాట్లాడుతూ నేటి తరానికి శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తూ శాస్త్రీయ కళలపై మక్కువ పెంచుకున్న సాహితీ రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఆర్‌వీ.రెడ్డి, ప్రైమరి డైరెక్టర్ రాజ్‌గోపాల్ శర్మ, తల్లిదండ్రులు మానస, ఐఆర్ఎస్.ఏపీ.బాబు పాల్గొన్నారు.





మహిళలకు ఆభరణాలంటే ఓ ఎమోషన్..

సినీ నటి గౌరీ ప్రియ

బంజారాహిల్స్: ఆభరణాలు అలంకరణకు మాత్రమే కాదు.. మహిళలకు అవంటే ఒక ఎమోషన్ అని సినీనటి గౌరీ ప్రియ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఓ గోల్డ్ అండ్ డైమండ్ స్టోర్స్ ప్రారంభోత్సవంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తనకు గోల్డ్ అంటే ఎంతో ఇష్టమని, తన వద్ద ఎన్నో రకాల కలెక్షన్ ఉందని చెప్పారు. సినిమా షూటింగ్ సందర్భంగా వేరే ప్రాంతాలకు వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక ఆభరణం కొంటూనే ఉంటానని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ – డైమండ్స్ సంస్థ వ్యవస్థాపకురాలు షానిలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చేర్యాల నకాషి పెయింటింగ్స్‌కు రోజు రోజుకు ఆదరణ పెరుగుతుంది. ఒకప్పుడు ఆదరణ లేని ఈ చిత్రాలకు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో గ్రామీణ, సాంస్కృతిక ఇతివృత్తాలను తెలిపే చిత్రాలను వేస్తోంది బోడుప్పల్ శ్రీసాయిరాం నగర్‌కు చెందిన ధనాలకోట వైకుంఠం నకాషి కుటుంబం. మహాభారతం, రామాయణం, వివిధ భారతీయ పురాణాలు వంటి హిందూ ఇతిహాసాలను చిత్రాల రూపంలో ఆలయాలు, మ్యూజియాల్లో, పలు ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఈ తరహా చిత్రకళపై వర్క్ షాప్స్ నిర్వస్తున్నారు. - బోడుప్పల్



గ్రామీణ, సాంస్కృతిక కళారూపం..

చేర్యాల చిత్రం..

తెలుగు రాష్ట్రాల ప్రత్యేక శైలికి నిదర్శనం

- రోజు రోజుకూ చేర్యాల చిత్రాలకు ప్రజల్లో ఆదరణ
- గ్రామీణ, సాంస్కృతిక ఇతివృత్తాలే పెయింటింగ్స్
- పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వర్క్ షాపులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, పలు వార్డులు



నకాషి కళాకారులు 13వ శతాబ్దం నుంచి చిత్రకళను ప్రారంభించారు. రాజులు, జమీందారులు తమ ఇళ్లలో ఇంటీరియల్ డిజైన్ కోసం, వాహనాల రూపంలో ఈ తరహా పెయింటింగ్స్ చెక్కలతో చేయించుకునేవారు. అంతేకాకుండా గ్రామ దేవతల విగ్రహాలు, బొమ్మల కొలువులు, ఆవుపేడ, చింతపిక్కలతో చిన్న పిల్లలకు బొమ్మలు చేసేవారు. వందల సంవత్సరాల క్రితమే కథ చెప్పే సంఘాలు వీటిని దృశ్య సహాయంగా ఉపయోగించుకుని కథలు చెప్పుకుంటూ తెలంగాణ గ్రామాల్లో తిరిగేవారు. చేర్యాల స్క్రోల్ పెయింటింగ్ అనేది ఆడియో – విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రారంభ రూపాల్లో ఒకటిగా ప్రాచుర్యం పొందింది. తెలంగాణ రాష్ట్రంలో నకాషి కులస్తులు మాత్రమే వీటిని తయారు చేస్తారు. ఎనిమిది కులాల పురాణాల చిత్రాలను వీరే వేస్తారు.



నకాషి కళకు ప్రభుత్వాల సహకారం..

చేర్యాల నకాషి పెయింటింగ్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. వైకుంఠం నకాషి కుటుంబ సభ్యులు వనజ, రాకేష్, నిహారిక, వినయ్‌కుమార్, తన్మయ్, సారిక ఈ చేర్యాల చిత్రాలను వేస్తున్నారు. వైకుంఠానికి 2016లో జాతీయ అవార్డు, 1994, 1995లో నేషనల్ మెరిట్ అవార్డు, 1994లో రాష్ట్ర అవార్డు లభించాయి.

ఆలయాలు, మ్యూజియాల్లో..

దేశంలో పలు ఆలయాలు, మ్యూజియాల్లో చేర్యాల నకాషి చిత్రాలు ఇప్పటికీ ఆదరణ పొందుతున్నాయి. ఉజ్జయినిలో శివపురాణం, దీనిని ఇటీవల ప్రధాని మోదీ సందర్శించారు. శివపురాణం ఆయనను ఆకట్టుకోగా, పెయింటింగ్స్ వివరాలు తెలుసుకుని గీసిన వైకుంఠం నకాషి గురించి మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. నూతన పార్లమెంట్ భవనంలో జైన్ మహావీర్ చరిత్ర ఏర్పాటు చేశారు. బొల్లారం రాష్ట్రపతి భవన్‌లో ఈ తరహా చిత్రాలు అందుబాటులో ఉన్నాయి. బీహారులోని తక్షిల మ్యూజియంలో, అయోధ్యలోని తులసీదాస్ రామాలయం మ్యూజియంలో, భోపాల్‌లోని ఆదివాసీ లోక్ కళా చిత్రసమితి ప్రదర్శనలో ఉంచారు. స్విట్జర్లాండ్, చైనా, లండన్, మలేషియా, ఇటలీ, బెర్లిన్, సౌత్ ఆఫ్రికాలో ప్రదర్శనలో పెట్టారు. అంతేకాకుండా న్యూ ఢిల్లీలో జరిగిన ఎగ్జిబిషన్‌లో ఈ చేర్యాల చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు.





అండర్సన్-సచిన్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా

లండన్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సంబంధించి అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ (ఏటీటీ)ని ఈ నెల 14నే ఆవిష్కరించాల్సి ఉంది. అయితే అనూహ్యంగా ఈ కార్యక్రమం వాయిదా పడింది. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం నేపథ్యంలో నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రమాదంలో భారతీయులతో పాటు 50కి పైగా బ్రిటీష్ జాతీయులు కూడా మరణించారు. దాంతో ట్రోఫీ కార్యక్రమం నిర్వహించడం సరైంది కాదని వారు భావించారు. ఇదే విషయాన్ని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు నిర్ధారించారు. అయితే ఒకటి, రెండు రోజుల్లోనే ట్రోఫీని ఆవిష్కరిస్తారని ఆయన చెప్పారు. మరోవైపు ఇప్పటి వరకు భారత మాజీ కెప్టెన్ మన్సూర్ అలీఖాన్ పేరుతో 'పటౌడీ ట్రోఫీ'గా ఉన్న పేరును 'అండర్సన్-సచిన్ ట్రోఫీ'గా మార్చడంపై చాలా మందిలో అసంతృప్తి ఉంది. పటౌడీ గౌరవార్థం దీనిని అదే పేరుతో కొనసాగించాలని స్వయంగా సచిన్ టెండూల్కర్ ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)ను కోరినట్లు సమాచారం. అయితే ట్రోఫీ పేరు విషయంలో కొత్త నిర్ణయానికే ఈసీబీ కట్టుబడి ఉంటే... ఈ సిరీస్‌లో పటౌడీ పేరుతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' లాంటి అవార్డును అందించైనా సరే మరో రూపంలో ఆయనను స్మరించుకునే విషయాన్ని పరిశీలించాలని బీసీసీఐ కోరింది.

మహిళల వన్డే వరల్డ్ కప్ - 2025 షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
సెప్టెంబర్ 30	భారత్ X శ్రీలంక	బెంగళూరు
అక్టోబర్ 1	ఆస్ట్రేలియా X న్యూజిలాండ్	ఇండోర్
అక్టోబర్ 2	బంగ్లాదేశ్ X పాకిస్తాన్	కొలంబో
అక్టోబర్ 3	ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా	బెంగళూరు
అక్టోబర్ 4	ఆస్ట్రేలియా X శ్రీలంక	కొలంబో
అక్టోబర్ 5	భారత్ X పాకిస్తాన్	కొలంబో
అక్టోబర్ 6	న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా	ఇండోర్
అక్టోబర్ 7	ఇంగ్లండ్ X బంగ్లాదేశ్	గువహటి
అక్టోబర్ 8	ఆస్ట్రేలియా X పాకిస్తాన్	కొలంబో
అక్టోబర్ 9	భారత్ X దక్షిణాఫ్రికా	వైజాగ్
అక్టోబర్ 10	న్యూజిలాండ్ X బంగ్లాదేశ్	వైజాగ్
అక్టోబర్ 11	ఇంగ్లండ్ X శ్రీలంక	గువహటి
అక్టోబర్ 12	భారత్ X ఆస్ట్రేలియా	వైజాగ్
అక్టోబర్ 13	దక్షిణాఫ్రికా X బంగ్లాదేశ్	వైజాగ్
అక్టోబర్ 14	న్యూజిలాండ్ X శ్రీలంక	కొలంబో
అక్టోబర్ 15	ఇంగ్లండ్ X పాకిస్తాన్	కొలంబో
అక్టోబర్ 16	ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్	వైజాగ్
అక్టోబర్ 17	దక్షిణాఫ్రికా X శ్రీలంక	కొలంబో
అక్టోబర్ 18	న్యూజిలాండ్ X పాకిస్తాన్	కొలంబో
అక్టోబర్ 19	భారత్ X ఇంగ్లండ్	ఇండోర్
అక్టోబర్ 20	శ్రీలంక X బంగ్లాదేశ్	కొలంబో
అక్టోబర్ 21	దక్షిణాఫ్రికా X పాకిస్తాన్	కొలంబో
అక్టోబర్ 22	ఆస్ట్రేలియా X ఇంగ్లండ్	ఇండోర్
అక్టోబర్ 23	భారత్ X న్యూజిలాండ్	గువహటి
అక్టోబర్ 24	పాకిస్తాన్ X శ్రీలంక	కొలంబో
అక్టోబర్ 25	ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా	ఇండోర్
అక్టోబర్ 26	ఇంగ్లండ్ X న్యూజిలాండ్	గువహటి
అక్టోబర్ 26	భారత్ X బంగ్లాదేశ్	బెంగళూరు
అక్టోబర్ 29	తొలి సెమీఫైనల్	గువహటి / కొలంబో
అక్టోబర్ 30	రెండో సెమీఫైనల్	బెంగళూరు
నవంబర్ 2	ఫైనల్	బెంగళూరు /కొలంబో

భారత్ తొలి ప్రత్యర్థి శ్రీలంక

సెప్టెంబర్ 30 నుంచి టోర్నీ
- నవంబర్ 2న ఫైనల్
- ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్న వైజాగ్

మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల



దుబాయ్: భారత గడ్డపై మరోసారి మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీకి రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు వేర్వేరు వేదికలపై ఈ టోర్నమెంట్ జరుగుతుంది. గతంలో 1978, 1997, 2013లలో భారత్ ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇచ్చింది. అయితే ఈసారి శ్రీలంకతో కలిసి సంయుక్తంగా టోర్నీని నిర్వహించనుంది. సెప్టెంబర్ 30న తొలి మ్యాచ్ జరగనుండగా, నవంబర్ 2న జరిగే ఫైనల్‌తో వరల్డ్ కప్ ముగుస్తుంది. 28 లీగ్ మ్యాచ్‌లు, 3 నాకౌట్ మ్యాచ్‌లు కలిపి మొత్తం 31 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో భారత్‌లోని నాలుగు వేదికలు బెంగళూరు, ఇండోర్, గువహటి, విశాఖపట్నంలతో పాటు శ్రీలంకలోని కొలంబో స్టేడియం కూడా మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి. ప్రపంచ కప్‌లో 8 జట్లు పాల్గొంటుండగా... ఎప్పటిలాగే రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ప్రతీ టీమ్ మిగతా 7 ప్రత్యర్థులతో తలపడుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరతాయి. ఇప్పటి వరకు మొత్తం 12 వరల్డ్ కప్‌లు జరగ్గా భారత్ 10 టోర్నీల్లో పాల్గొంది. ఒక్కసారి కూడా టైటిల్ నెగ్గలేకపోయిన మన టీమ్... రెండుసార్లు (2005, 2017) ఫైనల్ వరకు చేరడమే అత్యుత్తమ ప్రదర్శన. సెప్టెంబర్ 30న బెంగళూరు వేదికగా జరిగే తొలి పోరులో శ్రీలంకతో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై ఈసారైనా మన మహిళలు సత్తా చాటి ట్రోఫీ సాధిస్తారా అనేది ఆసక్తికరం. వరల్డ్ కప్‌లో భాగంగా సాగర తీరం విశాఖపట్నంలో ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో భారత్ ఆడే 2 మ్యాచ్‌లు ఉండటం విశేషం.

శ్రీలంకలో పాకిస్తాన్ మ్యాచ్‌లు



పురుషుల క్రికెట్ తరహాలో మహిళల క్రికెట్‌లోనూ భారత్, పాకిస్తాన్ జట్లు ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఇరు జట్ల మధ్య అక్టోబర్ 5న జరిగే పోరుకు కొలంబో వేదికవుతోంది. సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. ఇటీవలి 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో పరిస్థితి మరింత తీవ్రమైంది. ఇలాంటి సమయంలో ఐసీసీ టోర్నీలోనూ భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతుందా అనే సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు తాజా షెడ్యూల్ ప్రకటనతో మ్యాచ్ ఖాయమైనట్లు తేలింది. ఈ ఏడాది పురుషుల చాంపియన్స్ ట్రోఫీకి పాక్ ఆతిథ్యం ఇవ్వగా... భారత్ మాత్రం అక్కడికి వెళ్లేందుకు నిరాకరించింది. ఫలితంగా మన మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే జరిగాయి. దాంతో తాము కూడా మహిళల వరల్డ్ కప్‌కు భారత్‌కు రాలేమని, మరో చోట మ్యాచ్‌లు జరపాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు డిమాండ్ చేసింది. దీనికి అంగీకరించిన ఐసీసీ పాక్ మ్యాచ్‌లను తటస్థ వేదిక శ్రీలంకలో నిర్వహించాలని నిర్ణయించింది. పాక్ సెమీస్ చేరితే కొలంబోలో మ్యాచ్ ఆడుతుంది. లేదంటే తొలి సెమీస్ గువహటిలో జరుగుతుంది. అదే తరహాలో పాక్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే మ్యాచ్ కొలంబోలోనే నిర్వహిస్తారు. పాక్ చేరకపోతే ఫైనల్ బెంగళూరులో జరుగుతుంది.



శ్రీలంక X బంగ్లాదేశ్

నేటి నుంచి డబ్ల్యూటీసీ (2025-27) షురూ

గాలే: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) తాజా విజేత దక్షిణాఫ్రికా సంబరాలు ఇంకా ముగియక ముందే తర్వాతి డబ్ల్యూటీసీకి తెర లేచింది. 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో భాగంగా శ్రీలంక, బంగ్లాదేశ్ రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనున్నాయి. గాలే వేదికగా నేటి నుంచి తొలి టెస్టు జరుగుతుంది. కొన్నాళ్ల క్రితమే సొంతగడ్డపై ఆ్రస్టేలియా చేతిలో 0-2తో చిత్తయిన లంక కోలుకొని మళ్లీ కొత్తగా మొదలుపెట్టాలని పట్టుదలగా ఉంది. ఈ సిరీస్ కోసం లంక ఏకంగా ఆరుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. రెండు చేతులతో స్పిన్ బౌలింగ్ చేయగల తరిందు రత్ననాయకే ఈ టెస్టుతో అరంగేట్రం చేయడం ఖాయమైంది. టీమ్‌లో సీనియర్ ప్లేయర్ ఏంజెలో మాథ్యూస్ ఈ సిరీస్ తర్వాత రిటైర్ కానున్న నేపథ్యంలో విజయంతో వీడ్కోలు పలకాలని జట్టు భావిస్తోంది. మరోవైపు బంగ్లాదేశ్ పరిస్థితి ఎప్పటిలాగే బలహీనంగా కనిపిస్తోంది. జింబాబ్వేతో సిరీస్‌ను 1-1తో ముగించిన తర్వాత మళ్లీ ఆ టీమ్ ఇప్పుడే బరిలోకి దిగుతోంది. ఒక్క ఆటగాడు కూడా ఫామ్‌లో కనిపించడం లేదు. కెప్టెన్ నజ్ముల్ గత 10 టెస్టుల్లో 2 అర్ధ సెంచరీలు మాత్రమే చేయగా, సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ గత 13 ఇన్నింగ్స్‌లలో కనీసం హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. గాలే పిచ్ స్పిన్‌కు బాగా అనుకూలించే అవకాశం ఉండటంతో ఇరు జట్లు స్పిన్‌పై బాగా దృష్టి పెట్టాయి. మెహదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లామ్ జట్టుకు కీలకం కానున్నారు. మ్యాచ్‌కు వర్షం కొంత అంతరాయం కలిగించవచ్చు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫన్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నేడు జట్టుతో చేరనున్న గంభీర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇంగ్లండ్‌కు తిరిగి వెళుతున్నాడు. ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు జట్టు సన్నాహాలు కొనసాగుతుండగా ... తల్లి అనారోగ్యం కారణంగా గత బుధవారం గంభీర్ ఢిల్లీకి వచ్చాడు. అయితే ప్రస్తుతం ఆమె కోలుకోవడంతో అతను ఈ నిర్ణయం తీసుకున్నాడు. 'గంభీర్ తల్లి ఆరోగ్యం మెరుగైంది. ఇబ్బందేమీ లేదు. భారత్ నుంచి బయల్దేరి మంగళవారం అతను టీమ్‌తో కలుస్తాడు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ నెల 20 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టెస్టు మొదలవుతుంది.

సాక్షి సినిమా

ఆ ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేను

- ఎం. మోహన్ బాబు


● విష్ణు మంచు, రజనీకాంత్, మోహన్ బాబు

''పెద రాయుడు' సినిమా విడుదలై ఈ నెల 15కి(ఆదివారం) 30 ఏళ్లు పూర్తయ్యాయి. అదే రోజు నా ప్రియ మిత్రుడు రజనీకాంత్ 'కన్నప్ప' చిత్రాన్ని తన ఫ్యామిలీతో కలిసి వీక్షించారు. సినిమా చూసిన తర్వాత ఆయన కురిపించిన ప్రేమ, ప్రశంసలు, ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేను.. థ్యాంక్యూ మిత్రమా'' అని నటుడు, నిర్మాత ఎం. మోహన్ బాబు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రజనీకాంత్, ఎం. మోహన్ బాబు హీరోలుగా, రవిరాజా పినిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'పెద రాయుడు'. 1995 జూన్ 15న విడుదలైన ఈ చిత్రం ముప్పై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మోహన్ బాబు, రజనీకాంత్ చెన్నైలో కలుసుకున్నారు. ఈ క్రమంలోనే విష్ణు మంచు హీరోగా నటించిన 'కన్నప్ప' సినిమాని రజనీకాంత్ వీక్షించారు. ఈ నేపథ్యంలో విష్ణు మంచు సోషల్ మీడియాలో ఆనందాన్ని పంచుకున్నారు. ''కన్నప్ప' చూసిన తర్వాత రజనీకాంత్‌గారు నన్ను హత్తుకుని, సినిమా నచ్చిందన్నారు. ఈ క్షణం కోసం నేను గత 22 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. నా నటనను ఆయన ఎప్పుడు మెచ్చుకుంటారు? నన్ను ఎప్పుడు హత్తుకుంటారు? అనుకుంటూ ఉన్నాను.. ఆ కల ఇప్పుడు నెరవేరింది. నాకు ఎంతో ఆనందంగా, సంతోషంగా, గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు మోహన్ బాబు నిర్మించిన 'కన్నప్ప' చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది.


● రవితేజ

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరో రవితేజ, దర్శకుడు కిషోర్ తిరుమల కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచి ప్రారంభమైంది. ''రవితేజ నటిస్తున్న 76వ చిత్రం ఇది. హైదరాబాద్‌లో ఈ సినిమా కోసం వేసిన సెట్‌లో చిత్రీకరణ మొదలైంది. రవితేజ, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా కోసం రవితేజ స్పెషల్‌గా మేకోవర్ అయ్యారు. ఆయన ట్రేడ్‌మార్క్ కామిక్ టైమింగ్, మాస్ అప్పీల్‌తో కూడిన పూర్తిస్థాయి ఫ్యామిలీ డ్రామా కథను ఈ సినిమా కోసం సిద్ధం చేశారు కిషోర్ తిరుమల. వచ్చే సంక్రాంతికి ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రవితేజ నటించిన 'ధమాకా, మాస్ జాతర' వంటి చిత్రాల తర్వాత ఈ సినిమాకు కూడా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. కాగా రవితేజ, శ్రీలీల జంటగా నటించిన 'మాస్ జాతర' ఆగస్టు 27న రిలీజ్ కానుంది.

తండ్రీ కొడుకులు


● అఖిల్, నాగార్జున

నిజ జీవితంలో తండ్రీ కొడుకులైన అక్కినేని నాగార్జున, అఖిల్ వెండి తెరపైనా తండ్రీ కొడుకులుగా స్క్రీన్ షేర్ చేసుకోనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. అఖిల్ హీరోగా నటిస్తున్న యాక్షన్ లవ్‌స్టోరీ చిత్రం 'లెనిన్'. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అక్కినేని నాగార్జున, నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో నాగార్జున నటించనున్నారనీ, కథ రీత్యా అఖిల్ పాత్రకు తండ్రి పాత్రలో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఇదే వాస్తవమైతే... నిజ జీవితంలో తండ్రీకొడుకులైన నాగార్జున, అఖిల్ సిల్వర్ స్క్రీన్‌పై కూడా తండ్రీకొడుకులుగా కనిపించినట్లవుతుంది. అయితే ఈ విషయంపై పూర్తిస్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవల పెళ్లి చేసుకున్న అఖిల్ అతి త్వరలోనే 'లెనిన్' రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొంటారని, ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ తిరుపతిలో ప్రారంభం అవుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రం నవంబరులో రిలీజ్ కానుందని సమాచారం. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు నాగార్జున, నాగచైతన్య ప్రధాన పాత్రల్లో నటించిన 'మనం' సినిమాలో అఖిల్ ఓ చిన్న పాత్రలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

ది రాజా సాబ్‌ని సవాల్‌గా తీసుకున్నా

- మారుతి


● రాజీవన్, కార్తీక్ పళని, మారుతి, కృతి, టీజీ విశ్వప్రసాద్, ఎస్‌కేఎన్

''నేను దర్శకత్వం వహించిన 'పక్కా కమర్షియల్' సినిమా అంతగా ప్రేక్షకాదరణ పొందలేదు. దీంతో మా కాంబినేషన్‌లో(ప్రభాస్-మారుతి) మూవీ అనుకున్న ప్రొడ్యూసర్ డ్రాప్ అయ్యారు. కానీ, అలాంటి టైమ్‌లో నాకు సపోర్ట్‌గా నిలిచిన ఒకే ఒక వ్యక్తి ప్రభాస్‌గారు. అందుకే 'ది రాజా సాబ్' ను ఒక సవాల్‌గా తీసుకుని సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను'' అని డైరెక్టర్ మారుతి తెలిపారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 5న విడుదలకానుంది.

హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మారుతి మాట్లాడుతూ–''ప్రభాస్‌గారిని 'బుజ్జిగాడి' సినిమా స్టైల్‌లో 'ది రాజా సాబ్' ద్వారా వింటేజ్ లుక్‌లో చూపిస్తున్నాం. కొంత షూటింగ్, సాంగ్స్ బ్యాలెన్స్ ఉన్నాయి'' అన్నారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''మా సంస్థ నుంచి వస్తున్న బిగ్గెస్ట్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. ఈ సినిమా కోసం బిగ్గెస్ట్ ఇండోర్ సెట్ వేశాం. 40 నిమిషాల క్లైమాక్స్ ఎపిసోడ్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఈ మూవీకి సీక్వెల్ పాన్ వరల్డ్ స్థాయిలో ఉంటుంది'' అన్నారు. ఈ వేడుకలో 'ది రాజా సాబ్' క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృతి, కెమెరామేన్ కార్తీక్ పళని, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ మాట్లాడారు.

హనుమాన్ జంక్షన్‌లో...

అర్జున్, జగపతి బాబు, వేణు తొట్టెంపూడి, స్నేహ, లయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హనుమాన్ జంక్షన్'. మోహన్ రాజా దర్శకత్వం వహించారు. ఎడిటర్ మోహన్ సమర్పణలో ఎం.ఎల్. మూవీ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎంవీ లక్ష్మి నిర్మించిన ఈ చిత్రం 2001 డిసెంబరు 21న విడుదలై ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించి, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని ఈ నెల 28న రీ రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''యాక్షన్, అద్భుతమైన హ్యూమర్ మేళవించిన సినిమా 'హనుమాన్ జంక్షన్'. ఎంగేజింగ్ స్క్రీన్‌ప్లే, ఆకట్టుకునే సంభాషణలు, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు కల్ట్ స్టేటస్‌ను తీసుకువచ్చాయి. అలాంటి ఎవర్ గ్రీన్ ఎంటర్‌టైనర్ మరోసారి ప్రేక్షకులను థియేటర్లో అలరించబోతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: సి. రామ్‌ప్రసాద్, సంగీతం: సురేశ్ పీటర్స్.


● అర్జున్, జగపతి బాబు

హిలేరియస్ ఎంటర్‌టైనర్


● నాగ్ అశ్విన్, సుహాస్, శివాని

'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' సినిమా తర్వాత సుహాస్, శివాని నగరం జోడీగా కొత్త చిత్ర ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నటుడు సత్యదేవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు నాగ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత వంశీ నందిపాటి తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. సత్యదేవ్, నాగ్ అశ్విన్ కలిసి స్క్రిప్టును చిత్రయూనిట్‌కు అందించారు. ''ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు 'రైటర్ పద్మభూషణ్' సినిమా ఫేమ్ షణ్ముక ప్రశాంత్ కథ అందిస్తున్నారు.

మిస్టీరియస్ విజయం సాధించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి


● అబిద్, కోమటిరెడ్డి, మహి, రోహిత్

''మిస్టీరియస్' చిత్రం టైటిల్, పోస్టర్ చాలా బాగున్నాయి. పోస్టర్ చూస్తుంటే దక్షిణాదిలోని అన్ని భాషల్లో చేస్తున్న సినిమాలాగా ఉంది. ఈ చిత్రం విజయం సాధించాలని ఆశిస్తున్నాను'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోహిత్ సహాని (బిగ్ బాస్ ఫేమ్), అబిద్ భూషణ్ (దివంగత నటుడు నాగభూషణం మనవడు), రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో ఆష్లీ క్రియేషన్స్‌పై జయ్ వల్లందాస్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదలకానుంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రిలీజ్ చేశారు. మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ–''ప్రతి పాత్ర అనుమానాస్పదంగా ఉండేలా సస్పెన్స్, థ్రిల్లర్, మిస్టరీతో ఈ చిత్రం తీశాం. యాక్షన్స్, థ్రిల్లింగ్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ''మహి కోమటిరెడ్డి వంటి విజన్ ఉన్న దర్శకుడితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించడం సంతోషంగా ఉంది. త్వరలోనే మా సినిమా ఆడియోను రిలీజ్ చేస్తాం'' అన్నారు జయ్ వల్లందాస్. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రామ్ ఉప్పు, అబిద్ భూషణ్, రోహిత్ సహాని పాల్గొన్నారు.

బలమైన భావోద్వేగాలతో...


● అమ్ము అభిరామి

హీరో రాజ్‌తరుణ్, దర్శకుడు విజయ్ మిల్టన్ కాంబినేషన్‌లో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సునీల్, 'ప్రేమిస్తే..' ఫేమ్ భరత్ కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ సినిమాలోని మరో కీలక పాత్రలో అమ్ము అభిరామి నటించనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ''ఈ సినిమాలోని అమ్ము అభిరామి పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఆమె పాత్ర ఎమోషనల్‌గా, పవర్‌ఫుల్‌గా ఉంటుంది'' అని విజయ్ మిల్టన్ తెలిపారు. కాగా విజయ్ మిల్టన్ దర్శకత్వంలో వచ్చిన 'గోలీ సోడా' అనే వెబ్ సిరీస్‌లో అభిరామి ఓ కీలక పాత్రలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
17-6-2025

స్టాక్ మార్కెట్లు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	లాభం	ముగింపు
సెన్సెక్స్ ▲	678	81,796
నిఫ్టీ ▲	228	24,947

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,709	▲	302
డోజోన్స్	42,598	▲	400
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,875	▲	25
డాక్స్	23,699	▲	183
షాంఘై	3,389	▲	12
నికాయ్	38,311	▲	477

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.75	86.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.70	117.67
€	యూరో	ఎస్‌బీఐ	98.11	100.84
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.26	60.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.80	57.02
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.81	69.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.06	23.57
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.57	23.33
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93



SBI ఇంటి రుణం కారు చౌకగా..!

రుణ గ్రహీతలకు ఎస్‌బీఐ గుడ్ న్యూస్

- రుణాలపై 0.50% వడ్డీ రేటు కోత
- డిపాజిట్లపై పావు శాతం మేర తగ్గింపు
- దిగిరానున్న ఈఎంఐల భారం

న్యూఢిల్లీ: రుణ గ్రహీతలకు ఎస్‌బీఐ పెద్ద ఉపశమనాన్ని కల్పించింది. ఆర్‌బీఐ రెపో రేటు 0.50 శాతం తగ్గింపు ప్రయోజనాన్ని పూర్తిగా రుణ గ్రహీతలకు బదలాయించింది. వివిధ రకాల రుణాలపై 50 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గిస్తూ నిర్ణయించింది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు తగ్గనున్నాయి. ఎస్‌బీఐ రెపో ఆధారిత రుణ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) తగ్గించింది. ఈ తగ్గింపు అనంతరం ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ రేటు 7.75 శాతానికి దిగొచ్చింది. అలాగే, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత రుణ రేటును (ఈబీఎల్‌ఆర్) సైతం 8.65 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గించింది. సవరించిన రేట్లు జూన్ 15 నుంచే అమల్లోకి వచ్చాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ (ఎంసీఎల్‌ఆర్) రేట్లలో ఎస్‌బీఐ ఎలాంటి సవరణలు చేయలేదు. దీంతో ఓవర్‌నైట్, ఒక నెల ఎంసీఎల్‌ఆర్ రేటు 8.2 శాతంగా, మూడు నెలల రేటు 8.55 శాతం, ఆరు నెలల రేటు 8.90 శాతం, ఏడాది ఎంసీఎల్‌ఆర్ 9 శాతం, రెండేళ్ల రేటు 9.05 శాతం, మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ రేటు 9.10 శాతం చొప్పున ఉన్నాయి. ఆర్‌బీఐ ఈ నెల ఆరంభంలో రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంక్‌లు తమ రుణ రేట్లను సైతం వేగంగా సవరించడం గమనార్హం. ఇప్పుడు ఎస్‌బీఐ సైతం ఇదే నిర్ణయాన్ని అమలు చేసింది. రుణ గ్రహీతల క్రెడిట్ స్కోరును బట్టి ఎస్‌బీఐ గృహ రుణ రేటు 7.50 శాతం నుంచి 8.45 శాతం మధ్య ఉండనుంది.

డిపాజిట్ రేట్లకూ కోత

మరోవైపు వివిధ కాల వ్యవధి డిపాజిట్లపై రేటును సైతం ఎస్‌బీఐ తగ్గించింది. రూ.3 కోట్ల వరకు అన్ని కాల వ్యవధుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 1–2 ఏళ్ల డిపాజిట్లపై రేటు తగ్గింపు అనంతరం 6.50 శాతానికి దిగొచ్చింది. 2–3 ఏళ్ల డిపాజిట్లపై రేటు 6.70 శాతం నుంచి 6.45 శాతానికి తగ్గింది. 3–5 ఏళ్లలో మెచ్యూరిటీ తీరే డిపాజిట్లపై వడ్డీ రేటు 6.30 శాతం, 5–10 ఏళ్ల డిపాజిట్లపై రేటు 6.05 శాతానికి తగ్గింది. 444 రోజుల అమృత్ వృష్టి డిపాజిట్‌పై రేటు 6.85 శాతం నుంచి 6.60 శాతానికి తగ్గింది. 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు సాధారణ రేట్లపై 50 బేసిస్ పాయింట్లు, 80 ఏళ్లు నిండిన సూపర్ సీనియర్ సిటిజన్లకు 60 బేసిస్ పాయింట్ల అదనపు రేటు డిపాజిట్లపై లభిస్తుంది.

పెద్ద ఊరటే..

రూ.50 లక్షల గృహ రుణం, 8 శాతం రేటుపై 20 ఏళ్ల కాలానికి తీసుకునేట్టు అయితే తాజా 50 బేసిస్ పాయింట్ల తగ్గింపు రూపంలో రుణ గ్రహీతకు రూ.3.70 లక్షలు ఆదా కానుంది. 8 శాతం రేటుపై రేటు సవరణకు ముందు నెలవారీ ఈఎంఐ 41,822 కాగా, సవరణ తర్వాత రూ.40,280కు దిగివస్తుంది. ఈఎంఐ తగ్గించుకోకుండా పూర్వపు మాదిరే చెల్లిస్తూ వెళ్లేట్టు అయితే నిర్ణీత కాల వ్యవధి కంటే ముందుగానే రుణం తీరిపోతుంది.

పీఎఫ్ సేవల కోసం ఏజెంట్ల సాయం తీసుకోవద్దు

- ఆన్‌లైన్ పోర్టల్ సేవలను వినియోగించుకోవాలి
- వ్యక్తిగత డేటా గోప్యతను రిస్క్‌లో పెట్టుకోవద్దు
- సభ్యులకు ఈపీఎఫ్‌వో సూచన



న్యూఢిల్లీ: పీఎఫ్ క్లెయిమ్‌లు, ఆన్‌లైన్ సేవల విషయంలో ఏజెంట్ల సాయం తీసుకోవద్దంటూ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ తన సభ్యులకు కీలక సూచన చేసింది. తమ భవిష్యనిధికి సంబంధించి సేవల కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించింది. దీనివల్ల వ్యక్తిగత వివరాలు రిస్క్‌లో పడకుండా ఉంటాయని పేర్కొంది. వేగవంతమైన, పారదర్శకమైన సేవలు, వినియోగ అనుకూలమైన ఎన్నో సంస్కరణ చర్యలను ఈపీఎఫ్‌వో అమలు చేసినట్టు కేంద్ర కార్మిక శాఖ సైతం గుర్తు చేసింది. ఈపీఎఫ్‌వో సభ్యులు ఉచితంగా పొందాల్సిన సేవలపై సైబర్ కేఫ్ ఆపరేటర్లు, ఫిన్‌టెక్ కంపెనీలు పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుండడం తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. సభ్యులు నేరుగా ఉచితంగా వినియోగించుకోతగిన ఈపీఎఫ్‌వో ఆన్‌లైన్ ఫిర్యాదుల పోర్టల్‌ను ఈ ఆపరేటర్లు వినియోగిస్తున్నట్టు పేర్కొంది. మూడో పక్ష కంపెనీలు లేదా ఏజెంట్లను ఆశ్రయించడం వల్ల సభ్యుల సున్నితమైన ఆర్థిక డేటా లీకయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. సీపీజీఆర్‌ఏఎంఎస్ లేదా ఈపీఎఫ్‌ఐజీఎంఎస్ పోర్టల్స్‌లో ఫిర్యాదు చేయొచ్చని, సకాలంలో పరిష్కారమయ్యేంత వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపింది. క్లెయిమ్ దాఖలు, నిధుల బదిలీ, కేవైసీ అప్‌డేషన్, ఇతర ఏ ఫిర్యాదు అయినా ఉచితమేనని.. వీటి కోసం ఎవరికీ ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఏవైనా సమస్యలు ఉంటే ఈపీఎఫ్‌వో హెల్ప్ డెస్క్‌లు లేదా ప్రాంతీయ కార్యాలయాల్లో పీఆర్‌వోలను సంప్రదించొచ్చని సూచించింది. ఈపీఎఫ్‌వో పరిధిలో 7 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారు.

14 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

మే నెలలో 0.39 శాతం

- మరింత తగ్గిన ఆహార, ఇంధన ధరలు



న్యూఢిల్లీ: ఆహారం, కూరగాయలు, ఇంధన ధరల తగ్గుదలతో టోకు ద్రవ్యోల్బణం మరింత కనిష్టానికి దిగొచ్చింది. మే నెలలో టోకు ధరల ఆధారిత సూచీ 0.39 శాతంగా నమోదైంది. ఇది 14 నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్ నెలకు టోకు ద్రవ్యోల్బణం 0.85 శాతంగా ఉంటే, గతేడాది మే నెలలో 2.74 శాతంగా ఉంది. ఆహార వస్తువుల విభాగంలో 1.56% ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైంది. ఏప్రిల్ నెలలో ఇది మైనస్ 0.86%గా ఉంది. ముఖ్యంగా కూరగాయలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పప్పుల విభాగంలో ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైంది. కూరగాయల్లో అయితే ఏకంగా మైనస్ 21.6% ద్రవ్యోల్బణం నెలకొంది. ఇంధనం, విద్యుత్ విభాగంలోనూ మైనస్ 2.3% ద్రవ్యోల్బణం నమోదైంది. ఏప్రిల్‌లో ఇదే విభాగంలో 2.18% ద్రవ్యోల్బణం ఉండం గమనార్హం. తయారీ వస్తువుల విభాగంలో 2.04% ద్రవ్యోల్బణం నెలకొంది. మే నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయిలో 2.82 శాతానికి దిగిరావడం తెలిసిందే. టోకు ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం అన్ని విభాగాల్లోనూ కనిపించినట్టు ఇక్రా సీనియర్ ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

దేశీ కంపెనీలకు 'రేర్' తిప్పలు!	ఎగుమతులు రూ.3.29 లక్షల కోట్లు

ఇక 10 సెకన్లలోపే చెల్లింపులు

యూపీఐ లావాదేవీల్లో మరింత వేగం



న్యూఢిల్లీ: దేశీయంగా అన్నివర్గాలు ప్రజలు అత్యంత విరివిగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులు తాజాగా మరింత వేగాన్ని సంతరించుకున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్(ఎన్‌పీసీఐ) సోమవారం(16) నుంచి యూపీఐ చెల్లింపుల రెస్పాన్స్ సమయాన్ని 10 సెకన్లకు తగ్గించేందుకు నిర్ణయించింది. మొబైల్ ఫోన్ల ద్వారా చేపట్టే ఇంటర్‌బ్యాంక్ లావాదేవీలకు యూపీఐ ఇప్పటివరకూ 30 సెకన్ల సమయం తీసుకుంటోంది. అయితే ఇకపై 10–15 సెకన్లలో లావాదేవీ పూర్తికావడాన్ని ఎన్‌పీసీఐ తప్పనిసరి చేసింది. వెరసి సోమవారం నుంచి రివర్సల్స్‌సహా.. సొమ్ము బదిలీ, స్టేటస్ చెక్ 10–15 సెకన్లలో పూర్తికానున్నాయి. అంతేకాకుండా త్వరలో కస్టమర్లు యూపీఐ యాప్‌ల ద్వారా ఖాతాలోని నిల్వను రోజులో 50సార్లు మాత్రమే పరిశీలించుకునేందుకు పరిమితం చేయనుంది. ప్రస్తుతం ఇందుకు ఎలాంటి పరిమితులూ లేవు. కాగా.. గత(మే) నెలలో యూపీఐ లావాదేవీల సంఖ్య 33 శాతం జంప్‌చేసి 1,868 కోట్లను తాకింది. వీటి విలువ రూ. 25.14 లక్షల కోట్లు.

దిగువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- దిగొచ్చిన బ్రెంట్ క్రూడాయిల్ ధరలు
- ఒకశాతం మేర లాభపడిన సూచీలు
- ఐటీ, మెటల్ షేర్లకు భారీగా డిమాండ్



ముంబై: బ్రెంట్ క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు సోమవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 678 పాయింట్లు బలపడి 81,796 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 228 పాయింట్లు ఎగసి 24,947 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండురోజుల నష్టాలకు బ్రేక్ పడినట్లైంది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ప్రథమార్ధంలోనే భారీ లాభాలు ఆర్జించగలిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 747 పాయింట్లు బలపడి 81,866 వద్ద, నిఫ్టీ 250 పాయింట్లు ఎగసి 24,967 వద్ద గరిష్టాలు తాకాయి. ఆసియాలో సింగపూర్, తైవాన్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీల ఒక శాతం, యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు ఒక శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- దిగువ స్థాయిలో అన్ని రంగాలకు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియల్టీ షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో ఐటీ 1.5%, టెక్ 1.3%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 1.2% రాణించాయి. మిడ్‌క్యాప్ ఇండెక్సు 1%, స్మాల్‌క్యాప్ సూచీ 0.38% చొప్పున పెరిగాయి.
- సెన్సెక్స్ సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్ (2.45%), టెక్ మహీంద్రా(2.12%), టీసీఎస్(1.40%), ఇన్ఫోసిస్(1.39%), కోటక్ మహీంద్రా బ్యాంకు(1.31) షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ ఏడు పైసలు బలపడి 86.04 వద్ద స్థిరపడింది. క్రూడ్ ధరలు దిగిరావడం, డాలర్ బలహీనత, దేశీ స్టాక్ మార్కెట్ రాణించడం తదితర అంశాలు కలిసొచ్చాయి.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో 630 నావిక్, యాంత్రిక్ పోస్టులు

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నావిక్, యాంత్రిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన పురుష అభ్యర్థులు జూన్ 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కోస్ట్‌గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్ (సీజీఈపీటీ)-01/2026 బ్యాచ్, సీజీఈపీటీ-01/2026 బ్యాచ్ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తారు.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 630
- » **పోస్టుల వివరాలు:** సీజీఈపీటీ-01/2026 బ్యాచ్ ద్వారా నావిక్(జనరల్ డ్యూటీ)-260 పోస్టులు, యాంత్రిక్(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్)-60 పోస్టులు; అదేవిధంగా సీజీఈపీటీ-02/2026 బ్యాచ్ ద్వారా నావిక్ జనరల్ డ్యూటీ-260 పోస్టులు, నావిక్(డొమెస్టిక్ బ్రాంచ్)-50 పోస్టులను భర్తీ చేస్తారు.

అర్హతలు

- » నావిక్ జనరల్ డ్యూటీ పోస్టులకు మ్యాథ్స్, ఫిజిక్స్‌తో 10+2/ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » నావిక్ డొమెస్టిక్ బ్రాంచ్ పోస్టులకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- » యాంత్రిక్ పోస్టులకు పదో తరగతితోపాటు ఎలక్ట్రికల్ /మెకానికల్ /ఎలక్ట్రానిక్స్ /టెలీకమ్యూనికేషన్(రేడియో/పవర్) డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.
- » **వయసు:** ఆయా పోస్టులను అనుసరించి 18–22 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- » **బేసిక్ పే:** నావిక్ పోస్టులకు మూలవేతనం నెలకు రూ.21700, యాంత్రిక్ పోస్టులకు మూలవేతనం నెలకు రూ.29,200 లభిస్తుంది.
- » **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**25.06.2025
- » **వెబ్‌సైట్:** https://joinindiancoastguard.cdac.in/cgept/

ఎన్‌ఐపీజీఆర్‌లో ఉద్యోగాలు

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్(ఎన్‌ఐపీజీఆర్)..పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
- » **విభాగాలు:** సైంటిఫిక్,టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్.
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ -2 పోస్టులు, టెక్నీషియన్- 2 పోస్టులు, మల్టీ టాస్కింగ్ స్టాఫ్-1 పోస్టు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ -1 పోస్టు, ఫైనాన్స్ ఆఫీసర్ -1 పోస్టు.
- » **అర్హతలు:**పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగాలో ఐటీఐ,డిప్లొమా, బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- » **వయసు:** సైంటిఫిక్ పోస్టులకు 50–55 ఏళ్లు, టెక్నికల్ పోస్టులకు 25 ఏళ్లు, అడ్మినిస్ట్రేటివ్ పోస్టులకు 35 ఏళ్లలోపు ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**07.07.2025
- » **వెబ్‌సైట్:** https://nipgr.ac.in/nipgrv2/index.html

ఐసీఎంఆర్‌లో 4 సైంటిస్ట్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ -ఇ(మెడికల్): 4 పోస్టులు, సైంటిస్ట్–ఇ(నాన్ మెడికల్) -1 పోస్టు.
- » **అర్హతలు:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో ఎండీ/ఎంఎస్, ఎంబీబీఎస్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** గరిష్ఠ వయోపరిమితి 50 ఏళ్లకు మించరాదు.
- » **వేతనం:** లెవెల్–13లో నెలకు రూ.1,23,100-రూ.2,15,900 వేతన శ్రేణి లభిస్తుంది.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 23.06.2025
- » **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in

ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్ కొలువు

- » 284 పోస్టుల భర్తీకి ఏఎఫ్‌క్యాట్ 2025 నోటిఫికేషన్
- » రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ
- » శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టయిపెండ్

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్ స్థాయి కొలువు కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్) 2025కు నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా భారత వాయుసేనలో ఫ్లైయింగ్ బ్రాంచ్, గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్, నాన్ టెక్నికల్) విభాగాల్లో కమిషన్డ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ నేపథ్యంలో.. ఎయిర్‌ఫోర్స్‌లో ఏఎఫ్‌క్యాట్ 2025 ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, వేతనాలు తదితర వివరాలు..

- మొత్తం పోస్టుల సంఖ్య: 284

పోస్టుల వివరాలు

ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ ఫ్లయింగ్ బ్రాంచ్‌లో పురుషులకు ఒక పోస్టు, మహిళలకు 2 పోస్టులు; గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ పురుషులకు 123 పోస్టులు, మహిళలకు 33 పోస్టులు; అదేవిధంగా గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్‌లో పురుషులకు 98 పోస్టులు, మహిళలకు 27 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 50 శాతం మార్కులతో 10+2(మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి) ఉత్తీర్ణతతోపాటు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పాస్ అవ్వాలి లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్ ఏరోనాటికల్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)కు 10+2 స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్‌తో కనీసం 50 శాతం మార్కులతోపాటు సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ తదితర విభాగాల్లో నాలుగేళ్ల బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్ ఏరోనాటికల్ ఇంజనీర్(మెకానికల్)కు 10+2 స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్‌తో కనీసం 50 శాతం మార్కులతోపాటు మెకానికల్, ఏరోనాటికల్, ఆటోమొబైల్ తదితర విభాగాల్లో నాలుగేళ్ల బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ బ్రాంచ్ (వెపన్ సిస్టమ్ బ్రాంచ్, అడ్మినిస్ట్రేషన్ అండ్ లాజిస్టిక్స్, అకౌంట్స్, ఎడ్యుకేషన్, మెటియోరాలజీ)కు 10+2 స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్‌తో కనీసం 50 శాతం మార్కులతోపాటు ఆయా పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్, బీఎస్సీ, బీకామ్, పీజీ తదితర అర్హతలు ఉండాలి.

వయసు

- ఏఎఫ్‌క్యాట్ ఫ్లయింగ్ బ్రాంచ్, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీకి 01.07.2026 నాటికి 20–24 ఏళ్ల మధ్య ఉండాలి.
- గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్ టెక్నికల్ బ్రాంచ్‌కు వయసు 20–26 ఏళ్ల మధ్య ఉండాలి.
- అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

ఎంపిక విధానం

- ఏఎఫ్‌క్యాట్ ఆన్‌లైన్ పరీక్షతోపాటు ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్(ఏఎఫ్‌ఎస్‌బీ) ఇంటర్వ్యూ, వైద్యపరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఆన్‌లైన్ రాత పరీక్ష

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2025 ఆగస్టు 23, 24 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఏఎఫ్‌క్యాట్ నిర్వహిస్తారు. ఈ పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో 100 ప్రశ్నలు–300 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఈ పరీక్షలో జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లిష్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్, మిలిటరీ అప్టిట్యూడ్‌పై ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి మూడు మార్కులు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. వివిధ షిఫ్ట్‌ల్లో పరీక్ష నిర్వహిస్తున్నందున నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరించి మార్కులు కేటాయిస్తారు.



ఏఎఫ్‌క్యాట్ 2025

ఏఎఫ్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ

- ఏఎఫ్‌క్యాట్ ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులను ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ ఎంపిక ప్రక్రియకు అనుమతిస్తారు. వీరికి డెహ్రాడూన్, మైసూర్, గాంధీనగర్, వారణాసి, గౌహతీల్లో ఏఎఫ్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఎంపికైన అభ్యర్థులు వీటిల్లో ఏదో ఒక సెంటర్‌తో పాటు తేదీలను కూడా అధికారిక వెబ్ సైట్ ద్వారా ఎంచుకోవాల్సి ఉంటుంది.
- ఏఎఫ్‌ఎస్‌బీ ఇంటర్వ్యూలో భాగంగా తొలుత స్టేజ్1లో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో భాగంగా మొదటి రోజు ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్‌తోపాటు పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్, సైకలాజికల్ టెస్ట్‌లు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. అనంతరం వీరికి గ్రూప్ టెస్ట్, ఇంటర్వ్యూలు ఉంటాయి.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలక్షన్ సిస్టమ్ ఉంటుంది.

62 వారాల శిక్షణ

ఏఎఫ్‌క్యాట్ ఆన్‌లైన్ పరీక్షతోపాటు ఏఎఫ్‌ఎస్‌బీ ప్రక్రియలో విజయం సాధించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు. 2026 జూలై మొదటి వారంలో ఈ శిక్షణ ప్రారంభమవుతుంది. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్‌ల అభ్యర్థులకు 62 వారాలపాటు శిక్షణ ఇస్తారు. అదేవిధంగా గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ బ్రాంచ్ అభ్యర్థులకు 52 వారాల పాటు శిక్షణ ఉంటుంది.

రూ.లక్షకు పైగానే వేతనం

ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.56,100 స్టైయిపెండ్ లభిస్తుంది. శిక్షణ సైతం విజయవంతంగా పూర్తి చేసుకొని కొలువులో చేరిన వారికి ఫ్లయింగ్ ఆఫీసర్ ర్యాంకులో నెలకు రూ.56,100 - రూ.1,77,500 వేతన శ్రేణి లభిస్తుంది. మూలవేతనంతోపాటు హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు అన్నీ కలుపుకొని నెలకు రూ.లక్షకు పైగా వేతనం అందుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 01.07.2025
- **రాత పరీక్ష తేది:** 2025 ఆగస్టు 23, 24 తేదీల్లో
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in/AFCAT


రాత పరీక్షలో రాణించేలా

- ఈ పరీక్షలో ఉండే ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్, మిలిటరీ అప్టిట్యూడ్‌పై అభ్యర్థులు పట్టు సాధించేలా కృషి చేయాలి.
- ఇంగ్లిష్ విభాగంలో.. కాంప్రహెన్షన్, డిటెక్ట్ ఎర్రర్ ఇన్ సెంటెన్స్, సెంటెన్స్ కంప్లీషన్/ఫిల్లింగ్ ఇన్ ఆఫ్ కరెక్ట్ వర్డ్, యాంటోనిమ్స్/సినానిమ్స్, క్లోజ్ టెస్ట్ లేదా ఫిల్ ఇన్ ద గ్యాప్స్ ఇన్ ఏ పేరాగ్రాఫ్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, అనాలజీ, సెంటెన్స్ రీ అరేంజింగ్, సబ్‌స్టిట్యూషన్ ఇన్ సెంటెన్స్/వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- జనరల్ అవేర్‌నెస్‌లో.. హిస్టరీ, జాగ్రఫీ, స్పోర్ట్స్, నేషనల్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్, ఆర్ట్ అండ్ కల్చర్, పర్సనాలిటీస్, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎకాలజీ, ఇండియన్ పాలిటీ, ఎకానమీ, బేసిక్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్, డిఫెన్స్ వంటి వాటి నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- న్యూమరికల్ ఎబిలిటీలో.. డెసిమల్ ఫ్రాక్షన్, టైమ్ అండ్ వర్క్, యావరేజ్/ పర్సంటేజ్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, సింపుల్ అండ్ కాంపౌండ్ ఇంటరెస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్ అండ్ రేసెస్(ట్రైన్స్, బోట్స్, స్ట్రీమ్స్), ఏరియా, పెరిమీటర్, ప్రాబబిలిటీ, నంబర్ సిస్టమ్, నంబర్ సిరీస్, మిక్షర్ అండ్ అలిగేషన్ రూల్స్, క్లాక్స్‌పై ప్రశ్నలు అడుగుతారు.
- రీజనింగ్ అండ్ మిలిటరీ అప్టిట్యూడ్ నుంచి వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు మెట్రిక్యులేషన్ స్థాయిలో ఉంటాయి. ఇతర విభాగాల్లో మాత్రం డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
- ఆన్‌లైన్ టెస్ట్‌కు దాదాపు రెండు నెలల సమయం అందుబాటులో ఉన్నందున అభ్యర్థులు ఇప్పటి నుంచే సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ ప్రారంభించాలి. తొలుత గత ప్రశ్నపత్రాలను పరిశీలించి ముఖ్యమైన టాపిక్స్ గుర్తించాలి. వీటికి సంబంధించిన ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకొని, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్‌పై దృష్టిపెట్టాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

- » సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-రసాయనశాస్త్రం
- » గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్



టచ్‌లో ఉండకండి

'స్మార్ట్'ఫోన్లకు కట్టుబానిసలవుతున్న యువత

అనారోగ్యాలను 'టచ్'చేసి తెచ్చుకుంటున్నాం

'డిజిటల్ డీటాక్స్'తో ఫోన్‌కు దూరమవుదాం

మనవాళ్లకు, మంచి అలవాట్లకు దగ్గరవుదాం

కర్ణుడి కవచ కుండలాల్లా స్మార్ట్ ఫోన్ ఇప్పుడు మన శరీరంలోనూ ఒక భాగంగా మారిపోయింది. ఫోన్ ఉంటేనే అన్ని అవయవాలూ ఉన్నట్లు! ఫోన్ చూస్తుంటేనే అన్ని అవయవాలూ బాగా పని చేస్తున్నట్లు! నిద్రలోను, మెలకువలోను మన మైండ్ ఫోన్ మీదే. ఫోన్‌కి ఇంతగా 'కట్టు బానిస'అయి పోతే ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నా ఫోన్‌ని వదల్లేకపోతున్నాం. అది మన తప్పు కాదు. ఫోనే మనల్ని వదలటం లేదు. మరి దీనికి పరిష్కారం లేదా? లేకనేం, 'డిజిటల్ డీటాక్స్'ఉంది అంటున్నారు వైద్య నిపుణులు, సైకాలజిస్టులు.

ఇటీవల కర్ణాటక ప్రభుత్వం, అఖిల భారత గేమింగ్ ఫెడరేషన్‌తో కలిసి బెంగళూరులో 'బియాండ్ స్క్రీన్స్'అనే కార్యక్రమాన్ని చేపట్టింది. డ్రగ్స్‌కి బానిసలు అయినట్టే.. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి డిటిజల్ ఉపకరణాలు, ముఖ్యంగా అందులోని సోషల్ మీడియాకు బానిసలైనవారికి కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. అంతేకాకుండా విద్య, ఉపాధి వంటి అంశాల్లో తాత్కాలిక, దీర్ఘకాలిక పరిష్కారాలూ చూపిస్తారు.

మనం డిజిటల్ ఉపకరణాలకు ఎంతగా బానిసలు అయిపోతున్నామో చెప్పేందుకు ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే. దీనికి పరిష్కారమే డిజిటల్ డీటాక్స్.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, రీల్స్, షార్ట్స్, యూట్యూబ్.. ఈ ప్రపంచంలోకి అడుగుపెడితే ఒక పట్టాన మనల్ని బయటపడనివ్వదు. ఇదో మాయాలోకం. ఫోన్‌లో చార్జింగ్ అయిపోయేంత వరకు స్క్రీన్‌పై ఈదులాట సాగుతూనే ఉంటుంది. తలనొప్పిగా ఉన్నది గమనించం. కళ్లు మసక బారుతున్నదీ పట్టించుకోం. నిస్సత్తువ, నిస్తేజం అన్నవి స్క్రీన్‌ని అన్నేసి గంటలు చూడటం వల్లనే అనీ గుర్తించం. అందుకే 'డిజిటల్ డీటాక్స్'అవసరం అని నిపుణులు సూచిస్తున్నారు.

స్క్రీన్‌పై ఈదులాట తగ్గాలి

డిజిటల్ డీటాక్స్ అంటే నెమ్మదిగా స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌ని చూసే టైమ్‌ని తగ్గించుకోవటం. తద్వారా అనారోగ్యాల ముప్పు నుంచి తప్పించుకోవటం. మన చేతిలో పట్టే ఫోన్‌ని మన మెదడును అప్పగించేసి బానిసలు కాకుండా ఉండటం. మనకు వారాంతంలో ఎలా సెలవో అలాగే గ్యాడ్జెట్లకు వీక్లీ ఆఫ్ ఇవ్వాలి. వీకెండ్‌లో ముఖ్యమైన పనులు తక్కువగా ఉంటాయి డిజిటల్ డీటాక్స్ మొదటి దశకు ఈ రోజులు అనుకూలంగా ఉంటాయి.

వీకెండ్‌లో 'పీస్ ఆఫ్ మైండ్'

డిజిటల్ డిటాక్స్‌లో భాగంగా ముందుగా డిజిటల్ ఉపకరణాలను దూరంగా పెట్టాలి. అత్యవసరమైతే తప్ప వాటి జోలికి పోకూడదు. నిజానికిది అంత సులభమైన సాధన కాదు. ప్రారంభంలో ఏమీ తోచదు. ఎందుకంటే అలవాటైపోయిన ప్రాణం కదా. ఒంటరిగా ఉన్నట్లనిపిస్తుంది. నోటిఫికేషన్‌లు ఏమైనా వచ్చి ఉంటాయా అన్న ఆసక్తి, ఆందోళన మనసును పీకుతుంటుంది. స్థిమితంగా ఉండలేం. ప్రపంచంలో జరిగే అతి ముఖ్యమైన సంఘటనలు మిస్ అవుతున్నామన్నంత ఆరాటం ఉంటుంది. కానీ, ఏమీ ఫర్వాలేదు. అలవాటు అయ్యాక మాత్రం తేలిగ్గా చేయగలుగుతాం. ఫోన్‌ని స్విచాఫ్ చెయ్యక్కర్లేదు. ఫోన్ మీద నుంచి మనసును స్విచాఫ్ చేసుకుంటే చాలు.

డిజిటల్ డీటాక్స్ కూడా సాధనే

పక్కా ప్లానింగ్‌తో..

- అలాగే డీటాక్సింగ్ సమయంలో మనం చేయవలసిన పనులు ముందే అనుకుంటే మనసు ఫోన్ మీదకు మళ్లదు.
- ఉదయం పూట ఖాళీ దొరికితే జిమ్‌కు వెళ్లొచ్చు.
- పార్కులో రోజూ ఫోన్ లేకుండా రన్నింగ్, వ్యాయామం, యోగా వంటివి ఒక్కరైనా, నలుగురితో కలిసైనా చేయండి.
- స్నానం చేశాక మీకు నచ్చిన ఆలయానికి వెళ్లండి.
- ఇంటి పనుల్లో మీ శ్రీమతికి, కుటుంబ సభ్యులకు సాయం చేయండి.
- కొత్తకొత్త రకాల మొక్కలను పెంచండి.
- మీ స్నేహితులకు ఫోన్ చేసి గెట్ టుగెదర్ ఏర్పాటుచేసుకోవచ్చు. కానీ, అందరూ ఫోన్లు పక్కన పెట్టేయాలన్న కండిషన్ పెట్టుకోండి.
- మంచి పుస్తకం చదవండి. ఆన్‌లైన్లో కాదు.. కొని, చదవండి. లేదంటే ఎవరి దగ్గర నుంచైనా తీసుకుని చదవండి.
- ధ్యానం అలవాటు చేసుకోండి.
- మీకు బాగా దగ్గరివాళ్లు లేదా మనసుకు నచ్చిన వాళ్లతో రెస్టారెంటుకు భోజనానికో, పార్కుకో, షాపింగుకో వెళ్లండి.
- స్నేహితులూ, పిల్లలతో కలిసి క్రికెట్ లాంటి ఆటలు ఆడండి.
- కనీసం ఏడాదికి ఒకసారి.. ఒక అనాథాశ్రమం లేదా వృద్ధాశ్రమంలో ఒక రోజు పూర్తిగా గడపండి.
- మనసుంటే మార్గం ఉంటుంది. ఇలాంటి జాబితాను ఎవరికి వారు వారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా తయారుచేసుకోవచ్చు.

డిజిటల్ డిటాక్స్ ప్రయోజనాలు

- మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఉత్తేజాన్ని పుంజుకుంటుంది.
- మైండ్‌లోంచి పెద్ద లోడ్ ఏదో దిగినట్లు అనిపిస్తుంది.
- సోషల్ మీడియా తెచ్చిపెట్టే ఆదుర్దా, ఆందోళన, అసహనం అన్నీ మాయం అవుతాయి.
- మెదడుకు పని చెప్పడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుంది.
- కుటుంబ సభ్యులతో గడపటం ఎంత ఉల్లాసంగా ఉంటుందో గ్రహిస్తాం.
- రోజూ వందల కొద్దీ సోషల్ మీడియా పోస్టులు, వీడియోల వంటివి చూడటం వల్ల మన మెదడు ఒక విషయం మీద ఫోకస్ చేయలేదు. అదే అన్నీ ఆపేస్తే.. మన ఆరోగ్యం, భవిష్యత్తు, మనకు కావాల్సిన వారి గురించి ఆలోచించడం.. ఇలాంటి విషయాల మీద శ్రద్ధ పెట్టవచ్చు

మన పెద్దలే గురువులు

నిజానికి డిజిటల్ డీటాక్స్ ఎలా చేయాలో ఇంట్లో అమ్మమ్మలు, తాతయ్యలు, పెద్దనాన్నలు లాంటి పెద్దవాళ్లను ఎవరిని అడిగినా చెప్తారు. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగిపోయినా వాళ్లకు అనవసరం. వాళ్లు చేయాల్సిన పనులు శ్రద్ధగా, కచ్చితంగా చేసేవాళ్లు. కుటుంబ సంబంధాలు చక్కగా నెరిపేవాళ్లు. బంధువుల కుటుంబాల్లో జరిగే అన్ని కార్యక్రమాలకూ హాజరయ్యేవారు. అక్కడ అందరితోనూ కలిసి మాట్లాడేవారు. ఇప్పటిలా.. నలుగురూ కలిసినా ఒక్కొక్కరూ ఒక్కో ఫోను పట్టుకుని.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉండేవారు కాదు. అలాంటి వాళ్లు లేరు అంటారా.. అయితే మీకు మళ్లీ ఫోన్‌లోని డిజిటల్ డీటాక్స్ యాప్‌లే శరణ్యం.

అవి : డిజిటల్ డీటాక్స్ డ్రాగన్స్, ఆఫ్‌టైమ్, ఆఫ్‌స్క్రీన్, హెడ్‌స్పేస్, యాప్‌డీటాక్స్.



పర్వదినాల్లో జైనులు...

మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాల్లోని జైనులు.. 'పర్యూషణ్ పర్వ్'అనే ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా డిజిటల్ డిటాక్స్ చేపడుతున్నారు. కొందరు పూర్తిగా ఫోన్లు స్విచాఫ్ చేస్తే.. మరికొందరు ఆ రోజంతా వాట్సాప్ వాడకుండా ఉంటున్నారు. అహ్మదాబాద్‌లోని జైనులు మరో అడుగు ముందుకేసి, ఒక పోటీ కూడా పెట్టారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఏవీ వాడకూడదని నిబంధన పెట్టారు. దీనికి ట్యాగ్‌లైన్..'మొబైల్ ఫోన్ ఒక మంచి సేవకుడు. అదే సమయంలో ప్రమాదకరమైన గురువు కూడా'. 50 రోజులపాటు ఇలా డిజిటల్ డిటాక్స్ చేసి విజేతలుగా నిలిచిన 10 మందికి ఝార్ఖండ్‌లోని వారి పవిత్ర క్షేత్రానికి ఉచిత తీర్థయాత్ర ఆఫర్ ఇచ్చారు.

క్లుప్తంగా...


18న శ్రీవారి సెప్టెంబర్ నెల దర్శన కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను జూన్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన వారు జూన్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే, వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జి సేవా టికెట్లను జూన్ 21న, అంగప్రదక్షిణం టోకెన్లు 23న, వయో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్లను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనుంది. ఇక 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటా విడుదల చేస్తారు. శ్రీవారి సేవ (తిరుమల, తిరుపతి), పరకామణి సేవ, నవనీత సేవల ఆగస్టు నెల కోటాను జూన్ 25న విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.


బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి



సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉదయం సచివాలయానికి చేరుకున్న మంత్రి శ్రీహరికి వేదమంత్రోచ్చారణలతో పండితులు స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో ఆయన ప్రత్యేక పూజలు చేసి, బాధ్యతలు చేపట్టారు. పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్న సీహెచ్ ప్రియాంక



తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీగా ఐఏఎస్ అధికారి వల్లూరు క్రాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆ సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పర్యావరణ అనుమతులను తిరస్కరించాలి

- బనకచర్లపై కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ లేఖ
- టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ జారీ కోసం ప్రాజెక్టును మదింపు చేయరాదు
- ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే రాష్ట్రాలతో సమావేశం నిర్వహించాలి



సాక్షి, హైదరాబాద్: ఏపీ అక్రమంగా నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తును తిరస్కరించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరారు. తొలి దశ పర్యావరణ అనుమతుల్లో భాగంగా ప్రాజెక్టు నిర్మాణంలో అనుసరించాల్సిన నియమ నిబంధనల (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్/టీఓఆర్)ను జారీ చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం దరఖాస్తు చేసుకుందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టీఓఆర్ జారీకి కేంద్ర నిపుణుల కమిటీ ప్రాజెక్టును ఎలాంటి మదింపు చేయరాదని కోరారు. ఈ నెల 17న జరగనున్న కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల మదింపు కమిటీ సమావేశం అజెండాలో ఈ ప్రాజెక్టుకి టీఓఆర్ జారీ అంశాన్ని చేర్చారని తెలిపారు. 1980లో వచ్చిన గోదావరి నదీ వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమైన ఈ ప్రాజెక్టును చేపట్టే హక్కు ఏపీకి లేదన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఉత్తమ్ సోమవారం లేఖ రాశారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించడంతోపాటు గోదావరి జలాల వినియోగ స్వభావాన్ని సమూలంగా మార్చే ఇలాంటి భారీ ప్రాజెక్టు విషయంలో ఏకపక్షంగా ముందుకెళ్లే హక్కు ఏపీకి లేదంటూ ఇప్పటికే కేంద్ర పర్యావరణ, జలశక్తి శాఖలతోపాటు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), గోదావరి బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి లేఖలు రాశామని గుర్తు చేశారు. సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టుల మదింపు డైరెక్టరేట్‌కి గత నెల 23న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును ఏపీ సమర్పించగా, ఆ నివేదికను ఈ నెల 11న కృష్ణా బోర్డు, గోదావరి బోర్డు, గోదావరి పరీవాహక రాష్ట్రాలకి కేంద్రం పంపించి అభిప్రాయాలను కోరిందన్నారు.

ఏపీకి ఉల్లంఘనలు ఆనవాయితే..

వరద జలాల వినియోగం ముసుగులో పోలవరం ప్రాజెక్టు విస్తరణను చేపట్టి.. గోదావరి ట్రిబ్యునల్ తీర్పు నిబంధనలతోపాటు పోలవరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) జారీచేసిన అనుమతుల్లోని నిబంధనలను ఏకపక్షంగా మార్చేసేందుకే ఈ ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిందని ఉత్తమ్ ఆరోపించారు. కృష్ణా, గోదావరి పరీవాహకంలోని వివిధ ప్రాజెక్టుల విస్తరణ పనులను చేపట్టి ట్రిబ్యునళ్ల తీర్పులను ఏపీ ఉల్లంఘించడం ఆనవాయితీగా మారిందన్నారు.

పోలవరం అనుమతుల ఉల్లంఘనే..

పోలవరం ప్రాజెక్టుకి పర్యావరణ అనుమతులిస్తూ 2005లో కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించేలా ఏపీ చర్యలున్నట్టు ఉత్తమ్ దుయ్యబట్టారు. అనుమతులకి విరుద్ధంగా మార్పులకు ఏపీ పాల్పడగా, పనులను ఆపేయాలని ఆదేశిస్తూ 2011 ఫిబ్రవరి 8న కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశించిందని గుర్తు చేశారు. ప్రాజెక్టు పనుల్లో అలాంటి మార్పులకు పర్యావరణ అనుమతులు జారీ కాలేదన్నారు. ఈ ఉత్తర్వులను కొంత కాలం నిలుపుదల చేశారని, ఆ తర్వాత పలుమార్లు పొడిగించారని, చివరిసారిగా 2026 జూలై 2 వరకు పొడిగించారని గుర్తుచేశారు. తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఆందోళనలను పట్టించుకోకుండా 'స్టాప్ వర్క్ ఆర్డర్'అమలును ఇలా నిలుపుదల చేయడం సరికాదన్నారు. ప్రాజెక్టు విస్తరణకి సంబంధించి కొన్ని సాంకేతిక నివేదికలు అందుబాటులో ఉన్నా, మరిన్ని నివేదికలు అవసరమని 2022 సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ప్రాజెక్టు విస్తరణకి పర్యావరణ అనుమతుల విషయంలో సైతం ఇదే సూత్రం వర్తిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ, పర్యావరణ శాఖలు చొరవ తీసుకుని బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభావిత రాష్ట్రాలతో సమావేశం నిర్వహించాలని కోరారు.

హరీశ్ వ్యాఖ్యలతో చేటు: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఏపీ నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు మద్దతు ఇచ్చారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆ ప్రాజెక్టుపై హరీశ్ చేసిన వ్యాఖ్యలు ఆయన అజ్ఞానానికి నిదర్శనమని, రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉన్నాయని మండిపడ్డారు. హరీశ్ తనకు రాసిన లేఖకు స్పందిస్తూ సోమవారం ఉత్తమ్ ఓ ప్రకటన విడుదల చేశారు. గోదావరి జలాల నుంచి 200 టీఎంసీలను పోలవరం ద్వారా బనకచర్లకు ఏపీ తరలించుకోవచ్చని హరీశ్ పేర్కొనడాన్ని తప్పుబట్టారు. 200 టీఎంసీల వరద జలాలను తరలించుకోవడానికి ఏపీ ఈ ప్రాజెక్టును చేపట్టిందని, వాటిని తరలించుకునే హక్కు ఆ రాష్ట్రానికి లేదని స్పష్టం చేశారు. గోదావరి నుంచి ఏపీ 200 టీఎంసీలను వాడుకుంటే బదులుగా తెలంగాణ 112.5 టీఎంసీల కృష్ణా జలాలను కోరాలని హరీశ్ చేసిన మరో సూచన సైతం తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉందని ఉత్తమ్ తప్పుబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జలాల విషయంలో రాజీపడిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు గోదావరి జలాల విషయంలో రాష్ట్ర హక్కులను పణంగా పెట్టాలనుకోవడం దారుణమంటూ మండిపడ్డారు.

రెరా ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రెరా ట్రిబ్యునల్ చైర్మన్‌గా పనిచేసిన జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి లోకాయుక్తగా వెళ్లడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. కాగా, నియామకమైన నాటి నుంచి ఐదేళ్లు లేదా 67 ఏళ్ల వయసు వచ్చే వరకు జస్టిస్ సంతోష్‌రెడ్డి ట్రిబ్యునల్ చైర్మన్‌గా కొనసాగుతారు. సంతోష్‌రెడ్డి జగిత్యాల జిల్లాలోని జోగన్‌పల్లి గ్రామంలో జన్మించారు. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ నుంచి న్యాయ పట్టా పొందారు. ఉస్మానియా నుంచి మాస్టర్స్ పూర్తి చేశారు. 1985లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, కరీంనగర్‌లో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2023, జూన్ 20న న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందారు.

గ్రామ పంచాయతీలు సతమతం

- ఏడాదిన్నరగా స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం నిధులే దిక్కయ్యాయి
- తక్షణమే రిజర్వేషన్లు వెల్లడించి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలి
- ఫోన్‌ట్యాపింగ్, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాల్సిందే
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల అభివృద్ధికి కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులే దిక్కు అయ్యాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ నిధులతోనే పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పైసా నిధి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నరగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు లేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. పంచాయతీలు, వార్డుల వారీగా తక్షణమే రిజర్వేషన్లు ప్రకటించాలని, ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తుందని, ఈ ఎన్నికల్లో యువకులకే అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏడాదిన్నరగా ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతకానితనంగా భావిస్తున్నామని చెప్పారు.

సీబీఐ విచారణ జరపాల్సిందే..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కాంగ్రెస్ గతంలో సుద్దపూసలా మాట్లాడిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సీబీఐ దర్యాప్తును ఎందుకు కోరడం లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బనకచర్లపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఏపీ ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక ఇచ్చిందని చెప్పారు. గోదావరి పరీవాహక ప్రాంతాలకు అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. బనకచర్లతో తెలంగాణకు నష్టం జరుగుతుందనే వాదన ఉందని, ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని కేంద్రానికి లేఖ రాయాలని, ఏపీ ముఖ్యమంత్రితో చర్చలు జరిపేలా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కాళేశ్వరం విషయంలో బీజేపీ ఎప్పుడూ తన వైఖరిని మార్చలేదని, ఈ ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని మొదట్నుంచి కోరుతున్నామన్నారు. రాజాసింగ్‌కు రాజకీయంగా మంచి అనుభవం ఉందని, పార్టీ కోసం త్యాగాలు చేసిన వారిలో రాజాసింగ్ ఒకరని పేర్కొన్నారు.

సొంత జాగా లేని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- ఇందిరమ్మ దరఖాస్తుదారుల కోసం ప్రభుత్వం నిర్ణయం
- ఎక్కడి వారికి అక్కడి అసంపూర్తి ఇళ్ల కేటాయింపు
- కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే లబ్ధిదారులకే ఆర్థిక సాయం
- వారే ఇళ్లను పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సొంతజాగా లేని ఇందిరమ్మ దరఖాస్తుదారులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ఇళ్లను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొస్తే వారికే నిధులు కేటాయించడం, ఒకవేళ కాంట్రాక్టర్లు ముందుకురాని పక్షంలో లబ్ధిదారులకే ఆర్థిక సాయం అందించి వారే పూర్తి చేసుకునేలా వీలు కల్పించనుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అలాంటి అసంపూర్తి ఇళ్లు 69 వేలున్నాయి. ఇవన్నీ వివిధ స్థాయిలో ఆగిపోయాయి. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి భారీగా బకాయిలు పేరుకుపోవటం, ఆ యూనిట్ కాస్ట్ గిట్టుబాటు కాదని పేర్కొంటూ చాలా ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఇప్పుడు వాటిని పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులు కేటాయించి కాంట్రాక్టర్లతో చర్చించి పనులు పూర్తి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కడైనా కాంట్రాక్టర్లు ముందుకు రాకుంటే, వాటిని పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులను (గరిష్టంగా ఇంటికి రూ.ఐదు లక్షలు) లబ్ధిదారులకే కేటాయించి వారే ఇళ్లను పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. సోమవారం సచివాలయంలో దీనిపై గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో చర్చించారు.

అర్హులు 15 లక్షలు.. ఇళ్లు 69 వేలు

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన అర్హుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన వారిలో సొంత జాగా ఉన్నవారికి తొలుత ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. సొంత జాగా లేనివారిని ప్రస్తుతానికి పక్కన పెట్టారు. అలా సొంత జాగా లేని అర్హులైన వారికి ఇప్పుడు అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తారు. అలా సొంత జాగా లేని ఇందిరమ్మ దరఖాస్తుదారులు 15 లక్షల మంది ఉన్నారు. వారిలో 69 వేల అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఏఏ ప్రాంతాల్లో ఈ అసంపూర్తి ఇళ్లున్నాయో, ఆయా ప్రాంతాలకు చెందిన దరఖాస్తుదారుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. నిరుపేదలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ముందుగా కేటాయిస్తారు.

రూ.2 వేల కోట్లు కావాలి

ఈ అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు దాదాపు రూ.2వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఆ ఇళ్లు వివిధ స్థాయిల్లో ఆగిపోయాయి. కొన్నింటిని పూర్తి చేసేందుకు నాలుగున్నర లక్షలు కావాల్సి ఉండగా, కొన్ని రూ.లక్షతో పూర్తవుతాయి. ఇక ఆ అసంపూర్తి ఇళ్లున్న ప్రాంతాలతోపాటు, ఇప్పటికే ఇళ్లు పూర్తయిన కొన్ని ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పించలేదు. వాటిని పూర్తి చేసేందుకు కూడా నిధులు అవసరం. లబ్ధిదారులకు కేటాయించే ఆర్థిక సాయంతోపాటు, కాలనీల వద్ద మౌలిక వసతులు పూర్తి చేసేందుకు రూ.రెండు వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

రూ. 640 కోట్లు వెచ్చించాం : పొంగులేటి



తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించడంతోపాటు అసంపూర్తిగా ఉన్న 1.61 లక్షల ఇళ్లను పూర్తి చేసేందుకు రూ.640 కోట్లు వెచ్చించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలా పూర్తి చేసిన 98 వేల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించామన్నారు. ఇంకా 69 వేల ఇళ్లు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ఇందుకోసం లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించాలని, ఈ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటి వరకు 2.65 లక్షలమంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశామని, ఇప్పటివరకు 71 వేల ఇళ్ల పనులు మొదలయ్యాయని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని విడుదల

షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన మంగళగిరి కోర్టు



సాక్షిప్రతినిధి, గుంటూరు: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు గుంటూరు జిల్లా జైలు నుంచి సోమవారం సాయంత్రం విడుదలయ్యారు. ఈ నెల 6వ తేదీన 'సాక్షి' చానెల్‌లో నిర్వహించిన లైవ్‌షోలో విశ్లేషకుడు కృష్ణంరాజు అమరావతి రాజధానిపై కొన్ని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వాటిపై అమరావతి జేఏసీ నేతలు, టీడీపీ నాయకులు రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. 8వ తేదీన కొమ్మినేని శ్రీనివాసరావుపైనా గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. 9న ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్‌లోని కొమ్మినేని నివాసానికి వెళ్లి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గుంటూరులోని నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. 10వ తేదీన కొమ్మినేనిని మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించగా, గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. దీనిపై కొమ్మినేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు... విచారణ చేపట్టి ఈ నెల 13న కొమ్మినేనికి బెయిల్ మంజూరు చేసింది. కాగా, శని, ఆదివారం సెలవు దినాలు కావడంతో విడుదల వాయిదా పడింది. సోమవారం మంగళగిరి కోర్టు కొన్ని షరతులతో కొమ్మినేనికి బెయిల్ ఇచ్చింది. పోలీసుల విచారణకు సహకరించాలని, ప్రతి రెండు, నాలుగో శనివారాలు తుళ్లూరు స్టేషన్‌లో సంతకం చేయాలని, దేశం దాటి వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని, శాశ్వత చిరునామాకు సంబంధించి ఆధారాలు ఇవ్వాలని, ఇల్లు మారితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. లైవ్ షోలో పాల్గొన్నా వ్యాఖ్యల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంది. దీంతో సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో కొమ్మినేనిని గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదల చేశారు. కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిందని, దీనిపై న్యాయవాదితో చర్చించిన తర్వాతే మీడియా ముందుకు వస్తానని కొమ్మినేని తెలిపారు. ఆయనను గుంటూరు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు నగర అధ్యక్షురాలు నూరీ ఫాతిమా, తాడికొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డైమండ్‌బాబు, మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు పొలూరి వెంకటరెడ్డి, మాధవి, రామకృష్ణారెడ్డి, సీడీ భగవాన్, బాజీ గంగాధర్ ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


రాయికల్‌లోని చెన్నకేశవనాథ ఆలయం


ఆలయంలోని పంచముఖ లింగం

పంచముఖుడు.. ఈ చెన్నకేశవుడు

కాకతీయుల కళావైభవానికి చిహ్నం • దేశంలోనే రెండవ పంచముఖ లింగం

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని కాకతీయుల కళావైభవానికి అపురూప చిహ్నంగా వెలుగొందుతోంది చెన్నకేశవనాథ దేవాలయం. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఈ అలయం నాడు రాయికంటి పేరుకలిగిన నేటి రాయికల్‌కు చెన్నకేశవ నాథ ఆలయం చరిత్రతో ముడిపడి ఉంది. రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం దేశంలోనే రెండవ పంచముఖ లింగంగా పేరుగాంచింది. కాశీ లో మాత్రమే ఉన్నటువంటి పంచముఖ లింగం ఈ దేవాలయంలో ఉంది. ఈ ఆలయం నుంచి బయటపడ్డ శిలాశాసనాలు, ప్రాచీన అవశేషాలు, దేవనాగరిలిపులతో లభించిన శాసనాల వల్ల రావికంటి (రాయికల్) చరిత్ర తెలుస్తుంది. ప్రభాకర్‌రావుపేట, గోవిందురాజుపేట, ఒద్దులాపురం, పద్మపురం, నందిపేట, రాయికంటి (రాయికల్), కొండాపూర్ అనే ఏడు గ్రామాలు కలిపి రావికంటిగా ఏర్పడినట్లు తెలుస్తుంది. మరోశాసనం ద్వారా క్రీ.శ. 1305 ఆగస్టు 15న రాయికల్ ఏర్పడినట్లు తెలుపుతుంది.

దేవాలయ చరిత్ర: జైన మతాభిమానులైన వేములవాడ చాళుక్యులు దానంగా గ్రహించినటువంటి భూమిలో 700 సంవత్సరాల క్రితం ఈ దేవాలయం నిర్మించినట్లు మరొక శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయంలో పంచముఖ లింగం విశిష్టమైంది. ఇలాంటిది కాశీలో మాత్రమే ఉంది. జైన మతస్తులైన ఆర్యవైశ్య కులానికి చెందిన లకుమాదేవి అనే ఇల్లాలు తాను తీరిగ్గా కూర్చుని తన బిడ్డకు పాలు ఇస్తుండగా ఆమె మామ ఇంట్లోకి రావడాన్ని ఆమె గ్రహించలేదు. తనకు కనీస గౌరవం ఇవ్వలేదని, తాను వస్తుంటే లేచి నిలబడలేదని ఆగ్రహించిన ఆమె మామ 'పంపున చెరువు మిట్టన గుళ్లు' నిర్మించిన మహాసాధ్వేలా కూర్చున్నావని ఆగ్రహించాడు. ఈ అవమానాన్ని తట్టుకోలేని లకుమాదేవి తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారి ధనంతో చెరువును, దేవాలయం నిర్మించినట్లు ఇక్కడ కథ ప్రచారంలో ఉంది. నేడు లకుమాదేవి చెరువు కింద 1,500 ఎకరాల భూమి సాగులో ఉంది. లకుమాదేవి తన ప్రతిజ్ఞ నెరవేరిన తర్వాత తాను నిర్మించిన చెరువులోనే మునిగి ఒక పెద్దగుండంలో కలిసిపోయిందనే కథ ప్రచారంలో ఉంది. ఈ ఆలయంలో నమస్కరిస్తున్న భంగిమలో చెక్కిన స్త్రీమూర్తి విగ్రహం ఈ దేవాలయాన్ని నిర్మించిన లకుమాదేవిదే అయి ఉండవచ్చునని భావిస్తున్నారు.

ఆలయంలో భక్తుల తాకిడి

ఈ ఆలయంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు చేయించుకోవడం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు.

ఆలయ చరిత్ర తెలుసుకొని వస్తున్నారు



రాయికల్ చెన్నకేశవనాథ ఆలయ చరిత్రను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని పర్యాటకులు వచ్చి ఆలయాన్ని సందర్శిస్తున్నారు. ముఖ్యంగా ఆలయ చరిత్రపై యూట్యూబ్‌ల ద్వారా వీడియోలు చిత్రీకరిస్తూ పబ్లిసిటీ చేస్తున్నారు. మా ఆలయ చరిత్ర ఎంతో గొప్పది.

– ఏనుగు మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్

పర్యాటక శాఖ మరింతగా దృష్టి సాధించాలి



రాష్ట్ర పర్యాటకశాఖ చెన్నకేశవనాథ ఆలయ అభివృద్ధిపై దృష్టి సారిస్తే మరింతగా అభివద్ధి చెందుతుంది. దేశంలోనే రెండో పంచముఖ లింగం ఈ ఆలయంలో ఉంది. కాకతీయుల కళావైభవానికి ఈ ఆలయం ప్రతిరూపంగా భాసిల్లుతోంది. ఇటీవల కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశారు. ప్రభుత్వం స్పందించి మరిన్ని నిధులు మంజూరు చేయాలి.

– మచ్చ శ్రీధర్, ఆలయ కమిటీ చైర్మన్

ఆలయంలో ప్రత్యేక పూజలు



రాయికల్ చెన్నకేశవనాథ ఆలయానికి భక్తుల తాకిడి ప్రతి సోమవారం ఎక్కువగా ఉంటుంది. ఉదయం నుంచే అభిషేకాలతో పాటు వీఐపీల దర్శనం ఉండడంతో ప్రత్యేక పూజలు చేస్తున్నాం. వివిధ రాష్ట్రాల నుంచి వీవీఐపీలు ఆలయానికి వస్తున్నారు. అభిషేకాలు చేయించుకుంటున్నారు.

– సతీష్‌శర్మ, అర్చకుడు



వీహెచ్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీహెచ్‌తో పాటు సోమవారం పుట్టినరోజు జరుపుకున్న ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించిన సీఎం, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు వీహెచ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఆయన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ మంత్రి దానం నాగేందర్, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆమేర్‌అలీ ఖాన్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిలతో పాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నేతలు, వీహెచ్ అభిమానులు పెద్దఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ వాసులకు అండగా ఉండండి

అమెరికా న్యాయ నిపుణులకు చిన్నారెడ్డి సూచన

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలతో తెలంగాణ విద్యార్థులు, ఎన్ఆర్ఐలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఇమ్మిగ్రేషన్, వీసాలు, ఉద్యోగ భద్రత, కార్పొరేట్ లీగల్ సపోర్టు అందించాలని తెలుగు అమెరికా న్యాయ నిపుణులకు రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి సూచించారు. సోమవారం ప్రజా భవన్‌లో టీపీసీసీ ప్రవాసీ విభాగం కన్వీనర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా న్యాయ శాఖ అటార్నీలు జోషువా డాల్రైంపుల్, యహ్వ తాబిట్, సోమిరెడ్డి సంతోష్‌రెడ్డి, విజయ్ ఎల్లారెడ్డితో కూడిన న్యాయ నిపుణుల బృందం చిన్నారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ, అమెరికాలో నివాసం ఉంటున్న వారితోపాటు ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన విద్యార్థులు కూడా తీవ్ర భయాందోళనలతో ఉన్నారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో న్యాయ సేవలు అందించే అమెరికా సంస్థ తెలంగాణలో తమ సేవలను ప్రారంభించడం రాష్ట్ర వాసులకు భరోసానిస్తుందని వెల్లడించారు. ప్రవాస భారతీయుల వీసా సమస్యలపై, అమెరికాలో వ్యాపారం చేయదలచిన సంస్థలకు న్యాయ సహాయం, లిటిగేషన్ సేవలు, విద్యార్థులకు యూఎస్ శిక్షణ అవకాశాలు హైదరాబాద్ నుంచే నిర్వహించేందుకు సోమిరెడ్డి లా గ్రూప్ సీఈవో సంతోష్‌రెడ్డి ముందుకు రావడం హర్షణీయమని చిన్నారెడ్డి కొనియాడారు.

రిజర్వేషన్ల అమలు తర్వాతే.. పంచాయతీ నోటిఫికేషన్ ఇవ్వాలి: జాజుల శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, రిజర్వేషన్ల అమలు కోసం సీఎం నేతృత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమవారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్ బయట ఆయన బీసీ మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులుతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే వారం రోజుల్లో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు కాల్చుకోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే బీసీ రిజర్వేషన్లపై బీసీ సంఘాలు, మేధావులు, న్యాయనిపుణులు, అఖిలపక్ష పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై నేడు హైదరాబాద్‌లో మేధావులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్



సాక్షి, హైదరాబాద్: చార్మినార్ జోన్ డీఐజీగా ఇటీవల నియమితులైన ఐపీఎస్ అధికారి తఫ్సీర్ ఇక్బాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తఫ్సీర్ ఇక్బాల్ డీజీపీ జితేందర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై పట్టింపు లేదు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన గురించి పట్టింపు లేదని, విపక్ష నేతలపై కక్ష సాధింపుల పైనే దృష్టి పెట్టిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఫార్ములా– ఈ రేసింగ్‌లో ఎలాంటి అవినీతి జరగకున్నా కేటీఆర్‌ను విచారణకు పిలిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో అవినీతి జరగలేదని, పారదర్శకంగానే డబ్బు బదిలీ ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు.

ఫార్ములా –ఈ రేసింగ్‌తో అమరరాజా బ్యాటరీ సంస్థతో పాటు ఏడెనిమిది కంపెనీల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పెరగడానికి ఈ రేసింగ్ తోడ్పడిందని, దేశంలో ఎందరో ప్రయత్నం చేసినా ఫార్ములా – ఈ రేసింగ్ ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. పెట్టుబడులు తెచ్చిన కేటీఆర్ పైనే కేసు పెడతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబాన్ని వేధించడానికి పాలనను పూర్తిగా పక్కన పెట్టిందని ఆయన విమర్శించారు.

గుండెల్లో పెట్టుకుని సాదుకుంటాం

కోడెలు అందుకున్న రైతుల సంతోషం

వేములవాడలో ఉచితంగా జోడు కోడెలు పంపిణీ

32 మంది రైతుల కుటుంబాలకు చేరిన 64 రాజన్న కోడెలు

సంబరంగా సొంతూళ్లకు.. రైతుల ముఖాల్లో చిరునవ్వులు


తమకు అందజేసిన కోడెలను తీసుకెళ్తున్న రైతులు

వేములవాడ: వేములవాడ రాజన్న గోశాలలో రైతులకు ఉచితంగా జోడు కోడెల పంపిణీ సంతోషాల మధ్య సాగింది. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటిదఫాలో 64 కోడెలు 32 మంది రైతులకు పంపిణీ చేశారు. రెండు, మూడో దఫాలోనూ దాదాపు 150 కోడెలను అధికారులు పంపిణీ చేశారు. కోడెలు అందుకున్న రైతులు కుటుంబ సభ్యులతో హర్షాతిరేకాలతో గోశాల నుంచి స్వగ్రామాలకు వాటిని తీసుకెళ్లారు. రైతులకు ప్రభుత్వం తరఫున ఆదరణ లభించడంతో గతంలో దరఖాస్తు చేసుకున్న రైతుల కుటుంబాల్లో సంతోషాలు కనిపించాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పశుసంవర్ధకశాఖ అధికారులు, గోశాల ఫెడరేషన్ ప్రతినిధులు, ఆలయ అధికారులు, గ్రామాల పెద్దలు, రైతులు హాజరయ్యారు. ఇది మా జీవనోపాధికి ఒక పెద్ద అండగా నిలుస్తుందని, నేల దున్నేందుకు, పశుపాలన కోసం ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు. రైతులు ఆధారపడే వ్యవసాయం, పశుపాలనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం, ఈ కోడెల పంపిణీ ద్వారా రైతుల ఆదాయం పెరిగేలా చూస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. వీటిని పక్కదారి పట్టకుండా చూసుకోవాలని సూచించారు. గుండెల్లో పెట్టుకుని సాదుకుంటామని చెబుతున్న రైతుల అభిప్రాయం వారి మాటల్లోనే...

రాజన్న ప్రసాదమిది.... గుండెల్లో పెట్టుకుని సాదుకుంటా



మేము గతంలో రాజన్న కోడెల కోసం దరఖాస్తు చేసుకున్నాం. మీరొచ్చి కోడెలు తీసుకెళ్లండి అని ఫోన్ చేయడంతో మాకు ఎంతో సంతోషం కలిగింది. ఇది రాజన్న ప్రసాదంగా భావించి గుండెల్లో పెట్టుకుని సాదుకుంటాం. రాజన్న దయతో మా వ్యవసాయం బాగుండాలని మొక్కుకుంటాం. రాజన్నకు మొక్కులు కూడా చెల్లించుకుంటాం.

– పద్మ, మహిళా రైతు, వేములవాడ

ఇంటిల్లిపాదీ సంబరపడ్డాం..



రాజన్న కోడెలను రైతులకు ఇస్తున్నారని తెలిసి గతంలో దరఖాస్తు చేసుకున్నాను. నిన్న నాకు అధికారులు ఫోన్ చేసి జోడు కోడెలు తీసుకెళ్లాలని చెప్పడంతో మేమంతా కుటుంబ సభ్యులతో కలసి వచ్చి రెండు కోడెలను తీసుకెళుతున్నాం. రాజన్న కోడెలు మా ఇంటికి రావడం రాజన్న వచ్చినట్లే భావిస్తున్నాం. మా ఇంటిల్లిపాదీ సంతోషంగా ఉన్నాం.

– కె.తిరుపతినాయక్, దేవునితండా, సనుగుల, చందుర్తి మండలం

ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసు పెంచొద్దు

సీఎంకు అగ్రి, హార్టీ, వెటర్నరీ స్కాలర్ జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ యూనివర్సిటీలో విధులు నిర్వర్తించే ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసు పెంచొద్దని, వెంటనే ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని అగ్రి, హార్టి, వెటర్నరీ స్కాలర్స్ జేఏసీ కోరింది. సోమవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి.. జేఏసీ ప్రతినిధులు కాటం శ్రీధర్, కవిరాజు, మునీర్ వినతి పత్రం అందజేశారు. ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసు పెంచడంవల్ల విద్యారంగంలోకి వచ్చే అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. విద్యాప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్న ఈ సమయంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని, దానికి అనుగుణంగా నియామకాలు చేపట్టాలని కోరారు.

దొంగనని తెలిసి కూడా హీరోలా పోజులు కొడుతున్నారు

కేటీఆర్‌పై అద్దంకి దయాకర్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇంగితజ్ఞానం లేదని, ఆయన చర్యలతో తెలంగాణ పరువు తీస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. దొంగనని తెలిసి కూడా హీరోలా పోజులు కొడుతున్నాడని, ఆయన మాటలు వింటుంటేనే భయపడుతున్నాడని అర్థమవుతోందని అన్నారు. సోమవారం అద్దంకి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేటీఆర్ భాష చూసి తెలంగాణ సమాజం ముక్కున వేలేసుకుంటోందని, ఇలాంటోడు మంత్రిగా పనిచేశాడా అని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో కేటీఆర్ ఓ అపశృతి అని, సిగ్గుపోయే దాకా సిగమూగినట్టుగా ఆయన పరిస్థితి ఉందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎప్పుడు జైలుకెళ్లాడని అద్దంకి ప్రశ్నించారు. 'కేటీఆర్.. ఇప్పుడే నీ ఆట మొదలైంది. నీ పిచ్చి ప్రేలాపనలు మానుకోకపోతే తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం'అని హెచ్చరించారు.

మరిన్ని అంతర్జాతీయ స్థాయి సంస్థలు రావాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: న్యాయ సేవలు అందించేందుకు మరిన్ని లా చాంబర్‌లు హైదరాబాద్‌లో అడుగుపెట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమిరెడ్డి లా గ్రూప్ కోకాపేట్‌లోని నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో లీగల్ సలహాలు, సూచనలు ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి రావాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి లా గ్రూప్ వ్యవస్థాపకుడు సోమిరెడ్డి సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తగ్గుతున్నారు

పలు జిల్లాల్లో మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లలో తగ్గిపోయిన విద్యార్థులు

జిల్లా	2022-23	2024-25	తగ్గుదల
నల్లగొండ	87,769	61,073	26,696
సూర్యాపేట	78,505	66,260	12,245
యాదాద్రి	24,634	17,755	6,879
మంచిర్యాల	68,242	59,756	8,486
కరీంనగర్	46,415	39,219	7,196
రాజన్న సిరిసిల్ల	50,285	44,674	5,611
జగిత్యాల	77,160	66,322	10,838
పెద్దపల్లి	36,452	30,458	5,994
ప్రాథమిక పాఠశాలల్లో...			
మహబూబ్‌నగర్	19,261	16,745	2,516
వనపర్తి	41,549	33,747	7,802
గద్వాల	75,067	70,786	4,281
నారాయణపేట	22,810	18,111	4,699
నాగర్‌కర్నూల్	35,770	24,242	11,528
హనుమకొండ	18,055	11,745	6,310
వరంగల్	20,568	13,522	7,046
ఆసిఫాబాద్	2,762	2,502	260

పలు జిల్లాల్లో మూడేళ్లలో ప్రైవేటు స్కూళ్లలో పెరిగిన విద్యార్థులు..

జిల్లా	2022-23	2024-25	పెరుగుదల
నల్లగొండ	1,03,027	12,5572	22,545
సూర్యాపేట	60,134	74,690	14,556
యాదాద్రి	24,500	27,685	3,185
మంచిర్యాల	59,173	65,656	6,483
కరీంనగర్	31,303	36,417	5,114
రాజన్న సిరిసిల్ల	23,780	31,338	7,558
జగిత్యాల	67,878	86,446	18,568
పెద్దపల్లి	62,858	66,584	3,726
ప్రాథమిక పాఠశాలల్లో మూడేళ్లలో పరిస్థితి..			
మహబూబ్‌నగర్	32,122	35,258	3,136
వనపర్తి	27,935	32,623	4,688
గద్వాల	40,091	46,834	6,743
నారాయణపేట	16,367	25,187	8,820
నాగర్‌కర్నూల్	24,138	26,481	2,343
హనుమకొండ	41,867	56,668	14,801
వరంగల్	42,408	51,486	9,078
ఆసిఫాబాద్	3,200	3,982	782

గ్రామీణాభివృద్ధిపై ఎన్‌ఐఆర్‌డీలో వారం పాటు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: గ్రామీణాభివృద్ధిలో సరికొత్త ఆవిష్కరణల కోసం రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్‌ఐఆర్‌డీ)లో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వారం పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాల్లో సెంటర్ ఆన్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఇన్ ఆసియా అండ్ ది పసిఫిక్ (సీఐఆర్‌డీఏపీ) సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నెల 22వరకు జరిగే శిక్షణ కార్యక్రమాలను సీఐఆర్‌డీఏపీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి వ్యూహాలకు సంబంధించిన చర్చలను విస్తృతం చేయాలని, వాటిని ప్రోత్సహించడంతో పాటు నిపుణుల అనుభవాలను పంచుకోవాలన్నారు. ఎన్‌ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో గ్రూపుల వారీగా ఉత్తీర్ణుల వివరాలు

గ్రూపులవారీగా ఉత్తీర్ణులు ఇలా....

గ్రూపు	మొదటి సంవత్సరం			రెండో సంవత్సరం		
	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం
ఎంపీసీ	1,34,326	1,05,123	78.26	59,684	35,248	59.06
ఎంఈసీ	7,768	4,458	57.39	5,978	2,966	49.62
బైపీసీ	53,266	37,923	71.2	23,175	12,527	54.05
సీఈసీ	49,156	18,543	37.72	42,696	16,232	38.02
హెచ్ఈసీ	4,762	1,984	41.66	3,479	1,662	47.77
ఇతరులు	80	48	60	95	30	31.58
మొత్తం	2,49,358	1,68,079	67.4	1,35,107	68,665	50.82

మూడేళ్ల ఫలితాలు ఇలా... (జనరల్)

సంవత్సరం	మొదటి సంవత్సరం			రెండో సంవత్సరం		
	రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం	రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
2025	2,49,358	1,68,079	67.4	1,35,107	68,665	50.82
2024	2,54,498	1,62,520	63.86	1,38,477	60,615	43.77
2023	2,52,055	1,57,741	62.58	1,29,536	59,669	46.06


రింగ్‌టైల్డ్ లెమూర్స్

అరుదైన ప్రాణులకు ఊపిరి

అంతరించిపోతున్న జాతుల పునరుత్పత్తి

జూలో 46 ప్రాణులకు జన్మనిచ్చిన వన్యప్రాణులు

ఆరిలోవ: వాతావరణ కాలుష్యం, వేటగాళ్ల ఉచ్చులు, క్రూర మృగాల దాడి, మారుతున్న పర్యావరణ పరిస్థితుల కారణంగా ఎన్నో వన్యప్రాణి జాతులు అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. ఒకప్పుడు సజీవంగా ఉన్న జాతులు నేటి తరానికి టీవీల్లో, పుస్తకాల్లో మాత్రమే కనిపించే పరిస్థితి నెలకొంది. వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతున్న ఈ తరుణంలో విశాఖ నగరంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కు ఒక ఆశాకిరణంగా నిలుస్తోంది. అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణులకు పునరుత్పత్తి కేంద్రంగా మారి, వాటి వంశాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడి సంరక్షకుల కృషితో గత ఎనిమిది నెలల్లోనే 12 అంతరించిపోతున్న జాతులకు చెందిన 46 పిల్లలు ఊపిరిపోసుకున్నాయి. వన్యప్రాణి సంరక్షణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయి.

చుక్కల జింక పిల్ల



అడవి కుక్క పిల్లలు




తల్లితో నీల్‌గై పిల్ల


తల్లి పాలు తాగుతున్న బైసన్ దూడ


రాయిపై కూర్చున్న వోల్ఫ్


తల్లి పాలు తాగుతున్న కృష్ణ జింక పిల్ల


తల్లితో కనుజు పిల్ల

అరుదైన జీవులకు అభయం

తల్లి పాలు తాగుతున్న బార్కింగ్ డీర్ పిల్ల



విశాఖ జూ పార్కు ఇప్పుడు కేవలం జంతు ప్రదర్శనశాల మాత్రమే కాదు.. అంతరించిపోతున్న జీవజాతులకు ఒక సురక్షితమైన ఆవాసం, పునరుత్పత్తి కేంద్రం. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం షెడ్యూల్-1 జాబితాలోని అనేక జీవులు ఇక్కడ విజయవంతంగా తమ సంతతిని పెంచుకుంటున్నాయి. జింక పిల్లలు, అడవి దున్నలు, అడవి కుక్కల పిల్లలు, నీల్‌గై, రెడ్‌నెక్డ్ వాలబీ, బెంగాల్ ఫాక్స్, ఇండియన్ గ్రే వోల్ఫ్, రింగ్‌టైల్డ్ లెమూర్స్ వంటి జాతులకు చెందిన చిట్టి ప్రాణులు తమ ఎన్‌క్లోజర్లలో తల్లుల వెంట ఉత్సాహంగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. ఈ అద్భుతమైన దృశ్యాలు జూకి వచ్చే వారికి కనువిందు చేయడమే కాకుండా, అంతరించిపోతున్న జాతులను పరిరక్షించడం ఎంత అవసరమో తెలియజేస్తున్నాయి. వెటర్నరీ వైద్యులు, యానిమల్ కీపర్ల నిరంతర పర్యవేక్షణలో ఈ ఘనత సాధ్యమైంది.

8 నెలలు.. 46 బుల్లి ప్రాణులు

గడిచిన ఎనిమిది నెలల కాలంలో ఇందిరా గాంధీ జూ పార్కులో 12 రకాల వన్యప్రాణులకు 46 పిల్లలు పుట్టాయి. ఇందులో అడవి కుక్కలు-14, కృష్ణ జింక (రాష్ట్ర జంతువు) -9, చుక్కల జింక-7, కనుజు-5, నీల్ గై-3, బార్కింగ్ డీర్-2, మౌస్ డీర్-1, బెంగాల్ ఫాక్స్-1, ఇండియన్ గ్రే వోల్ఫ్-1, అడవి దున్న (బైసన్)-1, రెడ్-నెక్డ్ వాలబీ-1, రింగ్‌టైల్డ్ లెమూర్-1 ఉన్నాయి.

అంతరించిపోతున్న జాతుల విశేషాలివి..

ఈ జూలో పునరుత్పత్తి అవుతున్న కొన్ని ముఖ్యమైన అంతరించిపోతున్న జాతులు, వాటి ప్రత్యేకతలు ఇప్పుడు తెలుసుకుందాం..

- **అడవి కుక్కలు(ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్):** ఇవి వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని షెడ్యూల్-1 కిందకు వస్తాయి. ఇందిరా గాంధీ జూ పార్కులో వీటి పునరుత్పత్తి కేంద్రం ఉంది. వీటి ఎత్తు సుమారు 50 సెం.మీ., శరీరం పొడవు 90 సెం.మీ., తోక పొడవు 40-45 సెం.మీ. ఉంటుంది.
- **కృష్ణ జింక(బ్లాక్‌బక్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంతువుగా గుర్తింపు పొందిన ఈ జింకలు, తమ మెలితిరిగిన కొమ్ములతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కృష్ణ జింక షెడ్యూల్-1 జాబితాలో ఉంది
- **మూషిక జింక(మౌస్ డీర్):** షెడ్యూల్-1 జాబితాలోని ఈ జింక శరీరం పొడవు 50-60 సెం.మీ., బరువు 3-4 కిలోలు ఉంటుంది. ప్రపంచంలోని అతి చిన్న జింక జాతులలో ఇది ఒకటి. చూడటానికి చిన్నగా, సున్నితంగా ఉండే ఈ జీవి కూడా షెడ్యూల్-1 జాబితాలో ఉంది.
- **కనుజు :** ఇది కూడా షెడ్యూల్-1 జాబితాలో ఉంది. మగ కనుజులకు చెట్ల కొమ్మల మాదిరిగా ఉండే కొమ్ములు 3.5 అడుగుల పొడవు వరకు పెరుగుతాయి.
- **నీలి ఎద్దు(నీల్‌గై):** ఆసియా జింక జాతులలో అతి పెద్దదైన నీల్‌గై షెడ్యూల్-2 జాబితాలో ఉంది. దీని గొంతు భాగం తెల్లగా ఉంటుంది. మగ నీల్‌గైకి 13 సెం.మీ. జుట్టు ఉంటుంది. ఆడవి 200 కిలోలు, మగవి 250 కిలోల వరకు బరువు వరకు పెరుగుతాయి.
- **రెడ్ నెక్డ్ వాలబీ:** ఈ జాతి జీవుల పునరుత్పత్తి ఎంతో ఆసక్తికరం. రెడ్‌నెక్డ్ వాలబీ గర్భం దాల్చిన 30 రోజుల్లో పిల్లకు జన్మిస్తుంది. తర్వాత ఆ పిల్ల తల్లి పొట్ట కింద సంచిలో సుమారు 7 నెలల పాటు పెరిగి, తల్లి పాలు తాగుతుంది. 12 నెలల తర్వాత స్వతంత్రంగా జీవించడం మొదలుపెడుతుంది.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



జూ పార్కులో వన్య ప్రాణుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇటీవల పునరుత్పత్తి అయిన పలు రకాల జాతుల పిల్లలను ఇక్కడ సంరక్షకులు, జూ వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, యానిమల్ కీపర్లు ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్నారు. అంతరించిపోతున్న జాతుల సంతతి జూలో గణనీయంగా పెరుగుతోంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం వీటికి ఎలాంటి హాని కలిగించినా చట్టరీత్యా నేరమవుతుంది.

– జి.మంగమ్మ, జూ క్యూరేటర్

చంద్రబాబును సపోర్ట్ చేయడం లేదనే కొమ్మినేని అరెస్ట్

మాజీ మంత్రి అంబటి రాంబాబు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ చాలా దురదృష్టకరమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. జిల్లా జైలు నుంచి సోమవారం రాత్రి విడుదలైన సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అంబటి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఒక మాట మాట్లాడాలన్నా పదిసార్లు ఆలోచించే వ్యక్తి కొమ్మినేని అని పేర్కొన్నారు. చంద్రబాబుకు సపోర్ట్ చేయడం లేదనే కొమ్మినేనిని అరెస్ట్ చేయించారన్నారు. చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని ఎప్పటి నుంచో ఆయనపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. ఎన్టీవీ నుంచి ఆయనను తొలగించేందుకు ఎంతో ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. చివరకు చంద్రబాబు, లోకేశ్ కలిసి కొమ్మినేనిపై తప్పుడు కేసులు పెట్టించారన్నారు. పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడు సైతం అతనిపై అమరావతిలో మహిళలతో దాడులు చేయించడం దారుణమన్నారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి : ఏపీఎన్‌ఆర్టీఎస్

ఇరాన్, ఇజ్రాయెల్‌లో ప్రవాసాంధ్రులకు సూచన

సాక్షి, అమరావతి: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో ఆ దేశాల్లో ఉంటున్న ప్రవాసాంధ్రులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా ఏపీ ఎన్‌ఆర్టీఎస్ కోరింది. భారత విదేశాంగ శాఖ జారీ చేసిన అడ్వైజరీ నోటీసులను పాటిస్తూ బహిరంగ ప్రదేశాల్లో తిరగవద్దని సూచించింది. సహాయం అవసరమైన వారు ఏపీఎన్ఆర్టీఎస్, భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా కోరింది. కాగా అడ్వైజరీ నోటీసు జారీ చేసి రెండు రోజులైనా ఇంత వరకు ఏ ఒక్కరూ సాయం కోరుతూ సంప్రదించలేదని, ఏపీఎన్ఆర్టీఎస్ సంస్థ సీఈవో పి.హేమలతా రాణి తెలిపారు.

కనపర్తిపై సుమోటోగా కేసు నమోదు చేయాలి

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి న్యాయవాది గౌతం లేఖ
- ఏబీఎన్‌పైనా చర్యలు తీసుకోవాలని వినతి

అవనిగడ్డ: న్యాయమూర్తులు, కోర్టులను కించపరిచే విధంగా మాట్లాడిన టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఏబీఎన్ చానల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన యువ న్యాయవాది బడే గౌతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీనివాసరావు ఈ నెల ఏడో తేదీన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. పదవీ విరమణ చేసిన తరువాత వచ్చే పదవుల కోసం ఆశపడి కొంత మంది న్యాయమూర్తులు తీర్పులిస్తున్నట్లు వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. న్యాయమూర్తులు, కోర్టులను అవమానపరిచే విధంగా మాట్లాడిన కనపర్తిపై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.





నగరాల్లో కొబ్బరి, అరటి, చెరకు వంటి ఉత్పత్తులతో తయారు చేసిన స్వాగత ద్వారాలు

నయనానందం

- కొబ్బరాకుతో సెట్టింగ్‌లు
- పెళ్లి మండపాల డెకరేషన్‌లో ప్రాధాన్యం
- విభిన్న ఆకృతులతో ఆకట్టుకుంటున్న వైనం
- వాటితో పాటు పలు వ్యవసాయ ఉత్పత్తులకూ స్థానం

సాక్షి, అమలాపురం: ''కుక్కపిల్ల.. అగ్గిపుల్ల.. సబ్బు బిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం'' అన్నట్టు కొబ్బరాకు.. కొబ్బరి కాయలు.. ధాన్యం కుచ్చులు.. చెరకు గెడలు.. అరటి చెట్లు.. అరటి ఆకులు.. పోక చెట్లు... ఆర్కిడ్‌లు.. ఇలా చెప్పుకొంటూ పోతే పెళ్లి మండపం... పెళ్లి స్వాగత ద్వారం ముస్తాబు చేయడానికి ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తి అయినా కాదేదీ అనర్హం అంటున్నారు మండపాల తయారీదారులు. కొబ్బరాకులతో పెళ్లి మండపాల ముస్తాబు గోదావరి జిల్లాల్లో పెద్ద విషయం కాదు. అదిప్పుడు గోదావరి జిల్లాలు దాటుతోంది. ఇప్పుడు కొబ్బరాకుల ముస్తాబు కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక హంగులు అద్దుకుంటోంది. పెళ్లిళ్ల డెకరేషన్‌లో పెరుగుతున్న హంగూ ఆర్భాటాల్లో సంప్రదాయానికి సైతం పెద్దపీట వేస్తున్నారు.

కొబ్బరాకులతో పెళ్లి పందిళ్లు వేయడం..

పందిళ్లకు వేసే రాటలను కొబ్బరాకులతో ముస్తాబు చేయడం గతం నుంచీ ఉన్నదే. పెళ్లిళ్లే కాదు.. గ్రామాల్లో జరిగే ఇతర శుభ కార్యక్రమాల్లోను, ఆలయాల వద్ద జరిగే కల్యాణాలు, యాగాలు వంటి వాటిల్లోను కొబ్బరాకు ముస్తాబు సర్వసాధారణమైంది. ఇప్పుడు అదే కొబ్బరాకుతో కొత్త కొత్త కళాకృతులు తయారు చేయడం ట్రెండ్‌గా మారింది.



పెద్ద పెద్ద పెళ్లి మండపాల్లో కొబ్బరి ఆకులతో ముస్తాబు చేసేవారి సంఖ్య పెరుగుతోంది. పెళ్లి మండపాలు ఒక్కటే కాకుండా పెళ్లింటి వద్ద, కల్యాణ మండపాల వద్ద ఏర్పాటు చేసే స్వాగత ద్వారాలను సైతం ఈ ఆకులతో అందంగా తయారు చేస్తున్నారు. ఇప్పుడు వీటికి అదనంగా ఇతర వ్యవసాయ ఉత్పత్తులను జోడిస్తున్నారు. కొబ్బరి ఆకుల స్వాగత స్తంభాలను నెలకొల్పడంతో పాటు వాటికి చిన్న అరటి చెట్లను తగిలిస్తున్నారు. వీటికి అదనంగా కొబ్బరి కాయలు వేలాడదీస్తున్నారు. అక్కడక్కడ ధాన్యం కుచ్చులూ ఏర్పాటు చేస్తున్నారు. చెరకు గెడలతో ముస్తాబు చేయడమూ పెరిగింది. ఆర్కిడ్‌లు, చిలుక పువ్వులతో కొత్త అందాలు తీసుకువస్తున్నారు. కొబ్బరి వ్యాపార కేంద్రమైన అంబాజీపేటలో ఇటీవల జరిగిన ఒక పెళ్లిలో కొబ్బరి కాయలకు అందమైన రంగులద్ది స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఇటువంటి డెకరేషన్‌లు పెళ్లికి కొత్త జోష్ తీసుకు వస్తున్నాయి. చివరకు వధూవరులను అలంకరించే చోట కూడా వీటితోనే చిన్న చిన్న వేదికలు తయారు చేస్తుండటం విశేషం. కొబ్బరితో పాటు అరటి ఆకులతో సైతం వీటిని ముస్తాబు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు సైతం..

కొబ్బరి అధికంగా సాగయ్యే గోదావరి జిల్లాల్లోనే కాదు.. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో సైతం పెళ్లిళ్లకు కొబ్బరాకు స్వాగత ద్వారాలకు, పెళ్లి మండపాల ఆర్డర్లు వస్తున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో కోనసీమ జిల్లాలో అమలాపురం, కొత్తపేట, ఆత్రేయపురం, అంబాజీపేట, రావులపాలెం, రాజమహేంద్రవరం, కడియం, కడియపులంక, పెరవలి, కాకరపర్రు వంటి ప్రాంతాల్లో కొబ్బరి ఆకులతో ప్రత్యేక ఆకృతులు తయారు చేసేవారి సంఖ్య రానురానూ పెరుగుతోంది. ఇక్కడ వీటిని తయారు చేయించి నగరాలలో జరిగే పెళ్లిళ్లకు తీసుకు వెళుతున్నారు. వీటితో పాటు పెళ్లిళ్ల డెకరేషన్‌లో వినియోగించే ఆర్కిడ్‌లు, చిలకపువ్వు, డయనల్ గ్రాస్, చిన్నచిన్న అరటి మొక్కలను రైతులు స్థానికంగానే పండిస్తున్నారు. కోనసీమ జిల్లాలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, చాగల్లు, కడియం వంటి ప్రాంతాల్లో కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. పెళ్లిళ్లలో వస్తున్న ఈ కొత్త ట్రెండ్ ఇటు రైతులకు.. అటు డెకరేషన్ చేసేవారికి ఆదాయ వనరుగా మారుతోంది.

అభిరుచి మారుతోంది



పెళ్లిళ్లు చేసేవారి అభిరుచి మారుతోంది. బాహుబలి వంటి సెట్టింగ్‌లే కాదు.. ఒకప్పటి సంప్రదాయాన్ని తలపించేలా కొబ్బరి, అరటి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో సెట్టింగ్‌లు కావాలంటున్నారు. పెళ్లిళ్లలో అచ్చమైన పల్లె వాతావరణం కనిపించాలని కోరుకుంటున్నారు. వారి కోరికలకు అనువుగా కొబ్బరి, అరటి వంటి ఆకులతో సైతం కొత్తకొత్త మోడల్స్‌లో డెకరేషన్లు చేస్తున్నాం.

– బృందావనం నూకరాజు, ర్యాలి, ఆత్రేయపురం మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రత్యేకంగా డెకరేషన్



కొబ్బరాకులతో తయారు చేసే కల్యాణ వేదికలు, స్వాగత ద్వారాలు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల నుంచి కూడా కావాలని కోరుతున్నారు. షాపింగ్ మాల్స్ వంటి ప్రారంభోత్సవాల్లో వీటితో ప్రత్యేకంగా డెకరేషన్ చేయించుకుంటున్నారు. చివరకు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు తయారు చేసే చిన్న వేదికల వద్ద కూడా వీటిని ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు.

– మన్నెం సత్యనారాయణ, కాకరపర్రు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా

హుకుంపేట మండలం శోభకోట పంచాయతీ ఈదులగొంది మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్లేటి శ్రీనివాసరావు సాటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన పనిచేస్తున్న పాఠశాలకు పక్కా భవనం లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆయన సమస్య పరిష్కారానికి సంకల్పించారు. ఆయన సొంత నిధులతో పాటు స్నేహితుల సహకారంతో రూ.లక్ష సమకూర్చారు. ఈ నిధులకు గ్రామస్తుల శ్రమదానం జోడించి పాఠశాలకు సొంత భవనం సమకూర్చారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయుడు ఎల్లేటి శ్రీనివాసరావు

బడి బాగుకోసం..

ఓ ఉపాధ్యాయుడి తపన

- భవన నిర్మాణానికి సొంత నిధులు
- స్నేహితుల సహకారంతో రూ.లక్ష సమకూర్చిన టీచర్
- శ్రమదానం జోడించిన ఈదులగొంది గిరిజనులు
- సమష్టి కృషితో సమస్య పరిష్కారం

హుకుంపేట: పాఠశాలకు వసతి సమస్య పరిష్కరించేందుకు ఓ ఉపాధ్యాయుడు సొంత నిధులు వెచ్చించారు. దీనికి గ్రామస్తులు శ్రమదానం జోడించి భవన నిర్మాణాన్ని పూర్తిచేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వసతి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించుకున్నారు. అల్లూరి జిల్లా హుకుంపేట మండలంలోని శోభకోట పంచాయతీ ఈదులగొంది చిన్న గ్రామం. ఇక్కడ పీవీటీజీ సామాజిక వర్గానికి చెందిన గిరిజనులు జీవిస్తున్నారు. ఇక్కడి పాఠశాలలో 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. పక్కా భవనం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు పలుసార్లు ఉన్నతాధికారులను కోరినా ఫలితం లేకపోయింది. గ్రామస్తులంతా శ్రమదానంతో మట్టిగోడలు నిర్మించి రేకులతో షెడ్డు ఏర్పాటుచేసుకుని తాత్కాలికంగా వసతి సమస్య కల్పించారు. ఈ నేపథ్యంలో ఇదే పాఠశాలకు రెండేళ్ల క్రితం వచ్చిన ఉపాధ్యాయుడు ఎల్లేటి శ్రీనివాసరావు విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్యను గుర్తించారు. సమస్య పరిష్కరించేందుకు ఆయన సంకల్పించారు. ఇందుకు ఆయన స్నేహితులైన ఉపాధ్యాయుడు రాజేంద్ర తదితరులు ఆర్థిక సహకారం అందించారు. మొత్తంమీద భవన నిర్మాణానికి ఉపాధ్యాయుడు రూ.లక్ష వరకు నిధులు సమకూర్చారు. దీనికి గ్రామస్తులు శ్రమదానం జోడించారు. పాఠశాల భవనాన్ని నిర్మించి వసతులు కల్పించారు.

ఆదర్శంగా తీసుకోవాలి



ఈదులగొంది గ్రామంలో పాఠశాల సమస్య తెలుసుకున్న ఉపాధ్యాయుడు సొంత డబ్బులుతో పాఠశాల నిర్మించడం గొప్ప విషయం. అనేక ప్రాంతాల్లో ఈ సమస్య వెంటాడుతుంది. మిగతా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలి.

– ఈశ్వరరావు, ఎంఈవో-2


ఉపాధ్యాయుడు సొంత నిధులు, గిరిజనుల శ్రమదానంతో నిర్మించిన పాఠశాల భవనం

ఉచిత సలహాలు మాని.. పొగాకు కొనుగోళ్లు చేపట్టండి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

సాక్షి, అమరావతి: పొగాకు రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధరలు, కొనుగోలు సమస్యలపై రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేసిన ప్రకటన వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర రెడ్డి విమర్శించారు. పొగాకు ఉత్పత్తి తగ్గించాలని రైతులకు మంత్రి సలహాలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉచిత సలహాలు మాని వెంటనే పొగాకు కొనుగోళ్లు చేపట్టాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును చివరి కాడ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5వ తేదీన ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన చేసి రెండు వారాలు కావొస్తున్నా కొనుగోళ్లు ఇంకా ప్రారంభించలేదన్నారు. పొగాకు ఉత్పత్తుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. కానీ రైతులను ఆదుకునే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేనేత ఆధునికతకు డిజైన్ పోటీలు

పోస్టర్ ఆవిష్కరించిన ఆప్కో, లేపాక్షి ఎండీ విశ్వ మనోహరన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ హస్త, చేనేత కళలకు ఆధునిక రూపమిచ్చేందుకు రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆప్కో, లేపాక్షి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) విశ్వ మనోహరన్ తెలిపారు. పోటీల వాల్‌పోస్టర్‌ను విజయవాడలో సోమవారం ఆవిష్కరించారు. ఆప్కో, లేపాక్షి సంస్థల ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ భాగస్వామిగా ఈ నెల 17 నుంచి 30 రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ హస్తకళలుగా గుర్తింపు పొందిన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి ప్రింట్లు, లెదర్ పప్పెట్రీ, వుడ్ కార్వింగ్‌తోపాటు నేత కళలుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, బందరు ప్రత్యేకతలకు డిజైన్ల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నూతనంగా రూపొందించిన వస్త్రాలు, సూక్ష్మ జ్ఞాపికల విభాగంలో కొత్త డిజైన్లను ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీలకు 18 సంవత్సరాల పైబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కళాకారులు, నేతన్నలు, డిజైనర్లు, విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. సృజనాత్మకత, సంప్రదాయ నైపుణ్యం వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను నిపుణుల కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రతి విభాగంలో మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.10వేలు చొప్పున అందిస్తామన్నారు. పలు విభాగాల్లో మొత్తం 30 బహుమతులకు రూ.5లక్షలు అందిస్తామని విశ్వ మనోహరన్ తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

సాక్షి, అమరావతి: 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండవ విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను కేంద్రం ఐదు నెలల క్రితమే రాష్ట్రానికి విడుదల చేసినప్పటికీ వాటిని ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలకు జమ చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను సోమవారం ఆయన మీడియాకు విడుదల చేశారు.



వయసు పైబడిన వయోవృద్ధులను చాలామంది ఓ భారంగా చూస్తుంటారు.
ఓ రోజుకు మనమూ ఆ వయసుకు వస్తాం.
అప్పటి మన ఆరోగ్య సమస్యలనూ,
మన వెతలనూ ఇవ్వాళ్లే వాళ్ల పాదరక్షల్లో కాళ్లు పెట్టి ఆలోచించాలి.
నిజానికి వాళ్ల అనుభవం మనందరికీ అవసరమైన అంశం.
వాళ్ల వల్ల చాలా సమస్యలు తేలిగ్గా విడిపోతాయి.
ఇవేవీ అవసరం లేకపోయినా...
వాళ్లు అలా కుర్చీలో కూర్చుని మనల్ని పర్యవేక్షిస్తుంటే చాలు...
బోలెడంత నిశ్చింత. అందుకే... మనమే ఇంకా సంపాదిస్తూ ఉన్నట్లయితే...
స్త్రీ పురుషులు 50 దాటాక
కొన్ని వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.
ఒకవేళ ఆ పురుషుడు మన తండ్రీ లేదా మన తాతగారో,
అమ్మ లేదా అమ్మమ్మో అయి... మనమే సంపాదిస్తూ ఉన్నట్లయితే
మనమే మన తండ్రి, తాత లేదా మీకు బాగా కావాల్సినవారికి
వైద్య పరీక్షలు చేయిస్తుంటే ఇంకా ఆ ఫీలింగ్ ఇంకా బాగుంటుంది.
అదీ వాళ్లకూ, మనకూ ఆనందాన్ని, నిర్భీతిని పంచుతూ
కుటుంబ సంబంధాలను ఇంకా బలంగా చేస్తుంది.
అందుకే మీ ఇంట్లో 50 దాటిన స్త్రీ, పురుషులకు చేయించాల్సిన
కొన్ని సాధారణ వైద్య పరీక్షలివి...

‘టెస్ట్’ టైమ్
ఐదు పదులా? పదండి పరీక్షకు!

కుటుంబ సభ్యుల్లో ఐదు పదులు నిండాక చేయించాల్సిన కొన్ని సాధారణ (కామన్) వైద్య పరీక్షలివి...

50

డయాబెటిస్ (చక్కెర వ్యాధి) కోసం...

సాధారణంగా ఈ పరీక్షను రెండంచెల్లో చేస్తారు. ఉదయాన్నే పరగడుపున ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ చేయించాలి. ఇందులో పరగడుపున ఉన్నప్పుడు చక్కెర మోతాదులు తెలుస్తాయి. ఇక ఆ తర్వాత భోజనం చేసిన రెండు గంటల్లోపు చేయించే మరో పరీక్ష చేస్తారు. దీన్ని పోస్ట్ లంచ్ / పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ షుగర్ గా చెబుతారు. వీటితో పాటు సీరమ్ క్రియాటినిన్, సీయూఈ అనే పరీక్షలూ అవసరం ● ఇక కొందరికి మూడు నెలల సగటు చక్కెర మోతాదులను తెలుసుకోడానికి 'హెచ్‌బీఏ1సీ' అనే పరీక్ష చేస్తారు ● ప్రతి అరగంటకోమారు గ్లూకోజ్ ఇస్తూ చేసే పరీక్షను జీటీటీ (గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్) అంటారు. సందర్భాన్నీ, అవసరాన్ని బట్టి డాక్టర్లు ఈ పరీక్షలు చేయిస్తుంటారు. అయితే సాధారణంగా 'ఫాస్టింగ్ బ్లడ్ షుగర్', 'పోస్ట్ లంచ్ బ్లడ్ షుగర్' పరీక్షలు 50 ఏళ్లు దాటిన వారికి ఎక్కువగా చేయిస్తుంటారు. మిగతా పరీక్షలను అవసరాన్ని బట్టి డాక్టర్లు సూచిస్తుంటారు.

గుండె జబ్బుల నిర్ధారణ కోసం...

ఇటీవల గుండెజబ్బులు చాలామందిలో ఎక్కువగా కనిపిస్తున్నందున ఇందుకోసం చేయించాల్సిన సాధారణ పరీక్షలు... ● ఈసీజీ, ● లిపిడ్ ప్రొఫైల్. అలాగే కొంత అడ్వాన్స్‌డ్ పరీక్షలైన ● 2డి ఎకో, ● టీఎమ్‌టీ, ● సీటీ, ● కరోనరీ యాంజియో.

ఈసీజీ ఎందుకంటే: గుండెజబ్బును నిర్ధారణ చేసేందుకు అవసరమైన సాధారణ తొలి పరీక్ష ఇది. ఒకవేళ ఛాతీ నొప్పి అనిపిస్తే తప్పనిసరిగా చేయించుకోవాల్సిన పరీక్ష ఇది. ఒకవేళ అది గుండె సమస్య లేదా గుండెపోటు అయితే 80, 90 శాతం కేసుల్లో ఆ విషయం ఈ పరీక్షతోనే నిర్ధారణ అవుతుంది. లేదా గతంలో వారికి గుండెపోటు వచ్చి ఉండి, ఆ విషయం బాధితులకు తెలియకున్నా ఈ పరీక్షతో గతంలో వచ్చిన గుండెపోటు సమాచారమూ తెలిసిపోతుంది.

అయితే కొన్నిసార్లు చాలా చిన్న చిన్న గుండెపోటు సమాచారాల్ని ఈసీజీ గుర్తించలేకపోవచ్చు. కాకపోతే ఈసీజీ మెషిన్లోని కంప్యూటరు గతంలోని గుండెజబ్బుల విషయంలో కొన్ని క్లూస్ ఇస్తుంది. అయితే ఆ క్లూస్ అన్నీ నూరు శాతం ఖచ్చితంగా నిజం కాకపోవచ్చు. అయినప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేయకుండా, వాటికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే గుండెపోటు వచ్చినప్పుడు తక్షణమే ఈసీజీ తీయించినా గుండెపోటు వల్ల కలిగే మార్పులను ఈ పరీక్ష వెంటనే నమోదు చేయలేకపోవచ్చు. అందుకే గుండెనొప్పి / ఛాతీ నొప్పి వచ్చాక 45 నిమిషాల తర్వాత కనీసం 2 లేదా 3 ఈసీజీలను తీశాక కూడా అందులో మార్పులు లేవంటే అప్పుడు గుండెపోటు రాలేదని 99 శాతం కచ్చితత్వంతో చెప్పవచ్చు.

లిపిడ్ ప్రొఫైల్ : ఈ పరీక్షలో దేహంలోని అనేక రకాల కొవ్వు పదార్థాల వివరాలను తెలుసుకుని, అవి ఉండాల్సిన పరిమితుల్లో ఉన్నాయా లేదా అని చూస్తారు. ఒకవేళ పరిమితులకు మించి కొవ్వులు ఉంటే దాన్ని బట్టి డాక్టర్లు వాటిని అదుపులో ఉంచేందుకు అటర్వొస్టాటిన్స్ వంటి మందులను సూచిస్తారు.



2 డి ఎకో పరీక్ష ఎందుకు: టూ డీ ఎకో పరీక్ష గుండెస్పందనల్లోని మార్పులు, గుండె కండరంలో వచ్చిన మార్పులను తెలిపే పరీక్ష. గుండెపోటు వచ్చినప్పుడు గుండెస్పందనల్లో మార్పులు రావచ్చు కాబట్టి గుండెపోటు నిర్ధారణ కోసం ఎకో చేస్తారు. గుండెజబ్బు కారణంగానే ఛాతీ నొప్పి వస్తే... ఆ విషయం తెలుసుకునేందుకు అవకాశాలు 2 డీ ఎకో పరీక్షలో 95 శాతం కంటే ఎక్కువ. కాకపోతే ఈ పరీక్ష ఈసీజీ కంటే కాస్తంత ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది.

టీఎమ్‌టీ పరీక్ష : దీన్నే ఎక్సర్‌సైజ్ స్ట్రెస్ టెస్ట్ అని కూడా అంటారు. ఇది ట్రెడ్ మిల్‌పై పేషెంట్‌ను నడిపిస్తూ... నడిచినప్పుడు లేదా ఏదైనా పని చేస్తున్నప్పుడు గుండెపై పడే ఒత్తిడీ... అలా ఒత్తిడి పడుతున్నప్పుడు గుండె పనితీరును అంటే... గుండెవేగం, గుండె లయ (రిథమ్), గుండె అలా పనిచేస్తున్నప్పుడు పెరుగుతున్న రక్తపోటు వంటి అంశాలను ఈ పరీక్షలో తెలుస్తాయి.

యాంజియోగ్రామ్ : గుండెపోటు అని సందేహం కలిగినప్పుడు వ్యాధి నిర్ధారణ కచ్చితంగా చేయగలిగే మరో పరీక్ష యాంజియోగ్రామ్. కొన్నిసార్లు ఈసీజీ మార్పులు స్పష్టంగా లేకపోయినా, ఎకో పరీక్ష మనకు సరైన క్లూస్ ఇవ్వలేకపోయినా ఈ పరీక్షలో ఆ వివరాలు తెలుస్తాయి. అంతేకాదు... గుండె రక్తనాళాల స్థితి, అందులోని అడ్డంకుల వంటివి ఖచ్చితంగా తెలుస్తాయి. యాంజియోగ్రామ్‌లో వచ్చే ఫలితాలు 99 శాతం కంటే ఎక్కువగా నమ్మదగినవి.

హైసెన్సిటివిటీ ట్రోపోనిన్‌లు : గుండెపోటు వచ్చిన నాలుగు గంటల లోపే రక్తంలో హైసెన్సిటివిటీ ట్రోపోనిన్ అనే రసాయనాల మోతాదులు పెరుగుతాయి. ఈ పరీక్ష ద్వారా ఆ విషయం నిర్ధారణ అయితే... ఎంత చిన్న గుండెపోటు అయినప్పటికీ అది తప్పనిసరిగా గుండెపోటే అన్న విషయం పూర్తిగా నిర్ధారణ అవుతుంది.



కొన్ని ప్రత్యేక పరీక్షలు...

● బోన్‌స్కాన్ పరీక్ష ● పెట్ స్కాన్ పరీక్ష. (ఇవి క్యాన్సర్ నిర్ధారణలో తొలుత చేసే ప్రాథమిక పరీక్షలు, వీటిలో ఏదైనా తేడా ఉన్నట్లు తెలిస్తే మరి కాస్త అడ్వాన్స్‌డ్ పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉంటుంది. ఇక క్యాన్సర్ కోసం చేసే ప్రాథమిక పరీక్షల్లో ఏమీ లేదని తెలిస్తే క్యాన్సర్ ముప్పు లేదని నిశ్చింతగా ఉండవచ్చు)

పళ్లకు సంబంధించిన పరీక్షలు...

దీనికోసం ప్రతి ఆర్నెల్లకు ఒకమారు డెంటిస్ట్‌ను సంప్రదించి అవసరాన్ని బట్టి పళ్ల క్లీన్ చేయించుకోవాలి. చిగుర్లకు సంబంధించిన సమస్యలూ, వ్యాధులూ ఏవీ లేవని నిర్ధారణ చేసుకుని నిశ్చింతగా ఉండాలి.

కంటి పరీక్షలు...

ప్రతి ఏడాదికి ఒకసారి కంటి నిపుణులకు చూపించుకోవాలి. కళ్లలో ప్రెషర్ చెక్ చేయించుకుని గ్లకోమా అవకాశాలు ఏవీ లేవని తెలుసుకుని నిర్భయంగా ఉండవచ్చు. గ్లకోమా అనేది చాపకింది నీరులా క్రమంగా కంటిచూపును తగ్గిస్తూ పోయే వ్యాధి. దాదాపుగా చాలావరకు చూపు కోల్పోయే వరకు ఆ విషయం తెలియదు కాబట్టి పెద్దవయసు వచ్చాక తప్పనిసరిగా కంటి పరీక్షలు ప్రతి ఏడాదీ లేదా మీ డాక్టర్ / ఫిజీషియన్ సూచించిన విధంగా చేయిస్తూ ఉండాలి.

● ఇక కొంతవయసు దాటాక వచ్చే కంటి సమస్యల్లో క్యాటరాక్ట్ (తెల్లముత్యం) చాలా సాధారణంగా కనిపించే సమస్య. కళ్లు మసగ్గా కనిపిస్తున్నా లేదా అక్షరాలు, అంకెలు రెండుగా కనిపిస్తున్నా కంటి డాక్టర్‌ను సంప్రదించి క్యాటరాక్ట్ నిర్ధారణ చేసుకోవాలి. ఒకవేళ అది క్యాటరాక్ట్ అయితే చిన్న శస్త్రచికిత్సతో డాక్టర్లు ఆ సమస్యను పూర్తిగా చక్కబరుస్తారు.

ఏవైనా అసాధారణతలు ఉంటే...

అసాధారణతలు అంటే మామూలు సగటు వ్యక్తులకు అని అర్థం. ఒకవేళ ఆ వ్యక్తులకు పొగతాగడం, మద్యం, స్థూలకాయం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్లు సూచించిన విధంగా మరికొన్ని అదనపు పరీక్షలు అవసరం కావచ్చు. ఉదాహరణకు... ● **పొగతాగేవారైతే...** గుండె పరీక్షలతో పాటు... ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని తెలుసుకునే పీఎఫ్‌టీ పరీక్ష చేయించుకోవాలి ● **ఆల్కహాల్ అలవాటు ఉన్నవారైతే...** కాలేయ సామర్థ్యాన్ని తెలుసుకుని ఎల్‌ఎఫ్‌టీ పరీక్ష, గుండె పరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్ అబ్డామిన్ పరీక్షలు చేయించుకోవాలి ● **స్థూలకాయం ఉంటే...** బీఎమ్‌ఐ, టీఎస్‌హెచ్, ఎఫ్‌బీఎస్, లిపిడ్ ప్రొఫైల్స్ వంటి పరీక్షలు చేయించుకోవడం మంచిది ● **ఇతరత్రా ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే...** వాటిని బట్టి మీ ఫిజీషియన్ లేదా డాక్టర్ సలహా మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.

60

అరవైలలో ఆరోగ్య పరీక్షలివే...



డాక్టర్ కృపన్ కుమార్ బి
సీనియర్ ఫిజీషియన్

సాధారణంగా మధ్యవయసుకు చేరాక చేయించుకునే పరీక్షలతో పాటు వయసు 60 దాటాక పైన పేర్కొన్న పరీక్షలతో పాటు మరికొన్ని పరీక్షలు అదనంగా చేయించుకోవడం మంచిది. అవి...

● **బీపీ స్క్రీనింగ్ :** ఒక వయసు దాటాక ఇక తరచూ బీపీ చెక్ చెయించుకోవడం అవసరం. ఇకవేళ డయాబెటిస్, గుండెజబ్బులు, కిడ్నీ సమస్యలు, ఇతరత్రా ఏవైనా జబ్బులు ఉంటే దానికి సంబంధించి డాక్టర్ పేర్కొన్న పరీక్షలను క్రమం తప్పకుండా చేయించాలి ● **కొలెస్ట్రాల్ స్క్రీనింగ్ :** యాభై దాటాక ఒకసారి కొలెస్ట్రాల్ పరీక్ష చేయించి, అది నార్మల్ గనక వస్తే ఇక అప్పట్నుంచి ప్రతి ఐదేళ్లకోమారు కొలెస్ట్రాల్ స్థాయులు తెలుసుకుంటూ ఉండటం మంచిది ● గుండెకు సంబంధించిన ఈసీజీ, టూ డి ఎకో, టీఎమ్‌టీ, అవసరాన్ని బట్టి యాంజియోగ్రామ్ లేదా సీటీ యాంజియో వంటి పరీక్షలు ● ఒకవేళ డయాబెటిస్, గుండెజబ్బులు, కిడ్నీ సమస్యలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం డాక్టర్ పేర్కొన్న వ్యవధిలో క్రమం తప్పకుండా కొలెస్ట్రాల్ స్క్రీనింగ్ పరీక్ష తప్పక చేయిస్తూ ఉండాలి.

డయాబెటిస్ కోసం: చక్కెర వ్యాధి గురించి తెలుసుకోవడం కోసం క్రమం తప్పకుండా పరీక్షలు చేయిస్తూనే ఉండాలి. ఒకవేళ అది ఉన్నట్లు తేలితే డాక్టర్ పేర్కొన్న వ్యవధిలో క్రమం తప్పకుండా చక్కెర నిర్ధారణ పరీక్షలు చేయించాలి.


పెద్ద పేగు క్యాన్సర్ పరీక్షలు : పెద్ద వయసులో పెద్దపేగు క్యాన్సర్ లేదని తెలుసుకుని నిశ్చింతగా ఉండటం కోసం... ● ఏడాదిలో ఒకసారి మల పరీక్షతో పాటు ప్రతి ఐదేళ్లకోసారి ఫ్లెక్సిబుల్ సిగ్మాయిడోస్కోపీ. దీనితో పాటు స్టూల్ అక్కల్ట్ బ్లడ్ టెస్ట్ కొలనోస్కోపీ అనే పరీక్ష యాభై దాటిన నాటి నుంచి ప్రతి పదేళ్లకోమారు చేయించుకోవడం మంచిది ● కొలనోస్కోపీ అనే పరీక్షను ప్రతి పదేళ్లకోమారు చేయించుకోవడం మంచిది ● **అబ్డామినల్ అయోర్టిక్ అన్యురిజమ్ స్క్రీనింగ్ :** పురుషుల వయసు 65–75 మధ్య ఉన్నవాళ్లు... గతంలో వాళ్లకు పొగతాగిన అలవాటు ఉంటే... అయోర్టిక్ అన్యురిజమ్ అనే కండిషన్ కోసం ఒకసారి అల్ట్రాసౌండ్ అబ్డామిన్ పరీక్ష చేయించుకోవడం మంచిది ● ఇక వ్యక్తిగతంగా ఉన్న లక్షణాలను, కుటుంబ చరిత్రను, రిస్క్ ఫ్యాక్టర్స్‌ను బట్టి డాక్టర్ సూచించిన ఇతర పరీక్షలు చేయించుకోవాలి.



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు...

సాధారణమైనవి...
● ఛాతీ ఎక్స్-రే (ఇది అనేక వ్యాధుల నిర్ధారణ చేస్తుంది), ● అల్ట్రాస్కాన్ అబ్డామిన్, ● ఒకవేళ పరీక్షలు చేసే వ్యక్తి పురుషుడు అయితే పీఎస్‌ఏ మోతాదులు తెలుసుకుంటారు. ప్రోస్టేట్ క్యాన్సర్ నిర్ధారణ కోసం చేసే పరీక్ష కావడంతో కేవలం పురుషులకు మాత్రమే చేసే పరీక్ష ఇది. అదే ఒకవేళ స్త్రీలకే పరిమితమైన కొన్ని క్యాన్సర్ పరీక్షలు చేయించాల్సి వస్తే రొమ్ము క్యాన్సర్ పరీక్షల కోసం మ్యామోగ్రామ్, సర్విక్స్ క్యాన్సర్ కోసం హెచ్‌పీవీ టెస్ట్, ఒవేరియన్ క్యాన్సర్‌ను కనుగొనేందుకు సీఏ–125 అనే పరీక్షలు చేస్తారు. కాకపోతే మామోగ్రామ్, హెచ్‌పీవీ వంటి పరీక్షలు తరచూ చేయించినప్పటికీ... కేవలం కొన్ని కొన్ని లక్షణాలు కనిపిస్తుంటేనే మిగతా పరీక్షలను డాక్టర్లు సూచిస్తారు. అయితే ఇందులో రొమ్ము క్యాన్సర్ అనేది పురుషులకూ వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అది పురుషుల్లో చాలా అరుదుగానే కనిపిస్తుంది.





వయసు పైబడ్డాక తీసుకోవాల్సిన వ్యాక్సిన్లు

స్త్రీ పురుషులెవరైనప్పటికీ వారికి 65 ఏళ్లు దాటాక అంతకు ముందు ఎప్పుడూ తీసుకుని ఉండకపోతే 'న్యూమోకోకల్ వ్యాక్సిన్' తీసుకోవాలి. ఒకవేళ గతంలో తీసుకుని ఉండి, ఐదేళ్లు దాటినా ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.

● ప్రతి ఏడాదీ ఫ్లూ వ్యాధి నుంచి రక్షణకోసం ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.

● ప్రతి పదేళ్లకోమారు టెటనస్–డిఫ్తీరియా బూస్టర్ డోస్ తీసుకుంటూ ఉండాలి.

● గతంలో ఎప్పుడూ తీసుకోకపోతే 65 ఏళ్లు దాటక టీ–డాప్ వ్యాక్సిన్ తీసుకోవాలి. (ఇది డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది).

● అరవై దాటక షింగిల్స్ లేదా హెర్పిస్ జోస్టర్ వ్యాక్సిన్ తీసుకోవాలి. గతంలో తీసుకుని ఉండకపోతే ఇది వెంటనే తీసుకోవడం మేలు.

60+

ఇక సాధారణంగా చూసుకునే పరీక్షలైన బరువు చెక్ చేయించుకోవడం, బాత్‌రూమ్‌లో లేదా ఇతరత్రా కింద జారి పడకుండా చూసుకోవడం, చెవులు చక్కగా వినిపిస్తున్నాయేమో చూసుకోవడం, ఉల్లాసంగా ఆహ్లాదంగా లేకపోతే డిప్రెషన్‌కు గురికాకుండా జాగ్రత్త పడటం వంటి ఎవరికి వారు చేసుకునే పరీక్షలూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

వీటితో పాటు పొగతాగడం, ఆల్కహాల్ వంటి అలవాట్లకు దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం, మంచి పుష్టికరమైన ఆహారం తీసుకోవడం వంటివి చేస్తుంటే నాన్నలూ, తాతలూ... లేదా అమ్మలూ అమ్మమ్మలూ, నానమ్మల వయసులో ఉన్నప్పటికీ ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేకుండా... హాయిగా, ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటమన్నది తేలిగ్గానే సాధ్యమవుతుంది.



దేశీ కంపెనీలకు రేర్ తిప్పలు!

చైనా రేర్ ఎర్త్ మాగ్నెట్స్ కోసం క్యూ...

రెండు వారాల్లో రెట్టింపైన దరఖాస్తులు

న్యూఢిల్లీ: రేర్ ఎర్త్ మాగ్నెట్స్ ఎగుమతులపై చైనా నియంత్రణలను కఠినతరం చేయడంతో భారతీయ కంపెనీలు విలవిల్లాడుతున్నాయి. ప్రధానంగా వాహన విడిభాగాల పరిశ్రమను ఈ అనిశ్చితి వెంటాడుతోంది. నేరుగా చైనా నుంచి రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల దిగుమతి కోసం లైసెన్స్‌లకు దరఖాస్తులు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన రెండు వారాల్లో దేశీ కంపెనీల దరఖాస్తుల సంఖ్య రెట్టింపైనట్లు పరిశ్రమ వర్గాల సమాచారం. జూన్ మధ్య నాటికి సుమారు 21 కంపెనీలు మీడియం, హెవీ రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ దిగుమతి పర్మిట్ల కోసం చైనా వాణిజ్య శాఖకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎగుమతిదారులు కొనుగోలుదారు నుంచి ఎండ్-యూజర్ సర్టిఫికెట్‌ను తీసుకోవడం సహా అధికారిక అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేస్తూ చైనా ఏప్రిల్ 4న ఆదేశాలు చేసిన నేపథ్యంలో వీటి ఎగుమతులకు తీవ్ర అండ్డంకులు నెలకొన్నాయి. ఈ రేర్ ఎర్త్ మాగ్నెట్ మెటీరియల్స్‌ను ఎలాంటి ఆయుధాల ఉత్పత్తిలోనూ ఉపయోగించబోమని హామీ ఇవ్వడంతో పాటు నిర్దిష్ట డిక్లరేషన్లు ఈ సరిఫికెట్లో ఉంటాయి. చైనాకు దరఖాస్తు చేసిన కంపెనీల్లో బాష్ ఇండియా, మారెల్లి పవర్‌ట్రెయిన్ ఇండియా, మాహల్ ఎలక్ట్రిక్ డ్రైవ్స్ ఇండియా, టీవీఎస్ మోటార్స్, యూనో ఇండియా తదితర దిగ్గజాలు ఉన్నాయి. విధానపరమైన కారణాలతో గతంలో తిరస్కరణకు గురైన సోనా కామ్‌స్టర్ తిరిగి దరఖాస్తు చేసుకుంది. చైనా ఆమోదం కోసం వేచి చూస్తోంది.

52 కంపెనీలు...

భారతీయ వాహన తయారీ సంస్థల సంఘం (సియామ్) వివరాల ప్రకారం భారతీయ ఆటోమబైల్ కంపెనీలకు సరఫరా చేయడం కోసం దాదాపు 52 కంపెనీలు పూర్తిగా చైనా మాగ్నెట్లపైనే ఆధారపడుతున్నాయి. వీటిలో చాలా వరకు తమ తాజా పర్మిట్ల కోసం అన్ని లాంఛనాలను పూర్తి చేసి చైనా సరఫరాదారులకు డాక్యుమెంట్లను పంపించాయి. అయితే, చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి వాటికి ఇంకా తప్పనిసరి ఎగుమతి లైసెన్స్ రాకపోవడంతో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క, భారతీయ అధికారులు కూడా చైనాతో చర్చల కోసం దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, పెద్దగా పురోగతి కనిపించడం లేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అమెరికా, యూరోపియన్ సంస్థలు మాత్రం ఈ విషయంలో వేగంగా చర్యలు తీసుకున్నాయి. వాస్తవానికి యూఎస్ సుంకాలకు ప్రతిగా చైనా రేర్ ఎర్త్ మాగ్నెట్లపై నిబంధనలను కఠినతరం చేయగా.. అమెరికా ప్రభుత్వం వాటి సరఫరా విషయంలో ఇప్పటికే ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. యూరప్ వాహన విడిభాగాల తయారీ సంస్థలకు కూడా అనుమతులు లభించాయి. భారతీయ కంపెనీలు మాత్రం అనుమతుల కోసం నానాతవ్పలు పడుతున్నాయి.



ఉత్పత్తికి విఘాతం...

వీలైనంత త్వరగా లైసెన్స్‌లు దక్కకపోతే తయారీకి తీవ్ర విఘాతం కలుగుతుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మన పరిశ్రమ స్థాయితో పోలిస్తే రేర్ ఎర్త్ మాగ్నెట్ల దిగుమతుల విలువ తక్కువే అయినప్పటికీ.. వాటిని ఉపయోగించి తయారు చేసే ఒక్క విడిభాగం లేకపోయినా వాహనాల తయారీ నిలిచిపోతుందని ఆటోమొబైల్ కంపెనీకి చెందిన ఒక ఎగ్జిక్యూటివ్ పేర్కొన్నారు. 2024-25లో భారత్ రూ.306 కోట్ల విలువైన 870 టన్నులు రేర్ ఎర్త్ మాగ్నెట్లను దిగుమతి చేసుకుంది. ప్రస్తుతం కంపెనీల వద్దనున్న నిల్వలు జూన్ మొదటి నాటికి పూర్తిగా అయిపోతాయని కంపెనీలు హెచ్చరిస్తున్నాయి.

బిజినెస్ రీల్


27న పీఎస్‌బీ చీఫ్‌లతో ఆర్థిక మంత్రి భేటీ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్‌ల చీఫ్‌లతో ఈ నెల 27న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ కానున్నారు. బ్యాంకుల పనితీరుతోపాటు పలు ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల లక్ష్యాలపైనా చర్చ జరుగుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆర్‌బీఐ ఈ నెల మొదట్లో రెపో రేటును అర శాతం తగ్గించిన తర్వాత ఆర్థిక మంత్రి బ్యాంక్‌లతో నిర్వహిస్తున్న మొదటి సమీక్ష కావడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. జీడీపీ వృద్ధి నాలుగేళ్ల కనిష్ట స్థాయి 6.5 శాతానికి తగ్గడంతో ఆర్థిక వృద్ధికి మద్దతుగా ఉత్పాదక రంగాలకు రుణ వితరణ పెంచాలని ఆర్థిక మంత్రి ఈ సమావేశంలో బ్యాంక్‌లను కోరే అవకాశాలున్నట్టు తెలిపాయి. కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం ముద్రా, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల పరంగా పురోగతిని మంత్రి సమీక్షించనున్నట్టు వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరంలో 12 ప్రభుత్వరంగ బ్యాంక్‌ల లాభం అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 26 శాతం పెరిగి రూ.1.78 లక్షల కోట్లకు చేరడం గమనార్హం.

లోధా డెవలపర్స్‌గా మాక్రోటెక్

కంపెనీల రిజిస్ట్రార్ గ్రీన్‌సిగ్నల్



ముంబై: అభిషేక్ లోధా ఆధ్వర్యంలోని రియల్టీ దిగ్గజం మాక్రోటెక్ డెవలపర్స్ పేరు లోధా డెవలపర్స్‌గా మారనుంది. ఇందుకు రెండు నెలల తదుపరి కంపెనీల రిజిస్ట్రార్ నుంచి అనుమతి లభించింది. సోదరుడి సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధాతో ట్రేడ్‌మార్క్ వివాదం సెటిల్‌కావడంతో పేరు మార్పునకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ నెల 16 నుంచి కంపెనీ పేరును లోధా డెవలపర్స్‌గా మార్పు చేసేందుకు కంపెనీల రిజిస్ట్రార్, కార్పొరేట్ వ్యవహారాల శాఖ అనుమతించినట్లు మాక్రోటెక్ డెవలపర్స్ తాజాగా వెల్లడించింది. లోధా బ్రాండుతో రియల్టీ ఆస్తులను విక్రయించే మాక్రోటెక్ డెవలపర్స్‌కు హౌస్ ఆఫ్ అభినందన్ లోధాతో వివాదం కారణంగా పేరు మార్పునకు రెండు నెలల సమయం పట్టినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 14న రెండు సంస్థల మధ్య ట్రేడ్‌మార్క్ వివాదానికి సెటిల్‌మెంట్ కుదిరింది. దీనిలో భాగంగా లోధా బ్రాండు వినియోగాన్ని మాక్రోటెక్ డెవలపర్స్ కొనసాగించనుంది. మరోవైపు హౌస్ ఆఫ్ అభినందన్ లోధా బ్రాండుతో సోదరుడి సంస్థ కార్యకలాపాలు కొనసాగించనుంది.

జీ20 షెర్పాగా తప్పుకున్న అమితాబ్ కాంత్

45 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలు



న్యూఢిల్లీ: జీ20 షెర్పా పదవికి అమితాబ్ కాంత్ రాజీనామా సమర్పించారు. 1980వ బ్యాచ్ కేరళ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన అమితాబ్ కాంత్ 45 ఏళ్లపాటు వివిధ హోదాల్లో సుదీర్ఘకాలంపాటు సేవలు అందించిన అనంతరం చివరికి ఈ నిర్ణయం తీసుకున్నారు. కీలకమైన జీ20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టడానికి ముందు.. 2022 జూలైలో ఆయనను జీ20 షెర్పాగా కేంద్రం నియమించింది. 'నా కొత్త ప్రయాణం' అంటూ లింక్డ్‌ఇన్‌లో అమితాబ్ కాంత్ తాజాగా ఒక పోస్ట్ చేశారు. "45 ఏళ్లపాటు ప్రభుత్వ సేవల తర్వాత కొత్త అవకాశాలను స్వీకరించి, జీవితంలో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. భారత వృద్ధికి, పురోగతికి ఎన్నో అభివృద్ధి చర్యల దిశగా నాకు అవకాశం కల్పించడమే కాకుండా.. జీ20 షెర్పా పదవికి నేను సమర్పించిన రాజీనామాకు ఆమోదం తెలిపినందుకు భారత ప్రధానమంత్రికి ఎంతో కృతజ్ఞతలు" అని పోస్ట్‌లో రాసుకొచ్చారు. భారత జీ20 షెర్పాగా ఎన్నో బహుపాక్షిక చర్చలకు నాయకత్వం వహించడం తన కెరీర్‌లో ఒకానొక పెద్ద మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. జీ20 షెర్పా బాధ్యతలకు ముందు 2016 నుంచి 2022 మధ్య నీతి ఆయోగ్ సీఈవోగా అమితాబ్ కాంత్ పని చేయడం గమనార్హం. ఆ కాలంలో 115 వెనుకబడిన జిల్లాలను ప్రగతి పథకంలోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. అంతకుముందు పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం సెక్రటరీగానూ కాంత్ సేవలు అందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జైశంకర్ చూపించిన మార్గదర్శనం, ప్రోత్సాహానికి కాంత్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇంధన డిమాండ్ డౌన్

జూన్‌లో ముందస్తు వర్షాల ప్రభావం



న్యూఢిల్లీ: దేశీయంగా వివిధ ప్రాంతాలలో ముందుగా వర్షాలు పడుతుండటంతో ఈ నెల(జూన్) తొలి రెండు వారాల్లో ఇంధన వినియోగం మందగించింది. ప్రొవిజనల్ పారిశ్రామిక గణాంకాల ప్రకారం రెండు నెలల పురోగతి తదుపరి డీజిల్ వినియోగం క్షీణించింది. ఈ బాటలో రెండు నెలల వినియోగ వృద్ధి తదుపరి పెట్రోల్‌కు సైతం డిమాండ్ నీరసించింది. జూన్ 1-15 మధ్య పెట్రోల్ డిమాండ్‌లో వృద్ధి 2.3 శాతానికి పరిమితమై 1.4 మిలియన్ టన్నులను తాకింది. దేశీయంగా 90 శాతం మార్కెట్ వాటా కలిగిన మూడు ప్రభుత్వ రంగ ఇంధన రిటైల్ సంస్థల గణాంకాలివి. మే నెలలో పెట్రోల్ డిమాండ్ 9 శాతం పుంజుకున్న సంగతి తెలిసిందే. జూన్ తొలి అర్ధభాగంలో డీజిల్ వినియోగం 4.8 శాతం క్షీణించింది. 3.26 మిలియన్ టన్నులకు పరిమితమైంది. దేశీయంగా అత్యధిక వినియోగమున్న డీజిల్ ఏప్రిల్‌లో 4 శాతం బలపడగా.. మే నెలలో 2 శాతం వృద్ధి నమోదైంది. ఈ నెల తొలి రెండు వారాల్లో పెట్రోల్ అమ్మకాలు 7 శాతం తగ్గాయి. మే నెల 1-15 మధ్య 1.5 మిలియన్ టన్నుల పెట్రోల్ వినియోగం నమోదైంది. అయితే 2023 జూన్ 1-15తో చూస్తే వినియోగం 7 శాతం ఎగసింది. మరోపక్క ఇదే కాలంలో డీజిల్ డిమాండ్ 5.2 శాతం క్షీణించగా.. వినియోగం మే నెలతో పోలిస్తే 3.1 శాతం తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెరగడానికి వినియోగం ఊతమిచ్చింది.

ఏషియన్ పెయింట్స్ షేర్ల విక్రయం

లావాదేవీల విలువ రూ. 1,876 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్‌కు చెందిన 85 లక్షల షేర్లను డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ విక్రయించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 2,207 సగటు ధరలో 0.88 శాతం వాటాకు సమానమైన 85 లక్షల ఏషియన్ పెయింట్స్ షేర్లను ఆర్ఐఎల్ అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,876 కోట్లుకాగా.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ వీటిని కొనుగోలు చేసింది. ఈ డీల్ తదుపరి ఏషియన్ పెయింట్స్‌లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ వాటా 1.24 శాతం నుంచి 2.12 శాతానికి బలపడింది. కాగా.. గత గురువారం సైతం ఆర్ఐఎల్.. 3.64 శాతం వాటాకు సమానమైన 3.5 కోట్ల ఏషియన్ పెయింట్స్ షేర్లను విక్రయించిన సంగతి తెలిసిందే.

ఎన్ఎస్ఈలో ఏషియన్ పెయింట్స్ షేరు 1.2 శాతం లాభపడి రూ. 2,241 వద్ద ముగిసింది.

కార్డీలియా క్రూయిజెస్ ఐపీవో బాట...

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

- త్వరలో ఆగ్నేయాసియాకు సర్వీసులు
- మరో రెండు షిప్పులు జత..

న్యూఢిల్లీ: లగ్జరీ క్రూయిజ్‌ల నిర్వాహక కంపెనీ వాటర్‌వేస్ లీజర్ టూరిజం పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 727 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులలో దాదాపు రూ. 553 కోట్లను డిపాజిట్ లేదా అడ్వాన్స్‌డ్ లీజ్ రెంటల్‌కు చెల్లించనుంది. అనుబంధ సంస్థ బేక్రూయిజ్ షిప్పింగ్ అండ్ లీజింగ్(ఐఎఫ్ఎస్‌సీ) ప్రయివేట్ లిమిటెడ్‌కు నెలవారీ లీజు చెల్లింపులకు సైతం వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కార్డీలియా క్రూయిజెస్ బ్రాండుతో ప్రస్తుతం వాటర్‌వేస్ లీజర్ ఎంవీ ఎంప్రెస్ క్రూయిజ్ వెస్సల్‌ను నిర్వహిస్తోంది. నార్వేజియన్ స్కై, నార్వేజియన్ సన్ అనే మరో రెండు క్రూయిజ్‌ల నిర్వహణకు కంపెనీ ప్రణాళికలు వేసింది. ఒక్కో క్రూయిజ్ షిప్ ద్వారా సుమారు 2,000 మంది అతిథులకు సేవలు అందించనుంది. ప్రస్తుతం కంపెనీ నిర్వహిస్తున్న ఎంప్రెస్ క్రూయిజ్ ప్రధానంగా ముంబై, గోవా, కొచ్చి, చెన్నై, లక్షద్వీప్, విశాఖపట్టణం, పుదుచ్చేరిలకు సేవలందిస్తోంది. శ్రీలంకలోని ట్రింకోమలి, జాఫ్నాకు సైతం సర్వీసులు నిర్వహించడంతోపాటు.. ఇటీవలే ఆగ్నేయాసియాకు కూడా సేవలు విస్తరించింది. తొలిసారి ఫుకెట్ (థాయ్‌లాండ్), సింగపూర్, కౌలాలంపూర్ (మలేసియా) తదితర ప్రాంతాలకూ జూలైలో సర్వీసులను మొదలు పెడుతోంది. 2024 డిసెంబర్31తో ముగిసిన తొలి 9 నెలల్లో రూ. 409 కోట్ల ఆదాయం, రూ. 139 కోట్ల నికర లాభం ఆర్జించింది.



మేలో 5.6 శాతానికి నిరుద్యోగం

5.8 శాతానికి మహిళా నిరుద్యోగ రేటు



న్యూఢిల్లీ: నిరుద్యోగ రేటు గత నెల(మే)లో 5.6 శాతానికి పెరిగింది. ఏప్రిల్‌లో ఇది 5.1 శాతంగా నమోదైంది. ప్రధానంగా ఇందుకు కాలానుగుణ వైరుధ్యాలు కారణమైనట్లు ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి. ఈ నెల(జూన్) మొదట్లో గణాంకాలు, పథకాల అమలు శాఖ తొలి నెలవారీ కాలానుగుణ శ్రామిక శక్తి సర్వే(పీఎల్ఎఫ్ఎస్) వివరాలు ప్రకటించింది. రియల్‌టైమ్ ప్రాతిపదికన దేశంలో ఉద్యోగ అర్హతగల నిరుద్యోగుల పర్యవేక్షణలో భాగంగా సర్వేకు తెరతీసింది. తాజాగా వారానికి నమోదు చేసిన(సీడబ్ల్యూఎస్) గణాంకాల ప్రకారం అన్ని వయసుల ప్రజా నిరుద్యోగ రేటు(యూఆర్) 2025 మే నెలలో 5.6 శాతానికి చేరింది. 2025 ఏప్రిల్‌లో ఇది 5.1 శాతంకాగా.. మహిళల్లోనూ నిరుద్యోగిత రేటు 5.8 శాతానికి పెరిగింది. 2025 ఏప్రిల్‌లో ఇది 5.6 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా 15-29 వయసువారిలో నిరుద్యోగిత ఏప్రిల్‌లో నమోదైన 13.8 శాతం నుంచి మే నెలలో 15 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగిత 17.2 శాతం నుంచి 17.9 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో అయితే నిరుద్యోగిత 12.3 శాతం నుంచి మే నెలలో 13.7 శాతానికి చేరింది.

ఎగుమతులు రూ.3.29 లక్షల కోట్లు

మే నెలలో 2 శాతం క్షీణత • ఇంతే మేర తగ్గిన దిగుమతులు

రూ.5.15 లక్షల కోట్లుగా నమోదు • సేవల ఎగుమతులు సానుకూలం



న్యూఢిల్లీ: వరుసగా రెండు నెలల పాటు సానుకూల వృద్ధిని నమోదు చేసిన వస్తు ఎగుమతులు మే నెలలో స్వల్పంగా క్షీణించాయి. మొత్తం 38.73 బిలియన్ డాలర్ల ఎగుమతులు (రూ.3.29 లక్షల కోట్లు) నమోదయ్యాయి. అంతర్జాతీయంగా పెట్రోలియం ధరలు తగ్గడమే ఎగుమతుల విలువ తగ్గడానికి దారితీసినట్టు తెలుస్తోంది. మే నెలలో వాణిజ్య లోటు 21.88 బిలియన్ డాలర్లకు (రూ.1.86 లక్షల కోట్లు) పరిమితమైంది. ఇక మే నెలలో వస్తు దిగుమతులు సైతం క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 1.7 శాతం తగ్గి 60.61 బిలియన్ డాలర్లుగా (రూ.5.15 లక్షల కోట్లు) ఉన్నట్టు ప్రభుత్వం విడుదల చేసిన డేటా స్పష్టం చేసింది. బంగారం, ముడి చమురు దిగుమతులు క్షీణించడం మొత్తం మీద దిగుమతులు తగ్గేందుకు సానుకూలించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలలు (ఏప్రిల్-మే) కలిపి చూస్తే వస్తు ఎగుమతులు క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల కంటే 3.11 శాతం అధికంగా 77.19 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో దిగుమతులు సైతం 8 శాతం పెరిగి 125.52 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వాణిజ్య లోటు 48.33 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతర్జాతీయంగా అనిశ్చితులు పెరగడం, ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు ఎగుమతులు తగ్గడానికి కారణమని తెలుస్తోంది. తాజాగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఎగుమతుల పరంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్న దానిపై కేంద్ర వాణిజ్య శాఖ ఈ వారంలోనే అంతర్ మంత్రిత్వ శాఖ సమావేశం నిర్వహించనుంది.

సేవల ఎగుమతులు జూమ్

మే నెలలో సేవల ఎగుమతులు 33 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2024 మే నెలలో ఇవి 29.61 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. సేవల దిగుతులు సైతం మే నెలలో 17.14 బిలియన్ డాలర్లకు పెరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో ఇవి 16.88 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

సవాళ్ల మధ్య మెరుగైన పనితీరు

అంతర్జాతీయంగా ఎన్నో అనిశ్చితులు నెలకొన్న తరుణంలోనూ ఏప్రిల్, మే నెలల్లో ఎగుమతుల పరంగా భారత్ మెరుగైన పనితీరు చూపించినట్టు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భత్వాల్ తెలిపారు. వాణిజ్యానికి సంబంధించి విధానపరమైన అనిశ్చితులు, పలు దేశాల మధ్య ఘర్షణలను ప్రస్తావించారు. బ్రిటన్, ఈయూ, యూఎస్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల దిశగా వాణిజ్య శాఖ చురుగ్గా పనిచేస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులను ఎగుమతిదారులు సర్దుబాటు చేసుకుంటున్నట్టు భారత ఎగుమతిదారుల సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) ప్రెసిడెంట్ ఎస్‌సీ రల్హాన్ పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రయ్..

- బియ్యం, ఐరన్‌ఓర్, రత్నాభరణాలు, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఉత్పత్తులు దిగుమతులు క్షీణించడానికి దారితీశాయి.
- ముఖ్యంగా పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు మే నెలలో 30 శాతం తగ్గి 5.6 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.
- ముడి చమురు దిగుమతులు 26 శాతం తగ్గి 14.75 బిలియన్ డాలర్లు, బంగారం దిగుమతులు 12.6 శాతం తగ్గి 2.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- తేయాకు, కాఫీ, దినుసులు, రెడీమేడ్ వస్త్రాలు, కెమికల్స్, సముద్ర ఉత్పత్తులు, ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు సానుకూలంగా నమోదయ్యాయి.
- ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఎగుమతులు 54 శాతం పెరిగి 45.7 బిలియన్ డాలర్లకు చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-6-2025

విశాఖ	550-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	404	2.49
HDFCLIFE	770.5	2.34
SBILIFE	1,795.00	2.27
ULTRACEMCO	11,471.00	2.2
TECHM	1,693.30	2.07

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	294	-0.02
TATAMOTORS	685.3	-3.76
DRREDDY	1,350.00	-0.92
SUNPHARMA	1,679.00	-0.52
ADANIPORTS	1,400.20	-0.34

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,744
ఎన్ఎస్ఈ	91,121
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,51,447
ఎఫ్ఐఐ	- 2,539
డీఐఐ	+ 5,781

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.99	$ 71.29
బ్రెంట్	72.89	$ 74.23

చెన్నై ఓపెన్ పునరాగమనం

ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహణ

చెన్నై: తమిళనాడు టెన్నిస్ అసోసియేషన్ (టీఎన్‌టీఏ) అధ్యక్షుడు, భారత మేటి ప్లేయర్ విజయ్ అమృత్‌రాజ్ కృషి ఫలించింది. మూడేళ్ల తర్వాత చెన్నై ఓపెన్ భారత టెన్నిస్‌లో పునరాగమనం చేయనుంది. ఈ అక్టోబర్‌లో టోర్నీ నిర్వహణకు మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ఆమోదం తెలిపింది. అక్టోబర్ 27 నుంచి మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయని టీఎన్‌టీఏ అధ్యక్షుడు విజయ్ అమృత్‌రాజ్ తెలిపారు. 'మొత్తానికి మా ప్రయత్నాలు ఫలించాయి. చెన్నైలో మేటి అంతర్జాతీయ టెన్నిస్ టోర్నీకి మార్గం సుగమమైంది. ఈ టోర్నీని తిరిగి నగరంలో నిర్వహించాలనే మా ప్రయత్నాలకు మొదటి నుంచి వెన్నంటే ఉండి సహకరించిన తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వానికి, తమిళనాడు స్పోర్ట్స్ అథారిటీకి కృతజ్ఞతలు' అని విజయ్ అన్నారు. ప్రముఖ స్పోర్ట్స్ చానెల్ నెట్‌వర్క్ ఈ టోర్నీ మ్యాచ్‌లను ప్రసారం చేస్తుందన్నారు. చెన్నై అభిమానులు, భారత టెన్నిస్ ప్రియులు ఈ ఈవెంట్‌ను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. చివరి సారిగా చెన్నై ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టోర్నమెంట్‌ను 2022లో నిర్వహించారు. చెక్ రిపబ్లిక్ ప్లేయర్ లిండా ఫ్రువిర్తొవా సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది.


2022 చెన్నై ఓపెన్ విజేత లిండా (ఫైల్)



లండన్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఎంజీడీ-1 జట్టు. ఎంజీడీ-1 జట్టులో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత నంబర్‌వన్ ఇరిగేశి అర్జున్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్, డేవిడ్ గుజారో, లియోన్ ల్యూక్ మెండోకా, స్టావ్‌రూలా, అథర్వ త్రైడే సభ్యులుగా ఉన్నారు. ఇదే టోర్నీ బ్లిట్జ్ విభాగంలో ఎంజీడీ-1 జట్టు ఐదో స్థానంలో నిలిచింది.

ప్రపంచ రికార్డు నంబర్ 12

12వసారి ప్రపంచ రికార్డు నెలకొల్పిన స్వీడన్ పోల్ వాల్టర్ మోండో డుప్లాంటిస్

స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్ మీట్‌లో 6.28 మీటర్ల ఎత్తును అధిగమించిన ఒలింపిక్ చాంపియన్



స్టాక్‌హోమ్: అథ్లెటిక్స్ కెరీర్‌లో ఎలాంటి రికార్డులు నమోదు చేయకుండానే కెరీర్‌ను ముగించిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారు. ఒకట్రెండుసార్లు ప్రపంచ రికార్డులు నమోదు చేసిన వారు కొందరున్నారు. అయితే ప్రపంచ రికార్డులు సృష్టించడం... వాటిని బద్దలు కొట్టడం అలవాటుగా మార్చుకున్న వారు అతికొద్ది మందే ఉన్నారు. ఈ జాబితాలో అగ్రభాగాన చేరే దిశగా స్వీడన్ పోల్‌వాల్టర్ మోండో డుప్లాంటిస్ మరో అడుగు వేశాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ మీట్‌లో 25 ఏళ్ల మోండో డుప్లాంటిస్ 'మ్యాజిక్' చేశాడు. అందరూ అబ్బురపడే విధంగా ఏకంగా 12వసారి పురుషుల పోల్ వాల్ట్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఎనిమిది మంది పోటీపడ్డ పోల్ వాల్ట్ ఈవెంట్‌లో డుప్లాంటిస్ ఏడో ప్రయత్నంలో 6.28 మీటర్ల ఎత్తుకు ఎగిరి కొత్త ప్రపంచ రికార్డును లిఖించాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫ్రాన్స్‌లో జరిగిన మీట్ సందర్భంగా 6.27 మీటర్లతో తానే నెలకొల్పిన ప్రపంచ రికార్డును డుప్లాంటిస్ బద్దలు కొట్టాడు. మార్షల్ కుర్టిస్ (ఆస్ట్రేలియా; 5.90 మీటర్లు) రెండో స్థానంలో... మెనో వ్లూన్ (నెదర్లాండ్స్; 5.80 మీటర్లు) మూడో స్థానంలో నిలిచారు.

2020లో మొదలై...

ఐదేళ్ల క్రితం పోలాండ్‌లో జరిగిన మీట్‌లో డుప్లాంటిస్ 6.17 మీటర్ల ఎత్తుకు ఎగిరి తొలిసారి ప్రపంచ రికార్డు సృష్టించాడు. 6.16 మీటర్లతో రెనాడ్ లావిలెని (ఫ్రాన్స్) పేరిట ఉన్న వరల్డ్ రికార్డును డుప్లాంటిస్ తిరగరాశాడు. అప్పటి నుంచి డుప్లాంటిస్ వెనుదిరిగి చూడలేదు. 2020లో రెండోసారి... 2022లో మూడుసార్లు... 2023లో రెండుసార్లు... 2024లో మూడుసార్లు... 2025లో రెండుసార్లు అతను ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2020 టోక్యో ఒలింపిక్స్... 2024 పారిస్ ఒలింపిక్స్...2022 ప్రపంచ చాంపియన్‌షిప్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణ పతకాలు నెగ్గిన డుప్లాంటిస్ గత నాలుగేళ్లుగా డైమండ్ లీగ్‌లో విజేతగా నిలుస్తున్నాడు. 2022, 2024, 2025లలో జరిగిన ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ఈ స్వీడన్ స్టార్ స్వర్ణాలు గెలిచాడు.



17 పురుషుల, మహిళల పోల్ వాల్ట్ విభాగాల్లో అత్యధిక సార్లు ప్రపంచ రికార్డులు సృష్టించిన ఘనత సెర్గీ బుబ్కా (ఉక్రెయిన్). ఎలీనా ఇసిన్‌బయేవా (రష్యా)ల పేరిట ఉంది. వీరిద్దరూ 17 సార్లు చొప్పున ప్రపంచ రికార్డులు సృష్టించారు. డుప్లాంటిస్ ఇదే జోరు కొనసాగిస్తే భవిష్యత్‌లో అగ్రస్థానంలోకి వచ్చే అవకాశాలున్నాయి.



రఫ్ఫాడించిన రసెల్

కెనడా గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన మెర్సిడెస్ డ్రైవర్

- ఆద్యంతం ఆధిపత్యం చలాయించి సీజన్‌లో తొలి విజయం నమోదు
- రెండో స్థానంతో సరిపెట్టుకున్న వెర్‌స్టాపెన్
- సహచరుడు లాండో నోరిస్‌ను 'ఢీ'కొట్టిన మెక్‌లారెన్ డ్రైవర్ పియాస్ట్రి



మాంట్రియల్: 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించి మొదట్లోనే ఆధిక్యంలోకి దూసుకెళ్లిన మెర్సిడెస్ జట్టు డ్రైవర్ జార్జి రసెల్ చివరి ల్యాప్ వరకు అదే జోరును కనబరిచాడు. వెరసి ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన కెనడా గ్రాండ్‌ప్రిలో బ్రిటన్‌కు చెందిన 27 ఏళ్ల రసెల్ విజేతగా అవతరించాడు. నిర్ణీత 70 ల్యాప్‌లను రసెల్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా ఒక గంట 31 నిమిషాల 52.688 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఓవరాల్‌గా రసెల్ కెరీర్‌లో ఇది నాలుగో విజయం. ప్రస్తుత ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గత స్పానిష్ గ్రాండ్‌ప్రి రేసు సందర్భంగా రసెల్ కారును ఢీకొట్టిన ఉదంతంలో వెర్‌స్టాపెన్‌పై అందరి దృష్టి నిలిచింది. కెనడా గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ సాఫీగా ముందుకుసాగడంతో ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. తదుపరి ఆస్ట్రియా గ్రాండ్‌ప్రిలోనూ వెర్‌స్టాపెన్ దూకుడుగా వ్యవహరిస్తే అతనిపై ఒక రేసు సస్పెన్షన్ పడే అవకాశముంది. ఈ సీజన్‌లో అదరగొడుతున్న మెక్‌లారెన్ జట్టు డ్రైవర్లు ఆస్కార్ పియాస్ట్రి, లాండో నోరిస్‌లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. 66వ ల్యాప్‌లో పియాస్ట్రి, నోరిస్ కార్లు పరస్పరం ఢీకొట్టుకున్నాయి. దాంతో నోరిస్ రేసు పూర్తి చేయకుండానే వైదొలిగాడు. మరోవైపు పియాస్ట్రి నాలుగో స్థానంతో సంతృప్తి పడ్డాడు. లియామ్ లాసన్ (వీసా క్యాష్ యాప్ రేసింగ్ బుల్స్), అలెగ్జాండర్ ఆల్బోన్ (విలియమ్స్) కూడా రేసును పూర్తి చేయలేకపోయారు. 24 రేసుల తాజా సీజన్‌లో ఇప్పటికి 10 రేసులు ముగిశాయి. డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో 198 పాయింట్లతో పియాస్ట్రి అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 176 పాయింట్లతో లాండో నోరిస్ రెండో స్థానంలో, 155 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. కన్‌స్ట్రక్టర్స్ చాంపియన్‌షిప్‌లో మెక్‌లారెన్ 374 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. సీజన్‌లోని తదుపరి రేసు ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి ఈనెల 29న జరుగుతుంది.

కెనడా గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	జార్జి రసెల్	మెర్సిడెస్	70	1:31:52.688 సెకన్లు	-	25
2	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	70	1:31:52.916 సెకన్లు	0.228 సెకన్లు	18
3	ఆంటోనెలి	మెర్సిడెస్	70	1:31:53.702 సెకన్లు	1.014 సెకన్లు	15
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	70	1:31:54.797 సెకన్లు	2.109 సెకన్లు	12
5	లెక్‌లెర్క్	ఫెరారీ	70	1:31:56.130 సెకన్లు	3.442 సెకన్లు	10
6	హామిల్టన్	ఫెరారీ	70	1:32:03.401 సెకన్లు	10.713 సెకన్లు	8
7	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	70	1:32:03.660 సెకన్లు	10.972 సెకన్లు	6
8	హుల్కెన్‌బర్గ్	స్టేక్ కిక్ సాబెర్	70	1:32:08.502 సెకన్లు	15.364 సెకన్లు	4
9	ఒకాన్	మనీగ్రామ్ హాస్	69	1:31:54.161 సెకన్లు	1 ల్యాప్	2
10	సెయింజ్	విలియమ్స్	69	1:31:54.574 సెకన్లు	1 ల్యాప్	1

భారత్‌లో ఈక్వెస్ట్రియన్ ఈవెంట్లన్నీ రద్దు

న్యూఢిల్లీ: భారత్‌లోని ఈక్వెస్ట్రియన్ క్రీడాకారులకు, ఆటకు మింగుడు పడని కబురు ఇది. భారత ఈక్వెస్ట్రియన్ సమాఖ్య (ఈఎఫ్ఐ)లో అంతర్గత కుమ్ములాటలకు ఇప్పుడు ప్రతిభావంతులైన ఈక్వెస్ట్రియన్లు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పదేపదే హెచ్చరించినా తీరుమార్చుకోని భారత సమాఖ్యపై అంతర్జాతీయ ఈక్వెస్ట్రియన్ సమాఖ్య (ఎఫ్ఈఐ) కన్నెర్ర జేసింది. భారత్‌లోని అన్ని రకాల టోర్నీలను ఉన్నపళంగా రద్దు చేసింది. దీనివల్ల దేశవాళీ, అంతర్జాతీయ టోర్నీలు కలుపుకొని 24 ఈవెంట్లు పోటీలకు దూరమయ్యాయి. కొన్నేళ్లుగా ఈఎఫ్ఐ వ్యవహారాలు సజావుగా జరగడం లేదు. కుమ్ములాటలకు తోడు ఆర్థిక అవకతవకల నేపథ్యంలో భారత సమాఖ్య బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ (నిలుపుదల) చేశారు. సమస్యలు రోజురోజుకీ పెరుగుతుండటం, అంతర్జాతీయ సమాఖ్య అధికారులకు బకాయిలు పేరుకుపోవడంతో చేసేదేమీ లేక ఎఫ్ఈఐ భారత్‌లో జరిగే ఈవెంట్లను రద్దు చేసింది.


ముందుగా మీరట్ ఈవెంట్

నిజానికి అంతర్జాతీయ సమాఖ్య (ఎఫ్ఈఐ) తీసుకున్న ఆకస్మిక నిర్ణయం కాదిది! ఈ ఫిబ్రవరిలో 24 నుంచి 28 వరకు మీరట్‌లో జరగాల్సిన ఈవెంట్‌కు ముందే బకాయిల్ని 7వ తేదీలోపు చెల్లించాలని లేదంటే రద్దు చేస్తామని ఎఫ్ఈఐ హెచ్చరించింది. హెచ్చరికల్ని భారత సమాఖ్య పెడచెవిన పెట్టడంతో ఆ ఈవెంట్ అన్నట్లుగానే రద్దు చేసింది. అలాగే ఇకమీదట భారత్‌లో నిర్వహించబోయే ఈవెంట్లకు హాజరయ్యే ఎఫ్ఈఐ అధికారులు, రిఫరీలకు ముందస్తు చెల్లింపులు చేయాలని ఆదేశించింది. అయినాసరే భారత సమాఖ్యలో చలనం లేకపోవడంతో ఇప్పుడు మొత్తం ఈవెంట్లన్నీ రద్దు చేసింది. దీనివల్ల పలు దేశవాళీ టోర్నీలతో పాటు రెండు అంతర్జాతీయ ఈవెంట్లు రద్దయ్యాయి.

జరిగింది ఒక్క మ్యాచ్... గెలిచింది విండీస్!

ఐర్లాండ్‌తో మూడు టి20ల సిరీస్ 1-0తో వశం

- ఆఖరి పోరులో 62 పరుగులతో కరీబియన్ బృందం గెలుపు
- రెండు మ్యాచ్‌లు వర్షంతో రద్దు



ఎవిన్ లూయిస్

బ్రీడి (నార్తర్న్ ఐర్లాండ్): సిరీస్‌లోనే ఒకే ఒక్క మ్యాచ్ గెలిచిన వెస్టిండీస్ మూడు టి20ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి జరిగిన ఆఖరి పోరులో కరీబియన్ జట్టు 62 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. ఇదే వేదికపై జరగాల్సిన మొదటి రెండు టి20లు వర్షంతో రద్దయ్యాయి. దీంతో విండీస్ 1-0తో సిరీస్ గెలుచుకుంది. చివరి టి20లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఓపెనర్లు ఎవిన్ లూయిస్ (44 బంతుల్లో 91; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు), షై హోప్ (27 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచేశారు. తొలి వికెట్‌కు ఇద్దరు 10.3 ఓవర్లలో 122 పరుగులు జోడించారు. లూయిస్ 29 బంతుల్లో అర్ధసెంచరీ బాదగా జట్టు 8.3 ఓవర్లలోనే వందకు చేరుకుంది. కెప్టెన్ హోప్ 23 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. 17.3 ఓవర్లలో జట్టు 200 స్కోరు దాటింది. మిగతా బ్యాటర్లలో కీసీ కార్టి (22 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) చెలరేగాడు.

ఐర్లాండ్ బౌలింగ్ చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే ఒక బౌలర్ హంఫ్రెస్ కోటా ఓవర్లు వేసి 16 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీయగా, మరో బౌలర్ లియామ్ మెకార్థీ అసలు వికెట్టే తీయకుండా ఏకంగా 81 పరుగులు సమర్పించుకొని టి20ల్లో రెండో చెత్త బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. గతేడాది జింబాబ్వేపై గాంబియా బౌలర్ జోబర్తే 4 ఓవర్లలో 93 పరుగులు సమర్పించుకొని చెత్త రికార్డు నెలకొల్పాడు. తర్వాత కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసి పోరాడింది. రాస్ అడైర్ (36 బంతుల్లో 48; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), హ్యారీ టెక్టర్ (25 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్క్ అడైర్ (14 బంతుల్లో 31 నాటౌట్; 4 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అకీల్ హోసేన్ 3, హోల్డర్ 2 వికెట్లు తీశారు. వెస్టిండీస్ త్వరలోనే ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఆతిథ్యమివ్వనుంది. ఇటీవల ముగిసిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ ఆసీస్ సఫారీకి గదను సమర్పించుకున్న సంగతి తెలిసిందే. నెల 25 నుంచి బార్బడోస్‌లో జరిగే తొలిటెస్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్ మొదలవుతుంది. ఇది కాగానే ఐదు టి20ల ద్వైపాక్షిక సిరీస్‌లో ఇరుజట్లు తలపడతాయి.

వయో నిర్ధారణకు మరో పరీక్ష

బీసీసీఐ నిర్ణయం



న్యూఢిల్లీ: క్రీడల్లో తరచూ తప్పుడు వయో ధ్రువీకరణ సమస్యగా మారుతోంది. ముఖ్యంగా పలు వయో విభాగాల ఈవెంట్లలో పెను విమర్శలు తావిస్తోంది. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కఠినంగా వ్యవహరిస్తోంది. అండర్-15, అండర్-16, అండర్-19 క్రికెట్ ఆడే టీనేజర్ల అసలైన వయసు ధ్రువీకరణ కోసం పరీక్షలు చేయిస్తోంది. ఇప్పుడు కచ్చితమైన వయో నిర్ధారణకు అదనంగా మరో బోన్ మ్యారో (ఎముక వయసు పరీక్ష) టెస్టు చేస్తామని బోర్డు ప్రకటించింది. దీనివల్ల అర్హత గల క్రికెటర్లకు నష్టం వాటిల్లకుండా, అనర్హులను దూరం పెట్టేలా అదనపు పరీక్ష ఉపయోగపడుతుందని బోర్డు భావిస్తోంది. క్రితంసారి అండర్-16లో పాల్గొన్న క్రికెటర్ మరో ఏడాది ఆ వయో విభాగంలో పాల్గొనాలంటే ఈ పరీక్షకు హాజరై నెగ్గాల్సి ఉంటుంది. ఒకవేళ క్రితం ఏడాదే ఎముక పరీక్షలో ఓ సంవత్సరం పిన్న అని తేలితే మాత్రం మరుసటి ఏడాది ఆ పరీక్షను చేయరు. ఉదాహరణకు అండర్-16 బాలుర క్రికెట్‌లో కటాఫ్ వయసు 16.5 ఏళ్లు. అంటే పరీక్ష సమయంలో ఎముక వయసు 16.4 ఏళ్లు మాత్రమే ఉండాలి. లేదంటే ఆ సీజన్‌లో అనుమతించరు. అండర్-15 బాలికల క్రికెట్‌లో కటాఫ్ వయసు 15 ఏళ్లు. అయితే ఎముక పరీక్ష సమయంలో 14.9 ఏళ్లే ఉండాలి. గత సీజన్‌లో ఆ బాలిక బోన్ మ్యారో టెస్టులో వయసు 13.9 అని నిర్ధారణ అయితే మరుసటి సీజన్‌లో టెస్టు పెట్టకుండానే అనుమతిస్తారు.



ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రదర్శించిన ఎంబీడీఏ కంపెనీ రూపకల్పన చేసిన లాంగ్ రేంజ్ క్షిపణి. గగనతలం నుంచి ప్రయోగించే వీలుంటుంది



ఇది విద్యుచ్ఛక్తితో నడిచే అత్యాధునిక బీటా 50 విమానం. పారిస్ ఎయిర్ షోలో ప్రయోగాత్మక పరీక్షలో సోమవారం ఇది అందరినీ ఆకర్షించింది.



గోవా షిప్‌యార్డ్ నిర్మించిన ఐదో శక్తివంతమైన ఫాస్ట్ పెట్రోల్ వెసల్ (ఎఫ్‌పీవీ) నౌక ఇది. భారత తీర రక్షక దళంలో సేవలందించనుంది.

మోదీ సైప్రస్ యాత్ర... తుర్కియేకు గట్టి హెచ్చరిక!

ప్రపంచ దేశాల్లో మనవారెవరు, పరాయివారెవరు అన్నదానిపై ఆపరేషన్ సిందూర్‌తో భారత్‌కు బాగా స్పష్టత వచ్చింది. ముఖ్యంగా తుర్కియే నైజం పూర్తిస్థాయిలో బయటపడింది. అప్పట్లో భూకంపంతో కకావికలమైన వేళ అందరికంటే ముందుగా స్పందించి అన్నివిధాలైన సాయం పంపి ఆదుకున్న భారత్ పట్ల సిందూర్ వేళ తుర్కియే అక్షరాలా విషం కక్కింది. పాకిస్తాన్‌కు డ్రోన్లతో పాటు అన్నివిధాలా సాయుధ సాయం చేసి మనపట్ల కృతఘ్నత ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్ తర్వాత తన తొలి విదేశీ పర్యటనకు అనూహ్యంగా సైప్రస్‌ను ఎంచుకోవడం ఆశ్చర్యపరిచింది. ఇది యాదృచ్ఛికమేమీ కాదని విదేశాంగ నిపుణులు అంటున్నారు. ఈ చర్య ద్వారా తుర్కియేకు గట్టి సందేశమే ఇచ్చారని విశ్లేషిస్తున్నారు. ఆదివారం మోదీ సైప్రస్‌లో పర్యటించారు. ఒక భారత ప్రధాని ఆ దేశానికి వెళ్లడం 23 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. ఈ ఎంపిక వెనక పలు భౌగోళిక, రాజకీయ ప్రాథమ్యాలు దాగున్నాయి. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు మోదీ ఈ యాత్ర చేపట్టారు. అంతేగాక విమానాశ్రయంలో మోదీని ఆయన స్వయంగా స్వాగతించారు. సైప్రస్ అత్యున్నత పురస్కారంతో గౌరవించారు. తద్వారా భారత్‌తో మైత్రీ బంధానికి తాము అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. మోదీ ఆయనతో ద్వైపాక్షిక చర్చలు జరపడమే గాక వ్యాపార దిగ్గజాల సదస్సులో కూడా పాల్గొన్నారు. ప్రధాని సైప్రస్ యాత్రకు పలు రకాలుగా ప్రాధాన్యముంది.

ఉగ్రపోరులో దన్ను

కశ్మీర్ విషయంలో తుర్కియే తొలి నుంచీ పాక్‌కు మద్దతిస్తూ వస్తోంది. ఇక ఇరుదేశాల మధ్య ఘర్షణలు తలెత్తితే తను ఎటువైపో సిందూర్ వేళ కుండబద్దలు కొట్టింది. ఉగ్రవాదం పట్ల కూడా దానిది తొలినుంచీ మెతక వైఖరే. కానీ సైప్రస్ అలా కాదు. కశ్మీర్ విషయంలో ఎప్పుడూ భారత్‌కు మద్దతుగా ఉంటూ వస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించాల్సిందేనన్న మన వైఖరికి మొదటినుంచీ పూర్తిగా దన్నుగా నిలిచింది. పహల్గాం ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించింది. అంతేగాక పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదాన్ని యూరోపియన్ యూనియన్ వేదికపై ఎండగడతానని హామీ ఇచ్చింది. ఈ విషయమై ఈయూ దేశాల నుంచి మనకు మద్దతు కూడగట్టింది. 2026లో ఈయూ సారథ్య బాధ్యతలు కూడా చేపట్టనుంది. ఈ నేపథ్యంలో సైప్రస్ మద్దతు భారత్‌కు చాలా కీలకం. అంతేగాక ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని ఎప్పటినుంచో కోరుతోంది. భారత్-అమెరికా పౌర అణు ఒప్పందానికి కూడా మద్దతుదారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్‌కు సైప్రస్ పూర్తిగా నమ్మదగ్గ మిత్రుడని విదేశాంగ శాఖ పేర్కొనడంలో అంతరార్థం కూడా అదే. పహల్గాం నేపథ్యంలో ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తోడు నిలిచిన మిత్ర దేశాలకు కృతజ్ఞత తెలిపేందుకు తాజా మూడు దేశాల పర్యటన చక్కని అవకాశమని మోదీ ప్రకటించారు కూడా.

తుర్కియేతో వైరం

వీటికి తోడు తుర్కియేతో సైప్రస్‌కు నడుమ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వాటి నడుమ విభేదాలు ఈనాటివి కావు. సైప్రస్‌ను ఆక్రమించాలని గ్రీస్ ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. 1974లో అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రకు గ్రీస్ పూర్తిగా సహకరించింది. అదే అదనుగా తుర్కియే మరోవైపు నుంచి సైప్రస్‌పై దండెత్తింది. నాడు ఆక్రమించిన భూభాగాల నుంచి నేటికీ వైదొలగలేదు.

వర్తక పరంగానూ...

అంతేగాక మోదీ పర్యటన సందర్భంలో వర్తక, ఇంధన తదితర రంగాల్లో భారత్‌తో సైప్రస్ కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దీనికి తోడు భారత్-పశ్చిమాసియా-యూరప్ ఆర్థిక కారిడార్‌లో భౌగోళికంగా సైప్రస్ అత్యంత వ్యూహాత్మక స్థానంలో ఉంది. ఆ దేశంలో అతి పెద్ద బ్యాంకుల్లో ఒకటైన యూరో బ్యాంక్ ముంబైలో ప్రాతినిధ్య కార్యాలయం ఏర్పాటు చేయనుంది. సానుకూల పన్నుల వ్యవస్థ, అద్భుతమైన ఆర్థిక సేవల రంగం, బాగా అభివృద్ధి చెందిన షిప్పింగ్ రంగం మనకు వర్తక పరంగా బాగా అనుకూలించే విషయాలు. తూర్పు మధ్యధరా ప్రాంతంలో సహజ వాయువు వెలికితీత ప్రాజెక్టుల్లో సైప్రస్ కీలక భాగస్వామి కూడా.

- సాక్షి, నేషనల్ డెస్క్

సుదూర విశ్వంలో బుల్లి గెలాక్సీలు

జేమ్స్ వెబ్ కంటికి చిక్కాయి

- 1,300 కోట్ల ఏళ్ల నాటివి
- వాటివల్లే పారదర్శక విశ్వం
- అలా మన ఉనికికి కారణమయ్యాయి

అవడానికి అవి చిట్టి పొట్టి గెలాక్సీలే. కానీ వాస్తవానికి మహా గట్టి గెలాక్సీలు. అటూ ఇటుగా ఈ అనంత విశ్వంతో పాటే పురుడు పోసుకున్నాయి. విశ్వం 1,380 కోట్ల ఏళ్ల కింద ఉనికిలోకి వచ్చిందన్నది సైంటిస్టుల మాట. ఈ బుల్లి నక్షత్ర మండలాల వయసు ఏకంగా 1,300 కోట్ల ఏళ్లు! వీటి నుంచి అనూహ్యమైన ఆకుపచ్చని కాంతి అపార పరిమాణంలో వెలువడుతోంది. వెయ్యి కోట్ల పై చిలుకు ఏళ్ల కింద ఎటు చూసినా చిక్కనిబూర్ మాదిరిగా కమ్ముకుని, కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని విశ్వాన్ని పారదర్శకంగా, ఇప్పుడు మనం చూస్తున్న విధంగా మార్చింది ఆ కాంతేనట. ఆ లెక్కన మన ఆవిర్భావం కూడా దాని పుణ్యమేనని సైంటిస్టులు తేల్చారు. అంతటి కీలకమైన కాంతికి ఉద్గమ స్థానమైన బుల్లి గెలాక్సీలను జేమ్స్ వెబ్ టెలీస్కోప్ తాజాగా తన బ్రహ్మాండమైన కెమెరా కంటితో బంధించింది. అంతరిక్ష శాస్త్రవేత్తలు వాటిని ముద్దుగా రెడ్ షిఫ్ట్-7 అని పిలుచుకుంటున్నారు.



ఈ బుల్లి గెలాక్సీలు డజన్లకొద్దీ ఉన్నట్టు జేమ్స్ వెబ్ తేల్చింది. వైశ్విక పునరయానీకరణగా పిలిచే తొలి దశలో వీటి పాత్ర కీలకంగా నిలిచింది. అప్పట్లో విశ్వమంతటా తటస్థ హైడ్రోజన్ వాయువుతో నిండి ఉండేది. దాంతో సర్వత్రా సన్నని పొగమంచు మాదిరి పొర కమ్ముకుని ఉండేది. తొలి 100 కోట్ల ఏళ్లూ ఇదే పరిస్థితి. అలాంటి విశ్వం నేడున్న రూపురేఖలు సంతరించుకుందంటే ఈ

డజన్లకొద్దీ...

గెలాక్సీల్లో నాడు జరిగిన స్టార్ బరస్ట్ వల్లే! అంటే తారల ఆవిర్భావానికి కారణమైన పెను పేలుళ్లు. ఆ క్రమంలో ఈ గెలాక్సీల నుంచి వెలువడ్డ శక్తిమంతమైన పరారుణ రేడియో ధార్మికత హైడ్రోజన్ అణువుల్లోని ఎలక్ట్రాన్లను విడదీసి ఆ వాయువును అయానీకరించింది. గెలాక్సీల్లో నుంచి నేటికీ వెలువడుతున్న ఆ ఆకుపచ్చని ఉద్గారాలను జేమ్స్ వెబ్ సాయంతో పరిశోధకులు గుర్తించారు. గెలాక్సీల సమూహాన్ని అబెల్ 2744గా పిలుస్తున్నారు. దీని తాలూకు అపరిమితమైన గురుత్వాకర్షణ ఒక సహజ పట్టకంగా జేమ్స్ వెబ్‌కు సాయపడింది. విశ్వాన్ని జేమ్స్ వెబ్ తాలూకు నియర్ ఇన్ఫ్రా రెడ్ కెమెరా (ఎన్ఐఆర్ కామ్), ఇన్ఫ్రా రెడ్ స్పెక్ట్రో గ్రాఫ్ (ఎన్ఐఆర్ స్పెక్) లెన్స్ ఏకంగా మరో 400 కోట్ల ఏళ్ల వెనక్కు చూడగలిగాయి. అలా ఈ బుల్లి గెలాక్సీల ఉనికి తొలిసారి బయటపడింది. ఇవి మన పాలపుంత కన్నా ఏకంగా 2 లక్షల రెట్లు చిన్నవి కావడం విశేషం. అయినా మొత్తం విశ్వం అయానీకరణ చెందేందుకు అవసరమైనంత పరారుణ ఉద్గారాలను వెలువరించి గట్టి పిండాలు అనిపించుకున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

సైప్రస్ అధ్యక్షుడికి మోదీ బహుమతులు

న్యూఢిల్లీ: సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పలు బహుమతులు అందజేశారు. చేతితో తయారు చేసిన కాశ్మీరీ సిల్క్ కార్పెట్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కళాకారులు రూపొందించిన వెండి పర్సును బహూకరించారు. ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి నేతలకు భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని చాటిచెప్పే బహుమతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. సైప్రస్ అధ్యక్షుడికి ఇచ్చిన కాశ్మీరీ సిల్క్ కార్పెట్‌కు ఎన్నో విశిష్టతలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. కాశ్మీర్ లోయలోని కళాకారులు శతాబ్దాల నాటి కుట్టు నైపుణ్యాలను ఉపయోగించి, దీన్ని తయారు చేశారని చెప్పారు. అసలు సిసలైన మల్బరీ పట్టు, సహజసిద్ధమైన రంగులు వాడినట్లు పేర్కొన్నారు. ఇక వెండి క్లచ్ పర్సు కూడా విలువైందేనని అన్నారు. సంప్రదాయ లోహపు పనితనం, ఆధునిక రీతులను మేళవించి దీన్ని రూపొందించినట్లు వెల్లడించారు. పర్సుపై ఉన్న పూల డిజైన్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కళాకారుల నైపుణ్యానికి ఇదొక నిదర్శనమని స్పష్టంచేశారు.

ఆహార కేంద్రాల వద్ద కాల్పుల్లో మరో 34 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: ఇజ్రాయెల్-అమెరికా సారథ్యంలో గాజాలో ఏర్పాటైన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన కాల్పుల్లో మరో 34 మంది పాలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్ఎఫ్) అనే ప్రైవేట్ సంస్థ నెలకొల్పిన కేంద్రాల వద్ద గుమికూడిన జనాన్ని నియంత్రించేందుకు నేరుగా ఇజ్రాయెల్ ఆర్మీ కాల్పులకు దిగిందని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. రఫా, సెంట్రల్ గాజాల్లో సోమవారం ఉదయం 4 గంటల సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆహార కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేక మార్గాలను తెరిచింది. అన్నార్తులు ఆహారాన్ని త్వరగా అందుకోవాలనే ఆతురతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని చెబుతున్నారు.

అంబులెన్స్ ఇచ్చేందుకు నిరాకరించిన ఆస్పత్రి.. సంచిలో పసికందు మృతదేహంతో బస్సులో ప్రయాణం

మహారాష్ట్రలో గిరిజనుడి దయనీయ స్థితి

ముంబై: అస్తవ్యస్థమైన ఆరోగ్య వ్యవస్థ అతని కూతురు ప్రాణాలు తీసింది. ప్రభుత్వ ఆస్పత్రుల నిర్లక్ష్యంతో తల్లి కడుపులోనే బిడ్డ ప్రాణాలు పోయాయి. పసికందు శవాన్ని తీసుకెళ్లేందుకు అంబులెన్స్ ఇవ్వడానికి ఆస్పత్రి వర్గాలు నిరాకరించాయి. కూతురు మృతదేహాన్ని సంచిలో వేసుకుని 90 కిలోమీటర్లు ప్రయాణించాడు మహారాష్ట్రకు చెందిన ఓ గిరిజనుడు. జూన్ 12న నాసిక్ జిల్లాలో జరిగిన అత్యంత అమానవీయ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పాల్ఘర్ జిల్లాలోని జోగల్వాడి కుగ్రామానికి చెందిన సఖారామ్ కవార్ భార్య అవిత జూన్ 11న ప్రసవ వేదనకు గురైంది. సమీపంలోని ఖోడాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడానికి అంబులెన్స్ దొరకలేదు. 108కు కాల్ చేస్తే స్పందన రాలేదు. ప్రైవేట్ వాహనంలో పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. గంటసేపు ఎదురుచూసినా డాక్టర్లు రాలేదు. సమీపంలోని మోఖడా గ్రామీణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు నాసిక్ సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అంబులెన్స్ అందుబాటులో లేక మళ్లీ ఆలస్యమైంది. జూన్11న అర్ధరాత్రి దాటిన తరువాత ఆస్పత్రికి చేరుకుంది. తెల్లవారుజామున ఆమెకు చనిపోయిన ఆడ శిశువును ప్రసవించింది. ఆస్పత్రి జూన్ 12న శిశువు మృతదేహాన్ని సఖారామ్‌కు అప్పగించింది. కానీ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఇచ్చేందుకు నిరాకరించింది. బిడ్డను బట్టలో చుట్టుకుని, బస్టాండ్‌కు వెళ్లి.. రూ. 20 క్యారీ బ్యాగ్ కొనుక్కుని, అందులో పెట్టుకుని ఎమ్ఎస్ఆర్టీసీ బస్సులో దాదాపు 90 కిలోమీటర్లు ప్రయాణించాడు. ఏమి మోసుకెళ్తున్నావని ఆయనను ఎవరూ అడగలేదు. ఆ దుఃఖాన్ని ఆయన కూడా ఎవరితో పంచుకోలేదు. అదే రోజు శిశువును ఖననం చేసి.. జూన్ 13న మళ్లీ ఆస్పత్రిలో ఉన్న భార్యకోసం నాసిక్‌కు తిరిగి వచ్చాడు. ఈసారి కూడా అంబులెన్స్ ఇచ్చేందుకు నిరాకరించారు. పచ్చిబాలింత అయిన భార్యను.. బస్సులోనే ఇంటికి తీసుకెళ్లాడు. 'ఆస్పత్రి ఉదాసీనత వల్ల నేను బిడ్డను కోల్పోయాను. ఏ తల్లిదండ్రులకూ ఇలాంటి బాధ ఎదురు కాకూడదు'అంటూ నిస్సహాయతతో కూడిన బాధతో చెప్పాడు సఖారామ్.

యూకే గూఢచార సంస్థ చీఫ్‌గా బ్లేజ్

116 ఏళ్ల బ్రిటన్ చరిత్రలో మొదటి మహిళా అధికారిగా రికార్డు



లండన్: యూకే గూఢచార సంస్థ చీఫ్‌గా బ్లేజ్ మెట్రివెలి నియమితులయ్యారు. సీక్రెట్ ఇంటలిజెన్స్‌సర్వీస్ (ఎమ్ఐ6) చీఫ్‌గా మెట్రివెలిని నియమిస్తున్నట్లు ఆ దేశ ప్రధాని కెయిర్ స్టార్మర్ ప్రకటించారు. 116 ఏళ్ల సంస్థ చరిత్రలో ఇంటలిజెన్స్ సర్వీసెస్ చీఫ్‌గా మహిళా అధికారిని నియమించడం ఇదే మొదటిసారి. ఎన్నడూలేని విధంగా యూకే బెదిరింపులను ఎదుర్కొంటున్న ఈ కీలక సమయంలో మెట్రివెలి బాధ్యతలు స్వీకరించడం చారిత్రాత్మకమని ప్రధాని వ్యాఖ్యానించారు. గూఢచార సంస్థ చీఫ్‌గా బాధ్యతలు తీసుకోవడం గర్వంగా ఉందని మెట్రివెలి అన్నారు. బ్రిటన్ ప్రజల సురక్షితంగా ఉంచడం, దేశ ప్రయోజనాలను కాపాడటంలో ఎంఐ6 కీలక పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. ఏజెన్సీలోని ధైర్యవంతులైన అధికారులు, ఏజెంట్లు, ఇతర అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి విజయవంతంగా కొనసాగడానికి ఎదురుచూస్తున్నానని ప్రకటించారు. 47 ఏళ్ల మెట్రివెలి ప్రస్తుతం ఎంఐ6 సాంకేతికత, ఆవిష్కరణల విభాగం హెడ్ (క్యూ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో యూకే దేశీయ ఇంటలిజెన్స్ సర్వీస్ ఎమ్ఐ5 డైరెక్టర్‌గానూ పనిచేశారు. ఎంఐ6 విధుల్లో భాగంగా మిడిల్ ఈస్ట్, యూరప్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. యూకే గూఢచార సంస్థ సీక్రెట్ ఇంటలిజెన్స్ సర్వీస్‌ను 1909లో స్థాపించారు. ఈ ఏజెన్సీ ఉగ్రవాదం, సైబర్ దాడులు, శత్రుదేశాల బెదిరింపులు వంటివాటిపై దృష్టి సారిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల గూఢచార వ్యవస్థల్లో యూకే ఏజెన్సీ మూడో అత్యుత్తమ గూఢచార సంస్థగా పేరుగాంచింది. యూకే గూఢచార సంస్థను ఎమ్ఐ6గా, ఈ సంస్థ చీఫ్‌ను 'సి'గా పిలుస్తారు. దేశీయ ఇంటలిజెన్స్‌ను ఎంఐ5గా పిలుస్తారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

హాంకాంగ్‌కు తిరిగి వెళ్లిన డ్రీమ్‌లైనర్

ముంబై: హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో టేకాఫ్ అయిన గంట తరువాత సమస్యను గుర్తించిన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. విమానం హాంకాంగ్‌లో క్షేమంగా ల్యాండయ్యిందని, ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిర్ ఇండియా విమానం ఏఐ315 స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.16 గంటలకు హాకాంగ్ నుంచి బయలుదేరింది. 8.50కి టేకాఫ్ కావాల్సిన విమానం.. అప్పటికే మూడున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరింది. టేకాఫ్ అయిన గంట తరువాత విమానం సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వెంటనే విమనాన్ని వెనక్కి మళ్లించారు. మధ్యాహ్నం 1.15 గంటలకు విమానాన్ని హాంకాంగ్‌లో ల్యాండ్‌చేశారు. తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఎయిరిండియా తెలిపింది. ఈ సమస్య ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని హాంకాంగ్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా ప్రమాదం తర్వాత బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌తో సంబంధం ఉన్న జెట్ వెనక్కి తిరిగి వెళ్లడం ఇది రెండోసారి. ఆదివారం.. చెన్నైకి వస్తున్న బ్రిటన్ ఎయిర్‌వేస్ డ్రీమ్‌లైనర్ కూడా సాంకేతిక సమస్య కారణంగా లండన్‌కు తిరిగి వెళ్లింది.

మేం ముందుకు వెళ్లాలనుకోవడం లేదు: పైలట్ ఆడియో విడుదల

విమానంలో సాంకేతిక లోపం గుర్తించిన తర్వాత పైలట్లు ప్రయాణాన్ని కొనసాగించడానికి ఇష్టపడలేదు. 'మేం ముందుకు వెళ్లాలనుకోవడం లేదు'అని పైలట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కి తెలిపారు. ఆ సంభాషణకు సంబంధించిన ఆడియో ఒకటి బయటకు వచ్చింది. ''సాంకేతిక కారణాల వల్ల మేము హాంకాంగ్‌కు దగ్గరగా ఉండాలనుకుంటున్నాం. సమస్య పరిష్కారం అయ్యాక మేం తిరిగి వచ్చి హాంకాంగ్‌లో ల్యాండ్ అవుతాము. ఇలాగే ముందుకు వెళ్లాలనుకోవడం లేదు''అని ఏటీసీకి పైలట్ చెప్పడం ఆడియోలో స్పష్టంగా తెలుస్తోంది.

హైదరాబాద్‌కు వస్తున్న లుఫ్తాన్సా విమానానికి బాంబు బెదిరింపు

ఫ్రాంక్‌ఫర్ట్‌కు తిరిగెళ్లిన విమానం

లండన్/హైదరాబాద్: జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానం బాంబు బెదిరింపుల నేపథ్యంలో యూటర్న్ తీసుకుంది. తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయానికి వెళ్లింది. ఎల్‌హెచ్752 విమానం స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం జర్మనీ నుంచి బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ, ఆ విమానాన్ని లక్ష్యంగా చేసుకుని హైదరాబాద్ విమానాశ్రయానికి బాంబు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో ల్యాండింగ్‌కు నిరాకరించారు. భద్రతా దృష్ట్యా, విమానాన్ని తిరిగి బయల్దేరిన విమానాశ్రయానికి లేదా సమీపంలోని విమానాశ్రయానికి మళ్లించాలని సూచించారు. దీంతో.. లుఫ్తాన్సా విమానం తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్‌కు చేరుకుంది. శుక్రవారం ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం బాంబు బెదిరింపు కారణంగా థాయిలాండ్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది.

'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది'

జనగణన గెజిట్‌పై జైరామ్ రమేష్ విమర్శలు

సాక్షి, న్యూఢిల్లీ: జనగణనపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించడం 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ ఎద్దేవా చేశారు. గెజిట్‌లో కులగణన ప్రస్తావనే లేదని ఆరోపించారు. జనాభా లెక్కల్లో తెలంగాణ మోడల్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సర్వేలో 56 ప్రశ్నలు అడిగాం, ఈ జనాభా లెక్కల్లో 56 ప్రశ్నలు అడిగే ధైర్యం మోదీకి ఉందా? అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం జైరామ్ రమేష్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ' సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 16వ జనాభా లెక్కల కోసం చివరకు నోటిఫికేషన్ జారీ చేశారు. కానీ ఇది కొండను తవ్వి ఎలకను పట్టినట్లుగా గందరగోళంగా ఉంది. ఎందుకంటే.. ఇందులో ఇప్పటికే 30 ఏప్రిల్ 2025న ప్రకటించిన అంశాలను పునరుద్ఘాటిస్తోంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ డిమాండ్‌తో ఒత్తిడి కారణంగా ప్రధాని కుల గణన డిమాండ్‌కు తలొగ్గాల్సి వచ్చింది. ఈ డిమాండ్ చేసిన కాంగ్రెస్ నాయకులను 'అర్బన్ నక్సల్స్' అని కూడా ఆయన అన్నారు. పార్లమెంటు, సుప్రీంకోర్టులో మోదీ ప్రభుత్వం కుల గణన ఆలోచనను పూర్తిగా తిరస్కరించింది. కానీ.. సరిగ్గా 47 రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం స్వయంగా దీనిని ప్రకటించింది. తాజా గెజిట్ నోటిఫికేషన్‌లో కుల గణన గురించి ప్రస్తావించలేదు. ఇది వస్తాద్ ఆఫ్ యూ టర్న్‌కు అలవాటు లాగ మరో యూటర్న్ అవుతుందా? లేక భవిష్యత్తులో దాని వివరాలు బయటకు వస్తాయా? 16వ జనాభా లెక్కల్లో తెలంగాణ నమూనాను అనుసరించాలని కాంగ్రెస్ దృఢంగా విశ్వసిస్తోంది. అంటే, కులాల గణన మాత్రమే కాకుండా, కులాల వారీగా సామాజిక, ఆర్థిక స్థితికి సంబంధించిన వివరణాత్మక సమాచారాన్ని కూడా సేకరించాలి. తెలంగాణ కుల సర్వేలో 56 ప్రశ్నలు అడిగారు. 56 అంగుళాల ఛాతీ ఉందని చెప్పుకునే నాన్ బయోలాజికల్ వ్యక్తి 16వ జనాభా లెక్కల్లో 56 ప్రశ్నలు అడిగేందుకు అవగాహన, ధైర్యం ఉందా? అనేది ఇప్పుడు ప్రధానమైన ప్రశ్న' అని అన్నారు.

నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని సర్ గంగారామ్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉదర సంబంధ సమస్యతో బాధపడుతున్న ఆమె వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని వెల్లడించాయి. 78 ఏళ్ల సోనియాగాంధీ అనారోగ్యంతో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆమె ఆరోగ్యాన్ని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రస్తుతం నిలకడగా ఉందని సర్ గంగారామ్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ తెలిపారు. సోనియాగాంధీ జూన్9న ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

రైల్వే శాఖలో 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్ల పరిధిలో కలిపి ప్రస్తుతం ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందులో సిగ్నల్, టెలికమ్యూనికేషన్ విభాగంతోపాటు మొత్తం 17 రైల్వే జోన్లు, వివిధ ఉత్పత్తి విభాగాలకు చెందిన 51 కేటగిరీల పోస్టులున్నాయి. రైల్వే శాఖ భర్తీ చేయాలని భావించిన దాని కంటే వివిధ విభాగాల్లో ఎక్కువ సంఖ్యలోనే పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు అంటున్నారు. వీటన్నిటినీ భర్తీ చేయ డం ద్వారా ఉద్యోగులపై పనిభారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

యూపీలో రీల్ ఎఫెక్ట్

పామును ముద్దాడేందుకు యత్నం.. కాటేసిన విషసర్పం

మొరాదాబాద్(యూపీ): నాగుపామును ముద్దాడుతూ తీసిన వీడియోను ఆన్‌లైన్‌లో ఉంచి సెన్సేషన్ చేయాలనుకున్న ఓ వ్యక్తి ప్రయత్నం బెడిసికొట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా హైబత్‌పూర్‌లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో బాధితుడు ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. గ్రామానికి చెందిన జితేంద్ర కుమార్(50) ఓ చిన్నపాటి రైతు. గ్రామంలోని ఓ ఇంటి గోడలో ఉన్న విష సర్పాన్ని శుక్రవారం సాయంత్రం అతడు పట్టుకున్నాడు. దాన్తో విన్యాసాలు చేసిన వీడియోలను ఆన్‌లైన్‌లో పెట్టాలని అతడి ఆశ. అందుకే అందరూ చూస్తుండగా దాన్ని మెడలో వేసుకున్నాడు. ఆ తర్వాత దాని తలను నెమ్మదిగా తన నోటి వద్దకు తీసుకువచ్చాడు. ముద్దు పెట్టుకునే ప్రయత్నంలో నాలుకను బయట పెట్టాడు. అనూహ్యంగా అతడి నాలుకపై పాము కాటేసింది. చూస్తున్న వారంతా హాహాకారాలు చేశారు. కొద్దిసేపటికే అతడు సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో ఉన్న జితేంద్ర కుమార్ పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. స్టంట్ సమయంలో జితేంద్ర కుమార్ మద్యం మత్తులో ఉన్నాడని, పొగతాగుతూనే పాముతో ఆటలాడాడని స్థానికులు అంటున్నారు. కాటేసిన వెంటనే జితేంద్ర కుమార్ పామును వదిలేయడంతో అది పొదల్లోకి జారుకుందని చెబుతున్నారు.

యూపీలో బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

నలుగురు మహిళలు మృతి, 12 మందికి గాయాలు

అమ్రోహా (యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లాలో ఓ బాణసంచా ఫ్యాక్టరీలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి చెందారు. 12 మందికి గాయలాయ్యాయి. జిల్లాలోని అత్రాసి గ్రామ సమీపంలోని అడవిలో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాణాసంచా ఫ్యాక్టరీలో ఈ ప్రమాదం జరిగింది. పేలుడుకు కంపెనీ పైకప్పు పూర్తిగా ధ్వంసమయ్యింది. 300 మీటర్ల వరకు శిథిలాలు ఎగిరిపడ్డాయి. అడపాదడపా పేలుళ్లు 15 నిమిషాలపాటు కొనసాగాయి.

'మిన్నెసోటా' దుండగుడు అరెస్ట్

వాషింగ్టన్: అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రానికి చెందిన డెమొక్రాటిక్ పార్టీ ప్రజాప్రతినిధులపై కాల్పులు జరిపిన దుండగుడు ఎట్టకేలకు పట్టుబడ్డాడు. సాయుధుడి కాల్పుల్లో మిన్నెసోటా చట్టసభ సభ్యురాలు మెలిసా హార్ట్‌మన్, ఆమె భర్త మార్క్ చనిపోగా సెనేటర్ జాన్ హాఫ్‌మన్, ఆయన భార్య వైవెట్ గాయపడటం తెల్సిందే. బ్రూక్లిన్ పార్క్ ప్రాంతంలో అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన అమెరికాలో తీవ్ర కలకలానికి కారణమైంది. దాదాపు రెండు రోజుల పాటు భారీగా వేట సాగించిన పోలీసులు నిందితుడు వాన్స్ బోఎల్టర్(57)ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కిల్లర్ తమ కస్టడీలో ఉన్నాడని రామ్సే కౌంటీ షరీఫ్ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఇతడి ఆచూకీ తెలిపిన వారికి 50 వేల డాలర్లిస్తామని అంతకుముందు ఎఫ్‌బీఐ ప్రకటించింది. ఎట్టకేలకు మిన్నెసోటాలోని సిబ్లే కౌంటీలో గ్రీన్ ఐసిల్‌లో సొంతింటికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్నట్లు అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అతడు చేతులెత్తి లొంగిపోవడంతో బేడీలు వేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వాన్స్ బోఎల్టర్ పోలీసు యూనిఫాం ధరించి, తన ఎస్‌యూవీ డిజైన్‌ను పోలీస్ వాహనం మాదిరిగా మార్చి అనుమానం రాకుండా ప్రజాప్రతినిధులను వారి ఇళ్ల వద్దే వెళ్లి తుపాకీతో కాల్చి పరారైన సంగతి తెలిసిందే.

'అహ్మదాబాద్' ఘటనలో 119 మృతదేహాల గుర్తింపు

అహ్మదాబాద్: ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో ఇప్పటిదాకా 119 మంది బాధితులను గుర్తించారు. వీరిలో 76 మృతదేహాలను సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 12న విమానం కుప్పకూలడంతో 270 మందికిపైగా మరణించిన సంగతి తెలిసిందే. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. దాంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మృతదేహాలతోపాటు కుటుంబ సభ్యుల నుంచి నమూనాలు కూడా సేకరించి, డీఎన్ఏ టెస్టుల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. రెండు నమూనాలు సరిపోలితే మృతదేహం ఎవరన్నది సంగతి నిర్ధారణ అవుతోంది. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అధికారులు సోమవారం చెప్పారు. రూపానీ పార్థివదేహాన్ని ఆయన స్వస్థలమైన రాజ్‌కోట్‌కు తరలించారు. మృతుల్లో చాలామంది గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందినవారే ఉన్నారని అహ్మదాబాద్ సిటీ సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ జోషీ చెప్పారు. డీఎన్ఏ పరీక్షలు పూర్తికావడానికి కొంత సమయం పడుతుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని బాధిత కుటుంబాలకు సూచించారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఆర్టికల్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ , ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు. 1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా,నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం,అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ,ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు.

జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.

జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

ఆర్థిక వనరులు

1. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు.
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం.
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రి బ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీరాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్‌సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ.

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
ఎ) ప్రజలు స్వార్థపరులు
బి) ప్రజలే సార్వభౌములు
సి) ప్రజలు చేతకాని వారు
డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
ఎ) గోలక్‌నాథ్ కేసు
బి) మినర్వా మిల్స్ కేసు
సి) ఇందిరా సహానీ కేసు
డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంభించింది?
ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 14 బి) 15
సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
ఎ) 17 బి) 16 (4)
సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300-ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
ఎ) రాజకీయ హక్కు బి) ఆర్థిక హక్కు
సి) పౌర హక్కు డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
ఎ) 80 బి) 81
సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
ఎ) 20 బి) 21
సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
బి) సైమన్ కమిటీ
సి) సర్కారియా కమిటీ
డి) వెంకటాచలయ్య కమిటీ
14. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం?
ఎ) సిక్కిం బి) తమిళనాడు
సి) గోవా డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
ఎ) రాజీవ్‌గాంధీ బి) ఇందిరాగాంధీ
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
ఎ) 49 బి) 50
సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
ఎ) ఎం.ఎన్.రాయ్
బి) రాజేంద్రప్రసాద్
సి) బి.ఆర్.అంబేద్కర్
డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
ఎ) 4 బి) 5
సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
సి) అమెరికా డి) చైనా

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి; 16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?



లోహాల ఉనికి

భూమి వల్కలంలో అత్యంత విస్తారంగా లభించే మూలకం ఆక్సిజన్(45.5 శాతం). ఆక్సిజన్ తర్వాత విస్తృతిని సిలికాన్(27 శాతం) ఆక్రమిస్తుంది. భూపటలంలో లభించే మూలకాల్లో మూడోది, లోహాల్లో మొదటిది అల్యూమినియం(8.3 శాతం). రెండోది ఇనుము(5శాతం). మూలకాల్లో నాలుగో స్థానం, మనిషి ఉపయోగించిన మొదటి లోహం రాగి (కాపర్). అత్యధికంగా వినియోగించే లోహం ఇనుము(ఐరన్).

లోహ సంగ్రహణ

బంగారం(గోల్డ్), ప్లాటినం లాంటి కొన్ని లోహాలు మాత్రమే ప్రకృతిలో స్వాభావికంగా లభిస్తాయి. కార్బన్, సల్ఫర్ భూమి పైపొరల్లో స్వేచ్ఛాస్థితిలో ఉంటాయి. ఉత్కృష్ట వాయువులు గాలిలో స్వేచ్ఛగా ఉంటాయి. ఆక్సిజన్, నైట్రోజన్లు గాలిలో స్వేచ్ఛాస్థితిలో ఉన్నప్పటికీ ఇతర మూలకాల్లో సంయోగ పదార్థాలను ఏర్పరుస్తాయి. దాదాపు మిగిలిన మూలకాలన్నీ ఒకదానితో మరోటి కలిసి భూమి పొరల్లో సంయోగ పదార్థాలుగా ఉంటాయి. సహజంగా లభించే లోహ సంయోగ పదార్థాల నుంచి లోహాన్ని నిష్కర్షించి వేరు చేసే పద్ధతిని 'లోహ నిష్కర్షణ' అంటారు. సమ్మేళనాల నుంచి లోహాలను సంగ్రహించడం, శుద్ధి చేయడంతోపాటు వివిధ మిశ్రమ లోహాలు తయారు చేయడం లోహ సంగ్రహణశాస్త్ర పరిధి లోకి వస్తాయి.

ఖనిజాలు (మినరల్స్)

ప్రకృతిలో లభించే లోహ సమ్మేళనాలు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాల తో కలిసి ఉంటాయి. ఈ విధంగా లభించే లోహాల ముడి పదార్థాలను ఖనిజాలు అంటారు. గనుల నుంచి తవ్వి ఖనిజాలను వెలికి తీస్తారు. అయితే అన్ని ఖనిజాల నుంచి లోహాన్ని వేరు చేయడం లాభదాయకం కాదు. వాణిజ్యపరంగా ఏ ఖనిజం నుంచి లాభదాయకంగా లోహాన్ని వేరు చేస్తారో దాన్ని ఆ లోహధాతువు(ఓర్) అంటారు. ఉదాహరణకు అల్యూమినియం.. బాక్సైట్ రూపంలో, కయోలినైట్ అనే బంకమన్ను.. కోరండం, డయాస్పోర్‌లుగా లభిస్తాయి. ఇవన్నీ అల్యూమినియం ఖనిజాలు. కానీ అల్యూమినియం లోహాన్ని 'బాక్సైట్' నుంచి మాత్రమే లాభసాటిగా సంగ్రహిస్తారు. అందువల్ల బాక్సైట్‌ను అల్యూమినియం ధాతువుగా పరిగణిస్తారు.

ఎక్కువ శాతం లోహాలు ఆక్సైడ్లుగా లభిస్తాయి. ఇతరత్రా కార్బొనేట్లు, సల్ఫేట్లు, సల్ఫైడ్లు, క్లోరైడ్‌ల రూపాల్లో లభిస్తాయి.

ధాతువును ఎంచుకునేటప్పుడు కేవలం ఆర్థికాంశాలే కాకుండా పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు సల్ఫైడ్ ఖనిజమైన 'ఐరన్ పైరైటీస్' నుంచి ఐరన్‌ను సంగ్రహిస్తే అది వాతావరణాన్ని కలుషితం చేసి ఆమ్ల వర్షాలకు కారణమయ్యే 'సల్ఫర్ డై ఆక్సైడ్'ను విడుదల చేస్తుంది. కాబట్టి ఆక్సైడ్ ఖనిజాలైన హైమటైట్ లాంటి ఖనిజాలను ఉపయోగిస్తారు.

ఖనిజ రూపం	ఖనిజాలు
ఆక్సైడ్	బాక్సైట్, హెమటైట్, మాగ్నటైట్, మోనోజైట్, సిలికా, జింకైట్ (ఫిలాసఫర్స్ ఊల్).
కార్బొనేట్	సున్నపురాయి, మాలకైట్, కాలమైన్, డోలమైట్, సిడరైట్
సల్ఫేట్	బెరైటీస్, జిప్సం.
సల్ఫైడ్	పైరైటీస్, సిన్నబార్, గెలీనా, కాపర్ గ్లాన్స్.
క్లోరైడ్	కార్నలైట్, హార్న్ సిల్వర్, రాతి ఉప్పు(రాక్‌సాల్ట్).

సాంద్రీకరణ

ముడి ఖనిజాల్లో చాలా వరకు మాలిన్యాలు ఉంటాయి. వీటి నుంచి శుద్ధ లోహాన్ని పొందడానికి కొన్ని రసాయన ప్రక్రియల ద్వారా మలినాలను తొలగిస్తారు. ఈ పద్ధతిని 'సాంద్రీకరణ' అంటారు.

సాంద్రీకరణ పద్ధతులు

లెవిగేషన్: గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన సాంద్రీకరణ పద్ధతిలో వేగంగా వచ్చే నీటి ధారతో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని కడుగుతారు. తేలికైన మాలిన్య కణాలు నీటి ప్రవాహంతో కొట్టుకుపోగా బరువైన శుద్ధి ముడి ఖనిజ కణాలు నిలిచిపోతాయి. ఇది భౌతిక పద్ధతి.

ప్లవన క్రియ: సల్ఫైడ్ ఖనిజాల నుంచి మలినాలను తొలగించడానికి ఈ పద్ధతిలో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని నీటిలో అవలంబనం చేస్తారు. అనంతరం నూనె సమక్షంలో గాలిని పంపిస్తూ గిలకరించడం వల్ల పైన ఏర్పడే నురుగులోకి ఖనిజ కణాలు వస్తాయి. నురుగు కోసం పైన్ ఆయిల్, కొవ్వు ఆమ్లాలు, గ్జాంథేట్‌లను కలుపుతారు. జింక్, లెడ్ లాంటి లోహాల ఖనిజాలను ఈ విధంగా సాంద్రీకరిస్తారు. ఇది కూడా భౌతిక పద్ధతి.

లీచింగ్ (నిక్షాళనం): ఇది ఒక రసాయన పద్ధతి. ఇందులో ధాతువు రసాయన స్వభావాన్ని అనుసరించి, తగిన కారకాన్ని ఉపయోగించి, ధాతువు మాత్రమే ద్రావణంలో కరిగేలా చేస్తారు. కరగకుండా మిగిలిపోయిన మలినాలను వడపోత ద్వారా వేరు చేస్తారు. ఉదాహరణకు బాక్సైట్‌ను సోడియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగించి లీచింగ్ చేస్తారు.

అయస్కాంత వేర్పాటు పద్ధతి: ముడి ఖనిజానికి కానీ, మలినానికి కానీ అయస్కాంత ధర్మం ఉంటే ఈ పద్ధతిలో సాంద్రీకరిస్తారు. చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని అయస్కాంత రోల్లర్ మీద తిరిగే కన్వేయర్ బెల్ట్ మీద పడేలా చేస్తే ఖనిజం మాలిన్యం నుంచి వేరు అవుతుంది. ఈ పద్ధతిలో ఇనుప ఖనిజాలను, టిన్ స్టోన్‌ను సాంద్రీకరిస్తారు.

కొన్ని ముఖ్యమైన లోహాలు - వాటి ఖనిజాలు

లోహం	ముఖ్య ఖనిజాలు
అల్యూమినియం	బాక్సైట్, కోరండం, డయాస్పోర్, కయోలినైట్
బేరియం	బెరైటీస్
కాపర్	కాపర్ పైరెటీస్, చాల్కో పైరెటీస్, మాలకైట్, క్యూప్రైట్, కాపర్ గ్లాన్స్.
ఐరన్	ఐరన్ పైరెటీస్ (ఫూల్స్ గోల్డ్), హెమటైట్, మాగ్నటైట్, సిడరైట్, లియొనైట్, సిడరైట్.
కాల్షియం	సున్నపురాయి (కాల్షియం కార్బొనేట్), జిప్సం.
మెగ్నీషియం	కార్నలైట్, మాగ్నసైట్, ఎప్సం లవణం.
థోరియం	మోనోజైట్
మెర్క్యూరీ	సిన్నబార్
జింక్	కాలమైన్, జింక్‌బ్లెండ్, జింకైట్.
మాంగనీస్	పైరోలుసైట్
సిల్వర్	అర్జెంటైట్, హార్న్ సిల్వర్
లెడ్ (సీసం)	గెలీనా
సోడియం	రాతి ఉప్పు (రాక్ సాల్ట్), చిలీ సాల్ట్ పీటర్.

ముడి లోహాన్ని సంగ్రహించడం

ధాతువు నుంచి లోహాన్ని సంగ్రహించడానికి కొన్ని రసాయన ప్రక్రియలను అవసరానికి తగినట్లు ఉపయోగిస్తారు. వాటిలో ముఖ్యమైన ప్రక్రియలు.

భస్మీకరణం(కాల్సినేషన్): ధాతువును గాలి లేకుండా బాగా వేడి చేసి బాష్పశీల (వాయురూప) మలినాలను తొలగించే పద్ధతిని భస్మీకరణం అంటారు. కార్బొనేట్, బైకార్బొనేట్ ఖనిజాలకు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు కాల్షియం కార్బొనేట్ (సున్నపురాయి)ని భస్మీకరణం చేస్తే కాల్షియం ఆక్సైడ్ (సున్నం) ఏర్పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వేరై పడుతుంది.

భర్జనం(రోస్టింగ్): గాలి సరఫరా చేస్తూ లోహ ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద కొలిమిలో ముడి ఖనిజాన్ని వేడి చేసే ప్రక్రియ భర్జనం. ప్రధానంగా సల్ఫైడ్ ఖనిజాలను ఆక్సైడ్‌లుగా మార్చేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఉదాహరణకు రివర్బరేటరీ కొలిమిలో కాపర్ సల్ఫైడ్ ఖనిజాన్ని భర్జనం చేస్తారు.

ప్రగలనం: ధాతువును ద్రవకారి(ధాతువు ద్రవీకరణ ఉష్ణోగ్రతను తగ్గించే పదార్థం) కలిపి కానీ లేకుండా కానీ వేడిచేసి లోహాన్ని ద్రవస్థితిలో పొందే ప్రక్రియను ప్రగలనం అంటారు.

క్షయకరణం: లోహ ఆక్సైడ్‌లను సాధారణంగా కోక్(కార్బన్) లేదా కార్బన్ మోనాక్సైడ్ (CO) కలిపి వేడి చేస్తారు. ఈ ప్రక్రియలో అవి ఆక్సిజన్‌ను కోల్పోయి లోహాలుగా క్షయకరణం చెందుతాయి. ఉదాహరణకు 'బ్లాస్ట్ ఫర్నేసు'లో కోక్ మండటం వల్ల ఏర్పడిన కార్బన్ మోనాక్సైడ్.. ఐరన్ ఆక్సైడ్‌ను ఐరన్‌గా క్షయకరణం చేస్తుంది.

లోహ సంగ్రహణ - ముఖ్యాంశాలు

- ధాతువులో లోహంతోపాటు ఉండే మలినాలను 'గాంగ్' అంటారు.
- ఇనుము సంగ్రహణలో 'బ్లాస్ట్ కొలిమి'ని ఉపయోగిస్తారు. కొలిమిలోకి ప్రవేశపెట్టే కోక్, ధాతువు, సున్నపురాయిల మిశ్రమాన్ని చార్జ్ అంటారు.
- రివర్బరేటరీ కొలిమిలో ప్రగలనం, వేడి చేయడం ద్వారా కాపర్‌ను నిష్కర్షణ చేస్తారు.
- గలన స్థితిలో ఉండే లోహాన్ని పచ్చి కర్రలతో కలియబెట్టి మాలిన్యాలను వేరు చేస్తారు. ఈ పద్ధతిని 'పోలింగ్' అంటారు.
- విద్యుద్విశ్లేషణ పద్ధతిలో లోహాన్ని శుద్ధి చేసే ప్రక్రియలో అపరిశుద్ధ లోహాన్ని ఆనోడ్‌గా, శుద్ధమైన లోహ రేకును కాథోడ్‌గా వాడతారు.
- బ్లాస్ట్ ఫర్నేసులో 750° సెంటీగ్రేడ్ వద్ద ఏర్పడిన ఇనుము ఘన స్థితిలో, గుల్లబారి ఉంటుంది. దీన్ని 'స్పాంజ్ ఐరన్' అంటారు.
- స్పాంజ్ ఐరన్ కొలిమి అడుగు భాగం ద్రవరూపంలోకి మారుతుంది. ఈ స్థితిలో కార్బన్, ఫాస్ఫరస్, సిలికా చేరి దుక్క ఇనుము లేదా పోత ఇనుము(కాస్ట్ ఐరన్)గా మారుతుంది. దీనిలో కార్బన్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.
- దుక్క ఇనుము సంఘటనలో మార్పుల ద్వారా చేత ఇనుము(వ్రాట్ ఐరన్), స్టీల్ తయారు చేస్తారు.
- చేత ఇనుము శుద్ధమైన ఇనుము. ఇందులో కార్బన్ 0.1 – 0.25 శాతం మాత్రమే ఉంటుంది.
- ఉక్కు(స్టీల్)లో కార్బన్ 0.1–1.5 శాతం మాత్రమే. కార్బన్ శాతం పెరుగుతున్న కొద్దీ పెళుసుదనం పెరుగుతుంది.
- ఉక్కు ప్రధానంగా ఇనుము, కార్బన్ల మిశ్రమ లోహం. కార్బన్‌తోపాటు వివిధ పరిమాణాల్లో మాంగనీస్, నికెల్, క్రోమియం, మాలిబ్డినం, వెనేడియం, టంగ్‌స్టన్ మొదలైన లోహాలను మిశ్రమం చేసి ప్రత్యేక ధర్మాలు ఉన్న ఉక్కును తయారు చేస్తారు.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఇనుము, కార్బన్‌తోపాటు క్రోమియం, నికెల్ ఉంటాయి.
- దుక్క ఇనుము నుంచి స్టీల్ తయారీకి 'ఓపెన్ హార్త్ కొలిమి'ని ఉపయోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. సిన్నబార్ దేని ధాతువు?
1) బంగారం 2) యురేనియం
3) సీసం 4) మెర్క్యూరీ
2. చార్జ్ అంటే ఏమిటి?
1) విద్యుదావేశం 2) ఖనిజ చూర్ణం
3) కోక్, సున్నపురాయి, ధాతువుల మిశ్రమం
4) కోక్, ధాతువుల మిశ్రమం
3. బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?
1) స్టీల్ 2) బ్లిస్టర్ ఐరన్
3) స్పాంజ్ ఐరన్ 4) చేత ఇనుము
4. చేత ఇనుములో కార్బన్ శాతం?
1) 2 శాతం 2) 0.1 శాతం
3) 0.8 శాతం 4) 0.2 శాతం
5. గాలి లేకుండా ధాతువును వేడి చేసి బాష్పశీల మలినాలను తొలగించే ప్రక్రియ?
1) భస్మీకరణం 2) భర్జనం
3) నిక్షాళనం 4) పోలింగ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 1.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?
1) అల్యూమినియం 2) ఇనుము
3) బంగారం 4) ప్లాటినం
2. అల్యూమినియం లోహం ధాతువు?
1) బాక్సైట్ 2) బెరైటీస్
3) సిన్నబార్ 4) హెమటైట్
3. భూపటలంలో పుష్కలమైన లోహం?
1) ఇనుము 2) బంగారం
3) అల్యూమినియం 4) లెడ్
4. ఫిలాసఫర్స్ ఊల్ అంటే ఏమిటి?
1) జింక్ బ్రోమైడ్ 2) జింక్ నైట్రేట్
3) జింక్ ఆక్సైడ్ 4) జింక్ క్లోరైడ్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3.

వీరోచితంగా పోరాడిన సమ్మక్క

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

కాకతీయుల సామంతులు

నతవాడి వంశం

నందిగామ, మధిర తాలూకాలు, మహబూబాబాద్, జనగామ తాలూకాలు నతవాడి రాజ్యపరిధిలో ఉండేవి. ఈ రాజ్యాన్ని నతవాడి వంశం పాలించింది. ఈ వంశీయులు మొదట కల్యాణీ చాళుక్యుల సామంతులుగా ఉండి తర్వాత కాకతీయుల సామంతులయ్యారు.

ఈ వంశానికి ఆద్యుడు బేతరాజు. ఇతడు కాకతీయ రెండో ప్రోలరాజుకు తన కూతురునిచ్చి వివాహం చేశాడు. ఇతడి కుమారుడైన దుర్గరాజు(1104-1157) కల్యాణీ చాళుక్య ఆరో విక్రమాదిత్యుడికి, మూడో సోమేశ్వరుడికి సామంతుడిగా పనిచేశాడు. దుర్గరాజు కుమారుడైన బుద్ధరాజును కాకతి రుద్రదేవుడు, మహాదేవుడు నతవాడి పాలకుడిగా నియమించారు. ఇతడి పెద్ద కుమారుడు రుద్రుడు. కాకతి మహాదేవుడు ఇతడికి తన కూతురునిచ్చి వివాహం చేశాడు. బుద్ధరాజు రెండో కుమారుడు వక్కడి మల్లరుద్రుడు. ఇతడు గణపతిదేవుడి సోదరి అయిన మైలాంబను వివాహం చేసుకున్నాడు. రుద్రమదేవి కాలం వరకు నతవాడి రాజులు కాకతీయ సామంతులుగా పనిచేశారు.

గోనవంశం

రుద్రదేవుడు కందూరి చోడులను పానుగల్లు, దేవరకొండ ప్రాంతాలకు పరిమితం చేసినందువల్ల వారు వర్ధమానపురాన్ని విడిచి వెళ్లారు. మళ్లీ రుద్రదేవుడే వర్ధమానపురం (కందూరినాటి) పాలకుడిగా గోన బుద్ధరాజు(రంగనాథ రామాయణ కర్త)ను నియమించి ఉంటాడని భావిస్తున్నారు. అతడి కుమారుడైన గోన గన్నారెడ్డి గణపతిదేవుడి వల్ల వర్ధమానపుర రాజ్యాన్ని తిరిగి పొందాడు. ఇతడి తమ్ముడు విఠల నరేంద్రుడు. వీరిద్దరూ యాదవ రాజులు ఆక్రమించిన ఆదవాని, తుంబుశాలను జయించి రాయచూరు దుర్గాన్ని ఆక్రమించారు. విఠలుడు హోళువ, మాణువ రాజ్యాలను జయించాడు. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశాన్ని ఆక్రమించి దక్షిణాంధ్ర భూభాగాలను కాకతీయ సామ్రాజ్యంలో కలిపాడు. గోన గన్నారెడ్డి సోదరి కుప్పాంబిక. ఆమె భర్త మల్యాల గుండ దండాధీశుడు. గోన గన్నారెడ్డి తర్వాత ఇతడు వర్ధమానపుర పాలకుడయ్యాడు. ఇతడు 1245-46లో వర్ధమానపుర శాసనం వేయించాడు. 1259లో బూదపూర శాసనం, 1272లో మరో శాసనం వేయించాడు. ఇతడి మరణానంతరం భార్య కుప్పాంబిక తన భర్త పేరు మీద 1276లో గుండేశ్వరాలయం నిర్మించి శాసనం వేయించింది. ఇందులో ఆమె చిన్న తమ్ముడు గోనబుద్ధయ, గోన విఠయ కుమారుడు గుండయ గురించి పేర్కొన్నారు.



వావిలాల వంశం

వీరు రెడ్డి వంశస్థులు. రుద్రమదేవి కాలంలో ఆమనగల్లు, వంగూరు విషయాల (సీమ) పాలకులుగా ఉన్నారు. చెరకు రెడ్లతో వీరికి వివాహ సంబంధాలు ఉన్నాయి.

కాయస్థ వంశం (1239-1304)

మహారాష్ట్ర నుంచి వచ్చి స్థిరపడిన కాయస్థ వంశస్థుల్లో ఆద్యుడు గంగయ సాహిణి(1239-1257). ఇతడు కాకతి గణపతిదేవ చక్రవర్తికి సామంతుడు, ఆప్తుడు, అశ్వసైన్యాధిపతి. ఇతడి సువిశాల రాజ్యంలో మార్జవాడి, పలనాడు, కడప మొదలైన ప్రాంతాలతో పాటు, నల్లగొండ జిల్లాలోని పానగల్లు కూడా ఉండేవి. ఇతడి రాజధాని కడప జిల్లా వల్లూరు. దేవగిరి యాదవ రాజు ఆజ్ఞ మేరకు అతడి సామంతుడైన దామోదరుడు కాకతీయ భూభాగాలను ఆక్రమించాడు. గణపతిదేవుడి ఆజ్ఞతో గంగయ సాహిణి దామోదరుణ్ని ఓడించాడు. దీంతో గణపతిదేవుడు అతడికి మహామండలేశ్వర పదవిని ఇచ్చాడు. గంగయ సాహిణి తర్వాత అతడి మేనల్లుడైన జన్నిగదేవుడు గణపతిదేవుడు, రుద్రమదేవి వద్ద సామంతుడిగా పనిచేశాడు. ఇతడి రాజ్యంలో నల్లగొండ మండలం అంతర్భాగంగా ఉండేది. ఇతడి సోదరుడు త్రిపురాంతకుడుకూడా సామంతుడే. తర్వాత ఇతడి సోదరుడు అంబదేవుడు(1275-1302) స్వతంత్రించి కాకతీయులకు శత్రువయ్యాడు. అంబదేవుడి రాజ్యంలో నల్లగొండ జిల్లాలోని కృష్ణానది ఉత్తర ప్రాంతాలు, దోర్నాల ఉండేవి. ఇతడి కుమారుడైన రెండో త్రిపురాంతకుడి కాలంలో ఈ రాజ్యం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది.

సమ్మక్క సారక్క

పగిడిద్దరాజు, సమ్మక్క-సారక్కల తిరుగుబాటు వృత్తాంతానికి చారిత్రక ఆధారాలు లేవు. కానీ శతాబ్దాల నుంచి వీరి గాథలు ప్రజల్లో ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రకారం..

గోదావరి తీర ప్రాంతమైన మేడారం పరగణాను కోయ తెగకు చెందిన పగిడిద్దరాజు పాలించేవాడు. ఇతడు ప్రతాపరుద్రుడి సామంతుడు. కరీంనగర్ రాజధానిగా పాలించే మరో కోయ రాజైన మేడరాజు తన కుమార్తె సమ్మక్కను పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేశాడు. సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు వారి సంతానం. కొన్నాళ్లకు మేడారం పరగణాలో నాలుగేళ్లపాటు తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజలు పన్నులు కట్టలేని దుస్థితి తలెత్తింది. దీంతో పగిడిద్దరాజు కూడా ప్రతాపరుద్రుడికి పన్నులు కట్టలేదు. దీన్ని ధిక్కారంగా భావించిన ప్రతాపరుద్రుడు మంత్రి యుగంధరుడి ఆధ్వర్యంలో అతడిపైకి పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపాడు. మేడారం సమీపంలోని సంపెంగవాగు వద్ద పగిడిద్దరాజు సైనికులు కాకతీయ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయుధ బలం, సంఖ్యాబలం ఉన్న కాకతీయ సైన్యాన్ని నిలువరించలేక పగిడిద్దరాజుతో సహా ఆయన బిడ్డలు సారలమ్మ, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు వీరమరణం పొందారు. ఈ పరాజయాన్ని భరించలేక పగిడిద్దరాజు కుమారుడైన జంపన్న వాగులోకి దూకి చనిపోయాడు. అప్పటి నుంచి ఈ వాగుకు జంపన్నవాగు అని పేరొచ్చింది. పగిడిద్దరాజు భార్య సమ్మక్క కాకతీయ సేనతో పోరాడుతుండగా, ఒక సైనికుడు దొంగచాటుగా వచ్చి బల్లెంతో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క ప్రస్తుతం జాతర జరుగుతున్న స్థలంలో నేలకొరిగింది. లక్షలాది మంది పూజలందుకుంటున్న ఈ వీరుల గాథలు, కథనాల్లో చిన్న చిన్న తేడాలున్నాయి. కాకతీయులకు, ఆదివాసీలకు యుద్ధం జరగడానికి సహజవనరుల పంపకాల వివాదం కారణమని కొన్ని కథనాలు, కప్పం చెల్లించకపోవడం కారణమని ఇంకొన్ని కథనాలు చెబుతున్నాయి. వీరి నుంచి కాకతీయులు కప్పం వసూలు చేశారనడానికి ఆధారాల్లేవని చరిత్రకారులు తెలిపారు. కానీ ఎక్కువ కథలు అదే కారణమని చెబుతున్నాయి. కాకతీయులు రాష్ట్ర కూట వంశం వారు కాదని పులింద జాతికి చెందిన వారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఈ యుద్ధానికి పుళింద, కోయజాతి వైరం కారణమా? కప్పమే కారణమా? అన్నది పరిశోధించి తేల్చాల్సి ఉంది.

కాకతీయ యుగ విశేషాలు

పాలనా విధానం: కాకతీయుల ప్రభుత్వం సంప్రదాయ రాచరికం. సాధారణంగా రాజ్యం తండ్రి నుంచి కుమారుడికి వారసత్వంగా సంక్రమిస్తుంది. కుమార్తెకు కూడా ఆ హక్కు కల్పించడం కాకతీయ వంశంలోనే జరిగింది. సిద్ధాంత రీత్యా అధికారం అంతా రాజుదే. కానీ ఆచరణలో రాజ్యాధికారానికి కొన్ని పరిమితులు ఉండేవి. పాలనలో రాజుకు సహకరించేందుకు మంత్రి పరిషత్తు ఉండేది. వర్ణధర్మం, కులధర్మం, ఆచారం, సంప్రదాయం, శాస్త్ర నియమాలు రాజుకైనా అనుల్లంఘనీయాలు. నాటి శాసనాల్లో చాతుర్వర్ణ సముద్ధరణ అనే బిరుదు తరచుగా కనిపిస్తుంది. నిర్ణీత సమయంలో రాజు ప్రజలకు దర్శనం ఇవ్వాలని రుద్రదేవుడి నీతిసారం తెలుపుతోంది. కాకతీయులు ఆరోగ్యశాలలు, ప్రసూతి ఆసుపత్రులు, కళాశాలలు, మఠాలు, సత్రాలు, చలివేంద్రాలను నెలకొల్పారు. కాకతీయుల మంత్రులలో అన్ని కులాలవారు ఉండేవారు. కాకతీయులు కులాన్ని బట్టికాక వ్యక్తుల అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇచ్చారు. గణపతిదేవ చక్రవర్తికి రేచర్ల రుద్రారెడ్డి, మల్యాల హేమాద్రిరెడ్డి ప్రధానులు. ప్రతాపరుద్రుడికి ముప్పిడి నాయకుడు మహా ప్రధాని. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. నాయంకరులు దుర్గాధ్యక్షులు. వారి మండలంలో వచ్చే ఆదాయంతో నిర్ణీత సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు. ప్రతాపరుద్రుడు తన రాజ్యంలో నాలుగో వంతు భూమిని నాయంకరుల ఆధీనంలో ఉంచాడు. ప్రతాపరుద్రుడి కాలంలో 75 మంది నాయంకరులున్నారు. కాకతీయరాజ్య పతనం తర్వాత విజయనగర రాజులు నాయంకర విధానాన్ని అనుసరించారు. ఆంగ్లేయులు పాలన చేపట్టే వరకూ ఈ విధానం కొనసాగింది. కాకతీయులకు పూర్వీకులైన చోళులు, చాళుక్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని అనుసరించారు. అందుకు భిన్నంగా కాకతీయులు వికేంద్రీకృత పాలనా వ్యవస్థను అమలు పరిచారు. అందుకే మాండలికులు, నాయంకరులకు సైనిక విషయాలు మినహా పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. వారిపై అధికారాన్ని రుద్దలేదు. అణచి ఉంచే పద్ధతిని విడిచిపెట్టారు. వీరు తమను మహామండలేశ్వరులుగానే భావించారు తప్ప, రాజాధిరాజుగా, చక్రవర్తిగా భావించలేదు. ఒక రకంగా ఇది ప్రజాస్వామిక భావన.

నాయంకరుల్లో తెలంగాణకు సంబంధించిన కొందరి వివరాలు: యాదవ విశ్వనాథుడు గణపతిదేవుడి కాలంలో యుద్ధాల్లో పాల్గొన్నాడు. నల్లగొండ జిల్లాలో ఒక ప్రాంతాన్ని పరిపాలించాడు. అక్షయచంద్రదేవుడు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించాడు. సారంగపాణి దేవుడనే యాదవరాజు పానగల్లును పాలించాడు. సింద కుటుంబానికి చెందిన భైరవుడు రుద్రమ కాలంలో బీదర్ ప్రాంతాన్ని పాలించాడు. పరిపాలనా సౌలభ్యం కోసం కాకతీయ సామ్రాజ్యాన్ని స్థలం, సీమ, వాడి, నాడు, పాడి, భూమి అనే ప్రాంతీయ విభాగాలుగా విభజించారు. 10 నుంచి 60 గ్రామాల సముదాయాన్ని స్థలంగా వ్యవహరించేవారు. కొన్ని స్థలాల సముదాయమే నాడు. ఉదాహరణ: అనుమకొండనాడు, కందూరునాడు, సబ్బినాడు, అయిజనాడు.

ఆయగార్లు

గ్రామపాలనను ఆయగార్లు నిర్వహించేవారు. గ్రామసేవ, రాజ్యసేవ చేసినందుకు పన్ను లేకుండా వీరు భూమిని పొందేవారు. ఆయం అంటే పొలం వైశాల్యం. సాధారణంగా ఆయగార్ల సంఖ్య పన్నెండు. వారు 1. కరణం, 2. రెడ్డి, 3. తలారి 4. పురోహితుడు, 5. కమ్మరి, 6. కంసాలి, 7. వడ్రంగి, 8. కుమ్మరి 9. చాకలి, 10. మంగలి, 11. వెట్టి, 12. చర్మకారుడు. వీరిలో మొదటి ముగ్గురు ప్రభుత్వ సేవకులు. మిగతా వారు గ్రామ సేవకులు. గ్రామ విస్తీర్ణం, ఆయకట్టు, పోరంబోకు భూమి, తోట భూమి, గడ్డిభూముల విస్తీర్ణం, వ్యక్తుల ఆస్తుల లెక్కలు, దేవాలయ ఆస్తుల లెక్కలు మొదలైన దస్తరం నిర్వహణ కరణం బాధ్యత. కరణం ఇచ్చే లెక్కల ఆధారంగా రాజ్యభాగం(పన్ను)ను వసూలు చేసి ప్రభుత్వానికి అందజేసే బాధ్యత రెడ్డి లేదా పెద కాపుది. గ్రామ రక్షణ బాధ్యత తలారిది. దొంగతనాలు జరిగినప్పుడునేరస్థులను పట్టుకోవడం, అపహరించిన సొత్తుని తెచ్చి ఇవ్వడం అతడి విధి. అష్టాదశవర్ణాల వారికి సంఘాలుండేవి. వీటిని సమయాలనేవారు.

మాదిరి ప్రశ్నలు

1. రెండో బేతరాజు ఎవరి ద్వారా శైవమతాన్ని అవలంబించాడు?
   1) రామేశ్వర పండితుడు
   2) అప్పయాచార్యులు
   3) పాల్కురికి సోమన 4) బసవేశ్వరుడు
2. కాకతీయుల కాలంలో గ్రామరక్షణ బాధ్యత ఎవరిది?
   1) కరణం 2) పురోహితుడు
   3) రెడ్డి 4) తలారి
3. కాకతీయుల కాలంలో స్థూలంగా ఉన్న పన్నుల సంఖ్య?
   1) 5 2) 7 3) 6 4) 4
4. సెట్టి, కేసరి సముద్రాలను తవ్వించిన కాకతీయ రాజు?
   1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
   3) రుద్రదేవుడు 4) గణపతిదేవుడు
5. పాకాల చెరువును తవ్వించింది?
   1) రుద్రదేవుడు 2) జాయపసేనాని
   3) రేచర్ల రుద్రుడు 4) ప్రతాపరుద్రుడు
6. 'రామప్పచెరువు'ను తవ్వించింది?
   1) రేచర్ల రుద్రుడు 2) రుద్రదేవుడు
   3) జాయపసేనాని 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు: 1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1.

Elections are essential for the..

BANK EXAMS
GENERAL ENGLISH



Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Special programs of study (1)/ are tailored (2)/ to the needed (3)/ of specific groups. (4) No error (5)
2. Most travel agents (1)/ are prepared to (2)/ customize travel arrangements (3)/ to meet individual requirement. (4) No error (5)
3. The rise in inflation (1)/ was just one symptoms (2)/ of the poor state (3)/ of the economy. (4) No error (5)
4. Her arm was beginning (1)/ to swell up (2)/ where the bee (3)/ has stung her. (4) No error (5)
5. The next morning (1)/ the team surveyed (2)/ the damage (3)/ caused in the fire. (4) No error (5)

Directions (Q. 06-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Elections are essential for the _____ of parliamentary decisions.
   1) Continuous 2) monitoring 3) vital 4) approval 5) surveillance
7. Barons had to swear an oath of _____ to the king.
   1) Allegiance 2) administration 3) silence 4) request 5) promiscuous
8. Always chew food well before _____ it.
   1) Thrusting 2) putting 3) eating 4) swallowing 5) digesting
9. The _____ was released to await trial but had to _________ her passport.
   1) Defendant, surrender 2) plaintiff, give in 3) dependant, submit 4) accused, give of 5) convict, abide
10. When you first meet her, she gives a _______ impression of warmth and friendship.
    1) Supper 2) superfluous 3) superficial 4) superlative 5) superiority
11. His career was cut short when he _______ to cancer.
    1) Affect 2) effect 3) diagnosed 4) succumbed 5) suffered
12. The party suffered a _______ defeat in the general election.
    1) Vast 2) majority 3) devastate 4) possible 5) humiliating
13. Keep your answers as _______ as possible.
    1) Success 2) verbatim 3) succinct 4) modulate 5) length
14. I agreed _______ what she said in substance, though not _____ every detail.
    1) In, with 2) to, in 3) with, with 4) for, at 5) from, for
15. Climate change is still ____ much a subject ____ debate.
    1) Mostly, to 2) many, from 3) much, form 4) very, for 5) pretty, from

Directions: (Q. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

16. Millions <u>faces</u> starvation next year as a result of the drought.
    1) Are facing 2) had faced 3) will face 4) will have faced 5) No correction required
17. Leaving him out of the team may sound the <u>alarm</u> for our chances.
    1) Winning 2) ringing bell 3) death knell 4) blowing off 5) No correction required
18. The meeting ended on a <u>turn around</u> with several people walking out.
    1) Happy mood 2) mixed reaction 3) sordid 4) sour note 5) No correction required
19. If you say you're sorry <u>we would</u> forgive you.
    1) We might 2) we will 3) we had 4) we have 5) No correction required
20. They <u>carry up</u> research into the roles of men and women in today's society.
    1) Carried away 2) carried out 3) carry forward 4) carry upon 5) No correction required

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Finance minister Arun Jaitley on Saturday ______ (21) a Budget that put boosting growth before painful reforms, slowing the pace of fiscal deficit cuts and seeking to put ______ (22) and foreign capital to work. In his first full-year Budget since Prime Minister Narendra Modi's landslide election victory ______ (23) May, Jaitley said India's economy was about to take off. Modi tweeted that the Budget would "further reignite our growth engine".Billed as a test of the nationalist premier's willingness to ____ (24) a $2 trillion economy with a bloated public sector and weak private investment, the Budget was short on structural reforms and contained revenue targets some called unrealistic. It drew a__ (25) reception from economists, with some calling it a path to an investor-friendly India, but ______ (26) seeing a missed opportunity to tackle deep-seated structural problems. Jaitley promised higher investment in India's decrepit roads and railways, offered the ______ (27) of tax cuts to global companies and the stick of tighter-______(28) to get Indian tycoons to invest at home rather than stash wealth abroad. Tax evaders face ______ (29) sentences of up to 10 years, he warned.The tax changes and tougher enforcement would raise $2.5 billion next year, he said. Tax receipts overall would rise 15 percent and government asset sales would raise $11 billion - goals that past experience ______ (30) may be hard to meet.

21. 1) announced 2) proclaimed 3) decree 4) stated 5) publicize
22. 1) family 2) domestic 3) familial 4) household 5) domicile
23. 1) most recent 2) very last 3) last 4) end 5) final
24. 1) improvement 2) restructuring 3) reorganization 4) reform 5) development
25. 1) uniform 2) assertive 3) minor 4) magical 5) mixed
26. 1) others 2) extra 3) further 4) supplementary 5) spare
27. 1) bribe 2) carrot 3) lure 4) candy 5) bite
28. 1) system 2) convention 3) rules 4) laws 5) policy
29. 1) penitent 2) dungeon 3) confined 4) jail 5) detaining
30. 1) showing2) showed 3) shown 4) show 5) shows

Directions (Q. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) We only remember learning history on war, not of other types of historical subjects.
B) History, to some degree is important, but it is typically taught in a memorization manner.
C) But the reality is that history is so universal because nearly every country is interconnected whether it is through economics, culture, business, finances, goods and services, and ecological perspectives.
D) This is where we go wrong with learning history. There is no process of looking at it from a productive perspective.
E) Furthermore, we typically only learn history of our own country.
F) Never in any educational background was a student challenged to reflect or re-evaluate how history works, but rather how much one could retain.

31. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 36-38): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) garbage 2) delegeta 3) monitor 4) commission 5) ensconce
37. 1) courageous 2) contagios 3) commandeer 4) convulsion 5) complement
38. 1) referre 2) explicit 3) sabotage 4) supplement 5) surreptitious

Directions (Q. 39-40): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

39. **Apollo 11 is** (1) the first **manned** (2) mission **to land** (3) on **the moon.** (4)
40. The **cashere** (1) **gave** (2) me **two hundred** (3) and twenty **rupees.** (4)

Key:

1) 3	2) 4	3) 2	4) 4	5) 2
6) 5	7) 1	8) 4	9) 1	10) 2
11) 4	12) 5	13) 3	14) 3	15) 4
16) 3	17) 3	18) 4	19) 2	20) 2
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5
31) 3	32) 1	33) 4	34) 1	35) 5
36) 2	37) 2	38) 1	39) 1	40) 1